# ఆత్మీయతకు ప్రతిరూపం

# హల్దేకర్‌జీ



**శ్రీ భోగాది దుర్గాప్రసాద్ స్మారక సమితి**

ఆంధ్రప్రదేశ్

**ఆత్మీయతకు ప్రతిరూపం హల్దేకర్‌జీ**

ముద్రణ: శ్రీ వికారి నామ సం॥ మార్గశిర మాసం, బహుళ త్రయోదశి

తేది : 24.12.2019

**ప్రచురణ**

**శ్రీ భోగాది దుర్గాప్రసాద్ స్మారక సమితి, ఆంధ్రప్రదేశ్.**

**అక్షరాల కూర్పు**

**జాగృతి గ్రాఫిక్స్**

3-4-228/4/1

జాగృతి భవన్, కాచిగూడ, హైద్రాబాద్ - 500027

040-27561453

**ముద్రణ**

**ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్**

చిక్కడపల్లి, హైదరాబాద్ - 500 020

దూరవాణి : 040 - 2766 4525

**ప్రతులకు**

**సాహిత్యనికేతన్**

3-4-852, కేశవనిలయం,

బర్కత్‌పురా, హైదరాబాద్-500 027

దూరవాణి : 040-2756 3236

**సాహిత్యనికేతన్**

ఏలూరురోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ - 520 002

దూరవాణి : 9440643348

**వెల : రూ. 120/-**

# ప్రకాశకుల మనవి

మహారాష్ట్ర ప్రాంతం నుండి తెలుగు మాట్లాడే ఆంధ్రప్రాంతానికి వచ్చి సంఘకార్యాన్ని గ్రామగ్రామానికి తీసికొనిపోయే పరీక్షాసదృశ్యమైన కార్యాన్ని అత్యంత శ్రద్ధతో సుదీర్ఘకాలం నిర్వహించినవారిలో మొదటితరంవారు కాకపోయినా, సుదీర్ఘకాలం పనిలో నిమగ్నమైనందున చాలామందికి తొలుతగా గుర్తుకు వచ్చేవారు శ్రీరాంభావు హల్దేకర్. వారు నిజాం పాలనా కాలంలోనే హైదరాబాద్‌కు కళాశాల చదువు నిమిత్తం వచ్చారు. చదువు ఒక దశకు చేరుకున్న తర్వాత, దానిని ప్రచారకులైనారు. ఆరు దశాబ్దాలకు పైబడి వారు ప్రచారకులుగా తెలుగుప్రజలమధ్య నిరంతరం కృషిచేశారు. మొదట్లో కొద్దికాలం భాగ్యనగర్‌లో, ఆ తర్వాత వరంగల్లు జిల్లా ప్రచారక్‌గా (అప్పట్లో ఖమ్మం కూడా వరంగల్లు జిల్లాలో భాగమే), ఆపైన వరంగల్లు విభాగ్, భాగ్యనగర్ విభాగ్, విజయవాడ విభాగ్‌లకు విభాగ్ ప్రచారక్‌గా పనిచేశారు. ఆ తర్వాత సహప్రాంత ప్రచారక్‌గా, ప్రాంత ప్రచారక్‌గా – ఇప్పటి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. కొద్దినెలలపాటు దక్షిణక్షేత్ర సహక్షేత్ర ప్రచారక్‌గా బాధ్యత వహించి, ఆపై ఆంధ్రప్రాంతము, ఉత్కళ ప్రాంతమూ (ఆంధ్రప్రాంతం పూర్వాంధ్ర, పశ్చిమాంధ్రలుగా వ్యవస్థీకరింపబడింది) కలసిన ఆగ్నేయ క్షేత్ర ప్రచారక్‌గా బాధ్యత వహించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలతో కూడిన దక్షిణమధ్యక్షేత్రం ఏర్పడినప్పుడు క్షేత్ర కార్యకారిణీ సభ్యులైనారు. బాధ్యత ఏది అయినప్పటికీ కార్యక్షేత్రంలో నిరంతరం పర్యటిస్తూ, క్రొత్తక్రొత్త గ్రామాలను సందర్శిస్తూ ఉండటం, కలసిన క్రొత్త వారందరినీ విపులంగా పరిచయం చేసుకోవటం, పరిచితులైన వారందరితో ఆత్మీయ సంబంధాలు నెరపుతూ ఉండటం. ఎప్పుడైనా, ఎవైనా సమస్యలు తల ఎత్తినప్పుడు వాటి సత్వర పరిష్కారానికై తదేక దృష్టితో కృషి చేస్తూ ఉండటం వారి కార్యశైలిలోని విశిష్టత.

వారు తెలుగుభాషను అభ్యసించారు. తెలుగు చదవటమేగాక, తెలుగులో ఉపన్యసించేవారు. ప్రతివాక్యమూ వ్యాకరణబద్ధంగా, ఉన్నా, లేకున్నా, వారినోటి వెంట

వెలువడిన ప్రతిమాటా ఆకట్టుకొనేదిగా ఉండేది. శ్రోతలు ఎంతోశ్రద్ధగా వినేవారు. స్వయంసేవకులతో ఆత్మీయ సంబంధాలు నెరపుతూ, సందర్భాన్నిబట్టి ఒకింత కఠినంగా ఉంటూ కూడా, ఒక్కొక్క కార్యకర్తను తీర్చిద్దిటంపట్ల వారు శ్రద్ధవహించిన కారణంగా అనేకమంది కార్యకర్తలు వారి పర్యవేక్షణలో మలచబడి, కార్యవిస్తరణలో సహకారులైనారు.

గంభీరమైన సమస్యలను విశ్లేషించిన మహోపన్యాసకులుగా వారు గుర్తింపబడక పోవచ్చును. కాని కార్యకర్తలకు సందర్భానికి అవసరమైన ఆప్తవాక్యాన్ని అందించిన మార్గదర్శకులుగా వారి స్థానం సుస్థిరమైనది. కార్యకర్తల హృదయాలపై వారి ముద్ర చెరగనిది. ప్రొ॥ ఎస్.వి.శేషగిరిరావుగారు ఒక సందర్భంలో చెప్పినట్లుగా ఆదర్శ నాయకుల, కార్యకర్తల అడుగుజాడలు వారు నడిచిన నేలపై కాక, వారి సహచరుల, అనుచరుల హృదయఫలకాలపై ముద్రితమై ఉంటాయి.

వేలాది కార్యకర్తల హృదయాలలో ముద్రితమై ఉన్న లక్షలాది ఆత్మీయ జ్ఞాపకాలలో నుండి కొన్ని వందల జ్ఞాపకాలను మాత్రమే మేము సేకరింపగల్గినాము. 'సాధారణ కార్యకర్తలమైన మాకు కల్గిన అనుభవాలకు అంత ప్రాముఖ్యమున్నదా? ఇవన్నీ వ్రాసి, ముద్రించేటట్లయితే ఇది మహాభారతాన్ని మించిన గ్రంథమై పోతుందేమో'నన్న సందేహంతో చాలామంది కార్యకర్తలు వారికిగల అనుభవాలను వారివద్దనే భద్రపరచుకున్నారు. ఎప్పుడో.. ప్రస్తావవశంగా వారు తమ ఆత్మీయులతో పంచుకొంటూ ఉంటారేమో! వాటిని సేకరించటం అంత సులభంగా జరిగేపని కాదు.

మా॥ హల్దేకర్‌జీని స్మరించుకొనడానికి ఒక గ్రంథం జాప్యం కాకుండా వీలైనంత త్వరగా వెలువడవలెనన్న కోరిక అందరిలో బలంగా ఉండటం గమనించి, అందుబాటులోకి వచ్చిన సామగ్రిని ఒక క్రమంలో అమర్చి మీ ముందు ఉంచే ప్రయత్నం చేస్తున్నాం. మీ అందరి ఆదరమూ లభించగలదని ఆశిస్తున్నాం.

**– శ్రీ భోగాది దుర్గాప్రసాద్ స్మారక సమితి**

# విషయ సూచిక


1. సమర్పిత జీవనం– భయ్యాజీ జోషి – 7
2. సంఘకార్యమే వారి జీవితం – వడ్ల భాగయ్య – 8
3. హల్దేకర్‌జీ అందరికీ ఆత్మీయులు – శ్రీ జ్ఞానేశ్వరానందగిరి స్వామి – 10
4. స్మృతిపథంలో హల్దేకర్జీ – దూసి రామకృష్ణారావు – 12
5. “మనమంతా స్వయంసేవకులం
ఈ విషయం ఎప్పటికీ మరచిపోరాదు” – బండారు దత్తాత్రేయ – 14
6. శ్రద్ధా సుమాంజలి – ‘మంజీరా’ – 16
7. యజ్ఞమయ జీవనం – సేకరణ : బెల్లంకొండ మల్లారెడ్డి – 17
8. శ్రీ హల్దేకర్‌జీతో నా అనుభవాలు – కె.వి. సత్యనారాయణ – 34
9. స్మృతిలో మాననీయ శ్రీహల్దేకర్‌జీ – లింగాల రామచంద్రారెడ్డి – 37
10. నిరంతర సంపర్కమే సంఘకార్య విజయరహస్యం
– కొండపల్లి శ్యాంప్రకాశ్ – 43
11. హల్దేకర్‌జీతో మా పరిచయం ఆయన ప్రభావం – కొలిపాక సుచరిత – 46
12. నిరంతర మార్గదర్శకుడు – పోల్సాని లక్ష్మారెడ్డి – 48
13. అసలైన వీతసంగుడు హల్దేకర్‌జీ – పులుసు గోపిరెడ్డి – 49
14. శ్రీ హల్దేకర్‌జీతో నా అనుభవాలు – రేవా కోటేశ్వరరావు – 53
15. హల్దేకర్‌జీగారికి సంఘకార్యకర్త చిరుకానుక–వడ్లమూడి రాఘవరావు – 55
16. మరువలేని మహావ్యక్తి హల్దేకర్‌జీ – స్థానం భావనారాయణ – 59
17. మా॥ హల్దేకర్‌జీతో నా అనుబంధము – డా॥ బీరవోలు సురేంద్రరెడ్డి – 67
18. స్వర్గీయ రాంభావు జీ హల్దేకర్ – మంచెన గుండేరావు – 70
19. సాత్విక చైతన్యమూర్తి రాంభావూజీ – కొరిగింజ రామచంద్రయ్య – 76
20. హల్దేకర్‌జీ హాస్యప్రియత్వము– అద్భుతమైన జ్ఞాపకశక్తి
– చిట్టి గోపాల్‌రెడ్డి – 79
21. నా జీవితంలో చెరగని ముద్ర శ్రీ రాంభావు హల్దేకర్‌జీ
– అలువాల బిక్షపతి – 82
22. శ్రీ రాంభావ్‌జీ హల్దేకర్‌తో నా అనుభవాలు – పి. పద్మారావు – 86
23. హల్దేకర్‌జీ అందించిన ప్రోత్సాహం – కుందూరు విద్యాన్‌రెడ్డి – 87

24. కొత్త స్వయంసేవకులను పుట్టిన బిడ్డతో పోల్చటం - పిల్లి రాజేశ్వరరావు - 88
25. మా॥ రాంభావు హల్దేకర్‌జీతో నా అనుభవం - దుంద్రపు దుర్గారెడ్డి - 90
26. వారిది అద్భుత స్మరణశక్తి - తాయిలూరు ఎస్. సుందరరాజ - 90
27. మాన్యశ్రీ హల్దేకర్‌జీ జ్ఞాపకాలు - ఆర్. పూర్ణచంద్రరావు - 91
28. మా॥ హల్దేకర్‌జీ ఆచరణీయ మార్గదర్శనం - ఇసుకపల్లి సీతారామ శర్మ - 94
29. మా॥ శ్రీ రామచంద్ర హల్దేకర్‌జీ - భోజనపల్లి నరసింహమూర్తి - 96
30. ప్రత్యక్ష మార్గదర్శనములో - పేరి అప్పల నరసింహమూర్తి - 98
31. హల్దేకర్‌జీ మార్గదర్శనం - వల్లూరు రామకృష్ణ - 101
32. సంపర్కానికి మారుపేరు శ్రీ హల్దేకర్‌జీ - బుర్రా దత్తాత్రేయశాస్త్రి - 105
33. వారి మాటల్లో హాస్యం జాలువారుతుంటుంది- డా॥వడ్డి విజయసారథి - 107
34. నిష్కామ కర్మయోగి శ్రీ హల్దేకర్‌జీ - గుమ్మా ప్రసాదరావు - 109
35. పూజ్యశ్రీ హల్దేకర్‌జీతో నేను - కోడూరు సత్యం - 111
36. కార్యకర్తకి ఎంత విలువ ఇవ్వాలో నేర్పిన హల్దేకర్‌జీ
- పార్నంది వెంకట రమణమూర్తి - 112
37. శ్రీహల్దేకర్‌జీతో నా అనుభవాలు- పతకమూరి శ్రీనివాసరావు - 114
38. 'ఓం రాష్ట్రాయ స్వాహా' యజ్ఞంలో ఒక సమిధ
- మామిళ్ళపల్లి రామమూర్తి - 117
39. ఆత్మీయత, వ్రత నిష్ఠలకు ప్రతిరూపం హల్దేకర్‌జీ - బూర్గుల రామాచారి -120
40. పూజనీయ హల్దేకర్‌జీతో నా మధురస్మృతులు-చల్లా నాగశ్రీనివాస్ - 128
41. ఆత్మీయతకు మారుపేరు హల్దేకర్‌జీ - బెల్లంకొండ మల్లారెడ్డి - 137
42. సాదర సుమాంజలి - 'మంజీరా' - 144
42. సహస్ర పూర్ణచంద్రదర్శన కార్యక్రమము - 145
43. 'కర్మమయ జీవనం శ్రీ హల్దేకర్‌జీది' - శ్రీ సుదర్శన్‌జీ ప్రసంగం - 152
44. మీ జీవనం దీప సమానం - సునితా హల్దేకర్ - 156
46. శ్రీ రామచంద్ర సదాశివ హల్దేకర్‌జీ - వరిగొండ కాంతారావు - 163
47. హల్దేకర్‌జీ అందించిన ఆలోచనలు - 165
48. హల్దేకర్‌జీ స్వయంగా చెప్పిన అనుభవాలు - 170

# సమర్పిత జీవనం

**కే**వలం యుద్ధం చేయడమే పురుషార్థం కాదు. జీవన సార్వస్వాన్ని ఏకైక ధ్యేయం కోసం సమర్పించడం కూడా పురుషార్థమే. శ్రీ రాంభావు హల్దేకర్‌జీ 1954లో సంఘప్రచారక్‌గా వచ్చారు. అన్నిరకాలుగా ఎందరో సంఘాన్ని బాగా ద్వేషిస్తున్న కాలఖండమది. అంతటి విషమపరిస్థితిలోనూ ప్రచారక్‌గా రావడాన్ని మించిన పురుషార్థ మేముంటుంది. అనేకమంది శ్రీ హల్దేకర్‌జీ సంపర్కంలోకి వచ్చారు. వారికి సంఘాన్ని అర్థంచేయించడానికి బౌద్ధిక్-చర్చవంటివి అవసరం లేకపోయింది. శ్రీ హల్దేకర్‌జీ జీవనమే సంఘజీవనంగా అందరిముందు నిలిచి ఉండినది.

వారు మహారాష్ట్ర నుండి వచ్చి ఆంధ్రుడిగా (తెలుగు) సామాజిక జీవనంతో, అక్కడి సంఘకార్యంతో, కార్యకర్తలతో, వేషభాషలతో అద్భుత సామంజస్యాన్ని సాధించే కఠిన కార్యాన్ని కూడా సహజంగా చేసేశారు. పర్యటన చేయుటకు శక్తి తగ్గిపోయిన పిదప లేఖన, రచన కార్యమాధ్యమంగా సంఘసాధనలో లీనమై ఉండిపోయాడు. అనేక మరాఠీ పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. కేవలం వ్రాయడం వరకే కాదు, ఆ సాహిత్యం పాఠకులకుచేరే విషయాన్ని కూడా బాగా ఆలోచించారు.

ఒక సాహిత్యకారుడంటారు – 'ఈనాడు చరణస్పర్శ చేద్దామనుకుంటే అలాంటి మహానుభావులే కరువైపోయారు'. అయితే మనందరి అదృష్టం బాగుంది. మనకు మన జీవితంలో అటువంటి భాగ్యం లభించింది. మన అంతఃకరణలో అలాంటి పావన స్మృతిని పదిలపరచుకుందాం. వారు నిర్దేశించిన మార్గంలో మనమంతా నడుద్దాం. ఇదే మనందరి మనోభావన. శ్రీ హల్దేకర్‌జీ ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతున్ని ప్రత్యేకంగా ప్రార్థించాల్సిన పనిలేదు. ఇలాంటి పుణ్యాత్ములకు ఆత్మశాంతిని ప్రసాదించడం భగవంతుని బాధ్యత. ఆ భగవంతుడే స్వయంగా తన యోజనలో భాగంగా ఈశ్వరీయ కార్యాన్ని చేయుటకై మళ్ళీ భూమిపై అవతరింప జేస్తాడు.

**– భయ్యాజీ జోషి, ఆర్.ఎస్.ఎస్. సర్‌కార్యవాహ**

# సంఘకార్యమే వారి జీవితం

**వా**రు కాంతిపుంజం... హల్దేకర్‌జీ సైద్ధాంతిక కాంతిపుంజం. వారి కాంతి మనకు సదా దిశా దర్శనం గావిస్తుంది. సంఘ కార్యంలోనే సదా జీవించేవారికి మరణముండదు. ఎందుకనగా సంఘకార్యమే వారిజీవనంగా ఉండినది కనుక. వారి జీవితమంటే భక్తి, శ్రద్ధ మరియు విశ్వాసం. వారిది యుగానుకూల ఆలోచన, కావునవారు వాస్తవరూపంలో అత్యంత ఆధునికులు.

హల్దేకర్‌జీ తరచూ చెబుతుంటారు... కార్యంలో మృత్యువే విశ్రాంతి. ఇదేవిధంగా వారు వారి జీవితపు అంతిమ ఘడియవరకు సంఘకార్యంలోనే నిమగ్నమై ఉన్నారు. హల్దేకర్‌జీ సదా స్ఫూర్తి ప్రదాత, నిరంతర చలనశీలి. ఒకసారి తృతీయవర్ష సంఘశిక్షావర్గలో శిక్షక్‌గా 58నిమిషాలపాటు ఆగకుండా గణసమత తీసుకున్నారు. అది ఇంకా ఇప్పుడు గుర్తుకు వస్తూనే ఉంది. ఆనాడు అంతసేపు ఆగకుండా సమత తీసుకోవటం అసహజంగానే కనిపిస్తుంది. అయినా అంతసేపు అలసి పోకుండా సమత-గణ తీసుకోవటం, హల్దేకర్‌జీ కార్యక్షమతను మరియు సమర్థతను గుర్తుచేసుకుంటే నాకు ఇప్పటికీ ఆశ్చర్యమనిపిస్తుంది.

హల్దేకర్‌జీ సంఘటన వ్యవస్థను నియమబద్ధంగా పాటించేవారు. వారు ఎక్కడికి వెళ్ళినా అక్కడ క్రొత్త వ్యక్తుల్ని పరిచయం చేసుకొని వారిని సంఘకార్యంలో సమ్మిళితంగావించే కృషి కొనసాగిస్తారు. వ్యవస్థపట్ల పూర్ణ సమర్పిత వ్యక్తిత్వం వారిది. వ్యవస్థలో భాగంగా ఏదేని నిర్ణయం జరిగితే ఆ నిర్ణయంపట్ల వారెప్పుడూ వ్యతిరేకతను, నిరాసక్తతను లేదా అసంతృప్తి భావనను వ్యక్తంచేసేవారు కాదు. కార్యకర్తలు తమ అభిప్రాయాలు చెబుతుంటే పూర్తిధ్యానమగ్నులై మందస్మిత సహనంతో వినడం హల్దేకర్‌జీ ప్రత్యేకత. స్థానిక కార్యకర్తలు తీసుకున్న నిర్ణయాలను సమ్మతించడం హల్దేకర్‌జీలోనే కనిపిస్తుంది.

కార్యకర్తలపట్ల హల్దేకర్‌జీ మాతృప్రేమను చూపేవారు. డా॥ వేదుల సత్యనారాయణ, మా. శ్రీ చిలుకూరు సుబ్రహ్మణ్య శాస్త్రి మరియు ఇతరులు అస్వస్థులయినపుడు చాలా బాధపడ్డారు. కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించేటపుడు చాలాదూరదృష్టితో ఆలోచించేవారు. ఏ కార్యకర్తకు ఏ బాధ్యత ఇవ్వాలో లోతుగా ఆలోచించేవారు. కార్యకర్త స్వభావాన్ని బట్టి బాధ్యత ఇస్తే పనిలో విజయం మాత్రమేకాక వేగం కూడా పెరుగుతుందనేవారు. హల్దేకర్‌జీ సదా 'అఖండ భారతమాత' ఆరాధకులు. అలా అఖండభారత సాధనా సంకల్ప ఆవశ్యకతను మనముందుంచేవారు. రెండు తెలుగుప్రాంతాలు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు దిశాదర్శనం గావించి, కుటుంబ పెద్దలా వ్యవహరించిన హల్దేకర్‌జీ ఇప్పుడు మనమధ్యలేరు. ఇది మనకు పూరించరానిలోటుగా ఎప్పుడూ కన్పిస్తుంటుంది. అయినా వారుచేసిన కార్యాన్ని, వారుచూపిన మార్గాన్ని ఉత్సాహంగా స్వీకరించి సంఘకార్యంలో ముందుకేగుతూ సాగిపోవాల్సిందే. ఇదే వారికి శ్రద్ధాంజలి.

**– వడ్ల భాగయ్య, సహసర్ కార్యవాహ, రా.స్వ. సంఘ**




**గుంటూరు జిల్లా సంస్కారభారతి సభలో ప్రసంగిస్తున్న హల్దేకర్‌జీ, కుడి చివర ఆశీనులై కనిపిస్తున్న వారు శ్రీఘనశ్యామల ప్రసాద్ (అఖిల భారత ఉపాధ్యక్షులు, సంస్కారభారతి)**

# హల్దేకర్‌జీ అందరికీ ఆత్మీయులు

మాన్యశ్రీ రాంభావూ హల్దేకర్‌జీ అమృతహృదయులు. అందుకే అందరికీ ఆత్మీయులు. నా వరకు నాల్గుదశాబ్దాల పరిచయము. ఈ కాలములో అనేకసందర్భాలలో (వ్యక్తిగత, సంస్థాగత) వివిధవేదికలపైన, అనేకరకాల కార్యక్రమాలలో వారి ఆత్మీయ సంభాషణల, వినేభాగ్యం కలిగినది. అత్యంత అర్థవంతంగా, ఆచి తూచి మాట్లాడేవిధము, స్పష్టమైన సరళమైన తెలుగుభాషలో మాట్లాడడం ఎంతో ఆసక్తి, ఆశ్చర్యం కలిగించేది. ఇంకా వినాలని అనుకునేవారము. నాకు స్వర్గీయ పట్టోళ్ళ రాంరెడ్డిగారిద్వారా పరిచయం. నాకు రాంరెడ్డిగారు ప్రేరణకర్త అయితే హల్దేకర్‌జీ స్ఫూర్తిప్రదాత.

కార్యకర్తలకు వారుజేసే మార్గదర్శనం అత్యంత అనుకూల, సులభ పద్ధతులలో ఉంటుంది. వారు కోపముతో మాట్లాడడంగాని, గట్టిగా మందలించడంగాని చేసేవారుకాదు. వారు అత్యంత ప్రేమ, శాంత స్వభావులు, నిర్మల హృదయులు.

1984లో మా శ్రీమతి (పూర్వాశ్రమ) నాగిళ్ళ ప్రేమమ్మ స్వర్గస్తురాలైనపుడు (44 సం॥వయస్సు) వారు ప్రత్యేకంగా షాద్‌నగర్‌వచ్చి పరామర్శించి, అనునయించి, ఆవేదన చెందిన అమృతవాక్కులు ఇప్పటికి నాకు గుర్తున్నవంటె వారి ఆత్మీయత, ప్రేమ, అర్థంచేసుకోవచ్చును. (ఆమెను అన్నపూర్ణఅన్నారు) 1989లో నా (53వ ఏట) ఎంతో ప్రయత్నంతో ప్రధమవర్ష శిక్షావర్గకు (వ్యాపారముఖ్య సమయం) వెళ్ళినాను. వారు నన్నుచూచి దాదాపు ఆలింగనము చేసుకుని ఇన్ని సం॥లకు (సంఘపరిచయం 1964) ఈ వయస్సులో వచ్చినారంటే చాలా సంతోషం అని స్వయంసేవకులకు ఆదర్శం అని అభినందించినారు. ఎంతో ప్రోత్సహించినారు. మాది సంఘకుటుంబమని అధికారులకు పరిచయంచేసినారు. అనేక కార్యక్రమాలు అనగా దండ, యోగచాప్, ఛురిక, మొ॥ కార్యక్రమాలలో ఆటలలో చురుగ్గాపాల్గొనడం, మినహాయింపు ఇస్తామన్న తీసుకోకపోవడం

చూచి చిన్నవయస్సు వారికి నన్ను చూపెట్టుచు ఈ వయస్సులో లింగమూర్తిగారు మీకన్న ఉత్సాహంగ, చేస్తున్నారని చెప్పుచు అభినందించేవారు. అనేక సందర్భాలలో అనుసరణీయమైన మార్గదర్శనం చేసేవారు.

2008 ఫిబ్రవరి 28న నాకు భీమరథశాంతి (70సం॥ తర్వాత జరిగేది) షాద్‌నగర్‌లో జరిగినది. కార్యక్రమం పూర్తిఐనది, భోజనాలు కూడ ఐపోయినవి. అప్పుడు వారు చక్రాల కుర్చీలో కార్యక్రమ ప్రాంగణానికి కార్యకర్తల సహాయముతో రావడం చూచి చాలా ఆశ్చర్యం, ఆనందం కలిగినది. వెంటనే నేను దగ్గరికివెళ్ళి, ప్రేమతో పలుకరించి వారి ఆత్మీయ ఆగమనానికి ఆనందించి కొంచెంముందువస్తే సభాముఖంగా మీ ఆశీస్సులు అందేవికదా అన్నాను. ముందుగా వస్తే వేదికపై కూర్చుని రెండుమాటల చెప్పివెళ్ళేవాడిని. కాని ఇప్పుడు నీతో మనసువిప్పి, సన్యాసానికి కారణము తెలుసుకుని మాట్లాడి వెళ్ళవలెనని అనుకున్నానంటూ ఆలస్యానికి కారణముచెప్పి ఆశ్చర్యపరిచినారు. సన్యాసానంతరము ఈ రూపుతో, ఈపేరుతో కలవంకదా అని చాలా సమయం మాతోగడిపినాను. ఈ సంఘటన నాకేకాదు మాకుటుంబసభ్యులకు, బంధువులకు ఆనందం కలిగించినది.

2008 మార్చిలో శ్రీ వ్యాసాశ్రమం మా గురుదేవుల పీఠంలో సన్యాసదీక్ష గైకొనబడినది. దాదాపు ఒక సం॥తర్వాత వారికి శస్త్రచికిత్స జరిగినటుల తెలిసినది. దీక్షానంతరము మొదటిసారి పరామర్శించడానికి బర్కత్‌పుర కార్యాలయంలో వారి గదికి వెళ్ళినాను. వారు లేచి ఎదురువచ్చి పాదాభివందనం చేయగా వారించినాను. నేను సన్యాసికి మొక్కుచున్నాను కాని లింగమూర్తికి కాదని చెప్పినారు. అంతేకాదు సన్యాసికి తల్లితప్ప అందరు నమస్కరించాలని చెప్పినారు. ఈ విధంగావారితో నాల్గుదశాబ్దాల అనుబంధం చిరస్మరణీయం. వారి ఆత్మ మాకు మార్గదర్శనం చేస్తూనే ఉంటుంది.

**– సదా సమాజసేవలో**
**శ్రీ జ్ఞానేశ్వరానందగిరి స్వామి**
**(పూర్వం నాగిళ్ళ లింగమూర్తి)**

# స్మృతిపథంలో హల్దేకర్జీ

**నా** ద్వితీయవర్ష 1969 తెనాలిలో జరిగింది. ఆ వర్గ విశేషం – భీకర తుఫాను, 16 రోజులు సంఘస్థాన్ లేకపోవడం, రవాణా వ్యవస్థలేక చాలామంది అధికారులు – ప.పూ. గురూజీతోసహా – వర్గలో పాల్గొనలేకపోవడం, కేవలం బౌద్ధిక కార్యక్రమాలు, జ్యేష్ఠకార్యకర్తలు, వర్గనిర్వాహకుల విశేషకృషి వలన సమయానికి వేడిగా భోజనం. ఈ పరిస్థితుల్లో 30 రోజులు వర్గ జరగడం కార్యకర్త నిర్మాణ ప్రక్రియలో ఒక సోపానం. ఆ వర్గలో మా చర్చాగట ప్రముఖ్ హల్దేకర్జీ. వెనకాల ఉండిపోయి, మౌనంగా గడపటం, కలివిడి తనానికి దూరంగా అవసరమైనంతే మాట్లాడటం, పిరికితనం, సంకోచం, కొంత ఆత్మన్యూనతాభావం, భయం కలగలిసిన వ్యక్తిత్వం నాది. నాల్గురోజుల తర్వాత నన్ను గమనించి నా మౌనం వెనక అంతరార్థాన్ని నిశ్శబ్దం వెనక శబ్దాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు రాంభావుజీ. రెండు రోజులు అధిక సమయం కేటాయించి నా మనస్థితిని సరిచేసిన కారణంగానే నేను ఒక స్వయంసేవక్గా జీవించడానికి, కార్యకర్తగా ఎదుగుతుండడానికి అవకాశం ఏర్పడింది. వారి వ్యక్తిగత శ్రద్ధకు నేను జీవితాంతం ఋణపడి ఉండాల్సిందే.

ప్రాంతకార్యవాహగా ఒకరోజు పర్యటనలో ఉండగా అర్జెంటుగా భాగ్యనగరం చేరుకోవాలని రాంభావుజీ దూరభాషా సందేశం. ముందు వెనకలు, పూర్వపరాలు ఎందుకు? ఏమిటి? అనేది తలంపుకు రాలేదు. క్షేత్రప్రచారక్గారి పిలుపుకు కారణం ఆలోచించాల్సిన పనిలేదు. ఉత్కళ ప్రాంతంలో భారీ విపత్తు తుఫాను రూపంలో సంభవించింది. అప్పుడు ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ కలిసి ఆగ్నేయ క్షేత్రం. వెంటనే వారి సహాయానికి చేరువలో ఉండాలికాబట్టి మాననీయ క్షేత్ర సంఘచాలకులైన సుబ్రహ్మణ్యశాస్త్రిగారితో కలిసి, పదిలక్షల రూపాయల డ్రాఫ్టు తీసుకొని బయలుదేరమని రాంభావుజీ ఆవేదన భరితంగా చెప్పారు. విశాఖపట్నం నుండి ఇక అతికష్టంమీద... నడపడానికి డ్రైవర్ నిస్సహాయత వ్యక్తం చేసినా ఎప్పటికప్పుడు ప్రోత్సాహాన్నందిస్తూ భువనేశ్వర్లో ఉత్కళ బిపిన్న సహాయతా సమితి కార్యాలయానికి చేరుకున్నాం. (మధ్యలో

ఒకరాత్రి బరంపురం కార్యాలయంలో బసచేసిన అనంతరం) అక్కడి ప్రభుత్వం మనకు శాటిలైట్‌ఫోను అందుబాటులో ఉంచిన కారణంగా చేరుకున్న వెంటనే రాంభావూజీకి సమాచారం ఇచ్చాను. ఊపిరి పీల్చుకొని తరువాత దశలగూర్చివారి మార్గదర్శనం అందించ సాగారు. అది స్పష్టంగా లభించింది. ప్రతి గంటకు విషయం తెల్సుకుంటూ మొత్తం పనికి కావాల్సిన సంధానం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అన్నిరకాల వనరులు చేర్చడానికి ఆందరితోనూ ముందుగానే మాట్లాడిపెట్టారు. సంధానం సమన్వయం, సంవాదం, సంయమనం, సమయానుకూల నిర్ణయం ఒక స్వయంసేవక్‌గా వారి దగ్గర విశేషంగా గమనించాల్సిందే. భాగ్యనగరం నుండి అన్ని సదుపాయాలూ ఉన్న సంజీవని మెడికల్‌వ్యాన్‌లో డా॥ సురేందర్‌రెడ్డి, డా॥ బి. శంకర్ (జగిత్యాల), డా॥ రాజిరెడి (రాయికల్) వంటి అనుభవజ్ఞులైన బృందం భువనేశ్వర్ వచ్చి అపైన జగత్సింగ్‌పూర్ జిల్లాలో వైద్యసేవలు అందించటం స్థానిక కార్యకర్తల మనస్థైర్యాన్ని ఎన్నోరెట్లు పెంచింది. దేశమంతా మనకు అండగాఉందనేభావం దృఢపడింది.

గుడిలోవ ప్రకల్పం ప్రగతి గమనించడానికి ప్రతి సంవత్సరం రెండురోజులు కేటాయించేవారు. నేను చాలా నేర్చుకోవడాన్కి అవకాశం లభించింది అంటూనే చిన్న చిన్న విషయాలు. నాదృష్టిలోలేనివి - చెప్పిసరిచేసేవారు. గుడిలోవ క్యాంపస్‌లో ఉన్న మహిళాశక్తిని కలపడం, కష్టసుఖా లడగడం భాగ్యనగర్ రమ్మని పిలవడం, పిల్లలు పెద్దలు యోగక్షేమాలు ప్రస్తావించడం సహజంగా వారు చేసేపని. దానివలన గుడిలోవ పరియోజన సక్రమంగా నడవడంలో వారిభాగస్వామ్యం ఉంది.

వారు అనారోగ్యంగా మంచంమీదుండి చికిత్సపొందుతున్నపుడు, జ్యేష్ఠప్రచారక్‌గా వారు నన్ను క్షేత్రస్థాయి కార్యకర్తగా పిలిపించుకొని, కార్యకర్తలలో వచ్చేవికృతులు, వాటిని ఎలాసరిచేయాలో చర్చించేవారు. ఈ ప్రక్రియలో వారికళ్లలో నీరు తిరగడం, ఆర్ద్రతతో విషయప్రస్తావన ఉండేది. వికృతులను సరిచేసే చక్కటి వ్యవస్థకోసం పరితపించేవారు.

కార్యవృద్ధికి అవసరమైన అష్టసూత్రాలు వారిలో నిబిడీకృతమై ఉండేవి. కార్యకర్తలకు వారిజీవితం ఒక ప్రేరణ.

సక్రియత్వం సహజతా సంఘకేంద్రితవర్తితా
సంవాదనశీలతాచైవ సంవేదన సమన్వయౌ
సకారాత్మక దర్శిత్వం సార్థకత్వం తథైవచ
ప్రవాసశ్చాష్ట సూత్రంతు నిశ్చితం కార్యవృద్ధయే.

**- దూసి రామకృష్ణారావు,**

**ఆర్.ఎస్.ఎస్. దక్షిణ మధ్యక్షేత్ర సహసంఘచాలక్**

# “మనమంతా స్వయంసేవకులం ఈ విషయం ఎప్పటికీ మరచిపోరాదు”

శ్రీ రామ్‌భావూ హల్దేకర్ ఆజీవన బ్రహ్మచారిగా ఉంటూ రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్‌ద్వారా సమాజోన్నతికై శ్రమిస్తూ తన జీవితమంతా సమర్పించారు. నావంటివారికి వేలాదిమందికి వారు ప్రేరణాస్రోతస్సుగా ఉండిరి. ఎప్పుడూ సంతోషంగా నవ్వుతూ ఉంటూ చిన్నవారిని–పెద్దవారిని సన్నిహితంచేసికొంటూ ప్రేమపూర్వకంగా పనిచేయటమెలాగో ఎందరోవారినుండి నేర్చుకున్నారు. వారు వరంగల్లులో, హైదరాబాద్‌లో విభాగ్ ప్రచారక్‌గా పనిచేస్తుండిన రోజులలో నేను ఇందూరుజిల్లా ప్రచారక్‌గా ఉండినాను. నేను వారిని 1970 నుండి ఎరుగుదును. ఆరోజుల్లో వారు ఇందూరుజిల్లాకు వచ్చినపుడు చిన్న పట్టణాలలోనూ, గ్రామాలలోనూ రాత్రి బసచేసి అక్కడే ఉండిపోయేవారు. అక్కడి ప్రజలతో చిన్నవారితోనూ, పెద్దవారితోనూ బాగా కలిసిపోయేవారు. కొన్ని సందర్భాలలో అసౌకర్యమేర్పడినా, దానిని పట్టించుకొనేవారుకాదు. ఇంట్లో ఉన్నపుడు ఎలాఉన్నా సరిపెట్టుకోవాలి అంటూ ఈ సమాజమే నా కుటుంబము అన్నతీరున వారు వ్యవహరిస్తుండేవారు. వారు మరాఠీ కలగలిసిన హిందీలో మాట్లాడుతూఉంటే ఆ గ్రామాలలోని ప్రజలు మంత్రముగ్ధులై శ్రద్ధగా వింటుండేవారు.

1980లో నేను భారతీయ జనతాపార్టీ ప్రాంత సంఘటనా కార్యదర్శిగా బాధ్యత వహిస్తున్నపుడు రాంభావూ హల్దేకర్‌జీ స్వయంగా నా కార్యాలయానికి వచ్చి నన్ను కలిశారు. అప్పటినుండి వారిని నావద్దకు రప్పించటంకాక, నేనే వారివద్దకు వెళ్ళికలుస్తూ ఉండటం ఒక పరిపాటి చేసుకున్నాను. నేను 1998లో కేంద్రప్రభుత్వంలో మంత్రిఅయినప్పుడు “మిఠాయిఏది?” అంటూ వారునవ్వుతూ అడిగారు. అప్పటినుండి నేను వారిని కలసికొనడానికి సంఘకార్యాలయానికి వెళ్ళేసమయంలో మిఠాయిలపొట్లాంవెంటతీసికొని వెళ్ళేవాడిని. ఎప్పుడూ మరిచిపోయిందిలేదు. రాంభావూజీ హల్దేకర్‌ని కలిసినప్పుడల్లా

వారు మాననీయ శ్రీ అటల్‌బిహారీవాజపేయి గురించి, వారి ప్రభుత్వంలోని విశేషాంశాల గురించి పత్రికల తీరుతెన్నులగురించి చర్చిస్తుండేవారు.

2009లో తెలంగాణా ఏర్పాటుగురించిన ఉద్యమం బాగాఊపు అందుకుంది. నాటినుండి తెలంగాణ ఏర్పాటు పూర్తయ్యేవరకు ఆ విషయాన్ని గురించిన పూర్తివిశేషాలు నానుండి తెలుసుకోనడానికి యత్నిస్తుండేవారు. వారు ఒకవిషయాన్ని పదేపదే గట్టిగా చెప్ప గుర్తుచేస్తుండేవారు – "మనమందరం స్వయంసేవకులం. మనం ఈ విషయాన్ని ఎప్పటికీ మరచిపోరాదు". 2014 ఎన్నికలలో భారతీయ జనతాపార్టీ జనాదరణను బాగాపెంచుకొంటుంది, ఎన్నికల ఫలితాలు భా.జా.పా.కి అనుకూలంగా వస్తాయి అని రాంభావుజీ ముందునుండే అంటుండేవారు. ఆ ఎన్నికల తర్వాత నేను మళ్ళీ కేంద్రంలో మంత్రిని అయినప్పుడు వారు ఎంతో సంతోషించారు. వారి ఆరోగ్యం క్షీణించి ఇబ్బందిపడటం మొదలైన తర్వాత నేను వారిని కలవడానికి వెళ్ళినపుడు 'నేను రోజూ శాఖకువెళ్ళి ప్రార్థనచేస్తున్నాను'అని చెప్పారు. శ్రీరామ్‌భావూహల్దేకర్ గొప్పత్యాగమూర్తి. వారు తన అంతిమశ్వాసవరకూ సంఘంకొరకు జీవితాన్ని సమర్పించుతునే గడిపారు. నాకు వ్యక్తిగతంగా ఎన్నోవిషయాలలో ఎల్లప్పుడూ మార్గదర్శనం అందిస్తూ వచ్చిన వ్యక్తి ఆయన.

**– బండారు దత్తాత్రేయ, మాజీమంత్రి, లోక్‌సభ సభ్యులు**



**సంజీవని సంచార వైద్యశాల ప్రారంభ సభలో**
**ఎడమనుండి శ్రీ అశ్వినీ సుబ్బారావ్, శ్రీగణపతి రావు బ్రహ్మపూర్కర్ (ప్రాంత కార్యవాహ), శ్రీ బండారు దత్తాత్రేయ (కేంద్రమంత్రి), శ్రీ హల్దేకర్ (క్షేత్ర ప్రచారక్), శ్రీ చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి (క్షేత్ర సంఘచాలక్)**

# శ్రద్ధా సుమాంజలి

విశుద్ధ జీవన విభూతి మీరు
ప్రసిద్ధ అద్భుత శిల్పులు మీరు
సదాశివుని వరసుతునిగ వచ్చి
హృదయాలెన్నో జయించినారు
స్నేహసూత్రమున బంధించారు ॥
శ్రీ హాళదేకర మహాశయా ! ఓ రాంభావూజీ సదాశయా !
మమ్ము విడిచి శివరాతిరినాడే శివసన్నిధి కేగితిరయ్యా ! మీ జన్మ ధన్యమయ్యా !

1. ఆ అజంతా గుహలమాటున అవతరించినారు
భాగ్యనగరిలో పవిత్రభారతి నారాధించారు
క్షేత్ర వ్యాప్తముగ సంఘవనమునే సాగుజేసినారు
అది పూవులు, కాయలు, పండ్లనివ్వగా పంచిపెట్టినారు, ఆప్యాయత చూపారు ॥శ్రీ॥

2. తల్లి బాసకాకున్నా మీరు తెలుగు నేర్చినారు
సంఘటనా త్రిమూర్తుల సమగ్ర చరిత వ్రాసినారు
ఆరువదేళ్ళ మీ పరిచయాలను, పొల్లువోని మీ జ్ఞాపకాలను
ఊరూరా బంధువులను కలిసి పంచుకొన్నారు, ఆత్మీయత చాటారు ॥శ్రీ॥

3. ఎదలనుతాకే ఆ చిరు కథలు, మీనోటన మా తెలుగుపదాలు
ఉత్సాహం ఇచ్చే బౌద్ధికులు, అప్పుడప్పుడు 'అంతతోగత్వాలు'
ఎలా మరువగల మయ్యా ఓ శ్రీరామచంద్ర హల్దేకర్‌జీ
మా 'శ్రద్ధా సుమాంజలు'లివే స్వీకరించిపొండి
పరమేశ్వరు శ్రీచరణమ్ముల విశ్రాంతిని పొందండీ ॥శ్రీ॥

– 'మంజీరా'

# మాననీయ శ్రీ రామచంద్ర సదాశివ హల్దేకర్‌జీ

# యజ్ఞమయ జీవనం

**మ**న భారత్‌లో పుణ్యభూమి ఎందరెందరో పుణ్యమూర్తులు అవతరించారు. అందులో మహారాష్ట్ర ప్రాంతంలో ఎక్కువమంది సాధుసంతులు, సత్పురుషులు, త్యాగమూర్తులు జన్మించారని చెప్పవచ్చు. మహారాష్ట్ర భౌగోళిక స్వరూపం కూడా ఎంతో ప్రత్యేకతను కలిగి ఉన్నది. వజ్రహస్తాలు చాచినట్లున్న సహ్యాద్రి కొండలు, సుగంధాన్ని చిందిస్తున్న పలుచ పలుచని పచ్చ పచ్చని ఆడవులు, జొన్న, కంది, ప్రత్తి, మొక్కజొన్న, మిర్చివంటి మెట్టపంటలకు నెలవైన నల్లరేగడి నేలలు, విశ్వవిఖ్యాత ఖ్యాతి నార్జించిన శిల్పకళల్ని భద్రపరిచిన అజంతా, ఎల్లోరా గుహలు... ఇవన్నీ మహారాష్ట్ర మట్టి ప్రత్యేకతను చాటుచున్నవి. సంత్ జ్ఞానేశ్వర్, తుకారాం, నామ్‌దేవ్, గజానన్ మహారాజ్, తుకుడోజీ మహారాజ్, ఏకనాథ్ వంటి సంత్ మహాత్ములు నడయాడిననేల, భగవాన్ షిర్డీసాయి వంటి అవధూతలు అవతరించిన నేల, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్, హెూండా నాగనాథ్, పరళీ వైద్యనాథ్ వంటి జ్యోతిర్లింగాలు, తుల్జాపూర్, పండరీపూర్, కొల్హాపూర్, చంద్రపూర్, శని శంగణాపూర్ మొదలగు పుణ్యక్షేత్రాలకు ఆలవాలమైన నేల, బాలగంగాధర తిలక్, బాబాసాహెబ్ అంబేద్కర్, రానడే, గోఖలే, డాక్టర్జీ, గురూజీ మొదలగు రాజకీయ, సామాజిక వేత్తలు ఉద్భవించిన నేల... ఇలా వర్ణిస్తూపోతే మహారాష్ట్ర ప్రాంత ప్రత్యేకత చాంతాడులా సాగుతుంది.

### 'హల్దా' గ్రామం :

అజంతా గుహలకు అల్లంతదూరంలో సుమారు 8-10కి.మీ. చెంత దట్టమైన అడవులు, ఎత్తైనకొండలమధ్య దిగువప్రాంతంలో 'హల్దా' అనే కుగ్రామముంది. ఇప్పటి శంభాజీనగర్ (ఔరంగాబాదు) జిల్లా సిల్లోడ్ తాలూకా కేంద్రానికి 15కి.మీ. దూరంలో ఈ గ్రామముంది. ఔరంగబాదు, జల్‌గాంవ్ హైవేపై సిల్లోడ్ తాలూకా కేంద్రముంది.

హైవేనుండి నల్లని కంకర రాళ్ళతో వంకరటింకరలుగా నల్లత్రాచులా ఎగుడు దిగుడుగా రోడ్డువెల్తుంది. ఆరోడ్డు ఎక్కువభాగం అడవిగుండా సాగుతుంది. హల్దా గ్రామానికి 4కి.మీ. ముందే అడవిలో కొండల మధ్యనుండి 'వాగూర్' అనే చిన్ననది ప్రవహిస్తుంది. అజంతా కొండలలోపుట్టి ముందుకుపాగి 'చంద్రభాగ'నదిలో వాగూర్‌నది సంగమిస్తుంది. అడవినిదాటి ముందుకెళ్తే 3 కి,మీ. కు 'హల్దా' వస్తుంది.

ఎత్తైన మైదానంనుండి రోడ్డు క్రిందికి సాగిపోతుంది. అక్కడే హల్దా గ్రామం ఉంది. గ్రామ పొలిమేరలో ఎత్తైన మైదానంలో రోడ్డుకిరువైపులా రెండు కట్టడాలు గ్రామంలోకి వచ్చేవారిని ఆహ్వానిస్తాయి. ముందుగా రోడ్డుకు కుడివైపు 'గోకుళ్–శేతీ–గ్రామవికాస్' పేరుతో ఒక గోశాల ఉంది. శ్రీ నారాయణరావు హల్దేకర్‌జీ అనే పుణ్యపురుషుని పుణ్య స్మృతిలో ఈ గోశాలను వారివారసులు నిర్వహిస్తున్నారు. అక్కడినుండి రోడ్డుపై కొంచెం ముదుకెళ్ళగానే చిన్న సుందర మందిరం కన్పిస్తుంది. అది హల్దేకర్ వంశీయుల కులదైవం 'శ్రీ రేణుకామాత' మందిరం. శ్రీరామచంద్ర సదాశివ హల్దేకర్‌జీ పుణ్యస్మృతిలో వారి ఆకాంక్ష మేరకు వారు స్వర్గస్థులైన పిదప 2018లో ఈ మందిరం నిర్మింపబడినది. ఈరెండు స్మారకాలు గ్రామంలోకి వచ్చేవారిని ఆశీర్వదిస్తూ స్వాగతిస్తున్నట్లున్నాయి.

## 'హల్దేకర్' వంశం:

'హల్దేకర్' అనే వంశనామం హల్దాగ్రామంలో జన్మించి, నివసించినందున స్థిరపడింది. ఈ వంశంలో మనకు సమాచారం అందినమేరకు ముగ్గురు సోదరుల ఉమ్మడి కుటుంబం హాల్దాలో నివసిస్తుండినది. వారు వరుసగా గోవిందరావు కృష్ణా హల్దేకర్, లక్ష్మణరావు కృష్ణా హల్దేకర్ మరియు లఖుజీరావు కృష్ణా హల్దేకర్. ఈ ముగ్గురి తండ్రి కృష్ణారావు హల్దేకర్ అని వారి పేర్లను బట్టి తెలియుచున్నది. శ్రీ రామచంద్ర సదాశివ హల్దేకర్‌జీ (హల్దేకర్‌జీ) జీవన చరిత్ర సమాచార సేకరణ సందర్భంగా ఈ పేర్లు లభించినవి. గోవిందరావు కుటుంబం, వారసుల వివరాలు మాత్రమే లభించినవి. గోవిందరావు సోదరులిద్దరి కుటుంబవివరాలు లభించలేదు.

గోవిందరావు ఏకైక సంతానం సదాశివరావు. ఆయన భార్య ద్వారకాబాయి. అనగా మన 'హల్దేకర్‌జీ' తాత గోవిందరావు కృష్ణా హల్దేకర్‌జీ– తండ్రి: సదాశివరావు గోవింద హల్దేకర్ ; తల్లి– ద్వారకాబాయి సదాశివరావు హల్దేకర్. మహారాష్ట్ర (మరాఠీ)లో వ్యక్తిపేరు ముందుంటుంది. తర్వాత తండ్రిపేరు ఇంటిపేరు ఉంటుంది. ఆ తర్వాత వంశం పేరు

ఉంటుంది. కొందరు వంశంపేరును తనపేరులో జోడించుకోరు. ఇక్కడ మరో విశేషముంది. మహారాష్ట్రీయులకు చాలామందికి తమనివాసపు ఊరు లేదా తాము పుట్టి పెరిగిన ఊరు లేదా తాము మరో ఊరుకు వలస వచ్చినచో ముందు నివసించిన ఊరే ఇంటిపేరుగా స్థిరపడుతుంది. ఊరుపేరుకు 'కర్' జోడింపబడి ఇంటిపేరవుతుంది. 'కర్' అనగా మరాఠీలో గ్రామనివాసి' అని అర్థం.

మన హల్దేకర్‌జీ వంశముపేరు 'కులకర్ణి' మరియు వీరి గోత్రం అత్రి మహర్షి గోత్రం. ఇప్పుడు మన హల్దేకర్‌జీ పూర్తిపేరు ఇలా ఉంటుంది. అత్రి గోత్రోద్భవ శ్రీరామచంద్ర సదాశివ హల్దేకర్ కులకర్ణి. మరాఠీలో మరో విశేషముంది. కొందరు ముఖ్యంగా బ్రాహ్మణ కులస్థులు తమపేరుకు 'రావు'ను జోడించుకుంటారు. కొందరు – ముఖ్యంగా బ్రాహ్మణ కులస్థులు తమపేరుకు 'రావు'ను జోడించుకుంటారు. కొందరు ఇతర కులస్థులు కూడా 'రావు'ను జోడించుకుంటున్నారు. మన హల్దేకర్‌జీ తనపేరులో 'రావు'ను జోడించుకోలేదు. అట్లే తన వంశము 'కులకర్ణి'ని కూడా జోడించుకోలేదు. 'కులకర్ణి' అనేది బ్రాహ్మణులలోని ఒక విశిష్టమైన వంశం. ఈ వంశంవారు పూర్వం సాధారణంగా వ్యవసాయంతో జీవించేవారు. వీరు శిస్తువసూలు చేసే 'పట్వారీ' పని కూడా (కొందరు) చేసేవారు. వీరికి పెద్దమొత్తంలో వ్యవసాయ భూములుంటాయి. రైతులతో వ్యవసాయం చేయించుకుంటారు. హిందూ సంఘటనా కార్యంకోసం సంఘప్రచారక్‌గా వచ్చిన హల్దేకర్‌జీ రావు–కులకర్ణి పదాలను తనపేరనుండి త్యజించడం అత్యంత సహజం, అది గొప్ప ఆదర్శం కూడా.

## సదాశివరావు కుటుంబం :

సదాశివరావు తన తండ్రి గోవిందరావుకు ఏకైక సంతానం. తోబుట్టువులు ఎవరూలేదు. నిజాంపాలనలో ప్రభుత్వానికి ప్రజలు చెల్లించే పన్నులే ప్రధాన ఆదాయం. పన్నులలో 'భూమిశిస్తు' మాత్రమే ప్రభుత్వానికి ప్రధాన ఆర్థికవనరు. రకరకాల ఇతర పన్నులు కూడా ఉండేవి. అవి తక్కువ మొత్తంలో ఆదాయాన్నిచ్చేవి. గ్రామాలలో ప్రజలనుండి పన్ను–భూమిశిస్తు వసూలు చేయుటకు 'పట్వారీ' వ్యవస్థ ఉండినది. ఒకటి లేదా రెండు మూడు గ్రామాల శిస్తువసూలు చేయుటకు ఒకవ్యక్తిని ప్రభుత్వం నియమించేది. ఆ వ్యక్తిని 'పట్వారీ' అనే పదవీనామంతో పిలిచేవారు. అలా ఉన్న పట్వారీ పదవి వారసత్వంగానే లభించేది.

సదాశివరావు 'హల్దా' గ్రామ పట్వారిగా పనిచేశారు. ఆయన మంచి ఆజానుబాహువు. ప్రజలతో బాగా కలిసి మెలిసి ఉండేవారు. పదవీదర్పాన్ని ఎప్పుడూ చూపేవాడు కాదు.

చాలా సౌమ్యంగా శిస్తువసూలు చేసేవాడు. వసూలుచేసిన శిస్తుపైకాన్ని అణాపైసలతో సహా ప్రభుత్వానికి చెల్లించేవాడు. పేదలెవ్వరినీ పీడించేవాడుకాదు. అవసరమైతే పేదల శిస్తును తానే సర్దుబాటు చేసేవాడు. సదాశివరావుకు తండ్రినుండి వారసత్వంగా వ్యవసాయభూమి బాగానే లభించింది. దానికితోడు తాను కొంత సంపాదించాడు. శిస్తులు పండించే వివిధ పంటలకు వేర్వేరుగా ఉండేవి. పంట పండిన తర్వాత రైతులు శిస్తులు చెల్లించేవారు. ఆ శిస్తుల లెక్కలు జాగ్రత్తగావ్రాసి తహసీల్ కార్యాలయంలో చెల్లించేవారు. 'తహసీల్' అనే ఉర్దూపదానికి భూమిశిస్తు అని అర్థం. పంట పంటకు శిస్తు వసూలు చేయాలి. లెక్కలు జాగ్రత్తగా వ్రాయాలి. పైకము జాగ్రత్తగా తీసికెళ్ళి తహసీల్ కార్యాలయంలో అప్పగించాలి. తహసీల్ కార్యాలయం సుమారు 20కి.మీ. దూరంలో ఉన్నది. సంవత్సరంలో అనేక పర్యాయాలు సుమారు నెలకోసారి తప్పనిసరిగా అక్కడికి వెళ్ళేవారు. ఎక్కువసార్లు కాలినడకనే వెళ్ళేవారు. అప్పుడప్పుడు ఎడ్లబండి ఉండేది. వారి వెంట ఇద్దరు గ్రామసేవకులు (సుంకర్లు-శేత్‌సింధీలు) ఉండేవారు. సదాశివరావు ఆజానుబాహువు, చాలావేగంగా నడిచేవాడు. సుంకర్లు వెనుక దాదాపుగా పరుగెత్తుతూనే నడిచేవారు. సదాశివరావు సిన్సియారిటీ కారణంగా ఐదూళ్ళకు పట్వారీ గా నియమింపబడ్డాడు. కొంత ప్రభుత్వభూమి ఈనాంగా ఇవ్వబడింది. అప్పటికే పెద్దమొత్తంలో భూమి ఉంది. దీంతో సదాశివరావు దాదాపు 40-50 ఎకరాల భూస్వామి అయ్యాడు.

సదాశివరావుకు ఆరుగురు సంతానం. అలా చాలాపెద్దకుటుంబం. భార్య ద్వారకాబాయి తానే ఇంటి వ్యవహారాలు, పిల్లల వ్యవహారం అన్నీ చూసుకునేది. పిల్లలతో ఇల్లు కళకళలాడేది. వారి ఇల్లు మాత్రం చిన్నగానే ఉంది. గ్రామానికి కొంత మధ్యలోనే ఉంది. చిన్న ఇరుకుదారులు దాటితే వీరిల్లు వస్తుంది. ఇంటిస్థలం సగంలో పెద్దఖాళీ స్థలం ఉంది. అక్కడ పందిరి లేదా రేకులు ఉండేవట. ఇప్పుడు లేవు. మిగతా సగం స్థలంలో ఇల్లు. ముందుభాగంలో మూడుగదులు, వెనుక భాగంలో రెండు గదులు వంటశాల, ధాన్యాలగది, శౌచాలయం - మధ్య చిన్నఖాళీ స్థలం ఉంది.

సదాశివరావు హల్దేకర్ సంతానంలో నలుగురు మగ- ఇద్దరు ఆడవాళ్ళు ఉన్నారు. వరుసగా -

**1.కృష్ణాబాయి ప్రహ్లాదరావు ఉగలే:** హైదరాబాదు నివాసం. హల్దేకర్‌జీ కొంతకాలం వీరింట్లోనే ఉండి చదువుకున్నారు. ఇక్కడినుండే ప్రచారక్‌గా వచ్చారు. ఈ దంపతులు

ఇప్పుడు లేరు, వారి సంతానం ఉన్నారు.

**2. నారాయణరావు సదాశివరావు హల్దేకర్:** ఔరంగబాదు నివాసం. ప్రభుత్వ (కోర్టు) ఉద్యోగి. కొంతకాలం హైదరాబాదులో ఉన్నారు. హల్దేకర్‌జీ కొంతకాలం వీరింట్లోఉండి చదువుకున్నారు. వీరి భార్య వత్సలాబాయి. వీరి సంతానంలో నందకుమార్ పెద్దవాడు. అత్యంత నిష్ఠావంతుడైన కార్యకర్త. కోర్టులో ఉద్యోగంచేసి రిటైరయ్యారు. మొత్తం హల్దేకర్ ఉమ్మడి పరివారమంతా సంఘంతో జోడింపబడి ఉండుటలో ప్రధానపాత్ర పోషిస్తున్నారు. సంఘ పెద్దలనేకులతో ఆత్మీయ సంబంధాలున్నవి. నారాయణరావుది చాలా పెద్ద కుటుంబం. వీరి కూతురు 'సునితా హల్దేకర్' రాష్ట్రసేవికాసమితి ప్రచారిక, ప్రస్తుతం అఖిలభారతీయ స్థాయి 'సహసర్ కార్యవాహిక' బాధ్యత నిర్వహిస్తున్నారు. అస్సాం లోని గువాహటి కేంద్రంగా పనిచేయుచున్నారు. హల్దేకర్ ప్రేరణతోనే తాను ప్రచారికగా వచ్చానని చెబుతారు. నారాయణరావు 1990 సెప్టెంబరు 5 నాడు, ఆయన భార్య వత్సలాబాయి 2000సం॥ జనవరి 12 నాడు పరమపదించారు.

**3. రామచంద్ర సదాశివ హల్దేకర్ (రాంభావుజీ హల్దేకర్):**

యావత్ హల్దేకర్ పరివారాన్ని ధన్యత నొందించిన పుణ్యశ్లోకుడు. జననం –1930 ఫిబ్రవరి5 (పుష్యబహుళ ద్వాదశి)

**నిధనం:** 2017 ఫిబ్రవరి 23 (మాఘబహుళ త్రయోదశి)

**విద్యాభాసం :** ప్రాథమిక విద్య1,2 తరగతులు – హల్దాగ్రామ పాథమిక పాఠశాల.

3,4 తరగతులు – సోయేగాం (హాల్దా దగ్గరలోని గ్రామం) ప్రాథమిక పాఠశాల. 5 నుండి 10వ తరగతి ఔరంగబాదు. శ్రీ కృష్ణాశిక్షాసంస్థాన్ హైస్కూల్, షాగంజ్ ఏరియా –ప్రేంరాజ్ బిల్డింగులో అద్దెకుంటూ, స్వయంగా వండుకొనితింటూ చదివారు. ఎన్.ఎస్. కులకర్ణి, పి.వి. జోషి – గణితం, ఆంగ్లం బోధించిన అధ్యాపకులు.

**ఇంటర్‌మీడియెట్ :** (ఎఫ్.ఏ.– పి.యు.సి.) నిజాంకాలేజి/ ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

డిగ్రీ: బి.ఎస్.సి. (ఎమ్.పి.సి.) ఉస్మానియా విశ్వవిద్యాలయం (1952)

**శాఖా పరిచయం :** ఔరంగబాదులో 10వ తరగతిలో ఉన్నపుడు తమపాఠశాల మైదానంలో నడిచే శ్రీకృష్ణ సాయంశాఖకు వెళ్లేవారు. దత్తాజీ భాళే అనే సంఘ కార్యకర్త (ప్రచారక్) ద్వారా శాఖకు వెళ్ళారు. ఈయన సునీతా హల్దేకర్ మేనమామ. హైదరాబాదులో

ఉస్మానియాలో డిగ్రీ చదువుతున్నపుడు మళ్ళీ శాఖకు వెళ్ళారు. పనిలో క్రియాశీలకంగా తయారయ్యారు. ఇక్కడకూడా మళ్లీదత్తాజీభాళే ద్వారా క్రియాశీలకుడయ్యారు. దత్తాజీ ఇక్కడ కొంతకాలం ప్రచారక్‌గా ఉన్నారు. ఈయన సీతాఫల్‌మండిలో శాఖనడిపేవారు. హల్దేకర్‌జీ ఆ శాఖకు అప్పుడప్పుడు వెళ్లేవారు. రమణ్‌భాయి పారిఖ్ అనే కళాశాల విద్యార్థి నల్లకుంటలో శాఖనడిపేవారు. ఈయన హల్దేకర్‌జీ మిత్రుడు. ఆయన ప్రోద్బలంతో నల్లకుంట శాఖకు వెళ్లేవారు. 1952లో డిగ్రీ పూర్తయిన పిదప రెండేళ్ళు కాచీగూడా, గౌలీగూడా మండల విస్తారక్‌గా పనిచేశారు. 1954లో ప్రచారక్‌గా వచ్చారు. హల్దేకర్‌జీ ప్రచారక్‌గా రావడానికి దత్తాజీభాళే, శ్రీరాం సాఠేజీ, గణపతిరావుజీ బ్రహ్మపూర్కర్ ప్రోద్బలం బాగా ఉన్నట్లు చెప్పారు. ఆజీవనం ఆ వ్రతాన్ని కొనసాగించారు. ఇది సదాశివరావు మూడవ సంతానం సంక్షిప్త పరిచయం... ప్రచారక్ జీవిత వివరాలు వేరేచోట చూద్దాం....

**4. సుభద్రాతాయి నారాయణరావు డబీర్:** సదాశివరావు మూడవ సంతానం. హల్దేకర్‌జీ కంటే చిన్నది. అనగా చెల్లెలు. ఈమెది చాలా చిన్నకుటుంబం. నల్గురు కుమార్తెలు. ఈమె కూడా పరమపదించారు.

**5. దత్తాత్రేయ సదాశివరావు హల్దేకర్ :** ఔరంగబాదు నివాసం. వీరి ధర్మపత్ని రుక్మిణితాయి, 82ఏళ్ళ వయసులో హల్దేకర్ పరివారంలో అందరిముందు నడయాడుతున్న మహాసాధ్వి. ఈ సంవత్సరం ఆమెకు సహస్ర పూర్ణచంద్రదర్శనోత్సవం జరుపుతున్నారు. శంకర్ ప్రదీప్‌వంటి నిష్ఠావంతుల్ని కన్నారు. దత్తాత్రేయ హల్దేకర్ 2005.... నాడు హఠాత్తుగా హైదరాబాదు–చప్పల్‌బజార్‌లో గుండెపోటుతో మరణించారు. అంతకు ముందురోజు భాగ్యనగర్‌లో జరిగిన సర్‌సంఘచాలక్‌జీ విచ్చేసిన సాంఘిక్‌లో పూర్ణగణవేషతో పాల్గొన్న ధన్యజీవి. వీరి కుటుంబమే హాల్దాలోని ఇంటిలో ఎక్కువ కాలమున్నారు.

**6. ప్రభాకర్‌రావు సదాశివరావు హల్దేకర్ :** ఔరంగబాదు నివాసి. హైదరాబాదులో ఇంజనీరింగ్ విద్యాభ్యాసం చేశారు. తర్వాత మహారాష్ట్రలో వివిధచోట్ల ఇంజనీరుగా పనిచేశారు. హల్దేకర్ పరివారంలో ఆర్థికంగా బాగా స్థితిమంతుడు. ఈయన మంచి గాయకుడు. రేణుకమాతపై భక్తిగీతా లనేకం రచించారు. బాణీలుకట్టి భజనలు బాగా చేస్తారు. ఈయన భార్య ప్రమీలాతాయి. వారి సంతానంలో సంతోష్, సందీప్ మంచి నిష్ఠావంతులయిన సంఘకార్యకర్తలు. సంతోష్ పెద్ద పారిశ్రామికవేత్త. 'లఘు ఉద్యోగ భారతి' మహారాష్ట్ర ప్రాంత కోశాధికారి. సంతోష్ ఇల్లు సంఘాధికారులకు బాగా ఆతిథ్యాన్నిచ్చే

ఇల్లు. ఈ ఇంట్లోనే హల్దేకర్‌జీ వచ్చినపుడు ఎక్కువగా ఆగేవారు. దత్తాత్రేయ 2015 ఆగష్టు 12నాడు, వారి ధర్మపత్ని ప్రమీలాతాయి 2016 సెప్టెంబరు 28నాడు పరమపదించారు. తనకంటే చిన్నవాళ్లయినా తనకంటే ముందేపోయారని హల్దేకర్ జీ చివరిరోజుల్లో బాగా బాధపడ్డారు.

## సమరసత:

సదాశివరావు సంతానం గురించి ఇక్కడే సంక్షిప్తంగా పరిచయం చేయబడింది. సదాశివరావు హల్దా గ్రామాన్ని సంఘటితంగా ఉంచారు. ధార్మికంగా ప్రజల్ని తీర్చిదిద్దారు. గ్రామం ప్రారంభంలోనే రెండు మందిరాలున్నాయి. శ్రీ రుక్మిణీవిఠలేశ్వర మందిరం – చాలాపాతది. సదాశివరావు బాల్యంలో నిర్మించబడింది. రెండవమందిరం శ్రీ సీతారామమందిరం. సదాశివరావు హయాములో ఆయన నాయకత్వంలో నిర్మించబడింది. సదాశివరావు ఇల్లు సమరసతకు పెట్టిందిపేరు. ఆయన ఇంటిపనులు, వ్యవసాయపనులు చూడ్డానికి నల్గురు అన్నదమ్ముల ఉమ్మడి కుటుంబం ఒకటి ఉండినది. నల్గురు సోదరులలో పెద్ద కాశీనాథ్. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈ వృద్ధదంపతులు ఒకరేకుల కప్పుఉన్న గుడిసెలో ఉంటున్నారు. ఇద్దరు కుమారులు ప్రక్కనే చిన్న స్లాబు ఇల్లు రెండుపోర్షన్లుగా కట్టుకొని ఉంటున్నారు. వీరి ఇల్లు హల్దాగ్రామంలో ప్రవేశిస్తుంటే మొదటిఇల్లు. రేణుకామాత మందిరం దాటి రోడ్డు ఊరువైపు వస్తుంటే మూలమలుపు ఉంది. ఎడమవైపు తిరుగుతుంది రోడ్డు చాలా ఎత్తైన ప్రదేశంనుండి క్రిందికిపోతుంది రోడ్డు. ఆ క్రిందికి దిగగానే మొదటి ఇల్లు కాశీనాథ్ కుటుంబానిది. హల్దాగ్రామంలోని ఇంటిలో ఇప్పుడెవ్వరూ ఉండడంలేదు. దత్తాత్రేయ హల్దేకర్ చిన్నకొడుకు అజయ్ కుటుంబం కొంతకాలం అక్కడున్నారు. ఇల్లు పునర్నిర్మాణం జరిగిన పిదప ఆయనకూడా ఔరంగబాదుకు మారాడు. సదాశివరావు దంపతులకు ఆ తర్వాత దత్తాత్రేయ దంపతులకు, అజయ్ దంపతులకు మూడుతరాలకు సేవచేస్తూ కాశీనాథ్ ఉమ్మడి కుటుంబం అండదండగా ఉండినది. హల్దేకర్ జీ తల్లి ద్వారకాబాయికి కాశీనాథ్ భార్యకు సాన్నిహిత్యం బాగా ఉండేది. కాశీనాథ్ భార్య దినమంతా ద్వారకాబాయివద్ద ఇంట్లో పనులుచేస్తూ ఉండేది. ఇప్పుడు హల్దేకర్ పరివారసభ్యులు ఎవరూ హల్దాకు వెళ్లినా మొదట కాశీనాథ్ ఇంటివద్ద ఆగాల్సిందే. మంచినీళ్ళు, చాయ్ త్రాగాల్సిందే. భోజన సమయమైతే భోజనంకూడా చేయాల్సిందే. ఉభయ కుటుంబాల మధ్యనా అత్యంత సాన్నిహిత్యం,

సమరసత ఉండినది. కాశీనాథ్ పక్కా స్వయంసేవక్, ఎమర్జెన్సీలో సత్యాగ్రహంచేసి జైలుకెళ్ళాడు. మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అందుకుగాను 5000/-రూ.లు పెన్షన్‌కూడా ఇస్తున్నది. హల్దానుండి ఒక్కొబృందంలో ఐదారుగురు సత్యాగ్రహంలో పాల్గొన్నారు.

## సహస్ర పూర్ణచంద్రదర్శన మహోత్సవం :

సంఘ ఆదర్శంతో ప్రేరితులైన కొంతమంది వ్యక్తులు సంఘప్రచారకులుగా వస్తారు. ఇల్లు, కుటుంబం బరువు బాధ్యతలన్నీ వదిలిపెట్టి వస్తారు. కొందరు మంచి ఉన్నతమైన ఉద్యోగాలను, బాగా సంపాదించగలిగే వృత్తి, వ్యాపారాలను వదిలిపెట్టి వస్తారు. ప్రచారక్‌గా వచ్చిన పిదప పూర్తిగా కౌటుంబిక బంధనాలను త్రెంచుకున్నట్లు పనిలో మునిగిపోతారు. తమ ఇంట్లో, తమ బంధువుల ఇళ్ళల్లో జరిగే ముఖ్యమైన శుభాశుభ కార్యక్రమాలకు కూడా కొన్ని సందర్భాలలో వెళ్ళకుండా ఉంటారు. మనం వీళ్ళను 'సంఘప్రచారక్' అని అత్యంత గౌరవాదరాలతో, ఆత్మీయతతో చెప్పుకుంటూ ఉంటాం. వీళ్ళనే బయటి సమాజమేమో 'ఇళ్ళొదిలి దూరంగా వెళ్ళిపోయినోళ్ళు' అని ఎగతాళిగా చెబుతారు. నిజానికి అలా అనడం సమంజసం కాదు. అది బాధ్యతారాహిత్యం కూడా. తన చిన్న ఇంటిని సమాజమనే పెద్ద ఇంటికి విస్తరించి సమాజంకోసం సమాజంలో కలగల్సి జీవిస్తున్న వ్యక్తి సంఘప్రచారక్.

మామూలుగా చూస్తే సంఘప్రచారక్ తన ఇంటికి కుటుంబ సభ్యులకు దూరంగానే ఉంటాడు. అవును ప్రచారక్ అంటే ఇంటికి, బంధాలకు, బంధుత్వాలకు దూరంగా ఉండాల్సిందే అనే భావం మనందరిలో సహజంగానే ఉంటుంది. నిజానికి దాదాపు ప్రచారకులంతా అలాగే ఉంటారు కూడా...... అయితే ఇక్కడ మనకు హల్దేకర్‌జీ విషయం కొంత భిన్నంగా కనిపిస్తుంది. బంధాలకు దూరంగా ఉంటూనే బంధుత్వాలను బాగా పటిష్టంగా ఉంచుకున్నారు. ఇదే హల్దేకర్‌జీ ప్రత్యేకత. ప్రతియేటా ఒకసారి తప్పనిసరిగా శంభాజీనగర్, హల్దా వెళ్ళివచ్చేవారు. అలాగే తమ కులదైవం రేణుకామాత దర్శనం కోసం తమ కుటుంబ సభ్యులందరు మాహూర్‌లో ప్రతియేటా కలుసుకునేలా ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారు. ఈ రెండు కార్యక్రమాలను హల్దేకర్‌జీ తన వైయక్తిక లేదా కౌటుంబిక సంతృప్తి కోసం ప్రారంభించలేదు. సంఘజీవనాదర్శంతో తన సోదరీ సోదరుల సంతానమంతా 'తాదాత్మ్యం' చెందాలనే వారు కాంక్షించారు. అందులో వారు పూర్తి విజయవంతమయ్యారు కూడా. హల్దేకర్‌జీకి తమ కుటుంబ సభ్యులు జరిపిన సహస్ర

పూర్ణచంద్రదర్శన మహోత్సవంలో ఇది మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

2010 ఫిబ్రవరి 7 దాసనవమి నాటికి హల్దేకర్‌జీకి 82 ఏళ్ళు నిండినవి. ఆనాడు సహస్ర పూర్ణచంద్రదర్శన మహోత్సవం జరపాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. చాలా ముందుగానే అంతాకల్సి యోజన చేశారు. ఔరంగబాదునుండి భాగ్యనగర్‌కు నందు సోదరులతో వచ్చి హల్దేకర్‌జీకి విషయం చెప్పారు. తనకు ఇలాంటి ఆడంబరాలు నచ్చవన్నారు. ససేమిరా వద్దన్నారు. సంఘ ఆదర్శంతో తాదాత్మ్యం చెందిన ఆ సోదరులు "మీకు వ్యక్తిగతంగా కాదు, సంఘజీవన ఆదర్శానికే ఈ ఉత్సవం" అని పలువిధాలుగా నచ్చచెప్పి చివరకు సంఘ అఖిల భారతీయ పెద్దలచే చెప్పించి ఒప్పించారు.

2010 ఫిబ్రవరి 7నాడు ఔరంగబాదులోని 'కలశ్ మంగళ్ కార్యాలయ' అనే ఫంక్షన్‌హాల్‌లో హల్దేకర్‌జీ సహస్ర పూర్ణ చంద్రదర్శనోత్సవం చాలా చక్కగా జరిగింది. ఈ ఉత్సవం కేవలం ఒక్క హల్దేకర్‌జీ అభినందన కోసం కాదు. సంఘ ప్రముఖులు పూజ్య సర్ సంఘచాలక్ శ్రీ సుదర్శన్‌జీ, సర్‌కార్యవాహ మా.శ్రీ. భయ్యాజీ జోషి, వందనీయ ప్రమీలాతాయి మేఢే, మాననీయ శ్రీ మా.గో. వైద్య- మొదలగువారిని కూడా అభినందిస్తూ వారందరి పూర్ణాయుష్షును ఆకాంక్షిస్తూ జరిపిన ఉత్సవమిది. దీనికి హల్దేకర్‌జీ పరివారమంతా తరలి వచ్చారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్యులు హంపీ విద్యారణ్య విరూపాక్ష పీఠాధిపతి ప్రత్యేకంగా విచ్చేశారు. ఎందరెందరో నగర ప్రముఖులు వచ్చారు. భాగ్యనగర్ నుండి రెండు తెలుగు ప్రాంతాలకు చెందిన ప్రముఖ కార్యకర్తలు వచ్చారు. అలా వచ్చిన వారిలో శ్రీయుతులు జస్టిస్ పర్వతరావు, వి. రామారావు, బంగారు లక్ష్మణ్, భావనారాయణ, భాస్కర్‌జీ, బెల్లంకొండ మల్లారెడ్డి....మొదలగు వారున్నారు.

ప్రొద్దున వేదపండితులచే హవనం, యజ్ఞం నిర్వహింపబడింది. పెద్దలందరిచేత వేదమంత్రాలతో హవిస్సులు, సమిధలు, నవధాన్యాలతో ఆహుతులు ఇప్పించారు. తర్వాత సభాకార్యక్రమం జరిగింది. మొదట జగద్గురు శ్రీ శంకరాచార్యులు విద్యారణ్య భారతీస్వామి ఆశీః ప్రసంగం గావించారు. తర్వాత పూజ్య సుదర్శన్‌జీ, భయ్యాజీ, మా.గో. వైద్య, ప్రమీలాతాయి, జస్టిస్ పర్వతరావు, వి. రామారావు తదితరులు ప్రసంగించారు. శ్రీ హల్దేకర్‌జీ ధన్యవాదపూర్వకంగా తన మనోగతాన్ని సవిస్తరంగా ఆవిష్కరించారు. హల్దేకర్‌జీ కుటుంబసభ్యులు సేవాకార్యక్రమాల కోసం, సేవాభారతికి, సేవికా సమితికి, వనవాసీ కళ్యాణ ఆశ్రమానికి రూ. ఒకలక్ష చొప్పున విరాళం సమర్పించారు. చివరకు

ధన్యవాద సమర్పణ శ్రీ ప్రభాకర్‌రావు హల్దేకర్ చేస్తూ అందర్నీ ముగ్ధుల్నిగావించారు. అలాగే సౌ॥ సురేఖా సుధీర్ భాలేరావ్ అత్యద్భుతంగా సభా సంచాలనం గావించారు. సభలో సుమారు వేయిమంది పాల్గొన్నారు. అంతా సంఘమయ వాతావరణంతో తాదాత్మ్యం చెందుతూ ఆనందించారు.

## హల్దాలో ఇల్లు పునర్నిర్మాణం - గృహప్రవేశ మహోత్సవం:

హల్దాలో ఉన్న ఇల్లు వారసత్వంగా వచ్చింది. గోవిందరావునుండి సదాశివ రావుకు, ఆ తర్వాత హల్దేకర్‌జీ సోదరులకు వారసత్వంగా వచ్చింది. గోవిందరావునుండి సదాశివరావు ఇంటి బాధ్యత స్వీకరించిన క్రొత్తలో ఇంటిని పెద్దగా చేశాడు. చాలాకాలం ఆయిల్లు ఆరుగురు సంతానంతో కళకళలాడుతూ ఉండినది.. సదాశివరావు సంతానం పెరిగి పెద్దవారైనారు. కూతుళ్ళు ఇద్దరు పెళ్లిళ్ళయి అత్తావారిళ్ళకెళ్లిపోయారు. కుమారులు కూడా ఉపాధికోసం ముగ్గురు ఔరంగాబాదులో స్థిరపడ్డారు. హల్దేకర్‌జీ ప్రచారక్‌గా భాగ్యనగర్ చేరారు. దత్తాత్రేయ కుటుంబమే తరచూ హల్దాలో ఉండేవారు. చిన్నకొడుకు అజయ్ వ్యవసాయం చేయించుకుంటూ అక్కడే ఉన్నారు. సదాశివరావు పెద్దకొడుకు నారాయణరావు, చిన్నకొడుకు ప్రభాకర్‌రావు ఉద్యోగాలరీత్యా వివిధచోట్లకు తిరిగారు. చివరకు ఔరంగబాదులోనే స్థిరపడ్డారు. ఇక్కడ హల్దాలో ఇల్లు బాగాశిథిలావస్థకు వచ్చింది. ఉమ్మడికుటుంబ సభ్యులందరు ఆయింటిని వారసత్వ సంపదగా అపురూపంగా భావించారు. హల్దేకర్‌జీ ప్రేరణతో దాన్ని ఆ పాతమోడల్లోనే పునర్నిర్మాణంగావించారు 2012లో. 22-10-2012నాడు నిర్మాణం పూర్తయి గృహప్రవేశం జరిగింది. చాలా పెద్దఎత్తున కార్యక్రమం జరిగింది. సుమారు వందమంది సభ్యుల పరివారమంతా అక్కడ కలిశారు. అయితే అప్పటికే సదాశివరావు 1989లో, పెద్దకొడుకు నారాయణరావు 1990లో, మరో కొడుకు దత్తాత్రేయ 2005లో చనిపోయారు. వారులేని లోటుమాత్రము అక్కడ స్పష్టంగా కనిపించింది.... ఇక్కడ భాగ్యనగర్ నుండి 20-30 కుటుంబాల్ని హల్దేకర్‌జీ హల్దా గృహప్రవేశానికి ఆహ్వానించారు. హల్దేకర్ ఉమ్మడి కుటుంబసభ్యులు మరియు భాగ్యనగర్ నుండి వెళ్లిన సంఘకుటుంబాల సభ్యుల కలయికతో హల్దా కళకళలాడింది. అది గంగా, యమునల సంగమంలా ఉండినది. శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం తర్వాత చక్కగా పరిచయ కార్యక్రమం జరిగింది. హల్దేకర్‌జీ పరివార సభ్యులు, కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్ళు అందరి పరిచయం జరిగింది. నందకుమార్

హల్దేకర్ అందరినీ కుటుంబాలవారీగా పరిచయం చేశారు. భాగ్యనగర్ నుండి వచ్చిన వారందరిని కుటుంబాలవారీగా హల్దేకర్‌జీ పరిచయం చేశారు. హల్దేకర్‌జీ స్మరణశక్తికి అంతా ఆశ్చర్యపోక తప్పలేదు. కార్యకర్తలపేర్లు సరే, వారి భార్యా, పిల్లపేర్లు కూడా హల్దేకర్‌జీ తడబాటు లేకుండా చెప్పారు. ఉభయ వర్గాలలో అత్యున్నత హోదా పదవీ బాధ్యతలున్నవారి గురించి చెప్పినపుడు అంతా ఆశ్చర్యం ఆనందం వ్యక్తంచేశారు. ఇందులో ఇద్దరు ప్రముఖ బాధ్యతగలవారు ఉన్నారు. ఒకరు హరిభావూజీ జోషి- సంఘ జ్యేష్ఠప్రచారకులు. ఇతిహాస సంకలన సమితి అఖిల భారతీయ బౌద్ధిక్ ప్రముఖ్, రెండవవారు సునితా హల్దేకర్, రాష్ట్రసేవికా సమితి, అఖిలభారతీయ బౌద్ధిక్ ప్రముఖ్ – ఆమె అస్సాం, గౌహతి నుండి వచ్చారు. ఈమె హల్దేకర్‌జీ అన్నయ్య కూతురు కావటం విశేషం. చివర్లో కొద్దిసేపు హరిభావుజీ ప్రసంగించారు. హల్దేకర్ ధ్యేయవాద జీవనాన్ని వివరిస్తూ కార్యకర్తలంతా వారి ఆదర్శాన్ని అనుసరిస్తూ పనిచేయాలని తెలిపారు. తర్వాత అందరికీ భోజనాలు. అనంతరం పిచ్చాపాటి కబుర్లు. కొందరు హల్దా గ్రామమంతా తిరిగి చూశారు. కొందరు గ్రామస్థులతో ముచ్చటించారు. కొంతసేపటి తర్వాత సంఘప్రార్థన, తిరుగు ప్రయాణం. కొన్నికార్లు మరియు మూడు బస్సుల్లో ప్రయాణం ఆనందంగా సాగింది. భాగ్యనగర్ నుండి వచ్చినవాళ్ళు రాత్రి సంతోష్ హల్దేకర్ ఇంటివద్ద భోంచేసి, రైల్లో తిరుగుప్రయాణం అయ్యారు.

## హల్దేకర్‌జీ బాల్య మిత్రులు :

సమాచార సేకరణలో భాగంగా శంభాజీనగర్‌లో హల్దేకర్‌జీ బాల్య మిత్రులిద్దర్ని వారి ఇళ్లకువెళ్లి కలవటమయింది. వీరిరువురూ సుమారుగా హల్దేకర్‌జీకి సమవయస్కులు. 88-89 ఏళ్ళున్నట్లు చెప్పారు. ఔరంగాబాదులో 5వ తరగతి నుండి హైదరాబాదులో ఓ.యు. లో డిగ్రీ బి.ఎస్సీ. వరకు తాము ముగ్గురం స్కూల్ క్లాస్‌మేట్స్‌మని చెప్పారు. ఈ మిత్రులిద్దరూ విద్యాశాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ గావించారు. వయోవృద్ధులయి నందున చెముడు, వినికిడి సమస్య, నేనేదో అడిగితే వారింకా ఏవేవో చాలా చెప్పారు. హల్దేకర్‌జీ పాఠశాల విద్యాభ్యాసకాలం వివరాలు కొన్ని తెల్సినవి. ఆకాలంలో పల్లెటూరునుండి పై చదువులకోసం దగ్గరలో ఉన్న ఉన్నత పాఠశాల కు వచ్చేవారు. అదీ కాస్త ధనవంతుల పిల్లలు మాత్రమే వచ్చేవారు. ఆ ప్రాంతంలో ఆ కాలంలో ఔరంగాబాదులో మాత్రమే ఉన్నత పాఠశాల ఉండినది. సదాశివరావు తన మగపిల్లల్ని అలా చదివించారు.

ఔరంగబాదులోని షాగంజ్ ఏరియా ప్రేమ్‌రాజ్ బిల్డింగ్‌లో ఉండి హల్దేకర్‌జీ సోదరులంతా ఔరంగబాదులోని శ్రీకృష్ణ శిక్షణ సంస్థాన్ హైస్కూల్లో చదివారు.

## హల్దేకర్‌జీతో కలిసి చదువుకున్న ఇద్దరు పెద్దలు చెప్పిన విషయాలు:

**1. భాస్కర్‌రావు సాతార్కర్ :**

ఔరంగాబాదులో ఉంటున్నారు. సాతార్‌అనే గ్రామం నుండి చిన్ననాడు వచ్చి ఔరంగబాద్‌కు వచ్చి చదువుకున్నారు. తాను రాంభావ్ హల్దేకర్‌జీకు 1సంII జూనియర్ నన్నాడు. మళ్ళీ డిగ్రీలో ఓ.యు.లో క్లాస్‌మేట్ నన్నారు. తమ శ్రీకృష్ణ శిక్షణ సంస్థాన్ మైదానంలోనే సాయంశాఖ నడిచేది. ఆటలమీద ఆసక్తితో హల్దేకర్‌జీతోసహా చాలామంది పిల్లలు శాఖకు వచ్చేవారు. దత్తాజీ భాళే తమను శాఖకు తీసికెళ్లేవారన్నారు. రాంభావు హల్దేకర్‌జీ కూడా అలా శాఖకు వచ్చారు. దత్తాజీ భాళే సునితా హల్దేకర్‌కి, నందు హల్దేకర్‌కీ మేనమామ. దత్తాభాళే తర్వాత కాలంలో తాము భాగ్యనగర్ ఓ.యు.లో ఇంటర్–డిగ్రీ చదువుచున్నపుడు హైదరాబాదుకు విస్తారక్‌గా వచ్చారు. సీతాఫల్‌మండి ప్రాంతంలో హైదరాబాదులో శాఖనడిపారు. ఓ.యు. హాస్టల్ దగ్గర్లో కూడా ఓ శాఖ నడిచేది. బయటగదిలో ఉండి చదువుకుంటున్నపుడు సీతాఫల్‌మండి శాఖకు, ఓ.యు. హాస్టల్ గదిలో ఉండి చదువుకుంటున్నపుడు అక్కడి శాఖకు వెళ్ళేవారు. దత్తా భాళే తమ రూముకు అప్పుడప్పుడు వచ్చేవారు. ఆయనతో హల్దేకర్‌జీ కూడా మా శాఖకు, రూముకు అప్పుడప్పుడు వచ్చేవారు. హల్దేకర్‌జీ వాళ్ళ అన్నయ్య నారాయణరావు దగ్గర ఉండి ఇంటర్ చదువుకున్నారు. 1950లో నారాయణరావు. ఔరంగబాదుకు ఉద్యోగరీత్యా మారవల్సి వచ్చింది. అప్పుడు హల్దేకర్‌జీ తన అక్క, బావ ఇంట్లో ఉండి చదివారు. అప్పుడు హైదరాబాదులో సాఠేజీ ఒక్కరే ప్రచారక్‌గా ఉన్నారు. భాస్కర్‌రావు దామ్లేగారు బి.ఎస్.సి. బి.ఇ.డి. చేశారు. హైస్కూల్‌లో చదువుతున్నపుడు ధ్వజంలేని శాఖ కొంతకాలం నడిచేదని చెప్పారు. హల్దేకర్‌జీ మంచి కబడ్డీ క్రీడాకారుడని, గాయకుడని, పౌరాణిక నాటకాలలో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలు వేశారని తెలిపారు. భాస్కర్‌రావు 1952లో ప్రైమరీ స్కూల్ టీచరుగా చేరారు. ఔరంగబాదు (ఖట్కి) జిల్లాలో పనిచేశారు, 1955, 56లో హైదరాబాదులో హైస్కూల్‌లో చేశారు. 1990లో బి.ఇఓ. బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా రిటైరయ్యారు.

**2. హరిశ్చంద్ర (హరిభావు) దేశపాండే నేవపూర్కర్:**

ఔరంగబాదు (ఖట్కి) జిల్లాలోని నేవపూర్ స్వస్థలం. ఔరంగబాదులో సెటిలయ్యారు.

పైనచెప్పినట్లు 5వతరగతి నుండి 10వరకు ఔరంగబాదు శ్రీకృష్ణ శిక్షణ సంస్థాన్ హైస్కూల్‌లో హల్దేకర్‌జీతో కలిసి చదివారు. వీరు హల్దేకర్‌జీకి చిన్నమ్మ కొడుకు, సోదరుడవుతారు. హైదరాబాద్‌లో ఇంటర్, డిగ్రీ, బి.ఎస్.సి., బి.ఇ.డి. చదివారు– ఓ.యు.లో. వీరుకూడా ఔరంగబాదులో శ్రీకృష్ణసాయం శాఖకు వెళ్లేవారు. దత్తాజీభాళే ద్వారానే శాఖ పరిచయం. ఆ కాలంలో రెండు పాఠశాలల జట్ల మధ్య కబడ్డీపోటీ జరిగింది. హెూరాహెూరీపోటీ. తమటీం ఓడిపోయేస్థితిలో రాంభావు (హల్దేకర్‌జీ) కూతకు వెళ్ళి చాలా పౌరుషంగా ఆడి ప్రత్యర్థి టీంకు పట్టుబడినట్లే పట్టుబడి విదిలించుకొని గీతనందుకొన్నారు. ప్రత్యర్థి టీం ఒక్కదెబ్బతో అంతా ఔటయ్యారు. అలా రాంభావుజీ కారణంగా మా పాఠశాల టీం విజయం సాధించిందని చాలా ఉత్సాహంగా చెప్పారు. హరిభావుజీ పాటలన్నా, నాటకాలన్నా హల్దేకర్‌జీకి బాగా ఇష్టమని వీరుకూడా తెలిపారు. హల్దేకర్‌జీకి అనేక బహుమతులు కూడా వచ్చాయన్నారు. 1950లో డిగ్రీకోసం హైదరాబాదుకు వెళ్ళి ఓ.యు.లో చేరామన్నారు. కొంతకాలం బయట ఉండి వండుకొని తిన్నామన్నారు. 1సం॥ ఓ.యు. బి. హాస్టల్‌లో ఉన్నామన్నారు. బయట నల్లకుంటలో ఉండేవారు. అక్కడ తమ గదిదగ్గరే రమణభాయి పారిఖ్ ముఖ్యశిక్షక్‌గా శాఖ నడిచింది. కొంతకాలం తాను ముఖ్యశిక్షక్‌గా ఉన్నానన్నారు. నల్లకుంట శాఖకు హల్దేకర్‌జీ నియమితంగా వచ్చేవారు. రమణ్‌భాయి, హల్దేకర్‌జీ మంచిమిత్రులు. దత్తాజీ భాళే వెంట అప్పుడప్పుడు సీతాఫల్‌మండి శాఖకు హల్దేకర్‌జీ వచ్చేవారు. తాను, హల్దేకర్‌జీ కలిసిటుంకూర్‌లో సంఘశిక్షావర్గ ప్రథమవర్ష చేశారు. హల్దేకర్‌జీ కొద్దికాలం హైదరాబాద్‌లో వీరి రూంలో కల్సి ఉన్నారు. టుంకూర్ ఓ.టి.సి.లో హల్దేకర్‌జీ, తానూ ఒకేగణలో ఉన్నారు. గిరిధర్ మోతేవాలా తమ గణశిక్షక్. ఆ శిక్షావర్గకు యాదవరావుజీ జోషి, సూర్యనారాయణరావుజీ, జగన్నాధరావు జోషీజీ వంటి సంఘ అధికారులు వచ్చారు. జగన్నాధరావు జోషీజీ బౌద్ధిక్‌లు మరియు శారీరిక్ తమను బాగా ఆకట్టుకుందన్నారు. మొదట హైస్కూల్ టీచర్‌గా చేరి ప్రధానోపాధ్యాయులయ్యారు. చివరకు విద్యాశాఖలో పరీక్షల విభాగంలో అధికారిగా రిటైరయ్యారు. తన సంతకంతో వేల విద్యార్థుల మార్కుల మెమోలు, సర్టిఫికెట్లు జారీ అయ్యాయని చెప్పి మమ్మల్ని ఆశ్చర్యపరిచారు. రాంభావుజీపై పుస్తకం రాయటం చాలా ఆనందమంటూనే రాంభావు మమ్మల్ని వీడిపోయారు. మళ్లీ ఎప్పుడు కల్సుకుంటామో అంటూ కన్నీళ్లపర్యంతమయ్యారు. 1989లో పదవీ విరమణచేశారు.

## నిర్మాణాత్మక నేతృత్వం:

రెండు తెలుగు ప్రాంతాలలో రా.స్వ. సంఘ కార్యానికి గట్టిపునాదులువేసిన త్యాగమూర్తులెందరో ఉన్నారు. వారి త్యాగపు వారసత్వాన్ని హల్దేకర్‌జీ కొనసాగించినారు. అప్పటికి రెండు తెలుగు ప్రాంతాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒకే ప్రాంతంగా చాలాకాలం కల్సిఉండినవి. ప్రభుత్వపరంగా ఆంధ్రప్రదేశ్ అనబడితే, సంఘపరంగా ఆంధ్రప్రాంతం అనబడేది. తర్వాత రెండు ప్రాంతాలుగా విభజించారు. పూర్వాంధ్ర, పశ్చిమాంధ్ర. ఈ ప్రాంతానికి సుదీర్ఘకాలం స్వర్గీయ సోమేపల్లి సోమయ్యగారు ప్రాంత ప్రచారక్‌గా పనిచేశారు. వీరికి చేదోడు వాదోడుగా డా॥ చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ప్రాంతకార్యవాహగా, ప్రాంత సంఘచాలక్‌గా పనిచేశారు. తెలుగు ప్రాంతాల సంఘపరివారానికి ఈ ఇరువునీ తల్లిదండ్రులు లేక మూలపురుషులనవచ్చు. ప్రాంతంలో సంఘకార్యముతోపాటు వివిధ పరివార క్షేత్రాలపని కూడా బాగా వేగంగా పెరుగుతూ వచ్చినది. ఆ సందర్భంగా రాంభావు హల్దేకర్‌జీకి సహప్రాంత ప్రచారక్ బాధ్యత అప్పగించబడింది. ఇప్పుడు పనిభారం పంచుకుంటూ, పనిని పెంచుకుంటూ పోయిన త్రిమూర్తులలో ఒకరయ్యారు హల్దేకర్‌జీ. భాగ్యనగర్‌తోబాటు తెలంగాణ ప్రాంతమంతటా సంఘకార్య విస్తరణలో పటిష్టీకరణలో హల్దేకర్‌జీముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. భాగ్యనగర్‌లో ఓ.యు.లో అఖిల భారత విద్యార్థి పరిషత్ వారికి, వామపక్షీయులకు భయంకరమైన గొడవలు జరిగినపుడు, మతకలహాలు జరిగినపుడు, తెలంగాణాలో నక్సలిజం బాగా విజృంభించినపుడు, ఇంకా అనేక సందర్భాలలో సంఘకార్యం విపత్కర పరిస్థితుల నెదుర్కొన్నది. ఆ సందర్భంగా హల్దేకర్‌జీ వహించిన పాత్ర వారి మార్గదర్శనం, వారి నాయకత్వం సంఘాన్ని విజయపథంలో నిలుపుటకు ఎంతగానో దోహదపడింది. ఎమర్జెన్సీ సమయంలో ఉద్యమాన్ని విజయపథంలో నడపడంలో వారి పాత్ర ప్రశంసనీయం. హల్దేకర్‌జీ ఎమర్జెన్సీలో అరెస్టు కాకుండా చివరివరకు రహస్యకార్యకలాపాలు విజయవంతంగా నిర్వహించారు. తాను చాలాసార్లు చాలా చాకచక్యంగా పోలీసులకు దొరికినట్లే దొరికి తప్పించుకున్నారు. భాగ్యనగర్‌లో ఎన్నెన్నో రహస్య సమావేశాలు జరిగినవి. ఎందరెందరో అఖిలభారత నాయకులు వాటిలో రహస్యంగా పాల్గొన్నారు. దేశంలో అనేకచోట్ల ఏదో ఓ తప్పిదం కారణంగా అనేకమంది పోలీసులకు పట్టుబడ్డారు. భాగ్యనగర్‌లో హల్దేకర్‌జీ మార్గదర్శనం కారణంగా కార్యకర్తలు చాలా జాగ్రత్తగా మెలిగారు. ఏ పెద్దనాయకులు ఇక్కడ పట్టుబడలేదు... భాగ్యనగర్‌తోపాటు

తెలంగాణా అంతటా హిందూ చైతన్యం ఎక్కువనే చెప్పవచ్చు. దాన్ని సంఘకార్య ప్రగతికి జోడించడంలో హల్దేకర్‌జీ పాత్ర చాలా ప్రశంసనీయమని చెప్పవచ్చు. ఆ ఫలితంగా సంఘకార్యం బాగా బలంగా వేళ్లూనుకున్నది. వివిధ పరివార క్షేత్రాలు వటవృక్షంలా విస్తరించి పటిష్టమయ్యాయి. విశ్వహిందూ పరిషత్తు,, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు, సరస్వతీ శిశుమందిరాలు (విద్యాభారతి), జనసంఘ్, భా.జా.పా., సేవాభారతి, ప్రజ్ఞాభారతి, కిసాన్‌సంఘ్, ఇలాఅనేక సంస్థలపని సమాజంమీద స్పష్టమైన ప్రభావాన్ని చూపుతున్నది. హల్దేకర్‌జీ మార్గదర్శనంతో, ఆత్మీయస్పర్శతో, ఆశీస్సులతో ఎందరెందరో కార్యకర్తలు భారతమాత సేవలో తరిస్తున్నారు. వారు హిమాలయాలంత ఎత్తుకు ఎదిగారు, ఎదుగుతున్నారు. ఈ వాక్యం అతిశయోక్తి కావచ్చేమోకాని, అసత్యం ఎంతమాత్రం కానేకాదు. హల్దేకర్‌జీకి ఇలా ఎదిగిన కార్యకర్తలంతా ఎంతో ఆనందాన్ని పంచారు, ఆత్మసంతృప్తిని పెంచారు. అలాంటి కొందరు ప్రముఖులను ఇక్కడ పేర్కొనడం ద్వారా ఈ రచనకు మరింత నిండుదనం లభిస్తుందనిపిస్తుంది.

**ఎందరెందరో మహానుభావులు: హల్దేకర్‌జీ అడుగుజాడల్లో..**

**1. శ్రీ వి. భాగయ్యగారు :** వీరు సహప్రాంత ప్రచారక్‌గా హల్దేకర్‌జీ ప్రాంతప్రచారక్‌గా కల్సిపనిచేశారు. అలాగే వీరు ప్రాంత ప్రచారక్‌గా, హల్దేకర్‌జీ క్షేత్ర ప్రచారక్‌గా కల్సిపనిచేశారు. వీరు ఆ తర్వాత హల్దేకర్‌జీ ఆగ్నేయ క్షేత్రప్రచారక్‌గా ఉండగా సహక్షేత్ర ప్రచారక్‌గా పనిచేసి, ఆపై క్షేత్ర ప్రచారక్‌గా, అ.భా. బౌద్ధిక్ ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అ.భా. సహసర్ కార్యవాహ బాధ్యతలో ఉన్నారు.

**2. శ్రీ పి.వి.ఆర్ సోమయాజులుగారు:** వీరు సహప్రాంత ప్రచారకులుగా హల్దేకర్‌జీ ప్రాంత ప్రచారక్‌గా కల్సిపనిచేశారు. తర్వాత వీరు ప్రాంత ప్రచారక్‌గా హల్దేకర్‌జీ క్షేత్ర ప్రచారక్‌గా పనిచేశారు. ఆపైన వీరు అ.భా. వనవాసీ కళ్యాణ ఆశ్రమ అ.భా. సంఘటన మంత్రిగా పనిచేసి ప్రస్తుతం దానికి సంరక్షకులు ఉన్నారు.

**3. స్వర్గీయ పట్లోళ్ళ రాంరెడ్డిగారు:** ఆజీవన సంఘ ప్రచారకులు, విద్యార్థి దశనుండే హల్దేకర్‌జీ మార్గదర్శనం పొందారు. భాగ్యనగర్‌లో ఒక భాగ్ ప్రచారక్‌గా, వరంగల్, పాలమూరు విభాగ్ ప్రచారక్‌గా, ఛత్తీస్‌గఢ్ ప్రాంత ప్రచారక్, ప్రాంత గ్రామవికాస ప్రముఖ్‌గా, క్షేత్ర సేవా ప్రముఖులుగా పనిచేశారు.

**4. శ్రీ కె. రామచంద్రయ్యగారు:** సంఘప్రచారకులు, ఖమ్మంజిల్లా ప్రచారక్, వరంగల్

విభాగ్ ప్రచారక్, సహప్రాంత ప్రచారక్, ప్రాంత ప్రచారక్, అ.భా. వనవాసీ కళ్యాణ ఆశ్రమ దక్షిణభారత సంఘటన మంత్రి, ప్రస్తుతం వనవాసీ కళ్యాణ ఆశ్రమ అ.భా. శిక్షాప్రముఖ్.

**5. స్వ. శ్రీరాం సాఠేజీ:** హల్దేకర్‌జీ హైదరాబాద్‌లో చదువుకుంటున్నప్పుడు హైదరాబాద్ మహానగర ప్రచారక్, హల్దేకర్‌జీ ప్రచారకులుగా రావడానికి ప్రేరకులు. అ.భా. ఇతిహాస సంకలనసమితికి మార్గదర్శకులుగా బాధ్యత నిర్వహించారు. సేవికా సమితి మార్గదర్శకులు.

**6. శ్రీ సోమయాజుల నాగేశ్వరరావు:** సంఘప్రచారకులు ఆంధ్ర ప్రాంత పూర్వాంధ్రలో జిల్లా, విభాగ్ సహప్రాంత ప్రచారకులుగా పనిచేశారు. ప్రస్తుం శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తికేంద్రం సంఘటన కార్యదర్శిగా ఉన్నారు.

**7. స్వర్గీయ కె. శ్రీధర్‌జీ:** సంఘ ప్రచారకులు, భాగ్యనగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తివదిలి సాఠేజీ ,హల్దేకర్‌జీ ప్రేరణతో ప్రచారక్‌గా వచ్చారు. కరీంనగర్‌జిల్లా ప్రచారక్, వరంగల్ విభాగ్ ప్రచారక్, అ.భా. వనవాసీ కళ్యాణ ఆశ్రమ ప్రాంత సంఘటన మంత్రిగా, కేంద్రీయ కార్యదర్శిగా బాధ్యత నిర్వహించారు.

**8. స్వర్గీయ శఠగోపం లక్ష్మీనర్సింహాచార్యులు :** ఆజీవన సంఘప్రచారకులు. ఖమ్మం, ఆదిలాబాదు జిల్లా ప్రచారక్, ఇందూరు (నిజామాబాద్) విభాగ్ ప్రచారక్, శ్రీ సరస్వతీ విద్యాపీఠం సంస్థాపకులు, విద్యాభారతి దక్షిణక్షేత్ర, ఆగ్నేయక్షేత్ర సంఘటనా కార్యదర్శి. స్ఫూర్తి మాసపత్రిక సంస్థాపకులు.

**9. శ్రీ కె.వి. సత్యనారాయణగారు:** సంఘప్రచారకులు. కృష్ణా, వరంగల్, ఇందూరుజిల్లా ప్రచారకులు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం కార్యాధ్యక్షులు.

**10. శ్రీ భానూసింగ్‌జీ:** సంఘప్రచారకులు, మెదక్, కరినగర్‌జిల్లా ప్రచారకులు, వనవాసీ కళ్యాణాశ్రమ (తెలంగాణా,ఆంధ్ర) ద్విప్రాంత నిధి ప్రముఖ్.

**11. శ్రీ వై. రాఘవులు:** సంఘ ప్రచారకులు, అనంతపురం జిల్లాలో నగర జిల్లా ప్రచారక్, విశాఖ, ఇందూరు విభాగ్ ప్రచారక్, విశ్వహిందూ పరిషత్ ప్రాంత సంఘటనా కార్యదర్శి. ప్రస్తుతం వి.హెచ్.పి. అంతర్జాతీయ ప్రధానకార్యదర్శి.

**12. శ్రీ సామ బాల్‌రెడ్డి:** సంఘ ప్రచారకులు, భాగ్యనగర్, చార్మినార్ భాగ్ ప్రచారక్, బి.ఎమ్.ఎస్. ప్రాంత సంఘటనా కార్యదర్శి. ప్రస్తుతం బి.యమ్.ఎస్. అ.భా. కార్యదర్శి.

**13. శ్రీ డా॥ సుకుమార్:** సంఘప్రచారకులు, నెల్లూరు నగర, జిల్లా విభాగ్ ప్రచారకులు. ఆంధ్రప్రదేశ్ సహ ప్రాంత, ప్రాంత ప్రచారకులు. ప్రస్తుతం ఆరోగ్యభారతి

అ.భా. సంఘటనా కార్యదర్శి.

**14. స్వర్గీయ కళ్లెపు విద్యాసాగర్‌రావు:** సంఘప్రచారకులు, నగర జిల్లా ప్రచారకులు, బి.కె.ఎస్. అ.భా. కార్యదర్శి.

సంఘ మరియు వివిధ క్షేత్రాలలో ప్రముఖ బాధ్యతలు నిర్వహిస్తూ హల్దేకర్‌జీ ఆత్మీయ సాన్నిహిత్యాన్ని పొందిన గృహస్థ ప్రముఖులెందరో ఉన్నారు. వారిలో కొందరు:

శ్రీ జస్టిస్ పర్వతరావు, శ్రీ జస్టిస్ నర్సింహారెడ్డి, డా॥ ఎస్.వి. శేషగిరిరావు, స్థానం భావనారాయణ, డా. బి. సురేంద్రరెడ్డి, స్వ.ముదుగంటి మల్లారెడ్డి, స్వ. గణపతిరావుజీ బ్రహ్మపూర్‌కర్, స్వ. హరిహరశర్మ, స్వ. టి.వి. దేశ్‌ముఖ్, స్వ. జి. పుల్లారెడ్డి, స్వ. భండారు సదాశివరావు, మొదలగువారు.

రాజకీయ రంగంలోను ఉన్నత శిఖరాలు నధిరోహించిన ప్రముఖులెందరో హల్దేకర్‌జీ ఆత్మీయ ఆశీస్సులందుకొన్నారు. వారిలో కొందరు– స్వ. బంగారు లక్ష్మణ్, స్వ. వి. రామారావు, చెన్నమనేని విద్యాసాగర్‌రావు, స్వ. ఏలె నరేంద్ర, స్వ. బద్దంబాల్‌రెడ్డి, స్వ. జూపూడి యజ్ఞనారాయణ, స్వ. డి.ఎస్.పి. రెడ్డి, స్వ. వై.సి. రంగారెడ్డి, బండారు దత్తాత్రేయ, జి. కిషన్‌రెడ్డి, ఎన్. ఇంద్రసేనారెడ్డి, ఎన్.వి.ఎస్. ఎస్. ప్రభాకర్, సి.హెచ్. రామచంద్రారెడ్డి, ఎన్. రామచంద్రరావు.. మొదలగువారు.

## హల్దేకర్‌జీ మహాపరినిర్వాణం :

2016 విజయదశమి ఉత్సవం. బర్కత్‌పురా భాగ్ కార్యక్రమం కాచీగూడా రైల్వేస్టేషన్ వెనుక మైదానంలో జరిగింది. సాయంత్రం సార్వజనికోత్సవం. వాతావరణం చల్లగా ఉండినది. ఆ చలితో వారి ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. ఇంకా కోలుకోవటం కష్టమని, ఉన్నంతకాలం అందరం ఆత్మీయంగా ఆదరంగా సేవించుకోవటమే మిగిలిందన్నారు డా॥ శ్రీనివాస కులకర్ణి. ఆసుపత్రికి, కేశవనిలయం మధ్య తిరగాల్సి వచ్చింది. 2016 డిసెంబరు నుండి పూర్తిగాలేవలేని స్థితి. ఈ స్థితిలో వారిని సేవించిన వేంకటరెడ్డి, రామాచారి, యుద్ధవీర్‌లు ధన్యులు. 2017 ఫిబ్రవరి 19 నుండి మాట ఆగిపోయింది. ఫిబ్రవరి 23 రాత్రి శ్రీ మహాశివరాత్రి పూర్వ సంధ్యలో శివైక్యం చెందారు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**– సేకరణ : బెల్లంకొండ మల్లారెడ్డి**

# శ్రీ హల్దేకర్‌జీతో నా అనుభవాలు

**19**54లో బందరు జాతీయ కళాశాలలో ద్వితీయవర్ష సంఘశిక్షావర్గ (ఓ.టి.సి.)లో చివరివారం, వారు, జయరాం గోరేగావ్‌కర్ వచ్చారు. అప్పుడే వారితో పరిచయము అయింది. 1955లో నేను ప్రచారక్‌గా ఉన్నాను. 1956లో వారితో కలిసి తృతీయవర్ష శిక్షావర్గకు నాగపూర్ వెళ్ళాను. ఆంధ్ర నుండి నలుగురు మాత్రము వెళ్ళాము. ముగ్గురు ప్రచారక్‌లు, ఒకరు ఉపాధ్యాయులు. హల్దేకర్‌జీ, కూనపులి వేంకటేశ్వరరావు (ఇతిహాస సంకలన్), నేను ఉన్నాము. యం.జి. శ్రీనివాస మూర్తిగారు హైదరాబాద్ నుంచి పాల్గొన్నారు. 1956 నుండి 1959 వరకు కృష్ణాజిల్లాలో ప్రచారక్‌గా ఉన్నాను. 1956లో విజయవాడ, కృష్ణానది మధ్యలో ఉన్న లంకలో గణవేషధారి స్వయంసేవకులకు శిబిరము జరిగినది. పూజనీయ శ్రీ గురూజీ వచ్చారు. 1961లో వరంగల్ వచ్చాను. ఆయుర్వేద కళాశాలలో పూజనీయ గురూజీ కార్యక్రమము జరిగినది. కొచ్చి కృష్ణమూర్తి విభాగ్ ప్రచారక్‌గారు గురూజీతో జరిగిన బైఠక్‌లో నేను లేను.

ఉదయము గం॥5.30లకు ఇద్దరం కలిసి చాయ్‌కొరకు హోటల్‌కు వచ్చేవారము. రిక్షాలో వరంగల్‌కు వచ్చి శాఖకు వెళ్ళేవాళ్ళము. ఒకసారి టి త్రాగకుండా వరంగల్ వచ్చాము. మన కార్యకర్తల ఇండ్లకు ఐదుగురి ఇళ్ళకు వెళ్ళాము. ఎవరుకూడా టి తాగారా? అని అడగలేదు. అప్పుడు వారు ఎవరో ఇస్తారని మన పని మనం పూర్తిచేయకుండా బయల్దేరకూడదన్నారు. అప్పటినుంచి పర్యటనకు వెళ్ళేటప్పుడల్లా ముందు టీ త్రాగి బయలుదేరేవారము. వరంగల్‌లో ఎక్కువ కాలము నేను హోటల్‌లోనే భోజనము చేసేవాడిని. అప్పుడప్పుడు హల్దేకర్‌జీ స్వయంసేవకుల ఇండ్లకు వెళ్ళేవారు. నేను, వారు కలిసి అనేక పర్యాయములు హోటల్‌లోనే భోజనము చేసేవారము. నాకు కడుపునొప్పి వస్తుండేది. నువ్వు పచ్చిమిరపకాయలు ఎక్కువ తింటావు. అవి తినటము బంద్‌చేయమన్నారు. వారు నన్ను ఎప్పటికి నా మాటల ధోరణిని పరిశీలిస్తూ ఉండేవారు.

‘కడక్ సే బాత్ నయి కరనా, సచ్ భీ హై తో భీ’ అని హెచ్చరిస్తుండేవారు. బచ్‌రాజ్ వ్యాస్ జనసంఘ్ అధ్యక్షులుగా వరంగల్ వస్తున్నారు. కాజీపేటకు అందరు వెళుతున్నారు. హల్దేకర్‌జీ నన్నుకూడా రమ్మన్నారు. నేను చెప్పాను నేను జనసంఘ్ కార్యకర్తను కాను కనుక రాను అన్నాను. అదే విధంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వరంగల్‌కు వచ్చారు. ఉదయం శాఖలో సూచన ఇమ్మన్నారు. సాయంత్రము జనసంఘ్ సభ ఉంటుంది. దీన్‌దయాళ్ జీ మాట్లాడతారు రావలసిన వారు రావచ్చు అని చెప్పాను. దానికి వారు చెప్పిందేమిటంటే వారిద్దరూ జనసంఘ్ కార్యకర్తలే కావచ్చు కాని వారు మన స్వయంసేవకులు. రాజకీయ క్షేత్రములో పనిచేస్తున్నారు. కనుక మన కార్యకర్తల సభలకు మనం వెళ్ళటం తప్పుకాదు. అంతే మరెప్పుడు కూడా జనసంఘ కార్యక్రమములకు రమ్మనలేదు.

1963 నుండి 1973 వరకు వరంగల్ జిల్లా ప్రచారక్‌గానే ఉన్నాను. అదే సమయములో పరకాలనుండి చందుపట్ల జంగారెడ్డి జనసంఘ అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబడి గెలిచారు. ఎలక్షన్ అయింతర్వాత హల్దేకర్‌జీ వారి స్వగ్రామము హల్దా అజంతాగుహల దగ్గర ఉంటుంది. వారు నన్ను వారి ఊరికి తీసికెళ్ళారు. వారి గ్రామము , వారి గ్రామంలో వారికి ఉన్న పరిచయాలు, వారి పొలము, వారి బంధువులు అందరితో నాకు పరిచయం చేశారు.

వారికి తెలుగు అంతంత మాత్రంగానే వస్తుండేది. తెలుగు, హిందీ, మరాఠీ, ఉర్దూ కలిపి మాట్లాడుతుండేవారు. మరాఠి వార పత్రిక వివేక్ చదివే వారు. అందులో ఏదన్నా విషయముంటే మరాఠీలో చదివి హిందీలో అనువాదము చేసి చెప్పేవారు. ఆ విధంగా వారితో మరాఠీ చదవటం, మరాఠీ వినటం, అప్పుడప్పుడు మరాఠీ పత్రికనుండి అనువాదముచేసి స్ఫూర్తికి ఇస్తుండేవాడిని. పాటలు పాడడము నాకు రాదు. సంగీత జ్ఞానములేదు. వారు పాటలకు బాణీలు తయారు చేసేవారు. అనేకమందిచేత పాటలు పాడించేవారు. కరీంనగర్‌లో ఒక బైఠక్‌లో వారు నాచేత పాట పాడించారు. అప్పుడన్నారు సత్యం జీ ఆప్ భీ గా సకతే హై. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమంలో ఆంధ్రలో సమ్మెలు, బంద్‌లు జరుగుతుండేవి. వరంగల్ జిల్లా మానుకోటకు వెళ్ళాము. తిరిగి రావటానికి ఎలాంటి వాహన సౌకర్యము లేదు. వరంగల్ చౌరస్తాలో ఉద్యమకారులద్వారా ఇళ్లు తగలబెట్టడం జరిగింది. అందులో ఒక స్వయంసేవక్ ఇల్లు కాలిపోయింది. వెంటనే

బయలుదేరి వారిని కలవాలన్నారు. వెంటనే ఇద్దరమూ కలిసి మానుకోటనుండి వరంగల్ వరకు కాలినడకన బయలుదేరాము. మధ్య మధ్యలో తెలిసిన వారింటికి వెళ్ళి టీ త్రాగి, స్టేషన్‌లో ఒకతను భార్య అంగీకరించకపోయినా తానే వంటచేసి మాకు భోజనము పెట్టాడు. ఎందుకంటే వారు హిందీలో మాట్లాడటము చూసి ఆర్యసమాజ్ పండిట్ అనుకున్నారు. ఆర్యసమాజ్ కార్యకర్తలంటే అంత గౌరవము వుండేదని వారు చెప్పారు.

ఒక స్వయంసేవక్‌ను కలవటానికి ఇద్దరము కలిసి ఎడ్లబండిమీద వెళ్లాము. ఎద్దుతాడు తెంచుకుని వెళ్లిపోయింది. ఒక పక్కనుండి ఎద్దుకోసం పరుగెత్తడం. తిరిగితెచ్చి బండికి కట్టి ప్రయాణము కొనసాగించారు. ఇంకొకటి వరంగల్ నగరానికి ఒక లేంబ్రెట్టా కొన్నారు. దానిని వారు నడిపేవారు. నేను వెనక కూర్చోవడమే తప్పిస్తే, నడిపేవాడిని కాను. పెట్రోలు అయిపోయింది. బండిని తోయాలి. నేను తొందరగానే అలసిపోయేవాడిని. వారే బండిని తోసుకుంటూ వచ్చేవారు. ముఖములో ఏ రకమైన కోపముకూడా ఉండేది కాదు. కార్యాలయములో విద్యార్థులు చదువుకుండేవారు. ఒకసారి పర్యటనలో వచ్చినప్పుడు ఆ విద్యార్థులే మా పరిస్థితి చూసి, కిచిడీ చేసి తినిపించారు. ఆ విద్యార్థిని ఎంతో మెచ్చుకున్నారు. ఆయనెవరో కాదు మన ఆకుతోట రామారావే. ప్రస్తుతము గోసేవా ప్రముఖ్. వారన్నగారిని వారి గ్రామంలో నక్సలైట్లు హత్య చేశారు. రామారావు తెనాలి వర్గలో ఉన్నారు. ఏటూరు నాగారానికి 16మైళ్ళ దూరంలో గూర్రేవుల గోదావరి ఒడ్డున గ్రామం. ఈ 16మైళ్ళు నడిచి వారింటికి చేరాము. ఇట్లా అనేక సంఘటనలు వరంగల్, ఇందూర్ విభాగ్‌లలో వారి పర్యటనలు జరుగుతుండేవి. వారికి ఆలుగడ్డ పడదు, సెనగపప్పు పడదు. స్వయంసేవకుల ఇండ్లకివెళ్లి భోంచేస్తుండేవారు. వారు అవేపెట్టేవారు. ఫలానాది మాత్రమే చేయమని ఎప్పుడూ చెప్పేవారుకాదు. డా॥ ప్రతివాది భయంకర శఠగోపాచార్య, డా॥ వీరంరాజు కృష్ణమూర్తి వీరిద్దరూ వారికి డాక్టర్లు.

వారు వరంగల్ నగరంనుండి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లినప్పుడు వారికి వీడ్కోలు చెప్పడానికి ఆకారపు నర్సింగం దేవాలయంలో సభా కార్యక్రమము జరిగింది. ఒక రాజకీయ నాయకునికి జరిగిన పద్ధతిలో వారి కార్యక్రమానికి నగరములోని ప్రముఖులు అందరూ విచ్చేశారు. అంతగా వారి లోకసంపర్కము. కుటుంబాలయొక్క ఆత్మీయ సంబంధమూ ఉండేది. వారి తెలుగు ప్రసంగం వినటానికి అందరూ ఎంతో ఇష్టపడుతుండేవారు. చిన్నపిల్లలు కూడా వారితో మాట్లాడుతూ ఉండేవారు. ప్రతిచిన్న కార్యక్రమానికి ఎవరు

పిలిచినా వెళ్ళటమనేది ఒక పనిగా పెట్టుకునేవారు. అట్లా తన మాటల ద్వారానే సాహిత్య నిర్మాణముగూడా చేశారు. అనేక పుస్తకాలు తెలుగులో అనువాదము చేశారు. గ్రామాలలోని స్వయంసేవకులపేర్లు నాకంటే వారికే ఎక్కువ గుర్తుండేవి. అయినా నన్ను అడుగుతుండేవారు. ఇది మా సంబంధము.

**– శ్రీ కె.వి. సత్యనారాయణ, జ్యేష్ఠ కార్యకర్త, శ్రీ శారదాధామం.**

# స్మృతిలో మాననీయ శ్రీహల్దేకర్‌జీ

**అ**ది 1954వ సంవత్సరం. మార్చినెలలో హెచ్.ఎస్.సి. బోర్డుపరీక్షలు రాసి మచిలీపట్నంలో జరుగుతున్న ప్రథమవర్ష శిక్షావర్గ శిక్షణా శిబిరం ఓ.టి.సి.కి శిక్షణార్థినై వెళ్ళినాను. వరంగల్‌లోని వృత్తివిద్యా ఉన్నత పాఠశాలలో చదువుతుండేవాడిని, నేటి పాలిటెక్నిక్ పూర్వరూపం. వరంగల్‌లోని గోపాలస్వామి గుడిప్రాంతంలో ఉంటూ స్వయంపాకము చేసుకుంటూ నర్సంపేట రోడ్డులో బట్టలమిల్లువద్దగల పాఠశాలకు వెళ్ళేవాడిని. గోపాలస్వామి గుడి బస్సుస్టాపువద్దనే సంఘ (రాణాప్రతాప్) శాఖ నడుచుచుండేది. నాటి సంఘప్రచారక్ శ్రీ కె. శంకరావు ప్రోద్బలంతో తరుణ శిక్షక్‌గా ఉండేవాడిని. గిర్మాజీపేట, కాశీబుగ్గ ప్రాంతంలో నూతనంగా సంఘశాఖ ప్రారంభించి, దానికి నన్ను ముఖ్యశిక్షగా నియుక్తి చేసినారు. కొత్తశాఖ అయినప్పటికి తీవ్రకృషివల్ల ఇతోధిక సంఖ్యతో క్రమంతప్పకుండా శాఖనడుస్తుండేది. ఆశాఖనుండే శ్రీ చందుపట్ల జంగారెడ్డి, శ్రీ పోకల వీరన్న మొదలగు అనేక ప్రభావశాలి స్వయంసేవకులు తయారైనారు. మచిలీపట్నంలో నిర్వహించబడే శిక్షావర్గకు ఏప్రిల్ మాసంలో వెళ్ళాను. అచ్చటికి శిక్షకుడుగా శ్రీ రాంభావు హల్దేకర్‌జీ, శ్రీ భండారు సదాశివరావు, శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, సోమేపల్లి సోమయ్యగారు ఇత్యాది అనేకమంది లబ్ధప్రతిష్ఠులయిన పెద్దలు శిక్షకులుగా ఉండిరి. శ్రీమాన్ బాపూరావుజీ మోఘేగారు ప్రాంతప్రచారకులు. ఇత్యాది పెద్దలతో పరిచయాలు పెరిగినాయి. వర్గశిక్షణ పూర్తిఅయిన పిదప ఇల్లుచేరిన నాకు నాన్నగారినుంచి చీవాట్లు, చీత్కారాలేకాక ఇకముందు చదవవలసిన అవసరంలేదని ఇంటిపట్టునే ఉండాలని శాసించినారు. కనీసం పరీక్ష ఫలితం తెలుసుకోవటానికి కూడా అనుమతించలేదు. శ్రీ శంకరరావుగారు నేను మొదటి తరగతిలో ఉత్తీర్ణున్ని అయినట్లు తెలుసుకొని కాలేజీలో

చేరుటకు వెంటనే రావలసిందిగా ఇద్దరు స్వయంసేవకులను మా సొంతగ్రామం గవిచర్లకు పంపినారు. నాన్నగారితో పరిచయం ఉన్నందున వారికి నన్ను అర్జంటుగా పంపవలసిందిగా లేఖ రాసినారు. అంతటి కోపంలోను శ్రీ శంకర్రావుగారిపట్ల గల గౌరవభావంతో పంపుటకు అనుమతించినారు. కాని అప్పటికే జరుగవలసిన నష్టం జరిగిపోయింది. కాలేజీలో చేరుటకు అర్జీ సమర్పణకు ఆఖరిరోజుకూడా దాటిపోయింది. అప్పట్లో యూనివర్సిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బయట కేవలం ఔరంగాబాదు, వరంగల్లు, గుల్బర్గాలలో మాత్రమే కాలేజీలు ఉండేవి. విశ్వవిద్యాలయ కాలేజీలన్నింటికి ఒకే కామన్ అప్లికేషన్, అన్ని కాలేజీలలో చెల్లుబాటు అయ్యేట్లు ఆర్డర్‌ఆఫ్ ప్రిపరేషన్‌లో కామన్ ఎడ్మిషన్ ఉండేది. ఆవిధంగా నాకు ఆ సంవత్సరం హులక్కే. కాని శంకర్రావుగారు ఏవిధంగానైనా ప్రవేశం సంపాదించాలని పట్టుదలతో శ్రీ కాసుగంటి రాజేశ్వరావుగారు అడ్వకేటు, మరియు గవర్నమెంటు ప్లీడరుని సంప్రదించగా సంఘసానుభూతి పరులైనందువలన రాష్ట్రకార్యాలయంలో ఉన్నతోద్యోగిగా ఉన్న చిన్నమామగారిద్వారా ఉపకులపతి భగవంతరావుగారిని కలిసి ప్రత్యేక అనుమతి కోరుటకు వారికారులో హైదరాబాదు చేరి, భగవంతరావుగారిని కలిసి ఉంటిమి. వి.సి.గారు ససేమిరా రూల్సుమార్చనని భీష్మించిరి. వారే, ఏదేని ప్రయివేటు కాలేజీలో ప్రవేశంపొంది ఇంటర్ రెండవ సం॥లో ఏదైనా ప్రభుత్వకాలేజీలో చేరవచ్చునని సూచించిరి. అప్పట్లో స్టేటు మొత్తంలో కేవలం హైదరాబాదులో ఒక ఇంటర్ సైన్సుకాలేజీ, అప్పుడే ప్రారంభించబడింది. దానిలో చేరుటలో ఏ సమస్యలేదు. కాని హైదరాబాదులో నివాసము, మరియు ఇతర ఖర్చులు, భరించుట సాధ్యం కానివి. అయితే శ్రీ శంకర్రావుగారు ప్రాంతప్రచారక్ శ్రీ బాపూరావు మోఘేజీతో మాట్లాడి జాంబాగ్‌లోని సంఘకార్యాలయంలో ఉండుటకు అనుమతినిచ్చినారు. భోజనవసతి కోసం ముందే ఉన్న శ్రీ రాంభావు హల్దేకర్‌జీ, వినాయక్‌రావు మహరాజ్, వెంకట్రావ్ దేశ్‌పాండేలతో వారిమెస్‌లో చేరి మెస్‌ఖర్చులు వాటాలవారీగా భరించునట్లు ఏర్పాటుచేసిరి. ఆ విధంగా శ్రీ హల్దేకర్‌జీతో సహజీవనం, శ్రీ బాపూరావు మార్గదర్శనం, ఇతర మహారాష్ట్ర స్వయంసేవకులతో ఏ ఇబ్బంది లేకుండా ఆ విద్యాసంవత్సరం ప్రశాంతంగా గడిచింది. డబ్బు చెల్లింపు అప్పుడప్పుడు ఇబ్బందిగానే ఉన్నప్పటికి మిత్రుల సహకారంతో గట్టెక్కడమయినది. ఇక సంఘకార్యక్రమాలలో పాత్రగురించి. శ్రీ మోఘేగారి సలహా మేరకు వివేకవర్ధినీ కన్యాపాఠశాల ఆవరణలో జరిగే సాయంశాఖలో తరుణ శిక్షక్‌గా

బాధ్యత. శాఖలోని స్వయంసేవకులలో అధికభాగం మహారాష్ట్రులైనందున గటలోని స్వయంసేవకుల ఇళ్ళలో వారిని కలయుటకు వెళితే భాషసమస్య అడ్డంకి అయ్యేది. దానిపై శ్రీ హల్దేకర్‌జీ కొద్దిగా మరాఠి భాష శిక్షణ ఇచ్చారు. బారాహేకాయ్, క్షేమమా? మధుకర్ అహేకాయ్, మధుకర్ ఉన్నాడా ? నహి లేదు. కలటేగలా – ఎటుపోయినాడు ? మహేత్ నాయీ! తెలియదు! క్యోం ఆతే తీల్ . ఎప్పుడు వస్తాడు? మహాలే నావా. తెలయదు. జెవణీ ఝులకాయ్? భోజనం చేశారా? నానా – లేదు. బరాహే – సరే. నీఏతు – నేను వస్తాను. ఈ మాత్రం మరాఠీతో వ్యవహారాలు చూడు. చాలాసులభమైనది. జాంబాగ్ కార్యాలయంనుండి పత్తర్‌గట్టి ఎన్.బి. కాలేజీ రెండు కిలోమీటర్లు. బస్సు చార్జీ అణన్నర (తొమ్మిది పైసలు). ఆ కాలంలో రోజుకు మూడణాలంటే పెద్దఖర్చు. అయినా అటు కాలేజీ ఇటు సంఘ శాఖ. సాఫీగా ఒక నెల రోజులు గడిచినవి. ఇంతలో హల్దేకర్‌జీగారికి రెడ్డి హాస్టల్‌లో సంఘశాఖ నడపాలని ధ్యాస కలిగింది. నాటికి, దక్షిణ భారతదేశంలోనే ప్రవేటు మేనేజిమెంటులో కాలేజీ, విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులుండే అతి పెద్ద హాస్టలు, రెడ్డి హాస్టలే. తెలంగాణాలోని గ్రామీణ విద్యార్థులసౌకర్యం కొరకు కొత్వాల్ వెంకటరామిరెడ్డి గారి చొరవతో హైదరాబాద్ నడిబొడ్డున అబీడ్స్ సర్కిల్ సమీపంలో అతి విశాలమైన స్థలం సంపాదించి అందు పక్కామేడలు, సువిశాల ఆటమైదానాలు, వంటశాలలు, భోజనశాలలు, లైబ్రరీ కమ్ అసెంబ్లీ హాలు, చుట్టూ ప్రహరీగోడతో దాదాపు ఒకవేయివరకు అనేకానేకా తెలంగాణా రెడ్డిదొరబిడ్డలు, వివిధ కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసిస్తూ రెడ్డిహాస్టల్లో నివసించేవారు. పేరు రెడ్డిహాస్టలయినా ఎలాంటి కులమత విచక్షణలేకుండా సర్వవిధ విద్యార్థులకు కల్పవృక్షమైనది. ఇంతటి ప్రశస్తమైనచోట సంఘశాఖ నడపాలని సంఘ అధికారులు నిశ్చయించినారు. అయితే సంఘంలో అత్యధికులు మహారాష్ట్రులు మరియు వైశ్యులు, బ్రాహ్మణులు ఉండినారు. వారు పట్టుదలతో ప్రయత్నించినప్పటికి రెడ్డిదొరలకు కల సహజ అహంభావము కొద్దోగొప్పో ఉన్న వామపక్ష వాసనలు, తెలుగు, మరాఠీ భాషల వైవిధ్యము, అడ్డంకిగా నిలిచాయి. అతి కష్టంగా నెల, రెండునెలలు నడిపినప్పటికి వేళ్ళూనికోని దుస్థితివల్ల శాఖ బంద్ అయ్యేది. పదేపదే ప్రయత్నించినా లాభంలేకపోయేది. దానితో ప్రయత్నం విరమించటమైనది. మాన్యశ్రీ హల్దేకర్‌జీ ఒక అచ్చతెలుగు రెడ్డిగ్రామీణ నేపథ్యం కలవారు. సంఘంయెక్క సైద్ధాంతిక అవగాహన, నిష్ఠ, ఓరిమికల కార్యకర్త లభ్యమైతే ప్రతిష్ఠాత్మకమైన

రెడ్డిహాస్టల్‌లో శాఖ పునః ప్రారంభించవచ్చునని భావించినారు. ఇదే విషయము మా॥ బాపూరావు ముందుంచినారు. హల్దేకర్‌జీగారు, “నీవు శాఖకు పోకున్నా మంచిదే నష్టం ఏమీలేదు. రెడ్డి హాస్టల్‌లో తెలంగాణా అన్ని జిల్లాల గ్రామాలకు చెందినవిద్యార్థులున్నారు. బహుశా వారిలో నీ బంధువులు కూడా ఉండవచ్చు. కాబట్టి ఇకనుంచినీవు రెడ్డిహాస్టల్‌కు వెళ్ళి వివిధ వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని వారికి సంఘవిషయంలో చక్కని అవగాహన కలిగించి క్రమంగా శాఖను హాస్టల్‌లోని వ్యక్తులతోనే స్థాపించగలవు. నీకు సంఘవిషయంలో మంచి అవగాహన ఉన్నది. ప్రథమవర్ష శిక్షణకూడా చాలా చక్కగా పూర్తిచేశావు. ఈ పనికై నీవు సరిగ్గా సరిపోతావు. నేను నా అసక్తతను వివరిస్తు నాకాలేజీ కార్యాలయంనుండి రెండుకిలోమీటర్లు ఉంది. దానికి రోజు నాలుగుకిలోమీటర్లు నడక. రెడ్డిహస్టల్‌మరోకిలోమీటరు పైపడి వ్యతిరేకదిశలో ఉన్నది. రానుపోను మూడుకిలోమీటర్లు వేసుకున్నామొత్తంరోజులో 7కి॥మీ॥ నడక అంతసులభంగా సాధ్యమని అనుకోను అన్నాను. ఇదే విషయం బాపూరావుజీకి చెప్పి ఎలాగయినా ఒప్పించాలని కోరినాను. దానిపై బాపూరావుజీ పిలిచి, అరే రెడ్డి తుమ్‌తో ఇసిసే బడ్‌కర్ శరీర పరిశ్రమ్ కర్‌తాహై. తేరేలియే యహ కోయి బడీబాత్ నహీహై. తుమ్ చాహతేహైతో కర్‌సక్‌తేహై యహిమేరా విశ్వాస్ హై. ప్రయత్నకరో అని ఆజ్ఞాపించారు. అంతటి ఉన్నతవ్యక్తి ఆదేశాన్ని కాదన మనస్కరించలేదు. దానిపై హల్దేకర్‌జీ నేను, నీకూడా వచ్చి హాస్టల్‌ను చూపించి పరిసరాల అవగాహన కల్పిస్తాను అని ఆ మర్నాడు సాయంత్రం ట్రూప్‌బజారుగుండా హాస్టలు చేరినాము. ఆ హాస్టలు, దానిభవనాలు, అందులోని వ్యక్తులను చూడగానే ఎంతకష్టమైనా, నిష్టూరమైన తప్పకుండా ప్రయత్నించాలని సంకల్పించాను. రెండోరోజు అనుకుంటా. హాస్టల్‌లోకి ఇద్దరం వెళ్ళినాము. అప్పుడే కుందూరు వెంకటరామరెడ్డిగారు తమరూమునించి వస్తూ ఏం రో బావమరిది! ఎప్పుడొచ్చినావు? అని పలకరించినాడు. నేను హల్దేకర్‌జీని పరిచయంచేస్తూ రెడ్డి మా మేనత్త దత్తపుత్రుడని, వరంగల్ అశోకా బస్సుసర్వీసు సంస్థ వారిదేనని పరిచయం చేసినాను. వెంటనే హల్దేకర్‌జీ నీవు నీ పరిచయస్తులే లేరన్నావు. అత్యంత సన్నిహిత బంధువు కలిసినాడు. అది మొదలు ప్రతిరోజు 5గం॥లకు వచ్చి 9గం॥వరకు వివిధ వ్యక్తులను కలిసి గ్రూపుచర్చలు సాగించేవాడిని. ఆవిధంగా 15 రోజుల ప్రయత్నంలో అనేకమందితో స్నేహం కుదిరింది. అందులో వరంగల్‌జిల్లా చిట్యాలకే చెందిన వైద్యవిద్యార్థి శ్రీ బీరవోలు సురేంద్రరెడ్డిగారికి సంఘపూర్వ పరిచయం ఉన్నది.

వారి బావమరిది సర్వోత్తమరెడ్డిగారు పరిచయం అయినారు. నల్గొండజిల్లాకు చెందిన శ్రీ సత్యన్నారాయణరెడ్డి, నిజామాబాద్‌కు చెందిన మాణిక్యరెడ్డి, మహబూబ్‌నగర్‌కు చెందిన జనార్ధనరెడ్డిగారు, వై.ఎమ్.ఆర్.ఎ. (యంగ్‌మెన్ రెడ్డి అసోసియేషన్) ప్రసిడెంట్ శ్రీ రామకృష్ణారెడ్డిగారు, నిజామ్‌కాలేజీ తెలుగువిభాగం ప్రెసిడెంటు, కరీంనగర్‌కు చెందిన మారుతీ నిజామ్‌కాలేజీ విద్యార్థి ఇట్లా అనేకమందితో పరిచయం, స్నేహం ఏర్పడింది. వారందరూ అత్యంత ప్రతిభావంతులు అయినా చాలా ఆత్మీయంగా వ్యవహరించేవారు, అభిమానించేవారు. ఈ వయస్సులో (80ప్లస్) వారిని జ్ఞప్తికి తెచ్చుకోవటం సాధ్యమయ్యేది కాదు. శ్రీ హల్దేకర్‌జీ విభాగ్ ప్రచారక్ అయినప్పుడు వారి ప్రయాణాలలో వివిధ ప్రదేశాలలో కలిసినవారు రెడ్డి హాస్టలులో నాతో వారి స్నేహం గుర్తుచేసేవారని చెప్పేవారు. ఆ సమయంలోనే భారతీయ జనసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఎమ్.ఎల్. నర్సింహారెడ్డి బి.ఇ. గారి హైదరాబాద్ పర్యటన ఖరారైనది. శ్రీ బాపూరావుజీ శ్రీ రెడ్డిగారి గురించి బాగా ఎరిగినవారైనందున అరే రెడ్డి, యహ ఎమ్.ఎల్. ఎన్. రెడ్డి. బి.ఇ. ఇంజనీరింగ్ మద్రాస్సు గిండీ ఇంజనీరింగ్ కాలేజీమే కియా. గుడివాడకా ప్రముఖ స్వయంసేవక్, నిష్ఠావాన్ ఔర్ ప్రతిభాశాలిహై, అత్యంత ప్రతిభాశాలిహై. అత్యంత ప్రతిభాశాలి వక్తాభీ హై. హాస్టల్‌మే ఉన్‌కీ మీటింగ్‌కో ప్రయత్నకరో. దానితో హాస్టల్‌లోని స్వయంసేవకులతో సెక్రటరీకి అనుమతికై అర్జీ పెట్టుకోగా వారు అంగీకరించారు. ఆ సంగతి తెలుసుకొన్న వామపక్షీయులు సెక్రటరీగారికి తమ తీవ్ర అభ్యంతరం తెలిపినారు. మీరు రాజకీయాలకు అనుమతిస్తారా? అందునా కరుడుకట్టిన మతోన్మాద సంస్థ ఆర్.ఎస్.ఎస్. ప్రగతి నిరోధక బూర్జువా రాజకీయపార్టీ ప్రముఖుడితో సభకు ఎట్లా అనుమతిస్తారు అని పట్టుబట్టి అనుమతి రద్దుచేయించారు. శ్రీ హల్దేకర్‌జీగారు ప్రముఖ స్వయంసేవకులు వెంకట్రావు దేశాయి అడ్వకేటుగారి సలహాతో వేరొక అర్జీ అందులో నరసింహారెడ్డిగారిని ఒక ప్రముఖ ఇంజనీరుగానే పేర్కొంటూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినందున వారి సందేశము సత్‌ప్రభావము కలిగించకలదంటూ ఎమ్.ఆర్.ఏ. ప్రెశిడెంటు, నిజామ్ కాలేజీ సీనియర్ విద్యార్థి శ్రీ రామకృష్ణారెడ్డిగారితో సమర్పింపచేయగా గౌరవనీయ కార్యదర్శిగారు అంగీకరించి అనుమతించారు. హాస్టల్‌లో లైబ్రరీ కమ్ అసెంబ్లీ బిల్డింగు సువిశాలమైనది. దాదాపు 500మంది కూర్చుండే సిట్టింగ్ వసతితో పాటు కారిడార్‌లో మరో 500మంది నిలుచుండి వీక్షించే వసతి, చక్కని ధ్వని ప్రసారయంత్ర వ్యవస్థ, శాశ్వతమైనది ఉన్నందున

ఏర్పాట్లకు ఇబ్బందిలేదు. ఆదివారం శెలవయినందున విద్యార్థులందరికి విశ్రాంతియే. భోజనానంతరము రెండుగంటలనుంచి అయిదుగంటలవరకు సమయం నిర్ధారించి నోటీసుబోర్డుద్వారా ప్రకటించడమైనది. ఖంగుతిన్న వామపక్షులు సాధ్యమైతే సమావేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకున్నారు. గలాటాద్వారా, లేకుంటే బహిష్కరణ ద్వారా అడ్డుకుందాం అనుకున్నారు. కాని మిగతా విద్యార్థివర్గం సభను జయప్రదం చేస్తాం. చెప్పే విషయాలనుబట్టి వాటిని అనుసరించటమా? తిరస్కరించుటమా? అని నిశ్చయించినారు. అంచనాలకు మించి ఒంటిగంటకల్లా హాలుసిట్టింగ్ కెపాసిటి నిండిపోయి కారిడార్‌లు కూడా నిండినవి. ఏమైనా గొడవజరిగితే ఎదుర్కొనుటకు ఒక డజనుమంది స్వయంసేవకులు వచ్చినారు. శ్రీ నరసింహారెడ్డిగారిని వై.ఎమ్.ఆర్.ఏ. ప్రెసిడెంటు శ్రీ జనార్దనరెడ్డిగారు ఆహ్వానించి మాల అలంకరించినారు. శ్రీ నరసింహారెడ్డిగారు తమ ఉపన్యాసంలో దేశానికి కీడు కలిగిస్తున్న మూడు విచారధారలు. 1. ఇస్లాం మత మౌఢ్యం, 2. క్రైస్తవ ప్రచారతత్వం, 3. కమ్యూనిస్టు సోషియల్ సామ్రాజ్యవాదం. ఈ మూడుకూడా ప్రపంచాధిపత్యంకొరకు సర్వవిధాల ప్రయత్నిస్తున్నాయి అనే విషయం సాకల్యంగా విశదీకరించి అనేకానేక గణాంకాలతో సంఘటనలతో సంఘర్షణ వివరాలతో సుమారు 2గం॥లపాటు అనర్గళంగా, ఏకధాటిగా ఉపన్యసించినారు. శ్రోతలు తన్మయులై అత్యంత నిశ్శబ్దముతో విన్నారు. జాతీయభావ ఆవశ్యకతను నొక్కిచెప్పిన విధం శ్రోతలను ఆకట్టుకుంది. ఆషామాషీగా చూచిపోదామనుకున్నవారు అలాగే నిలుచుండిపోయారు. ఆవిధంగా సంఘం రెడ్డిహాస్టలులో కాలూనుటకు చేసిన ప్రయత్నం సఫలమైనది. ఆ మర్నాటినుంచే శాఖసంఖ్య 10-15నుండి 20-25కు పెరిగింది. మరింత కృషితో గరిష్టంగా 50ఉపస్థితితో మార్చివరకు శాఖహాస్టలో బోర్డర్స్‌తోనే నడిచింది. డా॥ బీరవోలు సురేంద్రరెడ్డిగారిలాంటి నిష్ఠావాన్ స్వయంసేవకులు తయారైనారు. రెడ్డి హాస్టల్ శాఖద్వారా యావత్ తెలంగాణాలో గ్రామాలలో సంఘంగురించి చూచాయగా పరిచయమైనది. ఈ విషయం హల్దేకర్‌జీగారు అనేకమార్లు గుర్తుచేసినారు.

శ్రీహల్దేకర్‌జీగారు ఆత్మీయత గురించి రెండుమాటలు. 1955తరువాత హైదరాబాదు వెళ్ళలేదు. చాలాకాలం తరువాత నా తమ్ముడు చి॥ ఎల్. నరసింహారెడ్డి హైకోర్టు అడ్వకేటుగా ప్రాక్టీసు చేస్తుండగా (శ్రీ బాబుల్‌రెడ్డిగారివద్ద జూనియర్‌గా) శ్రీ రాంభావుజీ శ్రీ బాబుల్‌రెడ్డిగారితో మాట్లాడుతూ శ్రీ నరసింహారెడ్డిని పరిచయంచేయగా వెంటనే

వరంగల్‌నుంచి అనగానే ఎల్. అంటే అని అడుగగా లింగాల అనే సమాధానంవిని లింగాల రామ చంద్రారెడ్డిగారు తెలుసా? అంటే ఆయన మా పెద్దన్నయ్య అనే సమాధానంతో శ్రీ హల్దేకర్‌జీగారు చాలా సంతోషంతో వారు మాఆప్త స్నేహితులని, తదాది డి.డి. కాలనీలోని వారి నివాసానికి అప్పుడప్పుడు వెళ్ళి పరామర్శించేవారు. మరోసంఘటన. మా అమ్మగారు గతించిన తరువాత అస్థికలు కృష్ణానది పుష్కరాల సందర్భంగా విజయవాడ వెళ్ళిఉంటిమి. రద్దీ కారణంగా వసతి లభించలేదు. దానిపై సంఘకార్యాలయాన్ని వెతుక్కుంటూ తిరుగుతుండగా కార్యాలయంకు కొద్దిదూరంలోనే శ్రీ హల్దేకర్‌జీగారు గుర్తించి, రెడ్డి కిధర్ నికలే ? కైసాఅనా హుఆ అని ప్రశ్నించి వారు స్వయంగా మా అందర్ని కార్యాలయంకు తీసుకువెళ్ళి శనివారం భోజనం చేయము అంటే, అరే రెడ్డిగారు మై జాంతాహు మగర్ టిఫెన్‌తో కారాళే హైనా. అని వెంటనే ఒక స్వయంసేవక్‌ను పిలిచి హొటల్‌కుపంపి టిఫెన్లు తెప్పించారు. ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకోగానే, తిరిగి అందరికి టిఫెన్లు తెప్పించి పుష్కర స్నానాలలో ఇబ్బందిలేకుండా అనువైన చోటుకు ఇద్దరు స్వయంసేవకులను తోడిచ్చి ట్రైను ఎక్కించేవరకు వెంటఉండే ఏర్పాటుచేసినారు.

ఆంధ్రప్రదేశ్‌లోని సంఘప్రగతిలో ఆత్మీయ జ్ఞాపకాలు అనే పుస్తకంలో 62,63 పేజీలలో నాగురించి నాలోలేని గుణాలను ఉటంకిస్తూ లేని గొప్పదనాన్ని ఆపాదిస్తూ వారి ఆత్మీయతను చాటుకున్నారు. అందుకే శ్రీ రాంభావు హల్దేకర్‌జీగారు చిరస్మరణీయులు.

**– లింగాల రామచంద్రారెడ్డి, హనుమకొండ**

# నిరంతర సంపర్కమే సంఘకార్య విజయరహస్యం

శ్రీ రాంభావూ హల్దేకర్‌జీతో నాకు సుమారు 1955 నుంచి పరిచయం ఉంది. నేను స్వయంసేవక్‌నైంది కూడా అప్పటినుంచే. తర్వాత సుమారు 1963 నుంచి 1965 వరకు నేను కరీంనగర్‌జిల్లా ప్రచారక్‌గా పనిచేశాను. శ్రీ హల్దేకర్‌జీ అప్పుడు కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్‌జిల్లాలతో కూడిన వరంగల్ విభాగ్‌కు విభాగ్ ప్రచారక్‌గా ఉండేవారు. ఆ కారణంగా అప్పుడే వారితో నాకు సాన్నిహిత్యం పెరిగి వారి వ్యక్తిత్వాన్ని సన్నిహితంగా

దర్శించే అవకాశం లభించింది.

హల్దేకర్‌జీకి తమ క్రింద పనిచేసే ప్రచారకులపై సంపూర్ణ విశ్వాసం ఉండేది. అందువల్ల సంఘకార్యం విషయంలో వారు వాళ్ళకు సంపూర్ణ స్వేచ్ఛ నిచ్చేవారు. ఎప్పుడైనా ఏదైనా పొరపాటు జరిగినా అంత సీరియస్‌గా తీసుకునేవారుకాదు. బైఠక్‌లలోనే ఆ విషయం ప్రస్తావనకుతెచ్చి మార్గదర్శనం చేసేవారు. అదికూడా వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి కాకుండా అందరికీ వర్తించే విధంగానే చేసేవారు. ప్రచారక్ లేక సంఘకార్యకర్త తనగ్రహణశక్తితో, అనుభవంతో సంఘపని ఎలాచేయాలనే విషయం స్వయంగానే తెలుసుకోగలుగుతాడని వారు భావించేవారు. ఈ సందర్భంలో మాననీయ స్వర్గీయ దాదారావు పరమార్థ్‌గారిని వారు తరచు ఉదాహరిస్తుండేవారు. కొత్తగా తమిళనాడుకు ప్రచారక్‌గా వచ్చిన ఒకరు దాదారావ్‌జీని సంఘపని ఎట్లాచేయాలో చెప్పండని అడిగాడట. అప్పుడు దాదారావుజీ "నీకు ఏంచేయాలో తెలుసుగదా? ఎట్లా చేయాలో అదే తెలుస్తుంది – చేస్తూపో" అన్నారట. బహుశా దాదారావుజీ చెప్పిన ఈ సమాధానమే హల్దేకర్‌జీకి మార్గదర్శకమై ఉంటుంది.

సంఘకార్యానికి మూలాధారం సంపర్కమే. అందువల్ల నిరంతర సంపర్కానికే హల్దేకర్‌జీ ఎక్కువ ప్రాముఖ్యమిచ్చేవారు. స్వయంసేవకుల కుటుంబాల్లో జరిగే శుభ, అశుభ కార్యాలన్నిటికీ వారు తప్పక హాజరయ్యేవారు. అక్కడికివచ్చే బంధువులందరితో పరిచయాలుచేసుకుని వాళ్ళతో కలిసిపోయేవారు. ఆ సంఘటనలను వారెప్పుడు మర్చిపోయేవారుకాదు. ఈ కారణంగా ఆంధ్ర,తెలంగాణాప్రాంతాల్లో అనేక కుటుంబాలు వారినొక కుటుంబపెద్దగానే భావిస్తాయి. మారుమూలగ్రామాలకుకూడా వారు శ్రమఅనుకోకుండా పర్యటిస్తుండేవారు. నేను ప్రచారక్‌గా విరమించుకొని కొంతకాలం మా స్వగ్రామం ఖమ్మంజిల్లా కల్లూరులో ఉన్నాను. అప్పుడు నాకు సంఘబాధ్యత ఏమీలేదు. మా ఊళ్ళో శాఖకూడాలేదు. ఐనా హల్దేకర్‌జీ నన్ను కలవటానికే వరంగల్‌నుంచి ప్రత్యేకంగా మాఊరు వచ్చారు. మా తల్లిదండ్రులతో పరిచయం చేసుకొని వాళ్ళతో చాలా కలివిడిగా రోజంతా గడిపారు. అది నన్ను చాల ప్రభావితం చేసింది. ఆ సంఘటన గుర్తుచేసుకొంటే సంపర్క ప్రభావం ఎంతగొప్పదో ననిపిస్తుంది. పూర్తిగా అశక్తులై మంచంపట్టేవరకు హల్దేకర్‌జీ స్వయంసేవకులతో సంపర్కకార్యాన్ని కొనసాగిస్తూనే వచ్చారు. దీన్నిబట్టి నిరంతర సంపర్కమే వారి సంఘకార్య విజయరహస్యమని తెలుస్తుంది.

హల్దేకర్‌జీ తమ తోటి ప్రచారకులతో తమసంబంధాన్ని తమవరకే పరిమితం

చేయకుండా అవకాశం దొరికనప్పుడు లేక అవకాశం కల్పించుకొని తమతోటి ప్రచారకులకు వారి తల్లిదండ్రులను, సోదరులను, సోదరుల కుటుంబాలను పరిచయం చేస్తుండేవారు. ప్రతిసంవత్సరం శిక్షావర్గపూర్తియైన తర్వాతగాని లేక అంతకుముందుగాని కొద్దిరోజులు వీలుచూసుకొని వారు తమ ఇంటికి, సోదరులవద్దకు వెళ్ళివస్తుండేవారు. ఆ విధంగా ఎంత సంఘకార్య నిమగ్నులై ఉన్నా, వారు తమకుటుంబంతో సంబంధాన్ని ఎప్పుడూ తెంచుకోలేదు. ఆ విధంగా తమ తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళేప్పుడు హల్దేకర్ తమతోటి ప్రచారకులను ఒకరిద్దరిని తమవెంట తీసుకువెళ్ళి తమకుటుంబసభ్యులందరితో పరిచయం చేస్తుండేవారు. దీన్నిబట్టితోటి ప్రచారకులను వారు తమకుటుంబసభ్యులుగానే భావించేవారని తెలుస్తుంది. నేను ప్రచారక్‌గా ఉన్నప్పుడు వారితండ్రి, సోదరులు, సోదరుల కుటుంబాలు (వారి తల్లి అప్పటికే స్వర్గవాసులైనారు) మహారాష్ట్రలోని మాహెూర్ అనేపుణ్యక్షేత్రానికి యాత్రకు వస్తూ హల్దేకర్‌జీని కూడా నేరుగా అక్కడికిరమ్మని కబురుచేశారు. మాహెూరులో దత్తాత్రేయుడి ప్రసిద్ధదేవాలయం ఉంది. దత్తాత్రేయుడు వారి కుటుంబ ఇష్టదైవం. వరంగల్లునుండి ఆదిలాబాద్ మీదుగా మాహెూర్ వెళుతూ హల్దేకర్‌జీ నన్ను కూడారమ్మని వెంటతీసుకువెళ్ళారు. అక్కడ వారి తండ్రిగారు, సోదరులు, సోదరుల కుటుంబాలు అందరినీ నాకు పరిచయం చేశారు. కొద్ది సంవత్సరాలక్రితం వారి స్వగ్రామం ఔరంగాబాద్ జిల్లా హాల్దాలో వారితాతలకాలంనాటి పాత ఇంటిని పునరుద్ధరించి దాని గృహప్రవేశ కార్యక్రమానికి ఆంధ్రా, తెలంగాణా, కర్ణాటక ప్రాంతాలకు చెందిన ప్రచారకులను, సంఘచాలకులను ఇంకా ప్రముఖ స్వయంసేవకులను ఆహ్వానించి పెద్దకార్యక్రమం నిర్వహించారు. అతిథులందరికీ భోజన తాంబూలాదులతోపాటు బట్టలుకూడా పెట్టి ఘనంగా సత్కరించారు. అదృష్టవశాత్తు నేను నా శ్రీమతికూడ ఆ కార్యక్రమంలో పాల్గొన్నాము. వారి కుటుంబీకులందరితో వారితోటిప్రచారకులందరికీ చక్కని పరిచయభాగ్యం లభించింది. ఆ సందర్భంలోనేవారు పిత్రార్జితంగా తమకు లభించిన కొంత భూమిని గోశాలనిర్మాణానికి దానంచేశారు. అక్కడ విజయవంతంగా ఒక గోశాలనిర్వహించబడుతున్నది.

ఈ విధంగా హల్దేకర్‌జీ జీవితం ఎంతో ధన్యమైందని తెలుస్తుంది. వారిజీవిత ఘట్టాలను స్మరించుకుంటూ వాటినుండి నిరంతరం స్ఫూర్తిని పొందటమే వారికి మనం అర్పించగల నిజమైన శ్రద్ధాంజలి.

**- కొండపల్లి శ్యాంప్రకాశ్. 9492033953**

# హల్దేకర్‌జీతో మా పరిచయం ఆయన ప్రభావం

**యా**భైఆరుఏళ్ళక్రితం మా పెళ్ళైన కొత్తలో మా అన్నయ్య శ్యాంప్రకాశ్‌రావు కరీంనగర్‌లో సంఘప్రచారక్‌గా ఉండేవాడు. హనుమకొండకు దగ్గరలో ఉండటము, మా శ్రీవారి కొలిపాక సుగుణాకరరావుతో మా వివాహానికి పూర్వమే ఉన్న బంధుత్వము, ముఖ్యంగా వాళ్ళిద్దరి సాన్నిహిత్యంతో తరచూ మా దగ్గరికి వస్తుండేవాడు. అప్పటికి మావారు సంఘవ్యతిరేకి అనలేను కాని సంఘసిద్ధాంతాలు, శాఖలపనితీరు ఒప్పుకునేవారుకాదు. మాఅన్నయ్య వచ్చిన ప్రతిసారీ రోజులతరబడి మావారిని కన్విన్స్ చేయాలని వాదిస్తూ ఉండేవాడు పాపం. ఒకోసారి ఇంతమంచి వ్యవస్థ గురించి ఎంతచెప్పినా ఒప్పుకోని మావారిని చూసీ, తాను ఒప్పించలేకపోతున్నాననీ బాధపడేవాడు కూడ. తరువాత 2,3 ఏళ్ళకు మా అన్నయ్య ప్రచారక్‌గా విరమించుకుని గృహస్థజీవితం ఆరంభించి సంఘపరిచయంతోనే సంఘకార్యక్రమాలలో పాల్గొంటున్నాడు. ఆ తరవాత 2,3 ఏళ్ళకు శ్రీ హల్దేకర్‌జీ ఎలా వచ్చారోగాని మావారిని కలిశారు. ఆయన దాదాపు ప్రతిరోజూ వచ్చి మావారి ఆఫీసులో ఒక 15నిముషాలు అరగంట కూచుని వెళ్ళేవారు. ప్రత్యేకంగా మావారిని సంఘప్రభావితులను చేయాలని ఆయన చెప్పిందేమీ లేదు. కాని ఆయనలో ఏమి వశీకరణ విద్య ఉందో మావారు నెమ్మది నెమ్మదిగా సంఘప్రభావితులు కావటం మొదలైంది. హల్దేకర్‌జీ పర్‌పస్ సర్వ్ అయింది. బహుశః ఆయన సరళస్వభావము, గంభీరముద్ర మావారిని ఆకర్షించాయేమో! సంఘవిధానంలో అదొక అద్భుత ప్రక్రియ కావచ్చు. ఒకసారి ఇక్కడ జరిగిన ఏదో క్యాంపుకు మావారిని రెండురోజులు అధికారిగా ఉండమని హల్దేకర్‌జీ కోరగానే ఆయన ముఖారవిందం ఏంటో, మావారు వెంటనే ఒప్పుకున్నారు. సాధారణంగా మావారు ఇలాంటి కార్యక్రమాలకు చాలాదూరంగా ఉండేవారు. అందులో వకాల్తా, వ్యవసాయము, కుటుంబవ్యవహారాలతో బిజీగా కూడా ఉండేవారు. అయినా ఆరెండు రోజులూ క్యాంపు అధికారిగా తన బాధ్యతను సక్రమంగానే నిర్వర్తించారు. ఆ సంఘటనతో హల్దేకర్‌జీకి మావారిపై పట్టుదొరికినట్టయింది. మెల్లమెల్లగా ముగ్గులోకి దింపగలిగారు. ఆయన ఎన్నడూ దేనికీ మావారిని బలవంతపెట్టకుండానే తాననుకున్న పనిచేయించేవారు.

ఆయనెప్పుడూ మావారిని నిక్కరు వేసుకోమనిగాని, సంఘశాఖకు రమ్మనమనిగాని చెప్పేవారుకాదు. బహుశః ఆఫీసులో తన పని విధానంలోనే మావారిలో అంతర్గతంగా ఉన్న హిందుత్వాన్ని గుర్తించి ఉంటారని నేననుకునేదాన్ని. ఆ తరవాత మావారిని జిల్లా సంఘచాలకులు చేశారు. ఎంతోమంది సంఘ అధికారులు, ముగ్గురు సర్ సంఘచాలకులు మాఇంట్లో ఎంతో తృప్తిగా ఆతిథ్యం స్వీకరించి, మా ఇంట్లోనే బసచేయటం కూడా జరిగింది. ముఖ్యంగా శ్రీ దేవరస్‌గారు, రజ్జూభయ్యా, సుదర్శన్ జీ, ఇంకా యాదవరావ్‌జీ, శేషాద్రిజీ లాంటి ప్రముఖులను కలవగలగటం, వారికి ఆతిథ్యమిచ్చే అవకాశం కలగటం పూర్వజన్మసుకృతమే ననిపిస్తుంది. దానికి ముఖ్యకారకులు హల్దేకర్‌జీయే.

మా పుట్టింటివైపు మా అన్నయ్యలు, మా మేనమామ కొడుకులు చాలామంది సంఘపరిచయస్థులే. ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్గలు కూడ పూర్తిచేసుకున్నవాళ్ళే. హల్దేకర్‌జీ మా తాతగారింటికి, మా నాన్నగారింటికి ఏదో సందర్భంగా వెళ్ళి కలుస్తుండేవారు. మా కుటుంబసభ్యులంతా ఆయనకు బాగా పరిచయస్థులే. సంఘసిద్ధాంతంలో కూడా కుటుంబ వ్యవస్థ నిర్మాణమూ భాగమే కదా. హల్దేకర్‌జీ ఎక్కడికి వచ్చినా కుటుంబంలో మనిషిలా కలిసిపోయేవారు. ఎప్పుడు వచ్చినా మావాళ్ళు అందర్ని పేరుపేరునా అడుగుతుండేవారు. “మా నాన్నగారికి చెవులు వినపడేవి కాదు. మా అన్నయ్యలందరికీ ఆ పోలిక వచ్చింది. ఇంకా నాకేరాలేదండీ”అంటే నవ్వుతూ “అది సుగుణాకర్‌రావుగారి సుకృతమమ్మా!”అని హాస్యమాడారు. ఎప్పుడూ సరాసరి వంటింట్లో నాదగ్గరికి వచ్చి చిరునవ్వుతో ‘కొంచెం చాయ్ తాగించండి’అని ఆప్యాయంగా అడుగుతుండేవారు. ఆయన చిరునవ్వే ఆయన ఆయుధమనిపిస్తుంది. ఎంతో సౌమ్యుడు. ఎప్పుడూ పరుషంగా గాని, అసభ్యంగాగాని మాట్లాడగా చూడలేదు. సహజంగా మితభాషి అయినా సందర్భం వస్తే హాస్యం జోడించి మాట్లాడేవారు. జన్మతః మహారాష్ట్రులైనా ఇక్కడికి వచ్చి తెలుగుభాషమీద బాగానే పట్టుసాధించారు. కాకపోతే ఏవిషయమైనా బ్రోకెన్ తెలుగులో ఎంతసేపైనా విపులంగా చెప్పేవారు. అదీ బాగానే ఉండేది. వారి సంతాపసభకువెళ్ళి మావారు మంచివాళ్ళంతా వెళ్ళిపోతున్నారు కొరగానివాళ్ళమే మిగిలిపోతున్నామని అన్నారు. మనమూ ఆయనను ఆదర్శంగా తీసుకుని మంచివాళ్ళము కావాలని చెప్తే బాగుండేది కదా!

హల్దేకర్‌జీ అనారోగ్యంతో సంఘపర్యటనలు మానేసి హైద్రాబాదులోని కార్యాలయం

'కేశవనిలయం'లో ఉండగా మేము ఎప్పుడూ హైద్రాబాదువెళ్ళినా కలిసి వచ్చేవాళ్ళము. నెమ్మదిగా మెట్లదాకావచ్చి మాకు వీడ్కోలిచ్చేవారు.

భగవద్గీతలో చెప్పినట్లు 'జాతస్య మరణం ధ్రువం' కదా! ఆయన వచ్చినపని అయిపోయిందేమో భగవంతుడు తీసుకెళ్ళాడు. మోదీజీ ప్రధాని కావటం చూసే వెళ్ళారు.

**– కొలిపాక సుచరిత, హనుమకొండ**

# నిరంతర మార్గదర్శకుడు

గత 63సంవత్సరాలు సంఘజీవితంలో లీనమైఉన్నాను. ఇంటర్‌మీడియట్ పరిక్షలో ఆంగ్లభాష విషయంలో అనుత్తీర్ణునిగా ఉన్న సమయాన శ్రీ దత్తు అనబడు సంఘకార్యకర్త మూలంగా (1953 సెప్టెంబరు) రెండురోజుల శిబిర కార్యక్రమములో పాల్గొనటము జరిగింది. ఆ శిబిరంలో ప్రాంతస్థాయి ప్రచారకులు మాననీయులు శ్రీ దేశ్‌పాండేజీ, శ్రీ రాంసాఠె, శ్రీ ఎం.ఎల్.నరసింహారెడ్డి గారల ఉపన్యాసాలు మరియు వారితో సంభాషించిన పర్యవసానంగా సంఘంపట్ల విశ్వాసము కలిగిన మూలంగా విడదీయరాని బంధం కుదిరింది. ఆ వెనువెంటనే మా గ్రామమునకు సంబంధిత విద్యార్థులకు వివరించి హనుమకొండలో సంక్రాతి తర్వాత నిత్యశాఖ ప్రారంభించి నేను శిబిరంలో నేర్చుకొనిన కొన్ని శారీరక కార్యక్రమాలతో నిర్వహించాను. వరంగల్లు నగరప్రచారక్ శ్రీ శంకరరావుగారి ప్రోత్సాహంతో ఇంటిలో చెప్పకుండా మచిలీపట్నంలో జరిగిన 30రోజుల సంఘశిక్షావర్గలో పాల్గొనినాను. తదనంతరం షుమారు సంవత్సరంపాటు జిల్లాలోని జనగామ మరియు ఖిలాషాపురం గ్రామాలలో శాఖలు ప్రారంభించాను. ఆనాటి ప్రారంభశాఖలో స్వయంసేవక్‌గా శిక్షణపొందిన శ్రీ కొరిగింజ రామచంద్రగారు నేడు వనవాసీ కళ్యాణ పరిషత్‌లో అఖిలభారతస్థాయి కార్యకర్తగా సంఘటన కార్యములో లీనమై ఉన్నారు.

తదనంతరం, వివాహం కావడం వ్యక్తిగత జీవితానికిగాను ఉపాధ్యాయునిగా, కాలేజీ విద్యార్థిగా, ప్రభుత్వోద్యోగిగా 36సంవత్సరాలు కొనసాగించాను. ఈ 36 సంవత్సరాల కాలంలో ఏనాడు సంఘకార్యానికి దూరం కాలేదు. ఒకవైపు కాలేజీ చదువు ప్రభుత్వ ఉద్యోగ బాధ్యత చిత్తశుద్ధిగా నిర్వహిస్తూ, సంఘస్వయంసేవక్‌గా శారీరక్ ప్రముఖ్ మరియు జిల్లా కార్యవాహ బాధ్యతలు అంతే నిష్ఠగా నిర్వహించాను. ఈ బాధ్యతలన్ని ఆనాటి

సంఘప్రచారకులు మా ॥ శ్రీ బాపురావుజీ మోఘే, శ్రీ రాంభావు హల్దేకర్‌జీ, శ్రీ సోంపల్లి సోమయ్య, శ్రీ గణపతిరావుజీ బ్రహ్మపూర్కర్‌గార్ల మార్గదర్శనం మరియు వారి జీవనవిధానము మరియు భావజాలమునుండి నిరంతరం స్ఫూర్తి గ్రహించిన మూలంగా ఒక సామాజిక కార్యకర్తగా రూపుదిద్దబడినాను.

ఉద్యోగ విరమణ అనంతరం శ్రీ లింగం సుధాకరరెడ్డి, శ్రీ రాంభావు హల్దేకర్‌జీ, శ్రీ సత్యనారాయణ గారల స్ఫూర్తితో విద్యాభారతి సంబంధిత శ్రీ సరస్వతీ విద్యాపీఠ పాఠశాలల నిర్వహణ మరియు సేవాభారతి కార్యక్రమాలలో లీనమై పనిచేయుచున్నాను. 2005లో వరంగల్లు జిల్లాలోని మారుమూల వనవాసి గ్రామాలలో నివసిస్తున్న వనవాసి కుటుంబాల పిల్లలు సరియైన విద్య, సంస్కారము లేకుండా బాధలకు గురిఅవుతున్న బాలురకొరకు హనుమకొండలో ఒక ఆవాసాన్ని ఉద్యోగ విరమణ చేసిన కొందరము కలిసి ప్రారంభించాము. 2007 నవంబరు మాసములో మా॥ శ్రీ రాంబావు హల్దేకర్‌జీ చేతులమీదుగా వారి ఆశీస్సులతో 17మంది వనవాసి బాలురతో ప్రారంభించబడినది. మా॥ హల్దేకర్‌జీ ప్రతి పర్యటనలో ఆవాసానికి విచ్చేసి మార్గదర్శనం చేసినారు. గత 10 సంవత్సరాలుగా మా॥ శ్రీ రాంభావు హల్దేకర్‌జీ ఆశీస్సులతో గత సంవత్సరంవరకు (45) విద్యార్థులు 10వ తరగతి పూర్తిచేసికొని కాలేజీలలో విద్యాభ్యాసాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ శ్రీ వ్యాస ఆవాసంలో 74మంది విద్యార్థులు ఉంటున్నారు. దగ్గరలోని శ్రీ సరస్వతీ విద్యాలయాలలో విద్య అభ్యసిస్తున్నారు. ఇట్టి విద్యార్థులు తమ కట్టుబట్టలతో ఇళ్ళనుండి విచ్చేసి అన్ని సౌకర్యాలతో 6 సంవత్సరాలు ఉంటు సంస్కారాల యుక్తవిద్య అభ్యసిస్తున్నారు.

**– పోల్సాని లక్ష్మారెడ్డి, వరంగల్**

# అసలైన వీతసంగుడు హల్దేకర్‌జీ

రెండు తెలుగురాష్ట్రాల స్వయంసేవక బంధువులు ఆప్యాయంగా హల్దేకర్‌జీ అని పిలుచుకునే శ్రీ రాంభావూ హల్దేకర్‌జీ జేష్ఠసంఘ ప్రచారక్ 1953 విజయవాడ ఓ.టి.సి. (సంఘశిక్షావర్గ) కాలంనుండి నేటివరకు గడచిన సుదీర్ఘకాలఖండంలో వారితో నాకు కల్గిన అనుభవాలు ఎన్నోఉన్నాయి. వాటిలో ఈ స్మరణిక కొరకు రెండు, మూడు

ఉదాహరణలు ఉటంకిస్తాను.

## ఖర్చులు లెక్కల విషయంలో నిష్ఠ:

1963లో సంగతి, నేను అనారోగ్యంతో బాధపడుతూ మదనపల్లి టి.బి. శానిటోరియంలో చేరాను. అప్పటివరకు సంఘఖర్చులు నమోదుచేసే బాధ్యత నాపై ఉంది. ఒక స్వయంసేవకునకు అత్యవసర పరిస్థితిలో సంఘనిధినుండి 150 రూ॥ ఇచ్చాను. నేను కొన్నిమాసాలపాటు ఆసుపత్రిలో ఉండవలసి వస్తుంది కాబట్టి, లెక్కలు ఆనాటి జిల్లాప్రచారక్ హల్దేకర్‌జీకి అప్పచెప్పాను. లెక్కలు చూస్తూ మనం వ్యక్తుల అవసరాలకొరకు సంఘనిధినుండి వాడకూడదు. అది జమచేయవలసిందే అని నిర్దిష్టంగా చెప్పారు. నేను మరోస్నేహితుని దగ్గర డబ్బు అప్పుగా తీసుకొని జమచేయటం జరిగింది. హల్దేకర్‌జీ లెక్కల విషయంలో అంత కచ్చితంగా ఉండేవారు. సంఘం చేపట్టిన విస్తృత ప్రణాళికలో అనేకఖర్చులు భరించవలసి వస్తుంది. సంఘానికి ఎప్పుడూ నిధులకొరతే కానీ ఉన్న కొద్దిపాటి మొత్తాన్నీ, ఖర్చుచేయడంలో, ప్రతి రూపాయికీ లెక్కచెప్పాలనేది సంఘనియమము. సంఘ నియమాలను తు.చ తప్పకుండా పాటించాలనేది హల్దేకర్‌జీ పట్టుదల.

## సంఘకుటుంబంతో అనుబంధం:

వరంగల్‌లో నేను అధ్యాపకుడిగా పనిచేస్తున్న రోజులలో సంఘంలో ముఖ్యబాధ్యతను నిర్వహిస్తుండేవాడిని. హల్దేకర్‌జీ జిల్లా ప్రచారక్‌గా ఉంటూ మా గృహానికి తరచుగా వస్తుండేవారు. "క్యా హాల్‌హై" అని కేక వినిపించింది అంటే హల్దేకర్‌జీ ఇంటికి వచ్చారని అర్థం. ఆ పూట భోజనం కూడా పూర్తిచేసి కొని, సంఘవిశేషాలు చెప్పి కార్యక్షేత్రంలో పనిపురమాయించి బైటికి వెళ్ళేవారు. చాలామంది కార్యకర్తలు అనుభవం కూడా ఇదే.

## విభాగ్‌ప్రచారక్‌గా పదోన్నతి :

హల్దేకర్‌జీని వరంగల్‌జిల్లా ప్రచారక్ బాధ్యతనుండి విభాగ్‌ప్రచారక్‌గా పదోన్నతిపై బదిలీచేశారు. ఆ సందర్భంలో అక్టోబర్ 5, 1969 వరంగల్ ఆకారపు నరసింహం మందిరం ప్రాంగణంలో చందన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఆ సందర్భంలో స్వయంసేవకులు తమ అభిప్రాయాలనుచెప్తూ హల్దేకర్‌జీ "మా గృహాలను తరచూ దర్శించేవారు. ఆయన మా ఇంటికి వస్తున్నారంటే ఒక అతిథి అనికాక ఒక దగ్గరి బంధువు వస్తున్నట్టే భావన చోటుచేసుకొనేది. గృహంలోని సభ్యులందరితో ఆయనకి పరిచయమే" అని, తమ అంతరంగాన్ని వెలిబుచ్చారు. సంఘప్రచారక్ అంటే స్వయంసేవక్

కుటుంబాలతో అంతటి ఆప్యాయత నెలకొల్పుకొవాలని అనిపించింది. వరంగల్ జిల్లా ప్రచారక్‌గా ఉన్నకాలంలో ఒక ఏడాది జోరున వర్షాలు పడ్డాయి. వాగులు, వంకలు పొంగి రహదారులమీదుగా ప్రవహిస్తున్న కారణంగా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. హల్దేకర్‌జీ అప్పుడు మానుకోట (మహబూబాబాద్) పర్యటనలో ఉన్నారు. ఆ మర్నాడు వరంగల్ కార్యక్రమానికి చేరాలి. వాహనాలు అన్నీబంద్. రైలు పట్టాలపై నడుస్తూ మానుకోటనుండి వరంగల్ వరకు కాలి నడకన వచ్చారు. ఎంతో శ్రమతో కూడినటువంటిపని అయినప్పటికీ శారీరక కష్టం కంటే కార్యక్రమం ముఖ్యం అనే సందేశం స్వయంసేవకులకు అందింది.

## అప్పుడప్పుడు వ్యంగ్యం :

హల్దేకర్‌జీ స్వయంసేవకులతో ఎంతగా కల్సిపోయారంటే ఎవరినీ నొప్పించనిరీతిలో వ్యంగ్యోక్తులు కూడా ఉపయోగించేవారు. కొంతమంది స్వయంసేవకులు శాఖ మొదలైన తర్వాత ఆలస్యంగా ప్రార్థన జరిగే సమయానికి చేరేవారు. ఆయన అలాంటి వారిని ఉద్దేశించి "తే భృశం" స్వయంసేవకులనేవారు. ప్రార్థనలో ఆఖరివాక్యం సమర్థా భవత్వాశిషా తే భృశం"(సంఘ కార్యవిజయానికి కావాల్సిన సమర్థతను మాకు **మిక్కిలిగా** ప్రసాదించు (తే భృశం) అని చదువుతాము. ఆ వ్యంగానికి స్వయంసేవకులు నవ్వుకొనేవారు.

## వివాదసమయాల్లో సంయమనము:

విజయవాడ ఎనికేపాడులో సి.బి.ఎస్.సి. సిలబస్‌లో చక్కటి ఇంగ్లీషుమీడియం ఉన్నతపాఠశాల నిర్వహింపబడుతుంది. పరిపాలనాంశంలో దొర్లిన ఒకదోషం కారణంగా ప్రధానాచార్యుడిని బదిలీ చేయాలని స్థానిక ప్రచారక్ పట్టుబట్టారు. ఆ మార్పు ఇష్టంలేని స్కూలు కార్యవర్గ కార్యదర్శి తనపదవికి రాజీనామా చేశారు. కార్యవర్గంలో నాతోపాటు కొందరుకూడా ఆ మార్పుని హర్షించలేక పనికి దూరంగా ఉన్నారు. ఆ సందర్భంగా హల్దేకర్‌జీ స్వ. చిలుకూరి సుబ్రమణ్యశాస్త్రిగారిని నాతో మాట్లాడవలసిందిగా పురమాయించారు. ఆ విధంగా సమస్యను పరిష్కరించడంలో హల్దేకర్‌జీ చూపిన విజ్ఞత హర్షించదగినది.

## సంఘ సాహిత్యం :

1925లో సంఘస్థాపన కాలంనుండీ నేటివరకు గడచిన కాలఖండంలో చాలామంది జ్యేష్ఠప్రచారకులు నిర్యాణం చెందారు. అలాంటివారి జీవిత విశేషాలు భావితరాలకు స్ఫూర్తిని

అందిస్తాయి. అందుచేత అలాంటివారి జీవిత కథలు సంఘసాహిత్యంలో ప్రముఖస్థానం వహిస్తాయి. హల్దేకర్‌జీ మాతృభాష మరాఠీ. సుదీర్ఘకాలం తెలుగు ప్రాంతాలలో ప్రచారక్‌గా ఉన్న కారణంగా తెలుగు బాగానే మాట్లాడగలరు గానీ తెలుగు వాఙ్మయంతో పరిచయం తక్కువ. అయినా కొందరు ప్రముఖుల జీవితగాథలు తెలుగులో స్వయంసేవకులకు తెలియపరచాలనే ఉత్సాహం హల్దేకర్‌జీకి ఉంది. ఆ కారణంగా పూజ్య బాలాసాహెబ్ దేవరస్ జీవితగాథను మరాఠీ నుంచి తెలుగులోనికి అనువదించారు. దానికి గాను ఒకరిద్దరు స్వయంసేవకులు సహాయం తీసుకుని ఆ గ్రంథాన్ని సవివరంగా అంతవరకు వెలుగుచూడని ఎన్నో ఉదంతాలు ఉటంకిస్తూ పూర్తిచేశారు. పుస్తకాలు ప్రచురించడం ఒక ఎత్తు, ప్రచురింపబడిన గ్రంథాలను పాఠకులకు అందించడం మరో ఎత్తు. ఆ పుస్తకాలు చంకన బెట్టుకుని విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, భాగ్యనగరం, కరింనగర్ మొ॥ పెద్ద పట్టణాలలోనే కాక చిన్న చిన్న గ్రామాలు కూడా తిరిగి సభలు, సమావేశాలు నిర్వహించి ఆ గ్రంథాలు ఎక్కువమంది స్వయంసేవకులకు అందేట్టు చేశారు. హల్దేకర్‌జీతో పాటు నేనుకూడా రెండు, మూడుచోట్ల పాల్గొన్నాను. ఒక పని తలపెడితే దానికి సంబంధించిన సూక్ష్మాతిసూక్ష్మమైన వివరాలు కూడా సేకరించి విజయవంతంగా అమలుపరచడంలో హల్దేకర్‌జీ దిట్ట.

**ఆప్యాయమైన పిలుపు :**

నేను భాగ్యనగరం సందర్శించినప్పుడు తప్పకుండా సంఘకార్యాలయం (కేశవనిలయం) సందర్శించడం ఆనవాయితి. కార్యాలయానికి ఎప్పుడు వెళ్ళినా హల్దేకర్‌జీని తప్పనిసరిగా పలకరించేవాడిని. ఎప్పుడు వారిని కలిసినా "గోపిరెడ్డిగారూ బావున్నారా" అంటూ పూర్తిపేరుపెట్టి పిలిచేవారు. సందర్భోచితంగా కుటుంబసభ్యుల యోగక్షేమాలు కూడా అడిగి తెల్సుకునేవారు. అక్టోబర్ 7, 2015 నాడు సంఘకార్యాలయంలో హల్దేకర్‌జీని కలిశాను. బాగా బలహీనంగా ఉన్నారు కానీ ఎంతో ఆనందంగా పలకరించారు. మరలా మార్చి 2016లో కార్యాలయాన్ని సందర్శించినపుడు వారిని చూడగా బాగా బలహీనమై మాట్లాడటమే కష్టంగా ఉన్నట్లు అర్థమైంది. ఆ స్థితిలోకూడా వీల్‌చెయిర్‌పై కార్యాలయవరండాలో తిరుగాడేవారు. కడవరకు సంఘకార్యమే ధ్యేయంగా పెట్టుకుని జీవించిన ధన్యజీవి హల్దేకర్‌జీ.

**– పులుసు గోపిరెడ్డి, విజయవాడ**

# శ్రీ హల్దేకర్‌జీతో నా అనుభవాలు

**అ**ది 1968-69వ సంవత్సరం అనుకుంటాను. వారు విభాగ్ (వరంగల్) ప్రచారక్ అనుకుంటాను. నేను మా జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్‌గా ఉంటూ పరకాల తాలూకా "ప్రభారి"గా ఉన్న రోజులవి.

ఆ సంవత్సరం గ్రామీణ శాఖలను ప్రోత్సహించే విధంగా పరకాల తాలూకా(ఆనాడు) చిట్యాల మండలంలోని 'జడలపేట' అను గ్రామంలో 'కోజాగిరి' ఉత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయమైనది. ఆ ప్రకారమే నేను, వారు సాయంకాలానికి అక్కడికి చేరుకున్నాము. అచ్చట గ్రామీణ శాఖలతోను, స్వయంసేవకులతోను, శాఖలులేని గ్రామాలలో శాఖలు ప్రారంభించటానికి ఆ కార్యక్రమం దోహదపడుతుందని భావించాం.

ఆ రాత్రి వెన్నెలలో జరిగిన కార్యక్రమానికి శాఖలులేని ప్రదేశాలనుండికూడ కొంతమంది యువకులు వచ్చారు. ఆ రాత్రి కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఉత్సవం అయిన తరువాత శాఖా కార్యకర్తలతోను - శాఖలులేని ప్రదేశాలనుండి వచ్చిన వారితో పరిచయాలు చేసుకొని మాట్లాడటం జరిగింది. ఆ రాత్రి 1గం॥ సమయంలో అందరం కచ్చడాలలో (ఆనాటి చిన్న ఎద్దులబండి) కొత్తపల్లికి బయలుదేరాం. స్వయంసేవకులు ఉత్సాహంతో బండ్లను పరుగులు తీయిస్తున్నారు. వారు ఒక "కచ్చడంలోను', నేను మరొక కచ్చడంలోను ఉన్నాం. వారు బండికి ఆనుకుని కూర్చొన్నారు. మొదటిగా వారిది, తరువాత నాదిగా బయలుదేరాం. మధ్యలో నీరులేని ఒక వాగు దాటుతుండగా క్రిందపెద్ద బండలు ఉన్నందున వారు పడిపోయారు బండితోసహా. వీపుకు దెబ్బకూడా తగిలింది. రక్తం కూడా కారింది. బండిలేపి కొత్తపల్లికి చేరుకున్నాం. అక్కడ శ్రీ తిరుపతిరావు, శ్రీ సమ్మారావు అనే స్వయంసేవకులు అమృతాంజనం తెచ్చి రాసారు. మర్ధనచేశారు.

ఉదయమే 5గం॥లకు బస్సుకే బయలుదేరాలి. పొలం గట్లగుండా నడవాలి. దారిలేదు. కనుక ఒక స్వయంసేవక్ పెట్రమాక్సులైటు వెలిగించుకుని నెత్తిన పెట్టుకుని ముందు నడుస్తుంటే మేమంతా ఆ వెలుగులో చెల్పూరు బస్సుస్టేషన్‌కు చేరి హనుమకొండకు చేరుకున్నాం.

ఈ మధ్యనే ఇన్ని సంవత్సరాల తర్వాత భూపాలపల్లి ప్రాథమిక శిక్షవర్గలో కలిసాము.

ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకోవటం, ఆ సంఘటన గుర్తు చేసుకోవటం జరిగింది. విచారాన్ని వ్యక్తీకరించారు. అలాగే భాగ్యనగర్ వెళ్ళినప్పుడు మా॥ రాంభావుజీ ఆ సంఘటన గుర్తు చేస్తుండేవారు.

ఈ సంఘటన కారణంగా వారిలో గ్రామీణ స్వయంసేవకులతో కలిసి మాట్లాడాలనే తపన కనిపించింది.

నేను భాగ్యనగర్‌లో జరిగే కార్యకారిణి (ప్రాంత) బైఠక్‌లకు వెళ్తుండే వాణ్ణి, వారు అనారోగ్యంతో లోగడమాదిరిగా ప్రాంతపర్యటన చేయలేక కార్యాలయంవరకే పరిమితంగా ఉండేవారు. కలిసినపుడు వరంగల్‌లోని కార్యకర్తలు శ్రీ జంగారెడ్డిగారు, శ్రీ ధర్మారావుగారు, శ్రీ రాజేశ్వరరావుగారు తదితర పాత కార్యకర్తల యోగక్షేమాలు అడిగితెలుసుకుంటుండేవారు.

ఒకసారి వరంగల్ వచ్చి రెండురోజులుండాలన్నారు. ఎందుకని అడుగగా పాత కార్యకర్తలు అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీ శిరిమెళ్ళ వెంకటస్వామి (కాశీబుగ్గ సంఘచాలక్) శ్రీ లకుం వెంకట్రాజు (బి.ఎమ్.ఎస్. రిక్షకార్మిక సంఘజిల్లా కార్యదర్శి పాతకార్యకర్తకూడా గత 20సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడున్నారు. చేయి, కాలు, నోరు పడిపోయింది, శ్రీ ఇమ్మడి ఉపేందర్, శ్రీ భూపతి రత్నం (వరంగల్‌శాఖ మొదటిజట్టులోని వాడు తన వివాహ సందర్భాన "ఘోష్ వాయిద్యాలు మొదటగా కొనిఇచ్చినవాడు. ఈమధ్యనే గృహస్థ ప్రచారక్‌గా భాగ్యనగర కార్యాలయంలో ఉన్నవాడు, తదితర స్వయంసేవకులను కలవాలన్నారు. ఆ ప్రకారమే వరంగల్‌వచ్చి మా ఇంట్లోనే ఉన్నారు. అందరినీ కలిశాం. పర్యటించలేని స్థితిలో తమను కలవడంగా వారికి ఎంతో సంతోషమైంది. ఆ తర్వాత వ్యాస ఆవాసంలోని విద్యార్థి స్వయంసేవకులలో కలిసి ముచ్చటించారు.

ఈవిధంగా అనారోగ్య స్థితిలో ఉండికూడా స్వయంసేవకులను కలుసుకోవడంలో వారిలో ఉన్న తపన అర్థమవుతుంది.

**– రేవా కోటేశ్వరరావు,**

**పూర్వ ప్రాంతకార్యకారిణి సభ్యులు**

# హల్దేకర్‌జీగారికి
# సంఘకార్యకర్త చిరుకానుక

**19**55 సంవత్సరములో ఒక చిన్న సంఘటనతో, ఖమ్మం గవర్నమెంట్ ఎమ్. పి. పి. హైస్కూలు విద్యార్థులు ఆర్. ఎస్. ఎస్. కార్యాలయముపై దాడి చేసినారు. ఆ ప్రభావములోపడి ఆర్. ఎస్. ఎస్. అంటే ఏమిటో తెలియని విద్యార్థులు ద్వేషభావము పెంచుకొనినారు. అందులో నేనొక విద్యార్థినిని.

1960-61 సం॥లో నేను యింటివద్ద యుండవలసి వచ్చినది. ఆ కాలములో శ్రీ ఎస్. ఎల్. ఎన్. ఆచారిగారితో పరిచయం ఏర్పడినది. వారు మా గ్రామం బురద రాఘవపురం సి. యు. పి. ఎస్. కు ప్రధాన ఆచార్యులుగా పనిచేయుచుండిరి. బ్రహ్మచారి, నిష్ఠాగరిష్ఠుడు, నిగర్వి, స్నేహశీలి. వారిని గురించి ఎంతచెప్పినను తక్కువే. ఒక దినమున ఆర్. ఎస్. ఎస్. వారు ఉపయోగించు నిక్కరు, బనియనుతో యోగాసనములు వేయుచుండిరి. నేను అడుగగా, తాను ఆ సంఘకార్యకర్తనని చెప్పి, ఖమ్మం సంఘటన దురదృష్టకరమైనదని వివరణ ఇచ్చినారు.

నేను కమ్యూనిష్టు అభిమానిని, అప్పటికే చాలా పుస్తకములు శ్రీ వాసుదేవరావు అనే మిత్రునిద్వారా లైబ్రరీనుండి తీసుకొని చదివి యున్నాను. నేను వారి వివరణకు లొంగలేదు. దేశమును ప్రేమించు వారిలో నేను ఒకడిని. శ్రీ ఆచారిగారినుండి సంఘమును గురించి ఎన్నో విషయములు తెలుసుకొనినాను. బంచ్‌ఆఫ్ థాట్స్ తెలుగు అనువాదం చదివినాను. క్రమంగా సంఘం పట్ల ఆకర్షితుడనై ఒకసారి నాగపూర్‌లో ఉత్సవం చూడడానికి వెళ్లాను.

నాగపూర్‌లో డాక్టర్ హెడ్గేవార్ స్మృతి మందిర ప్రారంభం జరుగనున్నదని తెలిసి మేము ఎన్నో అవాంతరములను అధికమించి నాగపూర్‌చేరినాము. రాత్రి శ్రీ గురూజీగారి బౌద్ధిక్ అయిపోయినది. మేము గ్రౌండులోనికి వెళ్ళినాము. ఆ కార్యక్రమమునకు వచ్చిన జనవాహినిని, క్రమశిక్షణ మరియు గణవేషధారులైన సంఘ కార్యకర్తలను చూచి మనస్సు పులకించుటయే గాక అంతరంగములో చెరగని ముద్రపడినది. స్మృతి మందిరము, కార్యాలయము దర్శించుకొని ఆ రాత్రి, ఆ పగలు కార్యకర్తలతో యుండి మరుసటిరోజు గ్రామమునకు ప్రయాణము కట్టినాము.

ఇంటికిరాగానే మా మిత్రులతో కలసి, శ్రీ కోటయ్యగారికి ముఖ్యశిక్షక్‌గా ఎంచుకొని, శాఖను మొదలిడినాము. ఈ శాఖ(దైనందిన)10సం॥ కొనసాగించినాము. గ్రామములో తరువాత యింటికి ఒకరు చొప్పున నమోదు చేసినాము.

కీ॥శే॥ శ్రీ ఎస్. ఎల్. ఎన్. ఆచారిగారి సలహాలు, సూచనలతో మా గ్రామంలో శ్రీరామనవమి ఎంతో ఘనంగా నిర్వహించినాము. భజనలు, పాటలు, ఆటలు, గ్రామాలు, ఒకటేమిటి, పెండ్లి అయిన పిల్లలు ఈ పక్కగ్రామాలకు కూడా శాఖ వ్యాపించినది. మా పంచాయతీని జనసంఘ పంచాయితీ అనేవారు. నేటికి ఆనాటి కార్యకర్తలు సంఘకార్యమనిన నియమ నిబద్ధతతో పాల్గొంటారు.

ఈ కాలంలోనే శ్రీ మాననీయ హల్దేకర్‌జీగారు ప్రాంత ప్రచారక్‌గా వచ్చినారు. మా గ్రామమును దర్శించిన రోజును జిల్లా ప్రచారక్‌గారు వచ్చేవారు. మాకు వారితో అనుబంధం ఎక్కువగా యుండెడిది. ఆనాడు రహదారులులేని కారణంగా ఎడ్లబండితో వారిని తీసుకొని వచ్చెడివారము. ఎనుకూరు మా బస్ స్టేషన్. రహదారి ఏమంత బాగుండెడిదికాదు. వాగులు, చిన్నచిన్న కాలువలు యుండెడివి. బండికి కట్టిన ఎడ్లలో ఒకటి కొత్తది. దారిలో వాగు యుండుటవలన అచ్చటికిరాగానే, కాడి తొలగించుకొని నిలబడినది. యింకొక ఎద్దుబండిని గుంజుకొని పోవుచున్నది. మాకు చాలభయం వేసినది. ఎదురు నిలబడి ఎద్దు కదలకుండ చేసినాము. దీనిని హల్దేకర్‌జీగారు చాలా తేలికగా తీసుకొని, మా భయం పోగొట్టేవారు. సంఘస్థానమందు ఈ విషయంచెప్పి అందరిని నవ్వించినారు. ఇదే విషయమును చివరసారి వచ్చినప్పుడు ప్రస్తావించి మనస్సునిండా ఆనందాన్ని నింపుకొనినారు.

సంఘకార్యకర్తల యోగక్షేమములు వారి యిండ్లకు వెళ్ళి విచారించేవారు. వీలున్న సహపంక్తిభోజనం కూడా చేసేవారు. వారు కార్యకర్తలతో యున్నపుడు హావభావములు, మాటల చతురత, హాస్యము, ఇవన్నీమాటలకందని విషయముగా నుండెడివి.

ఈ కాలంలోనే (తేదీ గుర్తులేదు) ఓ.టి.సి. నిమిత్తం ప్రయాణమై వివేకవర్ధని హైస్కూలుకు చేరినాను. ఆంధ్రప్రదేశ్ మొత్తంకూడ సంఘకార్యకర్తలకు ఇచ్చటనే శిక్షణ ఇవ్వబడినది. ప్రబంధకులతో కలిపి 400వరకు సంఖ్యయున్నది. ఇందు శ్రీ సోమయ్యగారు, కరెడ్ల సత్యనారాయణగారు, నాకు తెలియని ప్రముఖులు చాలామంది కలరు. మిత్రులు ఖమ్మంలో విద్యనభ్యసించిన శ్రీగంగాసత్యం ఆయుర్వేదిక్ డాక్టరు కూడా కలరు. క్రమశిక్షణ

అంటే ఏమిటో ఇచ్చట నేర్చుకొనినాను. నిత్యం విజిల్ ఊదకముందే తెల్లవారుఝామున 3.30 గం॥లకు లేచి కాలకృత్యములతోపాటు వీలున్న స్నానముకూడ ముగించేవారము. వివేకవర్ధని హైస్కూలుకు అనుబంధముగా నున్న పాఠశాలనందు కాలకృత్యముల వసతి కలదు. ఉదయం 5గం॥లనుండి సాయంకాలం రాత్రి 9గం॥లవరకు నియమనిబంధనలు పాటించుచు కార్యక్రమములు నిర్వహించవలసినదే. రాత్రి పరుండునప్పుడు మైదానంలో ముగ్గును రెండుగీతలుగా పోసెడివారు. వాటిమధ్యన నిద్రించవలెను. పాదరక్షలు కూడ క్రమశిక్షణతో యుంచవలయును.

ప్రథమ, ద్వితీయ శిక్షావర్గలు యిచ్చటనే నిర్వహించేవారు. మాననీయ శ్రీ గురూజీగారు మాతో రెండు దినములు గడిపినారు. ఒక దినమున మా గణ విద్యార్థులతో బైఠక్ జరిగినది. తెల్లని గడ్డం, బంగారుచాయ, తెల్లని వస్త్రములతో దైవదూతవలె నేలపైనున్న పరుపుమీద పద్మాసనంతో కూర్చుండినారు. ప్రతి స్వయంసేవకుని వ్యక్తిగత విషయములు, సంఘపరిచయము. ప్రస్తుతము మీరు ఏమి చేస్తున్నారు అని అడిగితెలుసుకునేవారు. నన్ను మీరు ఏమి చేస్తున్నారు అని హిందీలో అడిగారు. నా సమాధానం “ఖేత్‌కా దేఖ్‌బాల్ కర్‌తాహూ”. వారు హాస్యంగా నవ్వి ‘సిరఫ్ దేఖ్‌బాల్ కరేతో కామ్ కౌన్ కరేగా?”అప్పుడు గది అంతా నవ్వులతో నిండిపోయంది. నా జీవితంలో ఇది మరచిపోలేని సంఘటన. సంఘమిత్రులు కలిసినపుడు ఈ సంఘటన గుర్తుచేసుకుని నవ్వుకుంటాము.

సంఘప్రముఖులు దీనదయాల్‌జీ, అటల్ బిహారీ వాజ్‌పాయ్, దత్తోపంత్ ఠేంగ్డేజి, రానడేజీ, దేవరస్‌గార్లను మరియు తెలుగు పండితులతో బౌద్ధిక్‌లు విను భాగ్యము కల్గినది. రాత్రి ప్రముఖుల బౌద్ధిక్‌ల సారాంశము బోర్డునందు కాగితములు అతికించేవారు. సంస్కృత పాఠముకూడా ఉండెడిది. అవన్నియు నోట్సునందు రాసుకొనెడి వాడను. ప్రస్తుతము ఆ పుస్తకములు దొరుకుటలేదు. ఇక ఉదయం కాంజీ ఇచ్చెడివారు. మొదట పారబోసినను తరువాత బాగా అలవాటుపడ్డాము. రెండు గ్లాసులకన్నా ఎక్కువ ఇచ్చెడివారు కాదు. సంఘస్థాన్‌నందు క్యాంటిన్‌కూడా కలదు.

నాలో ఎక్కడో చిన్న అహంభావము యుండెడిది. సామూహిక పనులు చేయుటకు ఇష్టపడెడివాడనుకాను. ఈ సందర్భమున శ్రీ హల్దేకర్‌జీగారితో చిన్న సంఘటన జరిగినది. నిర్ధేశించిన గదిలోని స్వయంసేవకులు రోజు ఒకరు గదిని శుభ్రముచేయవలయును. నావంతు వచ్చిన దినమున, ఆపని చేయుటకు ఇష్టపడలేదు. మొహం కడుక్కోడానికి

బయటకు వచ్చినాను. ఆ సమయంలో విషయం తెలుసుకొనిన శ్రీ హల్దేకర్‌జీ చీపురుతో గదిని శుభ్రం చేయుచున్నారు. నేను వెళ్లి ప్రాధేయపడినాను. వారు ఎటువంటి అవకాశం యివ్వలేదు. ఈ సంఘటనతో నాలో యున్న అహంకారం కాస్త తుడిచిపెట్టుక పోయినది. అచ్చుటయున్న మిగతాకాలం వారి ముందు తిరుగుటకు న్యూన్యత పడేవాడిని. కాని వారు ఆప్యాయంగా పిలచి విషయములు చెప్పి చేయించెడివారు. ఏనాడు ఈ ప్రస్థావనరానివ్వలేదు.

వారి చివరి దినములలో మా గ్రామం దర్శించటం జరిగింది. వారు వచ్చు తేది ముందుగా తెలిసినందువలన ఎక్కువ సంఖ్యలో సంఘస్థాన్ నందు ఉండుటకు నిశ్చయించుకొనినారు. వయస్సు మీదపడినందున రహదారులు చక్కగా ఉన్నందున కారుపై వచ్చినారు. వారికి నేను పాదాభివందనం చేసాను. నన్ను పేరుపెట్టి పిలిచి నా భుజం తట్టారు. అప్పుడు నా ఆనందానికి అవధులు లేవు. వారికి జ్ఞాపకశక్తి ఎక్కువే. పాత స్వయంసేవకులందరిని రాజయ్య, గోపయ్య , లక్ష్మయ్య, నర్సయ్య, అని పిలుస్తూ ఉంటే అందరం ఆశ్చర్యపోయాం. గ్రామపెద్దలు శ్రీ వెంకటప్పయ్య, శ్రీనివాసరావు, దర్గయ్యగార్లను అడిగినారు.

పాత సంఘస్థాన్‌నందు (శివాలయం) సంఘశాఖ నడిచినది. ముందుగా తెచ్చుకున్న దుశ్శాలువను కప్పి మరల ఒకమారు పాదాభివందనం కావించి నాలోఉన్న భేషజం ఏమైనా ఉన్నట్లయితే చంపుకునినాను. ఈ సందర్భమున సంఘమిత్రులందరు ఒక పూలదండవలె కూర్చుండి ముడివద్ద వారిని కూర్చొనబెట్టగా మా గ్రామ సంఘ కార్యకర్తలు ఒక పూలదండవలె వారి మెడను అలంకరించినట్లుఅయింది.

మా గ్రామం వచ్చివెళ్ళిన కొంతకాలానికి దివంగతులయినారని తెలిసి బాధపడటమేకాక రెండు కన్నీటిచుక్కలు నా బుగ్గలు తాకినాయి. హిందూ సంఘటనా కార్యకర్తగాను బ్రహ్మచారిగాను సంఘ సంఘటన కార్యక్రమమునందు కొవ్వొత్తివలె వెలుగునిస్తూ, తన జీవితము సమర్పించుకొనినారు.

**– వడ్లమూడి రాఘవరావు,**

**బురదరాఘవపురం, ఖమ్మం జిల్లా**

# మరువలేని మహావ్యక్తి హల్దేకర్‌జీ

శ్రీ రాంభావు హల్దేకర్‌జీతో నా పరిచయం 60సం॥లు పూర్తిచేసుకున్నవి. 1957లో జరిగిన నాలుగు దక్షిణరాష్ట్రాల సంఘ్ శిక్షావర్గ్‌లో ఒక శిక్షార్థిగా వారిని కలిసాను. కాని వారు మాగణకు శిక్షక్‌గా రాలేదు. తదుపరి 1959లో మచిలీపట్నంలో జరిగిన శిక్షావర్గ్‌లో వారు మా గణకు శిక్షక్‌గా వచ్చారు. నేను నా స్వగ్రామం గుంటూరుజిల్లా బాపట్లనుండి 1960 మే 12నాడు భాగ్యనగర్‌లో శిక్షావర్గ్‌కు ప.పూ. శ్రీ గురూజీ బౌద్ధిక్ వినటానికి, వీలైతే ఉద్యోగం సంపాదించుకుని సాయంకళాశాలలో బి.ఎ. చదువుదామని వచ్చాను.

నా అదృష్టం ఏమోగాని అదేరోజు నాకు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు వారి ఆఫీసులో ఉద్యోగం దొరికింది. కాని అది నాలుగునెలలు మాత్రమే. పోలీసువారు నేను సంఘకార్యకర్తను అని గుంటూరుజిల్లానుండి వచ్చిన రిపోర్టుద్వారా తెలుసుకుని నన్ను ఉద్యోగంనుండి తొలగించారు. మొదట కొద్దిరోజులు బంధువుల ఇంట్లో ఉండి ఆ తర్వాత నా నివాసాన్ని అఫ్జల్‌గంజ్‌లో ఉన్న సంఘకార్యాలయానికి మార్చాను. అప్పటినుండి రాంభావుజీతో సాన్నిహిత్యం పెరిగింది. స్వర్గీయ శ్రీరామ్ సాఠేగారు మహానగర్ ప్రచారక్‌గా, మా హల్దేకర్‌జీ భాగ్యనగర్ జిల్లా ప్రచారక్‌గా ఉండేవారు. ఆ రోజుల్లో భాగ్యనగర్ విభాగ్‌లో భాగ్యనగర్, పాలమూరు, నల్గొండ, మెదక్, నిజామాబాద్‌లు ఉండేవి. సంఘకార్యాలయంలో నాలుగునెలలు ఉన్న తరువాత మరి ఇద్దరు కార్యకర్తలతో కలిసి కుత్బిగూడాలో దాదాపు నాలుగున్నర సంవత్సరాలు ఉన్నాను. నేను కొంతకాలం సుల్తాన్‌బజార్, గౌలిగూడాలో ఉన్న శాఖలకు మండల ప్రముఖ్‌గా ఉండేవాడిని. హిందీభాషతో పరిచయంలేని నాలాంటి వారితో హల్దేకర్‌జీ తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నించేవారు.

1962 ఉగాదినాడు నాగపూర్ రేషంబాగ్‌లో నిర్మింపబడుతున్న డాక్టర్జీ స్మృతిమందిర్ ఉద్ఘాటన జరపాలనీ నిర్ణయింపబడింది. అప్పుడు నేను అఫ్‌జుల్‌గంజ్ నుండి నారాయణగూడ చౌరస్తాదాకా ఉన్న శాఖలకు భాగ్‌ప్రముఖ్‌గా ఉండేవాడిని. నాశాఖ రాంకోటిలో మహారాష్ట్రమండల్‌లోని తిలక్ ప్రభాత్‌శాఖ. రాంభావ్‌జీ ప్రచారక్‌గా రాకపూర్వమే విద్యార్జనకోసం ఔరంగాబాద్ నుండి భాగ్యనగర్ వచ్చారు. అప్పుడు వారు సుల్తాన్‌బజార్‌లోని కందస్వామిబాగ్‌లో గల వారిబావగారింట్లో ఉంటూ చదువుకొనేవారు. అక్కడే శ్రీగణపత్‌రావుజీ బ్రహ్మపూర్‌కర్‌గారి ఇల్లుఉండేది. వారిరువురూ కూడా తిలక్

ప్రభాత్ శాఖకే వెళ్ళేవారు. అందువల్ల రాంభావ్‌జీ ఆ శాఖను తన మాతృశాఖ అనేవారు.

1962 జనవరిలో ఒకరోజు మాశాఖకు వచ్చారు. తనతోపాటు మరాఠీలో రచింపబడ్డ "పత్రరూపిడాకర్జీ" అనే పుస్తకాన్ని తెచ్చారు. డాక్టర్జీ వారి జీవితకాలంలో ఎంతోమందికి ప్రేరణదాయకంగా వ్రాసిన ఉత్తరాలను సేకరించి ముద్రించిన పుస్తకమది. ఆ పుస్తకాన్ని నాకిచ్చి దీనిలో కొన్ని ఉత్తరాలను గుర్తించినాను. ఈ సంవత్సరం ఉగాదికి నాగపూర్‌లో డాక్టర్జీ స్మృతిమందిర్ ఉద్ఘాటన సందర్భంగా జాగృతి ఒక ప్రత్యేకసంచికను విడుదల చేయబోతున్నది. దానిలో డాక్టర్జీ గురించి అనేకమంది ప్రముఖ కార్యకర్తలు వ్రాసిన వ్యాసాలు ఉంటాయి. దానిలో ఈ ఉత్తరాలను ముద్రించితే బాగుంటుందని నాకనిపిస్తుంది. అందువల్ల వీటిని 15రోజుల్లోగా తెలుగులో అనువాదం చేయమన్నారు. నాకు గుండె గుబేలుమంది. నేను భాగ్యనగర్‌కు వచ్చి 20నెలలు అయ్యింది. నాకు హిందీయేరాదు. ఇక మరాఠీభాషలో వ్రాసినవాటిని తెలుగులో వ్రాయటం ఎలా? వారి ముందు ఈ విషయం ప్రస్తావించాను. దానికి వారు నవ్వుతూ 20 నెలలుగా నీవు మరాఠీభాష మాతృభాషగాగల స్వయంసేవకుల శాఖలకే వెళ్తున్నావు కదా! వారితో ఎలా మెలుగుతున్నావు. నిన్నువారు అర్థం చేసుకొంటున్నారు. నీవు వారిని అర్థంచేసుకొంటున్నావు. వారికి తెలుగుమీద పట్టులేదు. కాని ఇంగ్లీషు, హిందీ, మరాఠీ అన్నీకలిపి నీతో మాట్లాడుతున్నారు. కనుక వారు ఆ ఉత్తరాలను చదివి వారికి తెలిసిన తెలుగు, ఇంగ్లీషు కలిపి నీకు చెపుతూ ఉంటారు. నీవు మంచి తెలుగులో వ్రాయి సరిపోతుంది. ఇక మొదలుపెట్టు అని చెప్పి ఆ పనికి నన్ను ప్రోత్సహించారు. నేను ఆ విధంగా వారు చెప్పిన ప్రకారం వ్రాసి జాగృతికి పంపాను. అది యథాతథంగా ముద్రింపబడింది. చాలామంది బాగున్నదని మెచ్చుకొన్నారు. ఆ విధంగా కార్యకర్తలను ప్రోత్సహించి వారిచే క్రొత్త క్రొత్త ప్రయోగాలు చేయిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం కలగచేసేవారు రాంభావుజీ.

ఆ అనుభవంతో హల్దేకర్‌జీ మరో పనికూడా నాతోచేయించారు. శ్రీ సమర్థరామదాసు గారి దాసబోధనుండి నిరంతరం పర్యటనచేసే కార్యకర్తలు క్రొత్త క్రొత్త పరిచయాలు ఎలా చేసుకోవాలి? కొత్తవారితో ఎలా మాట్లాడాలి? ఎవరియింట అయితే బస చేస్తారో అక్కడున్న వస్తువులను ఎలా వాడుకోవాలో, తన ప్రవర్తనద్వారా వాళ్ళను రాష్ట్ర కార్యసాధన కోసం తయారుచేయాలో తెలియచెప్పే మరాఠీ శ్లోకాలను నాచేత తెలుగులో అనువదింప చేయించారు. ప.పూ. శ్రీ గురూజీ తనకు, శ్రీ రాం సాఠేగారికి మరాఠీలో వ్రాసిన ఉత్తరాలను తెలుగులో అనువదింప చేయించి కొత్త కార్యకర్తలకు ముద్రించి ఇచ్చారు.

అసలు మనకార్యంకోసం ఎలాంటి కార్యకర్తలు కావాలంటే అసలు ఏమీ తెలియనివారే కావాలి అనేవారు మన జ్యేష్ఠకార్యకర్తలు. 1965లో సంఘవిస్తరణ యోజన నిర్ణయించబడింది. ప్రతికార్యకర్త కనీసం నెలరోజులు లేదా 15రోజులు విస్తారక్‌గా వెళ్ళాలి. ఆ విస్తరణ యోజనలో భాగంగా రాంభావుజీ ఒక కార్యకర్తల బైఠక్ వివేకవర్ధిని కన్యాశాలలో ఏర్పాటుచేశారు. ఆ బైఠక్‌కు మాన్యశ్రీ యాదవరావ్ జోషీజీ వచ్చారు. ఆ బైఠక్ అంతా పిచ్చాపాటీగా నవ్వుతూ, నవ్విస్తూ వారు తీసుకున్నారు. అందరం దాదాపు ప్రభుత్వ ఉద్యోగులం. 1962 దాకా ప్రభుత్వోద్యోగులు క్రియాశీలురుగా ఉండి పట్టుపడితే ఉద్యోగాలు పోయేవి. ఆ విధంగా నన్ను మూడుసార్లు వివిధ ప్రభుత్వశాఖలనుండి తొలగించి, ఉద్వాసన చెప్పారు. కాని 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో స్వయంసేవకులు మన సైన్యానికి అండగా నిలబడటం, వారికి రక్తం, మందులు, ఆహారం అందించటంలో చూపిన ధైర్యం, చొరవ చూసి నెహ్రూగారు సంఘంగూర్చి తన అభిప్రాయాన్ని మార్చుకున్నారు. అప్పుడే కర్ణాటక, అలహాబాదు హైకోర్టులు స్వయంసేవకులు దేశభక్తులేకాని దేశద్రోహులుకారు, వారిని ప్రభుత్వ ఉద్యోగాలనుండి తొలగించటం సరికాదు అని తీర్పుఇచ్చాయి. దాంతో బహిరంగంగా సంఘకార్యం చేయటంలో ఉన్నభీతిని స్వయంసేవకులు తొలగించుకున్నారు.

ఆ బైఠక్‌లో మా॥ శ్రీ యాదవరావుజీ ఎంతమంది విస్తారకులుగా రావటానికి సిద్ధంగా ఉన్నారని అడిగారు. చాలామంది చేయి ఎత్తారు. చేయి ఎత్తని ఒక కార్యకర్తను యాదవరావుజీ నిలుచోమన్నారు. ఎందుకు నీవు చేయి ఎత్తలేదు అని అడిగారు. దానికి సమాధానంగా ఆ కార్యకర్త నాకు విస్తారక్‌గా అనుభవం లేదు అన్నారు. దానికి యాదవరావుజీ అతనిని నీకు పెళ్ళి అయ్యిందా అని అడిగారు. దానికి ఆ కార్యకర్త నాకు పెళ్ళి అయ్యింది ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు అని సమాధానం ఇచ్చాడు. యాదవరావ్‌జీ నీకు పెళ్ళికాకముందు వైవాహిక జీవితంలో మంచి అనుభవం ఉన్నదని నీకు మీ మామగారు పిల్లనిచ్చారా? అని అడిగేసరికి అక్కడ ఉన్న వారందరు గొల్లున నవ్వారు. నీకు పూర్వానుభవంలేని కారణంగానే నీకు పిల్లనిచ్చారు. పూర్వానుభవం ఉంటే పిల్లను ఇచ్చేవారుకాదు కదా. ఎలాగైతే పూర్వానుభవం లేనివారికే పిల్లను ఇస్తారో అలాగే సంఘానికి పూర్వానుభవంలేని కార్యకర్తలే కావాలి. నేటి ప్రచారక్‌లు అందరూ పూర్వానుభవం లేకుండానే వచ్చారు. మన రాంభావు కూడా చదువుకుంటున్నవాడే చదువు వదిలేసి ప్రచారక్‌గా వచ్చాడు. అలాగే స్థిరబడ్డాడు. మీకు ఇబ్బందిలేదు. ఇప్పటికే వివాహితులు కాబట్టి ఒకనెలరోజులు మీరు విస్తారకులుగా వెళ్ళి ఒకటి, రెండు శాఖలు ప్రారంభించి

స్థానికులను శాఖను నిర్వహించేపాటి శిక్షణిచ్చి రాగలరు అని అన్నారు. దాదాపు ఆ సమావేశంలో ఉన్నవాళ్ళంతా నెలరోజులకు తగ్గకుండా విస్తారకులుగా వెళ్ళారు. ఆ బైఠక్‌తో రాంభావుజీ విభాగ్‌లో చాలా క్రొత్తశాఖలు పెరిగాయి.

2005లో చిత్రకూట్‌లో జరిగిన అఖలభారత కార్యకారిణి సమావేశంలో తీసుకొన్న నిర్ణయానుసారం 75 సంవత్సరాలు పైబడిన కార్యకర్తలకు బాధ్యతలనుండి తప్పించి వారి శారీరక, మానసిక ఆరోగ్యాలను బట్టి వారికి వారే తమకు అనువైన పద్ధతిలో సంఘకార్యం చేయవచ్చని సూచించటం జరిగింది. అప్పుడే శ్రీ నానాజీ దేశ్‌ముఖ్, శ్రీరాంసింగ్, డాక్టర్జీచే నియమింపబడిన బీహారు సంఘచాలక్ శ్రీ బబువాజీఅని పిలువబడే కుంవర్ ప్రసన్న నారాయణ కృష్ణవల్లభసింగ్ గారిని బాధ్యతలనుండి తప్పించారు.

ఆ నిర్ణయానికి అనుగుణంగానే శ్రీ రాంభావుజీ క్షేత్రస్థాయి బాధ్యతలనుండి విముక్తులు కావటం జరిగింది. కాని వారు బాధ్యత కాని సంఘపనులు చేయవచ్చని తనకు తానుగా ఒక కార్యప్రణాళికను తయారుచేసుకున్నారు. తదనుగుణంగా డాక్టర్జీ జీవితవిశేషాలతో గతంలోనే కొన్నిపుస్తకాలు ఉదా: డాక్టర్జీ జీవితచరిత్ర, స్మృతికణాలు లాంటివి ముద్రించబడ్డా, డాక్టర్జీ సమయంలో స్వయంసేవకై ప్రచారక్‌గా పనిచేసిన శ్రీగోపాల్ నీలకంఠ్ దాండేకర్ అనే ప్రముఖ రచయిత "వాదళాతీల్ దీపస్తంభ" అనే పేరుతో వ్రాసిన నవలను తెలుగులోకి అనువాదం చేయాలనుకొన్నారు. ఆ రోజుల్లో నేను కొన్నినెలలపాటు కార్యాలయంలోనే ఉండటం జరిగింది. అప్పుడు వారు నాతో ఈ ప్రస్తావనచేశారు. నేను ప్రతిరోజు ఒక 10 లేక 15 పేజీలునాకు తెలిసిన తెలుగులో చెప్తాను నీవు వాటిని సరియైన తెలుగులో వ్రాస్తావా. నీకు దీనిలో అభ్యాసం ఉందికదా అన్నారు. నేను సరే అన్నాను. రోజూఉదయం అల్పాహారం కాగానే ఉదయం 9గం॥ల నుండి 11గం॥ల వరకు మరియు మధ్యాహ్నం 3గం॥ల నుండి సాయంత్రం 5గం॥ల దాకా ఈ అనువాద ప్రక్రియసాగింది.

నేను 1968లో శ్రీ సోమయాజులు నాగేశ్వరరావు, శ్రీ పట్లోళ్ళ రామిరెడ్డి, శ్రీ బంగారు లక్ష్మణ్, శ్రీ భీష్మాచార్య, శ్రీదయానంద మొదలగువారితో కలిసి నాగపూర్ తృతీయవర్ష శిక్షావర్గకు శిక్షార్థిగా వెళ్ళాను. ఆ శిక్షావర్గకు శ్రీ రాంభావుజీ విభాగ్ ప్రచారక్‌గా ఉంటూ ఖడ్గశిక్షక్‌గా వచ్చారు.

1968 నుండి 2001 దాకా భారతీయ మజ్దూర్‌సంఘ్‌లో పనిచేసిన సమయంలో నేను తరచూ ముంబై మరియి మహారాష్ట్రలోని ఇతర నగరాలలో రోజులతరబడి ఉండటం

కారణంగా నాకు మరాఠీభాషలో కొంతఅర్థం చేసుకోగల స్థాయి వచ్చింది. అందువల్ల వారు విశ్రాంతి తీసుకొంటున్నప్పుడు నేను ఆ నవల పేరాలువారీగా చదివి స్వయంగా అనువాదం చేసేవాడిని. దానిని విని శ్రీ రాంభావుజీ బాగానే వ్రాస్తున్నావే అనిమెచ్చుకొనేవారు. కాని, తెలుగు అనువాదంలో మరాఠీకి సరియైన పదం పడితేగాని వారు ముందుకు వెళ్ళేవారు కారు. వారికి తెలుగు తెలియదనుకోవటం పొరపాటు. ఏ మరాఠీ శబ్దానికి ఏ తెలుగుపదం సరిగ్గా సరిపోతుందో ఆ పదం దొరికేవరకు పర్యాయపదాలు మనతో చెప్పించుకొని ఆ ఇది సరియైన పదమని ఇదేరచయిత మనసును సరిగ్గా ఆవిష్కరిస్తుందనేవారు. ఆవిధంగా సుమారు మూడునెలలపాటు ఈ అనువాదయజ్ఞం వారు చేశారు.

ఈ అనువాదం ఒక ఎత్తు అయితే దానిని స్వయంసేవకులకు అందించే ప్రయత్నం ఒక చరిత్ర సృషించింది. ప్రతివారం రెండురోజులపాటు వారు పర్యటన చేసేవారు. ఇది కార్యాలయం ద్వారా నిర్ణయింపబడే పర్యటనకాదు. వారే జిల్లాలవారీగా కొన్ని ప్రదేశాలను ఎంపికచేసుకొని అక్కడి పాత కార్యకర్తలతో ఫోన్‌ద్వారా మాట్లాడి కార్యక్రమాన్ని నిర్ణయించుకొనేవారు. వారి బైఠకులకు ప్రస్తుతం శాఖాబాధ్యతలులేని వాళ్ళను ఎంపికచేసుకొని తాను ఫలానారోజున ఆ ఊరు వస్తానని ఆరోజు ఆ ఊరిలోనూ, ప్రక్కన దగ్గరగా ఉన్న గ్రామాలలోను తనను గుర్తుపట్టగల పాత స్వయంసేవకుల సమావేశం ఏర్పాటుచేయవలసిందిగా కోరేవారు. తెలంగాణా ప్రాంతంలో అనేక చిన్నపట్టణాలు, గ్రామాలలో వారితో పరిచయం గలవారు అనేకులు ఉండేవారు. వారందరూ హల్దేకర్‌జీ మనలను కలవటానికి వస్తున్నారని తెలియగానే ఉత్సాహంగా ఆ సమావేశాలకు వచ్చేవారు. పరిచయాలు, కుశల ప్రశ్నలు అయిన తరువాత ఈ పుస్తకం గురించి ప్రస్తావించేవారు. ఒక విఖ్యాత నవలా రచయిత డాక్టర్జీ వ్యక్తిత్వాన్ని చక్కగా వివరిస్తూ వ్రాశారని అందరూ దీనిని చదవాలని, దానివల్ల మనలో ఒక నూతన ఉత్సాహం జనిస్తుందని, దానికి సుమారు ప్రింటింగ్‌ఖర్చు పుస్తకానికి 80 నుండి 100రూ॥లు దాకా అవుతుందని కాని అందరికి అందుబాటులో ఉంచేందుకు ప్రచురణ పూర్వవిరాళంగా పుస్తకానికి 50రూ॥ ఇస్తే 2010 ఫిబ్రవరిలో జరిగే సర్‌సంఘ్‌చాలక్‌గారి కార్యక్రమంలో విడుదల చేస్తామని చెప్పేవారు. అలావారు ఒకవైపు అనువాదం ఆగకుండా, రెండోవైపు తన్నిమిత్తంగా పర్యటనలు చేస్తూ పూర్వకార్యకర్తలను కలుస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపుతూ ఉండేవారు. ఇది మన ప్రాంతంలో సంఘపుస్తక ప్రచురణలో ఒక నూతన అధ్యాయం.

ఎన్నిపుస్తకాలు ముద్రిద్దాం అని నన్ను అడిగారు. ఇంతకు పూర్వ ఏ పుస్తకం కూడా వెయ్యి, రెండువేల కాపీలకంటే ఎక్కువ ముద్రించేవారు కాదు. ఒక్కోసారి అమ్ముడుపోక సాహిత్యనికేతన్‌లో మూలుగుతూ ఉండేవి. అది దృష్టిలో పెట్టుకుని వారిపర్యటనలను చూసి నేను ప్రథమముద్రణ క్రింద 5000ల కాపీలను వేద్దామని మహతి ప్రింటర్స్ శ్రీరామమూర్తిని సంప్రదించాం. 5000ల కాపీలయితే కాపీ ఒకటి 75రూ॥అవుతుందని చెప్పారు. శ్రీరాంభావూజీ వారిని మనం ఎన్నికాపీలువేస్తే 50రూ॥లకు యివ్వగలుగుతాం అని ప్రశ్నించారు. 10,000ల కాపీలువేస్తే మనం 50రూ॥లకు అమ్మవచ్చు అన్నాడాయన. అయితే 10,000ల కాపీలు ముద్రించండి అన్నారు. నేను, శ్రీరాంభావూజీ మీరు మరీ ఎక్కువ అంచనావేస్తున్నారేమో ! ఆలోచించండి అన్నాను. వారు కాదు నాకు ఇప్పటికే ఎనిమిదివేల కాపీలకు ఆర్డర్లు, అయిదువేల కాపీలకు నగదు అందింది అన్నారు.

ఆ పర్యటనలో భాగంగా ఒకరోజు తిరుపతి కార్యక్రమం ఏర్పాటుచేసుకున్నారు. అదేరోజు నేను నా కుటుంబంతో స్వామివారి దర్శనం నిమిత్తం తిరుపతి వస్తున్నామని చెప్పాను. అయితే ఆ రోజు శాఖకురా అని, నేను ఉండేచోటుకు ఒక కార్యకర్తను పంపారు. ఆరోజు వారు శాఖానంతరం బైఠక్‌తీసుకున్న విధానం నాకు ఆశ్చర్యం కలిగించింది. దానిలో సంఘంలో ప్రతిసారి పరిచయం ఎందుకు చేసుకుంటారు అంటూ తను సంఘంలో చేరినరోజున ఎంతమంది విడివిడిగా తనను పరిచయం చేసుకోమని కోరింది, దానిప్రభావంచెప్పి, మన పరిచయం అనేది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ఆ బైఠక్‌లో పుస్తకం గురించి చెప్పిన తరువాత అక్కడే ఒక వెయ్యికాపీలకు ఆర్డరు ఇవ్వబడింది. అలాంటి కార్యక్రమాలవల్ల అనేకమంది పాత కార్యకర్తలలో ఉత్సాహం నింపేపని డాక్టర్జీ జీవితాన్ని పరిచయం చేసేపని జరిగింది. చివరకు ఆ పుస్తకం 15,000 కాపీలు ముద్రించబడ్డాయి.

అదే రీతిలో “ఓం రాష్ట్రాయస్వాహా” అనే పేరుతో పరమ పూజ్య శ్రీ గురూజీ జీవితంలోని ఘట్టాలను శ్రీమతి మృణాళినీ జోషి మరాఠీ భాషలో రచించిన పుస్తకాన్ని, శ్రీ డా॥ శరద్ హెబాళ్కర్, శ్రీ బాలాసాహెబ్ జీవితంపై “సంఘహీచ జీవనగాథా” అనే మరాఠీ రచనను సంఘమే తానై ... తానే సంఘమై జీవించిన శ్రీ బాలాసాహెబ్ దేవరస్ పేరిట తెలుగులో అనువదించారు. ఈ రెండింటి అనువాదంలో ఆనాటి జాగృతి ఉపసంపాదకులు శ్రీ బెల్లంకొండ మల్లారెడ్డిగారు శ్రీరాంభావూ హల్దేకర్‌జీకి సహకరించారు. ఈ రెండు పుస్తకాలు కూడా బహుళ ప్రాచుర్యం పొందాయి.

## అద్భుతమైన జ్ఞాపకశక్తి :

మన మొదటితరం ప్రచారకులలో మాననీయ ఏకనాథ్ రానడేగారి జ్ఞాపకశక్తిగురించి అందరూ చెపుతుండేవారు. 1958లో చీరాల దగ్గరున్న ఓడరేవులో ప్రాంతకార్యకర్తల సమావేశంలో మొదటిరోజు అందరి పరిచయం జరిగింది. తరువాత ఆరురోజులు వారు ప్రతికార్యకర్తను పేరుపెట్టి పిలిచి మాట్లాడేవారు. అలాంటివారే శ్రీరాంభావూజీ కూడా. వందలకొద్ది గ్రామాలలో అనేక ఇళ్ళలో ఉన్న సంఘకార్యకర్తలను వాళ్ళ కుటుంబసభ్యుల పేర్లు వారికి కరతలామలకం. ఒకసారి వారికి జబ్బుచేసింది. దానికి మందుల కారణమో, మరి ఏ ఇతర కారణమోగాని వారి జ్ఞాపకశక్తి పూర్తిగాపోయింది. వారి సహకార్యకర్తలను కూడా వారు గుర్తించలేకపోయారు. కలవటానికి వచ్చిన ప్రతివారిని నీపేరేమి? ఏ ఊరు? ఇక్కడకు ఎందుకు వచ్చారు? అని అడిగేవారు. నేను ఆరోజుల్లో కార్యాలయానికివెళ్తే ఇలాగే అడిగేసరికి నాకు కళ్ళలో నీళ్ళువచ్చాయి. ఈ రోజు భాషలో కంప్యూటర్‌లోని మెమరీ ఎరేజ్ అయినట్టు. తరువాత పెద్దల సూచనమేరకు బెంగుళూరులో యోగా అనుసంధాన కేంద్రంలో మూడునెలలు ధ్యానం, ప్రశాంతతవల్ల వారికి పోయిన జ్ఞాపకశక్తి మొత్తం పునర్జీవితం అవటం అందరిని ఆశ్చర్యపరచింది.

ఆరోజు నేను వారితో కార్యాలయంలో వారిగదిలో ఉన్నపుడు ఇద్దరు మహిళలు వచ్చారు. వారిలో ఒకరిని పేరుపెట్టి పలకరించారు. ఏ సందర్భంగా వచ్చారంటే తనతో వచ్చిన ఆమె వివాహమని, శుభలేఖ ఇద్దామని చెప్పారు. వాళ్ళు మహబూబ్‌నగర్ జిల్లా నుండి వచ్చారు. ఈమె తల్లితండ్రులు మాఇంటిప్రక్కనే ఉంటారని ఒక్కసారి మీ ప్రవాసంలో వారింట్లోనే మీరు ఉన్నారని ఆమె చెప్పగానే, హల్దేకర్‌జీ నీవు ఫలానా అమ్మాయివా! నీపేరు ఇది కదా! అని వారింటిలోని వారి అందరిగురించి అడిగారు.

2005ఫిబ్రవరిలో శ్రీరాంభావూజీ తమ్ముడు ఎన్.టి.ఆర్ స్టేడియంలో జరిగిన సర్ సంఘ్‌చాలక్‌గారి కార్యక్రమానికివచ్చి రెండురోజుల తర్వాత బర్కత్‌పురా ప్రాంతంలో నడుస్తూ హఠాత్తుగా గుండెపోటువచ్చి రోడ్డుమీదే మరణించారు. వారి పార్థివదేహాన్ని తీసుకొని శ్రీరాంభావూజీ హల్దాగ్రామానికి వెళ్ళారు. వాళ్ళ పూర్వీకులు కట్టిన ఇంట్లో కర్మకాండలు జరిగాయి. ఆ కార్యక్రమానికి కీ॥శే॥ శ్రీ భండారు సదాశివరావుగారు, శ్రీ వడ్లమూడి రామ్‌మోహనరావుగారు, నేను వెళ్ళాము. హల్దేకర్‌జీ కుటుంబం చాలాపెద్దది. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు వారికి ఆరుగురుదాకా సోదరీ, సోదరులు ఉన్నారు. వారందరికి మనుమలు, మనవరాళ్ళు ఉన్నారు. భోజనాలు అయిన తరువాత అక్కడ

చేరిన పిల్లలు, పెద్దలందరిని పేరుపేరునా పరిచయం చేసారు. కేవలం పేరుచెప్పటమే కాకుండా వారు ఏమిచేస్తుంటారు, ఎవరెవరికి సంఘబాధ్యతలు ఉన్నాయి అని తడుముకోకుండా చెప్పారు. వారి జ్ఞాపకశక్తికి జోహార్లు.

2010 సం॥రంలో హల్దేకర్‌జీ పరివారంలోని చిన్నవారు శ్రీరాంభావూజీకి సహస్రచంద్ర దర్శనం కార్యక్రమం చెయ్యాలని ఆలోచించారు. దానికి శ్రీరాంభావూజీ సరేనని ఆ కార్యక్రమం తనకొరకేకాక తనలాగా 80సం॥లు పూర్తిచేసిన మా॥ సుదర్శన్ జీ, మా॥ మా.గో. వైద్యగారికి ఆనాటి ప్రముఖ సంచాలిక ప్రమీలామేఢే గారికి మరికొందరికి ఆ కార్యక్రమం సామూహికంగా జరిగేలా చూశారు.

ఇలా రాసుకుంటూపోతే ఎన్నో జ్ఞాపకాలు తరుముకుంటూ వస్తాయి. ఎవరైనా వారిని పరామర్శ చేద్దామని వారిగదిలోకి వెళితే ముందుగా పేరుపెట్టిపలకరించి, వారియొక్క వారికుటుంబసభ్యులయొక్క ఆరోగ్యాన్ని గురించి అడిగేవారు. వారిని కలవటానికి వచ్చేవారిలో చాలామంది మిఠాయిపొట్లాలు, బాదం, జీడిపప్పు, కిస్‌మిస్ లాంటివి ఇస్తుండేవారు. అవన్నీకూడా వచ్చేవారికి ప్రసాదంగా ఇస్తుండేవారు. తనకంటూ ఏమీవుంచుకునేవారుకాదు. ఏనాడూ తన అనారోగ్యంగురించి చెప్పేవారుకాదు. కొద్దిగా అలసటగా ఉంది అని అనేవారు. శరీరం సహకరించినన్నాళ్ళు నిత్యం మేడపైనుండే శాఖనుచూస్తూ ధ్వజప్రణామ్, ప్రార్థన చేసేవారు. 1982లో నాకు మలేరియా వచ్చినప్పుడు, నా శ్రీమతికి ఆరోగ్యం బాగాలేనప్పుడు మమ్మల్ని పలకరించటానికి స్వయంగా మాఇంటికి వచ్చారు. వారు ఋషి పరంపరకు చెందినవారు. అలాంటి వ్యక్తులవల్లనే సంఘ గంగా నిరంతరం వేగం పుంజుకుంటూ లక్ష్యంవైపుకు పరుగులెత్తుతున్నది. అలాంటివారి మార్గదర్శనంలో నడిచిన నాలాంటి చిన్నకార్యకర్తలు తమ జీవితాలను సార్థకం చేసుకుంటున్నారు. వారి సంస్మరణే మనకు నిత్యప్రేరణ దాయకం.

**– స్థానం భావనారాయణ, భాగ్యనగర్**

# మా॥ హల్దేకర్‌జీతో నా అనుబంధము

**19**57లో ఉస్మానియా మెడికల్ కాలేజీలో చేరాను. అప్పుడు ఐదు సంవత్సరాల కోర్సులో మొదటిరెండు సంవత్సరాలు ఉస్మానియా యూనివర్శిటి క్యాంపస్‌లోనే ఉండేది. అచ్చటి హాస్టల్‌లోనే చేరాను. 1956 ఇంటర్‌మీడియట్‌లోనే ప్రథమవర్ష సంఘశిక్షణ పొందాను. క్యాంపస్‌లో సంఘశాఖలు లేవు. నాకు సంఘశిక్షణ ఐనా, శాఖ ఎలా నిర్వహించాలో తెలియదు. అప్పుడప్పుడు హాస్టల్‌లో మేముపడుకునే మంచాల దోమతెరల కర్రలతో క్రమికా 1,2,3 అంటూ కొన్ని విన్యాసాలు చేసేవాడిని. మా మిత్రులు వింతగా చూసేవారు.

మొత్తం క్యాంపస్‌లో నాతోబాటు ఇంకొక స్వయంసేవక్ శ్రీ సర్వేపల్లి శేషగిరిరావుగారు ఎమ్.ఏ. విద్యార్థిగా హాస్టల్స్‌లోనే ఉండేవాడు.(వీరు విద్యార్థి పరిషత్‌లో పనిచేసి ప్రస్తుతము బి.జె.పి. లో ప్రముఖ కార్యకర్త).మాననీయ హల్దేకర్‌జీ అప్పుడప్పుడు యూనివర్శిటీ క్యాంపస్‌కు వచ్చి మా ఇద్దరిని లాండ్‌స్కేప్ గార్డెన్‌లో కూచోబెట్టుకొని పరామర్శిస్తుండేవారు. నేనున్న ఆరెండు సంవత్సరములు ప్రత్యేకముగా వచ్చి 3,4 సార్లు వారు కలువటముతో నాలో సంఘ అంకురము కాపాడబడింది. ఆ సమయములో వారు నన్ను కలువకపోతే 'మెడిసిన్' ప్రవాహములో కొట్టుకుపోయేవాడిని కావచ్చును.

3వ సంవత్సరము మామూలుగా సిటిలో నారాయణగూడలో ఒకచిన్న ఇల్లు కిరాయి తీసుకొని మా అన్నదమ్ములతో ఉన్నాను. ఓరోజు కీ॥శే॥ గణపత్‌రావ్‌జీ బ్రహ్మపూర్కర్ ప్రభాతశాఖ పిదప, ఖాకీ నిక్కర్‌తో మా యింటికివచ్చి 'డాక్టర్‌గారున్నారా?' అని అడిగారు. సమీప కేశవమెమోరియల్ పాఠశాలలో శాఖ నడుస్తున్నదని చెప్పారు. మళ్ళీ సహజంగా శాఖకు వెళ్ళడము ప్రారంభమైంది.

సంఘశాఖలకు అనివార్య కారణాలవల్ల దూరంగా ఉండేవారిని పైవిధంగా సంపర్కములో పెట్టుకుంటే, మళ్ళీ సహజంగానే వారు సంఘశాఖలకు వస్తారు. లేనిచో దూరమయ్యే ప్రమాదముంటుంది. అట్టి ప్రమాదము తప్పించారు, మా॥ హల్దేకర్ జీ.

1961లో మెడిసిన్ చదువుతూ, ద్వితీయవర్ష సంఘశిక్షావర్గ పూర్తిచేసుకొని, భాగ్యనగరము చిక్కడపల్లిలో సాయంశాఖ ముఖ్యశిక్షక్‌గా పనిచేస్తున్న రోజులు. అప్పుడు మా విభాగ ప్రచారక్ మాననీయ హల్దేకర్‌జీ. ఈ విభాగ్‌లో భాగ్యనగర్‌తోపాటు నల్లగొండ,

పాలమూరు, మెదక్ మరియు ఇందూరు జిల్లాలుండేవి.

1963లో మెడిసిన్‌తోపాటు తృతీయవర్ష సంఘశిక్షావర్గ పిదప, హౌస్ సర్జన్సీ పూర్తిచేసి, భాగ్యనగర్‌లోనే ప్రచారక్‌గా పనిచేసాను. ఇంటర్‌నుండి మెడిసిన్ పూర్తిచేసి ఇచ్చటనే ప్రచారక్‌గా పనిచేయుటతో నాకు ఏ క్రొత్తదనమూ కనపడలేదు. కేవలం పూర్తిసమయం సంఘకార్యం చేయుటకై దొరికిన అవకాశం తప్ప. అప్పటి మా నగర ప్రచారక్ మాననీయ సాఠేజీ, విభాగ్ ప్రచారక్ మా॥ హల్దేకర్‌జీ మరియు ప్రాంత ప్రచారక్ మాననీయ సోమయ్యగారు మార్గదర్శనము చక్కగా లభించేది.

కొంతకాలము పిదప మా ॥ హల్దేకర్‌జీ, వరంగల్ విభాగ్‌కు మార్చబడ్డారు. వరంగల్ విభాగ్‌లో వరంగల్, కరినగర్, ఖమ్మం మరియు ఆదిలాబాద్ జిల్లాలుండేవి. ఆ రోజుల్లో గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు రవాణా సౌకర్యాలు లేవు. మా హల్దేకర్‌జీ వరంగల్ జిల్లాలో సుమారు అన్ని గ్రామాలకు ఎడ్లబండిలోనే పర్యటన చేశారు. ప్రముఖ గ్రామాలన్నింటిలో సంఘశాఖలు ప్రారంభమైనవి. ఇప్పటి జ్యేష్ఠ స్వయంసేవకులంతా అప్పటి ఆ శాఖలకు వచ్చినవారే.

నేను మా గ్రామము చిట్యాలకు 1973లో వెళ్ళిన పిదప వరంగల్ గ్రామీణ జిల్లాకు సంఘచాలక్‌గా బాధ్యత అప్పగించబడింది. ప్రాంత ప్రచారక్‌గా మా॥ హల్దేకర్‌జీ మార్గదర్శనము చక్కగా లభించేది.

చిట్యాల గ్రామకేంద్రంగా పలుసేవా కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. ఈ క్రమములోనే ఈ కార్యక్రమాలన్నింటికి ఆధారమయ్యే ఒక సేవాభవనమును మా గ్రామ సేవాబస్తీ 'రాంనగర్'లో గ్రామస్థులు శ్రమసేవతో 1997లో నిర్మించుకున్నాము. ఆ సంవత్సరము వానలు సరిగా కురియలేదు. వరంగల్ జిల్లాలో కరువు పరిస్థితి ఏర్పడింది. మా ఊరిప్రక్కనే పారే జీవనది చలివాగులో వర్షాకాలములో కూడా ధార కనపడలేదు. మామూలుగా వర్షాకాలములో ఒక్కొసారి వారమురోజులు కూడా దాటనివ్వని పరిస్థితులో వాగు ఉధృతంగా ఉంటుంది.

ఆ సంవత్సరం కరువు పరిస్థితిలో యువకులంతా బ్రతుకుతెరవుకై దూరప్రాంతాలకు పోసాగారు. వయస్సు మళ్లిన పెద్దలు ఊళ్ళో ఉండిపోయారు.

ఓ రోజు నేను, మా॥ హల్దేకర్జీ, ప్రాంత ప్రచారకులు శ్రీ మా॥ రామచంద్రయ్యగారు కారులో ప్రయాణిస్తున్నాము. మా ఊరి పరిసరాల పరిస్థితిని మా॥ హల్దేకర్‌జీకి చెప్పాను.

వారు వెంటనే స్పందించి శ్రీ రామచంద్రయ్యగారితో జనసంక్షేమ నిధినుండి రు50,000 ఇప్పించవలసినదిగా ఆదేశించారు.

మా గ్రామము చుట్టూరా ఉన్న 5 గ్రామాలలో 70సం॥లుపైబడిన వారి జాబితా 500మందిది తయారుచేసి, సేవాకేంద్ర భవన ఉద్ఘాటన రోజున ఒక్కొక్కరికి 10కిలోల బియ్యము, నూతన వస్త్రములు, స్థానికపెద్దలచే వితరణచేయించాము.

సేవాకేంద్ర భవన ఉద్ఘాటన రోజుననే ఈ పంపిణీ జరగటము గ్రామస్థులకు ఒక చక్కటి సందేశమిచ్చింది.

మా॥ హల్దేకర్‌జీ సమయోచితంగా, తక్షణమే తీసుకున్న నిర్ణయము కార్యకర్తలకు ఉత్సాహమిచ్చింది. 1980 పిదప జిల్లాలో నక్సలైట్ల విధ్వంస కార్యక్రమాలు పెరుగుతూ పలుచోట్ల భవనాలుకూల్చటము, ప్రముఖులను హత్యచేయటంతో అందరినీ భయభ్రాంతులకు గురిచేసారు. 1998లో అనేక సేవా కార్యక్రమాలకు నిలయమైన మా సేవాకేంద్ర భవనాన్ని కూడా పేల్చివేశారు. అప్పుడు క్షేత్ర ప్రచారక్‌గా మా॥ హల్దేకర్‌జీ ఉన్నారు. నన్ను భాగ్యనగర్‌కు పిలిపించుకొని, నేను మళ్ళీ మాగ్రామానికి వెళ్ళకూడదని, ఇచ్చటనే ఉంటూ పనిచేయాలని ఆదేశించారు. కర్నూలులోని గోకవరం హాస్పిటల్‌లో వైద్యునిగా లేక అప్పుడే ప్రారంభించబోతున్న 'సంజీవనీ' సంచారవైద్యశాలలో వైద్యునిగా, లేక మరియే స్థానిక నర్సింగ్‌హోమ్‌లోనైనా వైద్యునిగా పనిచేయమన్నారు. నేను చలచికిత్సాలయముతో పనిచేయుటకు సమ్మతి తెలిపాను.

భాగ్యనగరములో 'సంజీవని' సంచార వైద్యశాల పనిగూర్చిన వివరాలు మనకు తెలుసు. మా॥ హల్దేకర్‌జీ 'సంజీవని' ఉద్ఘాటన కార్యక్రమములో పాల్గొనటమేగాక, ఆరోగ్యకార్యకర్తల ప్రశిక్షణా వర్గలకు వచ్చి మార్గదర్శనం చేసేవారు. సమయ సమయాలలో ప్రకల్పము గూర్చి తెలుసుకొని ప్రోత్సహిస్తుండేవారు.

1999లో ఒరిస్సాలో భయంకరమైన తుఫాను వచ్చింది. దేశమంతటి నుండి సంఘద్వారా సహాయ సహకారములందించబడినాయి. మా॥ హల్దేకర్‌జీ కార్యక్షేత్రంలో నాటి ఒరిస్సా కూడా ఉండింది. వారి ఆదేశానుసారము 10మంది డాక్టరులు, 10మంది కార్యకర్తల బృందంతో 'సంజీవని' వాహనము తీసుకొని 10రోజులు ఒరిస్సాలోని సముద్రతీర ప్రాంతములోని గ్రామాలకు సేవలందించాము.

ఒకసారి నెల్లూరులోని "జైభారత్ హాస్పిటల్" వైద్యబృందానికి ఇచ్చటి చలచికిత్సాలయం

ద్వారా జరుగుతున్న పని గూర్చి వివరించమని పంపించారు.

జీవిత చివరి దశలో ప్రాంతకార్యాలయానికే పరిమితమై గడిపారు. ఎప్పుడు వారి గదికి వెళ్ళి కలిసినా తమ బాధలు చెప్పుకొనేవారుకాదు. నేను వారి సాహచర్యములో గమనించినది ఏమిటంటే వారు ఏనాడూ ఎవరిగూర్చిగాని, ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. వారి జ్ఞాపకశక్తి అమోఘము. అనేకమంది పాతకార్యకర్తలను పేరుపేరున పలకరించేవారు.

సంఘపనిలో నన్ను తీర్చిదిద్దిన మాననీయ సాఠేజీ, మాననీయ హల్దేకర్‌జీ, మాననీయ సోమయ్యగారు ఇప్పుడు లేరు. కాని ఈరోజు నేను చేస్తున్న సంఘపనిని వీరంతా నా వెంటనే ఉంటూ నాచేయిపట్టి నడిపిస్తున్నారనిపిస్తున్నది.

**- డా॥ బీరవోలు సురేంద్రరెడ్డి,**
**ఆరోగ్యభారతి జాతీయ కార్యకారిణి సభ్యులు**
**9246200360**

# స్వర్గీయ రాంభావు జీ హల్దేకర్

**అ**ది 1961సం॥ పి.యు.సి. విద్య పూర్తిచేసి తరువాత చదువు ఏది, ఎలా కొనసాగించాలి అని ఆలోచిస్తూ ఇంటివద్ద మిత్రులు, శ్రేయోభిలాషులతో సంప్రదిస్తున్న రోజులు. ఆమధ్యనే మిత్రులతో కలిసి స్థానిక హనుమాన్ మందిరంలో సుహృత్‌గోష్ఠి అన్న చిన్న భజన సంఘం మొదలుపెట్టాం. ప్రతిశనివారం ఒక గంట, గంటన్నర నామసంకీర్తన, భక్తిగీతాలు, చిన్నచిన్న ఉపన్యాసాలు సాగుతుండేవి. ఒకరోజు ఎవరో అపరిచిత వ్యక్తి వచ్చి మాతో పాల్గొన్నారు. వారి కంఠధ్వని ఆకర్షణీయంగా ఉంది. చాలా చలాకీగాఉంటూ పాటలు పాడటం, ఆ తరువాత అప్పుడప్పుడు వచ్చివెళుతుండేవారు.

**పాలమూరు పాలిటెక్నిక్ కళాశాల :**

కొన్నాళ్ళు గడిచిన తరువాత నేను పాలమూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో చేరాలని నిర్ణయమైంది. కళాశాలకు సమీపంలోనే ఒక చిన్న గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాను. ఒకనాటి సాయంత్రం మాఊళ్ళో భజన పాటలు పాడినవ్యక్తి, మా కళాశాలలో నా సహాధ్యాయుడిని తీసుకుని గదికి వచ్చాడు. ఆ విశిష్ట వ్యక్తి నా సహాధ్యాయుడికి నన్ను పరిచయం చేస్తూ ఇతడు మంచి విద్యార్థి, చక్కగా పాటలుకూడా పాడతాడు. రోజు ఉదయం

నీతోపాటు శాఖకు తీసుకెళ్ళమని చెప్పాడు.

## శాఖలో ఓనామాలు :

మరునాటినుండి ఆ సహాధ్యాయి తెల్లవారు జామున నాగదికి రావటం, పాతపట్నంలో జరిగే శాఖకు తీసుకెళ్ళటం ప్రారంభమయింది. ఆ క్రమంలో మా మిత్రుడు ఆ విశిష్ట వ్యక్తిని గురించి చెప్పాడు. వారి పేరు పి.సి. రమణయ్యగారు. వారు ఆర్.ఎస్. ఎస్. అనే హిందూ సంస్థకు జిల్లా ప్రచారక్ అని, జిల్లాఅంతటా తిరుగుతూ సంఘపని చేస్తారని చెప్పాడు. ఉదయం జరిగే శాఖ కార్యక్రమాలు ఆ సంస్థవే అని కూడా చెప్పారు. కొన్నాళ్ళకు నాగది దగ్గరలోని మరో శాఖకు వెళ్ళటం మొదలు పెట్టాను. ఒకరోజు ఆ శాఖకు శ్రీ రమణయ్యగారు వచ్చి, వచ్చేఆదివారం మన శాఖకు మరో పెద్దవారు రాబోతున్నారని, వారి ప్రసంగం చాలా చక్కగా ఉంటుందని, మిత్రులందరిని తీసుకుని మీరు శాఖకు రావాలని చెప్పారు.

## హల్దేకర్‌జీ ప్రథమ దర్శనం :

మరునాడు మేమంతా 10,15 మిత్రులను వెంటపెట్టుకుని శాఖలో పాల్గొన్నాము. శాఖ ప్రారంభసమయానికి ఆ పెద్దవారు వచ్చారు. జిల్లాప్రచారక్ శ్రీ రమణయ్యగారు వారిని మాకు పరిచయం చేస్తూ, వారు తమ స్వంత గ్రామం మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌జిల్లా అజంతాగుహల పరిసరాలలో ఉన్న "హల్దా" అనే గ్రామంనుండి కళాశాల చదువుకోసం హైదరాబాద్ వచ్చి ఓపక్క చదువుకుంటూనే హైదరాబాదు నగరంలో సంఘకార్య విస్తరణకోసం కృషిచేశారని చెప్పారు. శాఖ తరువాత వారిని గురించి మరిన్ని వివరాలు తెలిపారు. వారిపేరు శ్రీ రామచంద్ర సదాశివ హల్దేకర్‌అని, డిగ్రిచదువు పూర్తికాగానే, బ్రహ్మచారిగానే ఉంటూ పూర్తిసమయం సంఘపనిని చేసేందుకు సంఘంలో ప్రచారక్‌గా నియమించబడ్డారని తెలిపారు.

## హల్దేకర్‌జీ మొదటి ప్రసంగం :

కొంతసమయం ఆటలు, పాటల తరువాత మేమందరం వారికి మా పరిచయం చేశాము. మాతోపాటే వారు మండలలో కూర్చుని సంఘాన్ని గురించి మాకు తెలియని అనేకవిషయాలు తెలిపారు. సంఘం అంటే ఏమిటి? ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ప్రారంభించారు? ఎందుకు? అన్న ప్రాథమిక విషయాలు వివరించారు. హిందూ సంఘటన ఎందుకు? అన్న అంశాన్ని చాలా చక్కగా వారు మాకు అవగాహన కలిగించారు. వారు మాతృభాషా మరాఠీ అయినప్పటికి వచ్చిరాని తెలుగులోనే వారు ప్రసంగించారు. అలా

ప్రారంభమైన మాననీయ శ్రీ హల్దేకర్‌జీతో మా పరిచయం క్రమక్రమంగా మమ్మల్ని సంఘంలో అప్పగించబడే ఎలాంటి బాధ్యతనైనా నిర్వహించే స్థాయికి చేర్చింది.

## మా నాన్నగారి ఆందోళన :

ఇటు మాఊళ్ళో వ్యవసాయానికి సంబంధించిన మోటారు పంపులు బాగుచేసేందుకు ఒక వ్యక్తి వస్తుండేవారు. అతను కాంగ్రెసు పార్టీ వీరాభిమాని. అతడు మా నాన్నగారికి నేను సంఘంలో చేరానన్న సంగతి పదేపదే చెపుతూ, సంఘం మంచిదికాదని, గాంధీజీ హత్యచేసినవారు ఈ సంస్థవారేనని అప్పుడు సంఘంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని మరింత మసాల కలుపుతూ చెప్పటంతో మానాన్నగారిలో ఆందోళన మొదలయింది. దానితో నేను శెలవురోజున ఇంటికి వచ్చినప్పుడల్లా హెచ్చరిస్తుండేవారు. సంఘం మొదలైనవి వదిలేయమని, చదువుపై పూర్తిశ్రద్ధ పెట్టమని నాకు హితవు చెప్పేవారు. నాకైతే సంఘంలో చెడు ఏమి కనిపించలేదు. అందువల్ల నేను యధావిధిగా శాఖకు వెళుతూనే ఉన్నాను. కొన్నాళ్ళకు మా॥ హల్దేకర్‌జీ మా గ్రామశాఖకు రాగా వారికి స్థానిక కార్యకర్తలు మాఇంట్లోనే బస ఏర్పాటుచేశారు.

మా నాన్నగారు వారితో స్వయంగా మాట్లాడి వారి ప్రవర్తన, మాటతీరు, పై చదువులు చదివినప్పటికి దేశంకోసం త్యాగంచేసి వచ్చిన వారి జీవన శైలికి బాగా ప్రభావితులైనారు. ఆ తరువాత తరువాత అప్పుడప్పుడు సీనియర్ కార్యకర్తలు, ప్రచారకులు తరచుగా ఇంటికి రావటంవల్ల వారిలో సంఘకార్యంపట్ల క్రమంగా సదభిప్రాయం ఏర్పడింది. దానితో నన్ను గురించిన ఆందోళన దూరమయింది. దానితో ఆసంవత్సరం పరీక్షలు నాకు ప్రధమశ్రేణి రావటంతో నాకు చదువుపట్ల శ్రద్ధ ఏమీ తగ్గలేదని వారికి భరోస ఏర్పడింది.

## సంఘంలో మా తొలి అడుగులు :

నా ప్రారంభరోజుల్లో నేను సంఘంలో స్థిరపడేందుకు దోహదం చేసింది శ్రీ హల్దేకర్‌జీ మార్గదర్శనం. సంఘ సిద్ధాంతాన్ని లేత మనసుల్లో, విద్యార్థులు, యువకుల్లో, వయోధికులలో, ఎవరిస్థాయికి తగినరీతిలో వారికి వారి హృదయాలలో నాటుకునేటట్లు ఎలా మాట్లాడాలో ఆ ప్రక్రియ (టెక్నిక్) చక్కగా తెలిసినవారు శ్రీ హల్దేకర్‌జీ. చిన్నచిన్న కథలతో, ఉదాహరణతో, దేశచరిత్ర, దేశభక్తుల కథలు, అనేక స్ఫూర్తినిచ్చే సంఘటనలు ఎంతోనేర్పుగా చెప్పేవారు. వారి వివరణ శ్రోతలలో మరింత ఆసక్తిని పెంచేది. మహనీయుల

జీవితచరిత్రలు, గాథలు, విశ్వగురువుగా పూజించబడిన మనదేశం తరువాతి కాలంలో ఎందుకు పతనావస్థకు గురైంది, మొదలైన లోతైన అంశాలతోపాటు, ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి ఏమిచేయాలి అన్నవిషయాలు చర్చగోష్ఠులద్వారా ప్రతివారికి అవగాహన కలిగించేవారు.

## అందరితో ఆత్మీయంగా :

వారు అతిథిగా ఏకుటుంబంలో ఉంటే ఆ కుటుంబసభ్యులు- పిన్నలు- పెద్దలు- మహిళలు అందరితోను ఎంతో ఆత్మీయంగా, గౌరవంగా మెలగటంవల్ల అందరి హృదయాలను ఆకట్టుకునేవారు. వారి ఈ కలుపుగోలు ప్రవృత్తి వారి జీవితాంతం అలాగే కొనసాగింది. ప్రత్యేక బాధ్యతలేవీ లేకుండా ఉండిన చివరి సంవత్సరాలలో ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలోని తాము ఇదివరలో పర్యటించిన అనేక గ్రామాలను మళ్ళీ ఒకసారి దర్శించి తన పరిచయస్థులందరితో మనసువిప్పి మాట్లాడటం, వారి కుటుంబాల యోగక్షేమాలు పరామర్శించటం, ఆ గ్రామాలలోని పూర్వసంఘ కార్యకర్తలతో, వయోవృద్ధులతో పాతరోజులు నెమరువేసుకోవటం, అందరికి ఎంతో ఆనందం కలిగించింది.

## ఎమర్జెన్సీలో :

శ్రీ హల్దేకర్‌జీ సంఘంలో ఎంతో ప్రముఖ అధికారి అయినప్పటికి ఎమర్జెన్సీ కాలంలో తమ ఉనికి ఎక్కడ బయటపడకుండా జాగ్రత్త పడుతూ సగటుమనిషిలా వేషధారణతో పనిలోఉన్న కార్యకర్తలకు ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తూండేవారు. ఎమర్జెన్సీ నిర్బంధ విధానాలు అమలులోఉన్న దాదాపు 21మాసాలు సంఘనిర్దేశిత కార్యక్రమాలు చురుకుగా పాల్గొంటూ స్వయంసేవకులకు రహస్యంగానే మార్గదర్శనం చేసిన ప్రముఖ అధికారుల్లో శ్రీ హల్దేకర్‌జీ ఒకరు. అదేకాలంలో నేను రహస్య కార్యకలాపాలలో బయట తిరుగుతూ ఉండగా మా యింటివద్ద వయోవృద్ధులయిన మా నాన్నగారికి కార్యకర్తలద్వారా సందేశాలు పంపిస్తూ ధైర్యాన్ని యిస్తుండేవారు. అయితే విధిలిఖితంవల్ల మా పితృపాదులు నా ఎడబాటులోనే స్వర్గస్థులయ్యారు. స్వయంసేవకులు వారివారి వ్యక్తిగత, కౌటుంబిక సమస్యలు కారణంగా సంఘకార్యానికి విముఖులు కాకుండా వారికి తగిన సలహాలు ఇస్తూ పరిష్కారాలు సూచిస్తూ ఊరట కలిగించేవారు. కార్యకర్తలపట్ల ఎంతో సహృదయత కలిగిఉండేవారు.

**రచనా వ్యాసంగం :**

తమ జీవిత చరమాంకంలో శరీరం సహకరించక పోతున్నప్పటికి సమాజంకోసం ఏదోచేయాలన్న తీవ్రతపన, ఆవేదన, సంకల్ప బలం కారణంగా సంఘకార్య ద్రష్టలయిన త్రిమూర్తులు పూ॥డాక్టర్జీ, గురూజీ, బాలాసాహెబ్గార్ల జీవిత చరిత్రలను సమగ్రంగా తెలుగు పాఠకలోకానికి అందిస్తూ బృహత్ గ్రంథాలను అనువదించిన కర్తవ్యదీక్ష వారిది.

**అపురూప జ్ఞాపకాలు :**

వారితో గడిపిన ఆ అపురూప క్షణాలు నాకింకా జ్ఞాపకం ఉన్నాయి. శ్రీ హల్దేకర్జీ మాజిల్లాలో వరుసగా 3,4 రోజులు పర్యటించి చివరిరోజు భాగ్యనగర్వెళ్ళేరాత్రి మా గృహంలో విశ్రాంతి తీసుకుంటం, మరునాడు ఉదయం శాఖలో పాల్గొని, కొందరి స్వయంసేవకుల కుటుంబాలను పలకరించివచ్చి మధ్యాహ్నం మాకుటీర ప్రాంగణంలోని చేదబావి బండలపై తమ దుస్తులు చక్కగా ఉతుక్కుని స్నానాదులు ముగించుకోవటం, ఆ తరువాత అందరము కలిసి ఆనందంగా భోజనంచేయటం, కొద్దిగా విశ్రమించిన అనంతరం భాగ్యనగర్ వెళ్ళిపోవటం–అస్మృతులు ఎప్పుడూ చెరిగిపోనివి. కొన్నిగంటల పాటు మాతోవారు గడిపిన ఆ క్షణాలు మాకెంతో హృద్యంగా ఉండేవి.

**అవ్యాజ్యమైనప్రేమ :**

ఒకసారి నేను స్వయంగా అనారోగ్యంతో హైదరాబాదు ఆస్పత్రిలో చేరినపుడు, మా శ్రీమతి తన చివరి సంవత్సరాలలో పక్షవాతంతో బాధపడుతున్నప్పుడు శ్రీ హల్దేకర్జీ స్వయంగావచ్చి మాతో ధైర్యవచనాలు పలికి ఆశీర్వదించివెళ్ళారు. మరే ఇతర కార్యక్రమాల సందర్భంగానైనా మా గ్రామసమీపంలోకి వస్తేచాలు అనుకోకుండానే మాఇంటివద్ద కొంతసేపుఆగి వెళుతుండేవారు. వారు తమ చివరి రోజుల్లో గదికే పరిమితమయిన స్థితిలోను అప్పుడప్పుడు ఫోన్చేసి మాట్లాడేవారు.

2010లో శ్రీ హల్దేకర్జీ కుటుంబసభ్యులంతా వారి స్వగ్రామం మహారాష్ట్రలోని (హల్దా)లో వారికి "సహస్రపూర్ణచంద్రదర్శన మహోత్సవం" సంకల్పించిన సందర్భంగా ప్రత్యేకించి తమకు అత్యంత సన్నిహితులైన కొందరిని శ్రీ హల్దేకర్జీ స్వయంగా ఆహ్వానించారు. అట్టివారిలో నేను ఒకడిని కావటం నా అదృష్టం. వారు నాఎడల చూపిన ఆ వాత్సల్యాన్ని ఎన్నడూ మరువలేను. దశాబ్దాలుగా వారితో కొనసాగిన ఆ ఆత్మీయతా బంధం అవిస్మరణీయం. మా కుటుంబానికి వారిొక జ్యేష్ఠభ్రాతగా భావించాను.

నా జీవన గమనము మారుతున్న దశలో 1981లో శ్రీశైల క్షేత్రంలో జరిగిన సంఘప్రాంత సమావేశంలో పూజ్యశ్రీ బాలాసాహెబ్‌జీ మార్గదర్శనం లభించింది. నన్ను విశ్వహిందూ పరిషత్ కార్యానికి అప్పగిస్తూ అధికారుల ఆదేశం అందింది. మూడు సంవత్సరములు స్థానికంగా అంటే జడ్చర్లలోనే ఉంటూ బాధ్యతలు నిర్వహించాను. 1984 నవంబర్‌లో అప్పటి మా విభాగ్ ప్రచారక్ స్వర్గీయ శ్రీ పట్లోళ్ళ రామిరెడ్డిగారి సూచనతో నా నివాసాన్ని హైదరాబాద్ విశ్వహిందూ పరిషత్ కార్యాలయానికి మార్చటం జరిగింది. ఆ సందర్భంలో మా॥ శ్రీ రాంభావుజీ జడ్చర్ల బస్సుస్టాండులో కలిశారు. అక్కడే బెంచిమీద కూర్చొని వారితో జరగబోతున్న మార్పులుగురించి నివేదించాను. ఇది శుభపరిణామమేనని తమ సమ్మతిని, తమ అనుమతిని నాకు అందిస్తూ ఆశీర్వదించారు. వారి ఆశీర్వాదమే విశ్వహిందూ కార్యంలో నన్ను ముందుకు విజయవంతంగా నడిపించిందని విశ్వసిస్తాను. నా జీవన గమనాన్ని మార్చి ఉత్సాహాన్ని నింపిన ఆస్ఫూర్తిదాయక క్షణాలను సదా స్మరించుకుంటాను. చివరిరోజుల్లో అప్పుడప్పుడు కేశవనిలయంలో వారిని దర్శించి, కొద్దిసేపు ముచ్చటించి వారిఆశీస్సులు తీసుకువచ్చిన ప్రతీసారి ఎంతో ఆత్మతృప్తిని అనుభవించాను.

## హృదయాన్ని పులకింపచేసింది :

1968వ సంవత్సరము. అప్పుడు నేను మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో సబ్ ఇంజనీరుగా పనిచేస్తున్నాను. పూనావద్ద “చించ్‌వడ్”అనే స్థలంలో ప్రాంత శిబిరం నడుస్తున్నది. నేను అందులో పాల్గొన్నాను. ఓ రోజు మధ్యాహ్నం భోజనానంతరం నివాసంవైపు వెళుతుంటే ఎవరో ఒకరు కనిపించారు. అచ్చం హల్దేకర్‌జీలాగానే ఉన్నారు. అవే పోలికలు. వారిని చూడగానే ఉండబట్టలేక ‘రాంభావుజీ!’ అన్నాను. వారు గిరుక్కున వెనక్కితిరిగి ‘మీరెవరు?’అని అడిగారు. “రాంభావు మా అన్నగారు”అని చెప్పి, “నేను వారి తమ్ముడిని” అని అన్నారువారు. హైదరాబాదు వచ్చినపుడు శ్రీ హల్దేకర్‌జీతో ఈ విషయం చెప్పారు. ఆ తరువాత హల్దేకర్‌జీ సోదరులు కలిసినప్పుడల్లా ఈ విషయం గుర్తుచేసుకుని ఆనందించేవారట !

## జ్యోతి ఆరిపోయింది :

వారి శిక్షణలో పెరిగిన నావంటి స్వయంసేవకులెవరైనాసరే, హైదరాబాదువస్తే కార్యాలయంలో వారిని దర్శించకుండా వెళ్ళేవారుకాదు. ఆ స్థితిలోను వచ్చినవారితో

మాట్లాడుతూ వారి గ్రామంలో వారిని పేరుపేరునా జ్ఞాపకంచేసుకుని క్షేమసమాచారం తెలుసుకునేవారు. పండుటాకులా రాలిన వారి శరీరం ఒకనాటి వేకువజామున రాలిపోయింది. జీవనజ్యోతి ఆరిపోయింది. తల్లి భారతి పాదసన్నిధికి చేరుకున్నారు – మాననీయ రాంభావు హల్దేకర్‌జీ.

**– మంచెన గుండేరావు, జడ్చర్ల,**
**పూర్వ సంఘచాలకులు, పాలమూర్ విభాగ్**

# సాత్త్విక చైతన్యమూర్తి రాంభావూజీ

**మ**హారాష్ట్రలోని శంభాజీనగర్ (ఔరంగాబాద్) జిల్లాలోని అజంతా గుహలకు దగ్గరలోని హల్దా గ్రామంలో జన్మించిన స్వర్గీయ రామచంద్ర సదాశివ హల్దేకర్‌జీని అందరూ రాంభావూజీ అని, హల్దేకర్‌జీ అని పిలిచేవారు. భాగ్యనగర్ లోని కాచిగూడ, నింబోలీఅడ్డా, సుల్తాన్‌బజార్‌లల్లో ఎక్కువగా మహారాష్ట్ర ప్రజలు నివసిస్తారు. సుల్తాన్‌బజార్ ఆర్యసమాజభవన్‌కు దగ్గరలో రాంభావూజీ తమ అక్కగారి ఇంట్లో ఉంటూ బి.యస్.సి చదువుతూ సంఘశాఖకు నియమితంగా వచ్చేవారు. డిగ్రి చివరి సంవత్సరంలోనే వారు ప్రచారక్ అయ్యారు.

మొదట్లో వారికి తెలుగు మాట్లాడటం బొత్తిగా తెలియదు. 1960 ఆ ప్రాంతంలో వారు భాగ్యనగర్, జనగామ, వరంగల్‌లాంటి పెద్దకేంద్రాలకు పర్యటనలో వచ్చి హిందీలోనే గటనాయకుల బైఠక్ నిర్వహించేవారు. ఆ తర్వాత వరంగల్ జిల్లాప్రచారక్‌గా నియమింపబడ్డారు. ఆరోజుల్లో వరంగల్‌జిల్లాలోనే కరినగర్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలుండేవి. ఆదిలాబాద్‌జిల్లా మహారాష్ట్రలోని చంద్రపూర్ విభాగ్‌లో ఉండేది. ఆంధ్రప్రదేశ్ అంతాకలిపి ప్రారంభంలో 4విభాగ్‌లు మాత్రమే ఉండేవి. గోదావరి విభాగ్‌కు స్వర్గీయ కరెడ్ల సత్యనారాయణగారు, కృష్ణావిభాగ్‌కు ప్రయాగ సుబ్రహ్మణ్యంగారు, వారు ప్రచారక్‌గా విరమించుకున్నాక భోగాది దుర్గాప్రసాద్‌గారు, రాయలసీమ కంతటికీ స్వర్గీయ వినాయక లక్ష్మణ్ దేశముఖ్‌జీ ఆ తర్వాత స్వ. నిచ్చెనమెట్ల విశ్వనాధయ్యగారు నియమితులయ్యాక, దేశముఖ్‌జీ తెలంగాణకు విభాగ్ ప్రచారకులయ్యారు. ఆ తర్వాత తెలంగాణ 2 విభాగ్‌లుగా విడిపోయి అందులో భాగ్యనగర్ విభాగ్‌కు దేశముఖ్‌జీ, వరంగల్ విభాగ్‌కు హల్దేకర్‌జీ

విభాగ్ ప్రచారకులయ్యారు. అప్పుడు ఆదిలాబాద్ జిల్లా కూడా వరంగల్లు విభాగ్‌లో కలిసింది. నల్లగొండజిల్లా భాగ్యనగర్ విభాగ్‌కి వెళ్లింది.

ప్రారంభంలో హల్దేకర్‌జీ వరంగల్ రామన్నపేటలోని దిల్లీవాలా మిఠాయి ఘర్ ఎదుటవున్న సందులోని కార్యాలయం మాధవనిలయం కేంద్రంగా చాలాకాలం ఉన్నారు. ఆ తర్వాత శ్రీ కె.వి. సత్యనారాయణగారు వరంగల్‌జిల్లా ప్రచారక్‌గాను, స్వర్గీయ ఎస్.ఎల్.ఎన్. ఆచార్యులుగారు ఆదిలాబాద్ జిల్లా ప్రచారక్‌గాను, స్వర్గీయ కొయ్యడ శ్రీధర్‌జీ కరినగర్‌జిల్లాకు, నేను ( రాయచంద్రయ్య)ఖమ్మంజిల్లాకు ప్రచారకులుగా ఉంటే, విభాగ్ ప్రచారక్‌గా మాన్యులు హల్దేకర్‌జీ హనుమకొండలోని ఏనుగులగడ్డవద్ద "కేశవకృప" కార్యాలయం కేంద్రంగా ఉంటూ పర్యటన చేసేవారు. మా హల్దేకర్‌జీ ఆ రోజుల్లో ఎంతో అనుభవం కలిగిన స్వయంసేవకులు స్వర్గీయులైన శఠగోపాచార్యులు, భండారు సదాశివరావు, వీరంరాజు కృష్ణమూర్తి గారలవంటి వారితో సంఘపనిని సాగించేవారు. వరంగల్‌జిల్లా సంఘకార్య ప్రగతికొరకు పులుసు గోపిరెడ్డిగారు, రేవా కోటేశ్వరరావుజీ, ఎల్.ఎస్. రాజుగారు, కొమరగిరి రామమోహనరావు, స్వ. దొమ్మరాజు రామకృష్ణరాజుగారి లాంటి అనేక అనుభవజ్ఞులైన కార్యకర్తలు కృష్ణా, గుంటూరు జిల్లాలనుండి వచ్చి అధ్యాపకులుగా పనిచేస్తూ సంఘకార్య ప్రగతిలో భాగస్వాములయ్యారు. ఆరోజుల్లోనే పర్కాల, వరదన్నపేట తాలూకాల్లో ఒక్కోచోట 25పైగా శాఖలుండేవి.

మా॥ హల్దేకర్‌జీ వచ్చీరాని తెలుగుభాషలో మాట్లాడుతూ అందరినీ ఆకట్టుకునేవారు. తెలంగాణ జిల్లాల్లో నిజాంపాలనవల్ల ఉర్దూను ప్రేమించే గ్రామపెద్దలతో వారు హిందీ, ఉర్దూలోనూ మాట్లాడుతూ ఉంటే స్థానికులకు ఆనందంగా ఉండేది. చాలా గ్రామాల్లో విద్యార్థులు మరియు యువకులే ఎక్కువగా శాఖల్లో ఉండేవారు. హల్దేకర్‌జీ పర్యటన దరిమిలా ఆ గ్రామాల పెద్దమనుషులు ఎక్కువమంది సంఘకార్యానికి చేరువయ్యేవారు. హల్దేకర్‌జీ స్థానికులైన వెనుకబడ్డ పేదకుటుంబాలలో ఒకరిగా ఉంటూ అక్కడి పరిసరాలు, భోజనాలతో సర్దుకుపోయేవారు. వారికి వసతి ఇత్యాదుల్లో లోటుపాట్లు ఉన్నప్పటికీ పట్టించుకునేవారు కాదు. కడుపులో అల్సర్ కారణంగా ఆపరేషన్ జరిగినందున, ఆదరిమిలా బంగాళాదుంపలు తినడం మానేశారు.

వరంగల్‌జిల్లా పర్యటనలో రైలు ఆ సమయానికి లేనప్పుడు శ్రీ కె.వి. సత్యనారాయణ గారితో కల్సి రైలుపట్టాల ప్రక్కనే నడుస్తూ వరంగల్ స్టేషన్ నుండి నెక్కొండ, కేసముద్రం

లాంటి గ్రామాల పర్యటనకు వెళ్ళేవారు. హన్మకొండ కార్యాలయానికి "తరుణభారత్" అనే దినపత్రిక మరాఠీ భాషలో తెప్పించి చదివేవారు. ప్రారంభ రోజుల్లో గ్రామాల్లో సంఘకార్యానికి ఆదరణ తక్కువగా ఉండేది. ఒకసారి వర్ధన్నపేట తాలూకాలోని ఊకల్లు గ్రామానికి హల్దేకర్‌జీ రాయపర్తిలో బస్సుదిగి నడిచివెళ్ళారు. అక్కడే ఊరుబయటే చెట్టుక్రింద నిలబడి, విద్యార్థిగా ఉంటున్న శ్రీ అలువాల భిక్షపతిని పిలిపించుకొని మాట్లాడి సంఘశిక్షావర్గకు వచ్చేలా ఒప్పించి వచ్చారు. అప్పుడు ఇంటిపెద్దలెవ్వరికీ సంఘంగురించి అవగాహన లేనందున ఇంటికిగాని, ఊళ్ళోకిగాని వెళ్ళలేదు. మరి ఆరోజు భోజనం ? అంతే.

మా॥ హల్దేకర్‌జీ అన్ని గ్రామాశాఖలకు వేళ్ళేవారు. వారి చివరిరోజుల్లో కూడా ఆ గ్రామంపేరు చెబితే అక్కడి కార్యకర్తలందరిపేర్లూ గుర్తచేసేవారు. ఒకసారి ఖమ్మంజిల్లా బురదరాఘవపురంకు ఏనుకూరులో బస్‌దిగి 5కి.మీ. దూరం ఎడ్లబండిలో వెళ్ళారు. ఇప్పటికీ వారి పర్యటనగూర్చి స్థానికులు గుర్తుచేస్తుంటారు. ఖమ్మంజిల్లా సంఘచాయకులుగా స్వర్గీయ శాకమూరి సూర్యప్రకాశరావుగారు చాలాకాలం ఉన్నారు. కమ్యూనిస్టు భావజాలంతో ఉన్న వాతావరణం నుండి వారు వచ్చినా స్వర్గీయ సోమేపల్లి సోమయ్యజీ, స్వర్గీయ హల్దేకర్‌జీల వ్యక్తిత్వాల కారణంగా వారు జీవితాంతం కార్యకర్తగా నిలిచారు. హల్దేకర్‌జీ ఖమ్మం జిల్లాపర్యటనకు వస్తే ప్రకాశరావుగారు హల్దేకర్‌జీని "పండిట్‌జీ" అని సంబోదిస్తూ సూటి-పోటి మాటలతో, ఎన్ని మాట్లాడినా హల్దేకర్‌జీ చిరునవ్వే సమాధానం.

వరంగల్ విభాగ్ బైఠక్ జరిగితే సంఘకార్యపద్ధతి ప్రకారంగా లెక్కలు, జాబితాలు సక్రమంగా ఉండాలనే వారు హల్దేకర్‌జీ, ఇది కూడా సంఘకార్యంలో ఒక భాగమని గుర్తుచేసేవారు. ఒక్కోసారి బైఠక్‌లో శ్రీధర్‌జీకి, వారికి గట్టిగానే వాదనజ రిగేది. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే హల్దేకర్‌జీ బాగా కోపంగా ఉన్నపుడు ముక్కు ఎర్రబడేది. ఇలా సంఘకార్యపద్ధతి అమలులో వారు "వజ్రాదపి కఠోరాని, మృదూని కుసుమాందపి" వలెనే ఉండేవారు. సంఘశిక్షవర్గల్లో వారు ఎక్కువగా యోగచాప్, సమతా శిక్షకులుగా ఉండేవారు. వారు సహప్రాంతప్రచారక్‌గా ఉన్నరోజుల్లో వరంగల్ విభాగ్‌లో అనేకచోట్ల నక్సలైట్లతో ఘర్షణలు జరిగాయి. చురుకైన ప్రముఖ యువకార్యకర్తలను చాలామందిని సంఘం కోల్పోయింది. ఇలాంటి సందర్భాల్లో హల్దేకర్‌జీ కార్యకర్తలను చైతన్యపరుస్తూ, వారి కుటుంబాల్లో ధైర్యాన్ని నింపుతూ వటవృక్షంలా ఉండేవారు.

వారికి 80 వసంతాలు నిండిన సందర్భంగా శంభాజీనగర్‌లో జరిగిన "సహస్రచంద్రదర్శన్" కార్యక్రమంలో ఇక్కడి కార్యకర్తలు చాలామందికుటుంబాలతో సహావెళ్ళి పాల్గొన్నారు. అంతకుముందే వారి స్వగ్రామమైన "హల్దా"కు ఈ 2 ప్రాంతాల సీనియర్ ప్రచారకులను శ్రీయుతులు భాగయ్యగారు, సోమయాజులుగారు, సో. నాగేశ్వరరావుగారు, రామచంద్రయ్యలను తీసుకెళ్ళి అక్కడి పెద్దలందరినీ పరిచయం చేశారు. వారి కుటుంబమంతా సంఘవాతావరణంతో నిండిఉండింది.

చివరిరోజుల్లో శరీరం పర్యటన చేసేస్థితిలో లేనప్పుడు హల్దేకర్‌జీ స్థానం భావనారాయణ, జాగృతి సహసంపాదకులుగా ఉన్న బెల్లంకొండ మల్లారెడ్డిగార్ల సహకారంతో డాక్టర్జీ, గురూజీ, బాళాసాహెబ్‌జీ జీవితాలను సులభశైలిలో, తెలుగులో చదివిన అందరికీ దిశాదర్శనం లభించేలా పుస్తకాలు వ్రాశారు. మాననీయ హల్దేకర్‌జీ మరణంతో తెలుగుప్రాంతంలో సంఘప్రారంభ తరంలోని ఒక వటవృక్షం రాలిపోయింది. సంఘప్రచారక్‌గా వారి జీవితం ధన్యతనొందింది.

**– కొరిగింజ రామచంద్రయ్య,**
**వనవాసీ కల్యాణ పరిషత్, అ.భా. శిక్షప్రముఖ్**

# హల్దేకర్‌జీ హాస్యప్రియత్వము అద్భుతమైన జ్ఞాపకశక్తి

**స్వ**ర్గీయ రాంభావ్ హల్దేకర్‌జీ వ్యక్తిత్వం విశిష్ఠసర్వగుణ సంపన్నం. వివిధ సందర్భాలలో అవసరంమేరకు అది ప్రస్ఫుటమవుతుండేది. తెలుగులో అనర్గళంగా ఉపన్యసిస్తూన్నప్పటికీ మరాఠీ మాతృభాష అయినవారి బౌద్ధిక్‌లలో ఆకట్టుకునే యాస స్పష్టమయ్యేది.

సంఘ శిక్షావర్గ, ప్రాథమిక శిక్షవర్గ శిబిరాల్లో, ఇష్టాగోష్ఠిల్లో హల్దేకర్‌జీ స్వయంసేవకులను ఒకప్రశ్న అడిగేవారు. మీరెందుకు శిక్షణకోసం వచ్చారు. ఎక్కువమంది చెప్పే సమాధానం – "శాఖలు లేనిచోట శిక్షణ అనంతరం శాఖలు ప్రారంభించటానికి," "ఉన్నచోట ఆపివేయటానికి" అనే హల్దేకర్‌జీ జోడింపుతో ఘోల్లుమని నవ్వులే నవ్వులు! ఇలా ఉండేది వారి హాస్యచతురత.

## ఆగయ్యా, అన్నంలో రాళ్ళు ఉడకలా :

కరినగరంజిల్లా కొత్తపల్లిలో 1970లో ప్రాథమిక శిక్షావర్గ శిబిరం నిర్వహించబడింది. అప్పటి యువస్వయంసేవక్ కీ.శే. నాయిని ఆగయ్యగారు వ్యవస్థ ఏర్పాట్లలో ఉన్నారు. శిబిరంలో మధ్యాహ్నభోజన అనంతరం వారు పెండాల్‌లోనుండి బయటకు వస్తుంటే ఆగయ్యగారు అగుపడ్డారు. ఆగయ్యా! అన్నంలో రాళ్ళు ఉడకలా అన్నారు. అక్కడే ఉన్న స్వయంసేవకులంతా నవ్వుతుంటే ఆగయ్య బిత్తరపోయారు. భుజంపై చేయివేసి అనునయించినా పాపం రాళ్ళుడకవు కదా! ఇక ఏ శిబిరం, కార్యక్రమంలో అన్నంలో రాళ్ళు వచ్చినా హల్దేకర్‌జీ వాడిన అన్నంలో రాళ్ళు ఉడకలా అనే మాట వినబడుతూ వారినే జ్ఞప్తికి తెచ్చేది.

## వైయక్తిక్ బాగుంది-నేర్పాల :

నేను కరినగర్ జిల్లా ప్రచారక్‌గా వెళ్ళిన కొత్తలో రక్షాబంధన్ కార్యక్రమంలో వారి బౌద్ధిక్‌కు ముందు నేను వైయుక్తిక్ పాడాను. కార్యక్రమానంతరం "గోపాల్ వైయుక్తిక్ చాలా బాగుంది. దీనిని మరికొందరికి నేర్పాలి" అన్నారు. నేను మరెప్పుడూ స్వయంసేవకుల, కార్యకర్తలకు గీత్‌లు నేర్పించి వారితో పాడించడం తప్ప పాడలేదు, ఒక్కమాటలో అంతా అర్థమైంది.

హల్దేకర్‌జీ చాయ్ ప్రియులు. అది అర్థం చేసుకొని ఆ సమయంలో చాయ్ అందించకపోతే దగ్గరున్న కార్యకర్తలను పిలిచి ఒక కప్పు మంచి చాయ్ అని తలూపుతూ చెప్పేవారు.

జిల్లా ప్రచారక్‌గా కొత్తలో పర్యటనకు వచ్చిన వారికి ఒక అభిమాని ఇంట్లో నివాసం ఏర్పాటు చేశాము. పైగదిలో బస. భోజనానంతరం పడుకునేముందు నేను కార్యాలయానికి వెళుతుంటే అడిగారు. బాత్‌రూం ఎక్కడ? నేను, ఏర్పాటుచేసిన జిల్లా బౌద్ధిక్‌ప్రముఖ్ పూరె సాంబశివరావు ఎవరమూ గమనించలేదు. రాత్రిపూట మెట్లుదిగి కిందికి వెళ్ళాల్సి ఉంటుంది. మెట్ల వద్ద లైట్‌వేసి ఉంచినా అసౌకర్యం కల్పించాము. ఈ సంఘటన జరిగి మూడున్నర దశాబ్దాలు గడిచినా ఆ తర్వాత వ్యవస్థలో నా వైపున ఎప్పుడూ పొరపాటు జరగనివ్వలేదు.

## గణవేష్‌లో నియమము :

శాఖా కార్యక్రమాల్లో, శిబిరాల్లో గణవేష్ ధరిస్తే ఆరమలో అయినా యువకుడిలా

బలిష్ఠంగా నిలబడేవారు. సాంప్రదాయ దుస్తులు ధరించే ఆయన ఆ సమయములో మాత్రము ఛాతీపై చేతులు పెట్టుకుని బౌద్ధిక్ ఇచ్చేవారు. అత్యవసర పరిస్థితిలో ప్యాంటూ, షర్ట్ ధరించిన ఆయనను చూస్తే ఏ ప్రభుత్వ అధికారో అనుకునేవారు. ఎప్పుడూ అలాంటి దుస్తులు ధరించని అయనను సన్నిహితులే గుర్తుపట్టడం కష్టంగా ఉండేది.

పర్యటనలో ఓ జిల్లాకు వస్తే ఆ పర్యటనలో అన్నిచోట్లా కొన్ని అంశాలను ఎంపికచేసుకుని అవి మాత్రమే మాట్లాడేవారు. ముఖ్యంగా యువతకంటే మధ్యవయస్కులు పెద్దవారే బాగా ఆకర్షితులయ్యేవారు. అలాంటి ఒక పర్యటనలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన సంఘకుటుంబీకుడు శ్రీ కృష్ణారెడ్డి ప్రత్యక్షంగా ఆయనతో అదే విషయం చెప్పారు. దానిపై నా అభిప్రాయం అడిగారు. రెడ్డిగారి ప్రశంసలో ఎలాంటి అతిశయోక్తి లేదని తెలిపాను. అనంతర కాలంలో మరో 18ఏళ్ళ అనంతరం కృష్ణారెడ్డిగారి కుమారుడు వెంకటరమణారెడ్డి (దామూ) 1999లో మెట్‌పల్లి నియోజకవర్గ బి.జె.పి. ఎమ్మెల్యేగా గెలిచాడు. అదేస్థానంలో నేటి మహారాష్ట్ర గవర్నర్ శ్రీ చెన్నమనేని విద్యాసాగర్‌రావు యం.పి. అయ్యేవరకు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అలాంటి వ్యక్తులను ఆకట్టుకునే అపురూపమైన వ్యక్తిత్వం హల్దేకర్‌జీది.

## ఆత్మీయత కొనసాగింపు ఉత్తర ప్రత్యుత్తరాలు :

మాననీయ హల్దేకర్‌జీ పర్యటనలో భాగంగా 1980లో కరినగర్ వచ్చారు. పర్యటించి వెళ్ళాక నాలుగురోజులకు కార్యాలయానికి ఉత్తరము వచ్చింది. నేను తువ్వాలును కార్యాలయంలో మరిచిపోయాను. నువ్వు ప్రాంత బైఠక్‌కు వచ్చేప్పుడు మరచిపోకుండా తువ్వాలు తీసుకురాగలవు. అంతచిన్న విషయమైనప్పటికీ ఎంతో శ్రద్ధ ప్రతివిషయంపై కనబరిచేవారు.

నేను కరినగర్ జిల్లాప్రచారక్‌గా విరమించుకున్న తర్వాత 1982 డిసెంబరులో నాపెళ్ళి పత్రిక తీసుకువెళ్ళి వారికి అందచేసి మిగతా సంఘపెద్దలకు ఇచ్చాను. పర్యటన కారణంగా హల్దేకర్‌జీ రాలేకపోయారు. కానీ రెండురోజుల అనంతరం శుభాకాంక్షలు తెలియచేస్తూ వారు రాసిన ఉత్తరము వచ్చి ఎంతో సంతోషాన్నిచ్చింది.

మళ్ళీ 24ఏళ్ళ తర్వాత మా అమ్మాయి పెళ్ళి శుభలేఖ వారికి అందచేయడానికి వెళ్ళాను. అప్పటికే పర్యటన తేదీలు ఖరారై షరా మాములుగా హల్దేకర్‌జీ రాలేకపోయారు. అయినా అంతపెద్దవయస్సులోనూ ఓపికతో శుభాకాంక్షలు తెలుపుతూ ఉత్తరము రాశారు.

స్వయంసేవకులకు ప్రశంస, మందలింపు, కోపం, నవ్వించడం అన్నీ ఒకేరీతిలో ఉండేవితప్ప ఎక్కువసేపు నిలిచేవికావు. బాల్యం నుండి ఎనిమిది పదుల వయస్సు వరకు అందరికీ సాన్నిహిత్యం పంచుతూ భరతమాతసేవలో జీవన పుష్పాన్ని సమర్పించుకున్న రాంభావ్ హల్దేకర్‌జీ జీవితం ధన్యం.

– చిట్టి గోపాల్‌రెడ్డి,
కరినగర్ పూర్వజిల్లా ప్రచారక్, 9440390434

# నా జీవితంలో చెరగని ముద్ర శ్రీ రాంభావు హల్దేకర్‌జీ

**రా**ష్ట్రీయ స్వయంసేవక సంఘంలో ప్రచారకుల వ్యవస్థ ఒక విలక్షణమైనది. పూర్వకాలంలో మన సమాజ హితమునకు దోహదపడిన ఋషి, ముని, యోగుల పరంపరకు ప్రతిబింబమా అన్నట్లు తోస్తుంది. ఆకోవకు చెందిన జీవితాలు ధన్యజీవులు కాక మరేమిటి?

**మరచిపోలేని పలుకరింపు :**

1961లో 10వ తరగతికై వరంగల్ వచ్చిన తర్వాత శ్రీ రాంభావు హల్దేకర్‌జీ హనుమకొండ కుమార్‌పల్లి ప్రభాత్ శాఖలో పరిచయము కలిగింది. వారిలో ఉన్న విశేషం ఒక్కసారి వారితో మాట్లాడితె ఇక జీవితంలో మరచిపోలేరు. వారి మరాఠీ యాసలో తెలుగు పదజాలం, మాటలవంపు, సొంపులు, వయ్యారి నడకలా ఉంటుంది. వారు మాట్లాడేటప్పుడు తెలుగు పదాలను వెదుకుతున్న ఆ చేతుల కదలికలు, కన్నులుమూసి కదిలేముఖ కదలికలు, ఆ బాడీలాంగ్వేజి ఎదుటివారిని అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. వారి మనస్సుకూడ పారేనీరు లాంటిది. నిజానికి వారు మా వరంగల్ విభాగ్ ప్రచారకుగా రావడం మా అదృష్టంగా భావిస్తాం. గ్రామీణ పర్యటనలలో ఎండ్లబండ్లు, సవారికచ్చురాలలో, మరువలేని అనుభవాలు కోకొల్లలు. చివరివరకుకూడా వారి పలుకరింపు బలేగా ఉండేది. ఏం..బా..మీ..ఊకల్లు వారంతా అనో, లేక అలువాల వారంతా క్షేమమా అనో మా పిల్లలు కల్సినా ఆత్మీయంగా పలుకరించేవారు. నేను కల్సినప్పుడు ఏం...బా... మీ పాములు, కొంగలు, ఈగలు వారంతా కుశలమా? అని

పలకరించేవారు. (మా ఊళ్ళోపాము, ఇల్లెందు గ్రామంలో కొంగ, ఈగ అనిఇంటిపేర్లు ఉన్నవి.) వీరంతా మా వర్దన్నపేట ఖండలోని వారు.

## దృఢమైన నిర్ణయం :

నేను డిగ్రీ చదువుతున్న సమయంలో సురారం అనే గ్రామానికి దసరా శెలవల్లో 15రోజులు విస్తారక్‌గా వెళ్ళాను. శ్రీ తంగేటిపెళ్ళి గోపాలరావుగారు జ్యేష్ఠకార్యకర్త ఇంట్లో వసతి. పక్కనేఉన్న ఎలకమర్తి గ్రామంలో సాయంశాఖ, సురారంలో రాత్రిశాఖ, దండవెల్లి గ్రామంలో కొద్దిరోజులు ప్రభాత్‌శాఖ నిర్వహించేది. మంచి సంఖ్యలో ఉత్సాహంగా నడిచేవి. చివరిరోజున సార్వజనికోత్సవ కార్యక్రమము యోజనచేసాము. వక్తగా శ్రీ హల్దేకర్‌జీ వచ్చారు. కార్యక్రమానికి మూడు గ్రామాలనుంచి వచ్చారు. ముఖ్యంగా సురారం ఊరంతా కదిలింది. కార్యక్రమమంతా యోజనాబద్ధంగా శ్రీ కె.వి. సత్యన్నారాయణ (జిల్లాప్రచారక్) గారి మార్గదర్శనంలో చాలా చక్కగా జరిగింది. ఊహించినదానికన్నా మిన్నగా జరిగింది. ఇక శ్రీ హల్దేకర్‌జీ బౌద్ధిక్ ధోరణి, మరియు వారి భాషతీరు సమావేశానికి వచ్చినవారందరిని కదలకుండా కట్టిపడవేసింది. వారుకూడా ఆ వాతావరణానికి ఎంతో ఆనందాన్ని వ్యక్తపరచినారు. వారు వరంగల్‌కు బయలుదేరేముందు నన్ను దగ్గరకు పిలుచుకొని నీవు ఈ సంవత్సరము ప్రథమవర్ష శిక్షావర్గ చేయాలిగా అన్నారు. దానికి నేను ఏమాత్రం వీలుకాదు అన్నాను. కారణం, మాది సాధారణ వ్యవసాయ కుటుంబం. ఎండాకాలంలో వ్యవసాయ పనులు బాగా ఉంటాయి.(పెంటతోలటం, చెట్లు కొట్టడం, దంతెలు తోలటం, దుక్కులు తయారుచేయటం) ఆపనులు నేను చేయవలసి ఉంటుంది. అందువల్ల మా నాన్నగారు ఒప్పుకోరు అన్నాను. అయితే నేను మీ ఊరికివచ్చి నాన్నగారితో మాట్లాడి ఒప్పిస్తానన్నారు. దయచేసి మీరు ఆపని చేయకండి. ఆయన ముక్కోపి, మీరు ఎవరు, ఏంటి అని ఆలోచించకుండా మాటలు అనేస్తాడు. మాఊరికి రావాలన్నా కష్టం. రాయపర్తిలో బస్సుదిగి ఎనిమిది కిలోమీటర్లు నడవాలి. ఎటుచూసినా పొలాలు. దారి ఉండదు. అన్ని పంటకాలువలు, బురద, ఎత్తుపల్లాలు, మీరు నడవటంకూడా చాలాఇబ్బందే. ఈ ఎనిమిది కి॥మీ॥ దూరంలో, ఎండలో ఉండటానికి చెట్టునీడకాని, త్రాగడానికి గుక్కెడు మంచినీరుగాని దొరకని స్థితి. వీలయినప్పుడు నేను తప్పకుండా శిక్షావర్గలు పూర్తిచేస్తానన్నాను. ఇక వారు వెళ్ళిపోయినారు.

## హృదయాన్ని కదిలించినవేళ :

మే మాసం ఎండలు దండిగా ఉన్నవి. ఇంటివద్ద తాటాకుల పందిళ్ళక్రింద పొగాకు

మండె తిరగేస్తున్నాము. మిట్టమధ్యాహ్నం ఒక అబ్బాయివచ్చి అన్నా నీకొరకు ఎవరో ఇద్దరు వరంగల్‌నుండివచ్చి కొలిమిమఱ్ఱి కాడ ఉన్నారు. మిమ్మల్ని రమ్మని చెప్పినారు. నాకేమి అర్థంకాలేదు. నాకొరకు ఈ ఎండలో వచ్చేవాళ్ళు ఎవరుంటారులే అని నేను అట్లే పనిలో ఉన్నాను. ఇంతలో నాన్నగారు కల్పించుకుని వెళ్ళు, తొందరగారాపో అన్నారు. వెళ్ళి చూసేసరికి శ్రీ హల్దేకర్‌జీ మరియు శ్రీ కె.వి. సత్యన్నారాయణగారు. నానోట మాటరాలేదు. నిర్ఘాంతపోయా! ఏమిమాట్లాడాలో తెలియని స్థితి. వారు అక్కడ ఉన్న వారిద్వారా తెలుసుకున్నట్లు ఉన్నది. మా నాన్నగారి గురించి, మా ఇంటి స్థితిగతులగూర్చి. అంతా బాగున్నారా? ఇంకా ఏదో, ఏదో మాట్లాడి ప్రథమవర్ష శిక్షావర్గ గుర్తుచేద్దామని వచ్చాము. ఇకమేము వెళ్ళిపోతామని అన్నారు. నేను ఉండండి కొంచెం మంచినీళ్ళు తెస్తా, అవసరంలేదు ఇప్పుడే తాగాం అని ఆ ఎండలోనే బయలుదేరినారు. నేను వారిని అనుసరించాను. వద్దు బా... ఎండతీవ్రంగా ఉంది అని నన్నువారించారు. వారు వెళుతుంటే ఊరుబయట ఉన్న ఆ చెట్టుదగ్గర వారు కనిపించేంతవరకు నేను నిలుచుండిపోయాను. కళ్ళెంట నీళ్ళువచ్చాయి. హృదయం చలించింది. ఎనిమిది కి॥మీ॥ నడవాలి. బస్సుకూడా ఎప్పుడో ఒకటి ఉంటుంది. భోంచేసారో లేదో కూడా తెలియదు. ఆరోజు వారి పట్టుదల కార్యకర్త నిర్మాణమునకై వారి తపన సంఘకార్యంపై ఉన్న ఆవేదన, వారిలోని సంవేదన నాపై చెరగని ముద్రవేసింది. నన్ను కార్యోన్ముఖునిచేసి నా వ్యక్తిగత కుటుంబ విషయాలన్నిటిని ప్రక్కనపెట్టి ఒక దృఢమైన నిర్ణయం తీసుకొని, ఇంట్లో ఎవరికి చెప్పకుండా మా గ్రామములోని మరో స్వయంసేవక్ పాము వెంకటేశ్వర్లును తీసుకొనిపోయి 1968లో కేశవమెమోరియల్ స్కూలులో ప్రథమవర్ష పూర్తిచేశాము. ఆనాటి నిర్ణయమే నన్నింకా ఈ దిశలో ఎన్నిఒడుదుడుకులు, ఆటంకాలు, ఇబ్బందులు వచ్చినా, ముమ్ముందుకు నడిపిస్తున్నది.

## సాహసోపేతమయిన నిర్ణయం :

ఎమర్జెన్సీ సమయంలో నేను జహీరాబాద్ కళాశాలలో పనిచేస్తున్నాను. అదొక భయకంపిత వాతావరణము. జీవితంలో అదొక పీడకల. నేను ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తనని చాలామందికి తెలుసు. కొందరైతే నాతో మాట్లాడటానికి గాని, కనీసం దగ్గరకు రావటానికిగాని భయపడేవారు. ఆ పరిస్థితుల్లో శ్రీ హల్దేకర్‌జీ, శ్రీ కె.వి. సత్యన్నారాయణగారు సాయంత్రం నాలుగున్నర గంటలకు నారూముకు వచ్చారు. వారి గెటప్ ఇప్పుడు చెప్పినా

నమ్మలేరు. మంచి బెల్‌బాటమ్ పాంటు, ఫుల్ షర్టు, టక్‌చేసి, నల్లటి పెద్ద గాగుల్స్, హైహిల్స్ షూ, చేతిలో మెడికల్ రిప్రజెంటివ్ బ్యాగు, నెత్తిన బ్రిటీషర్స్ టోపి, వారిని చూసి నేను ఆశ్చర్యపోయాను. విషయాలు మాట్లాడుతూ కొద్దిగా రెస్టు తీసుకొని సాయంత్రం ఆరున్నర గంటలకు బస్టాండుకు బయలుదేరాము. నన్నువెళ్ళి హైదరాబాదువెళ్ళు బస్సులో సీట్లు ఆపి మాకు సైగచేస్తే ఆమూలనుండి వస్తామని చెప్పారు. నేను అదే ప్రకారంగా చేసా. కిటికీవైపు హల్దేకర్‌జీ కూర్చున్నారు. కంట్రోలు రూమువైపు వెళుతున్న వ్యక్తిని చూపుతూ సత్యం అతడే కదా? మనలను అనుసరిస్తున్నది అన్నాడు. శ్రీ సత్యన్నారాయణ గారు అవునన్నారు. వెంటనే దిగుదిగుమని దిగేసారు. చీకట్లో కొద్దిదూరం వచ్చి, తర్జన భర్జనలుచేసి ఒకనిర్ణయానికి వచ్చినారు. ఆరాత్రి రైల్వేట్రాకువెంట “కోహిర్” అనే గ్రామానికి చేరుకోవాలి. పరిస్థితి చాలాతీవ్రంగా ఉన్నది పదపద అన్నారు హల్దేకర్‌జీ. ఏం బా.... మమ్ముల ట్రాక్ ఎక్కించి వెళ్ళిపో. అలాగే చేశా. అప్పటి నా పరిస్థితి క్లిష్టమే.

పాపం అది అమావాస్య చీకటి రాత్రి. ఎప్పుడూ చూడని దారి. సాధారణమైన దారికూడా కాదు. పరిచయంలేని ప్రాంతం. ఎక్కడ తిన్నారో! ఎక్కడ ఉన్నారో! ఎప్పుడు తిన్నారో! ఏం తిన్నారో! ఆ దేముడికే తెలియాలి. అనుకున్నట్లు, అనుకున్న స్థలం చేరతారో? మధ్యలోనే అరస్టు అవుతారో ? అంతా క్షణం క్షణం ఒక భయంకర వాతావరణంలో బయలుదేరారు. ఆరాత్రంతా నాముందుఇవే సమాధానం దొరకని ప్రశ్నల వర్షం. చివరికి అన్నింటికి సమాధానం ఆ తల్లి “భారతమాత సేవే” అని తృప్తిపడినాను.

## చేతలద్వారా మార్గదర్శనం :

కార్యకర్తల నిర్మాణంలో ఇలా, అలా అని చెయ్యాలని చెప్పిందానికన్నా చేసి చూపినదాని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అలాంటి సన్నివేశాలు అనేకం వారినుండి నేను చూసే అదృష్టం లభించింది. వారిజీవిత కాలంలో నాలాంటివేలాదిగా కార్యకర్తలు ప్రేరణ పొందినారనటంలో సందేహం లేదు. వయస్సుపెరిగి పర్యటన చేయుటకు శరీరం సహకరించనపుడు తన మేధోశక్తికి పనిచెప్పి “పెనుతుఫానులో దీపస్థంభం” లాంటి గొప్పగ్రంథం తెలుగులోకి అనువదించి, మనకందించిన మహావ్యక్తి. కార్యకర్తకు వారిజీవితమే ఒక పాఠ్యప్రణాళికగా, ఒక రోల్‌మోడల్‌గా వుంచి వెళ్ళిన శ్రీ రాంభావు హల్దేకర్‌జీగారి ఆత్మీయ స్మృతికివే నా వినమ్ర ప్రణామాలు.

**– అలువాల బిక్షపతి, వరంగల్**

# శ్రీ రాంభావ్‌జీ హల్దేకర్‌తో నా అనుభవాలు

శ్రీ భానూసింగ్‌గారి ప్రోత్సాహంతో నేను 1970లో 10వ తరగతి వార్షిక పరిక్షల తరువాత పటాన్‌చెర్వుకు వేసవిసెలవులలో విస్తారక్‌గా ఆర్.ఎస్.ఎస్. శాఖ ప్రారంభించుటకు వెళ్ళాను. తరువాత 1971లో ఇంటర్ ప్రధమ వార్షిక పరీక్షల తర్వాత మెదక్‌జిల్లాలో నర్సాపూర్ తాలుకాలోగల దౌల్తాబాద్‌కు ఆర్.ఎస్.ఎస్.విస్తారక్‌గా శ్రీ భానూసింగ్ (అప్పటి జిల్లా ప్రచారకులు) గారి ప్రోత్సాహంతో వెళ్ళాను. నా క్లాస్‌మేట్ రాజ్‌వీర్ సహాయంతో సుమారు 40మంది యువకులను దౌల్తాబాద్‌లో మొదటిరోజు ఊరిబయట మైదానంలో సాయంత్రంపూట సమావేశపరిచాను. ఆ సమావేశానికి శ్రీ భానుసింగ్‌గారు కూడా వచ్చి నన్ను అందరికి పరిచయంచేసి ప్రతి హిందూ యువకుడు ప్రతిరోజు శాఖకు రావాలని ఉద్బోధించారు. నేను 40 రోజులు దౌల్తాబాద్‌లో ఉండి ఉదయము, సాయంత్రం శాఖలు నడలిపించారు. ఆ సమయములో నాకు ధైర్యం చెబుతూ తగిన సలహాలు ఇస్తూ 2సార్లు శ్రీ హల్దేకర్‌జీ నాకు ఉత్తరాలు రాశారు. అవి నాకెంతో మనోధైర్యాన్ని ఇచ్చాయి. నేను విస్తారక్‌గా ఉన్న సమయంలో కొందరు ముస్లింలు నన్ను చాలా ఇబ్బంది పెట్టారు. ఊరు విడిచి వెళ్ళిపొమ్మని లేకుంటే "ఖతం" చేస్తామని ధమ్‌కీ ఇచ్చారు. అయినా నేను చలించకుండా 40రోజులు రెండు శాఖలు నడిపాను. నా స్నేహితుడు రాజ్‌వీర్ కూడా ఊరువిడిచి వెళ్ళమని సలహా ఇచ్చాడు. నాకు దౌల్తాబాద్‌లో తిండి పెట్టేవాళ్ళే కరువయినారు. అప్పుడప్పుడూ హోటల్లో తినేవాణ్ణి. మరికొన్నిసార్లు పేలాలు, పుట్నాలు, అటుకులతో సరిపెట్టుకొనేవాడిని. శ్రీ హల్దేకర్‌జీ ఉత్తరాలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి. శ్రీ హల్దేకర్‌జీ మా విభాగ్ ప్రచారక్‌గా ఉన్నప్పుడు నేను వారికి చేరువయ్యాను. 1970లో గుడివాడలో ప్రథమవర్ష శిక్షావర్గ పూర్తిచేశాను. అప్పుడే నేను ఆర్.ఎస్.ఎస్.ప్రచారక్‌గా వస్తానని శ్రీహల్దేకర్‌జీ తో చెప్పాను. కాని వారు ఇప్పుడే కాదు "నీవు ఇంకా బాగా చదువుకోవాలి. అప్పుడే నిన్ను ప్రచారక్‌గా తీసుకుంటాము"అని సరియైన సలహాఇచ్చి దారిలోపెట్టారు. వారి బౌద్ధిక్‌లు నన్నెంతో ప్రభావితం చేశాయి. 1970లో ప్రథమవర్ష, 1985లో ద్వితీయ వర్ష, 1987లో తృతీయవర్ష శిక్షావర్గలు

పూర్తిచేయడానికి శ్రీ హల్దేకర్‌జీ మార్గదర్శనాలు నాకు ఎంతో తోడ్పడ్డాయి.

కలిసిన ప్రతిసారి నన్ను పేరుపెట్టి పలకరించి పాతస్వయంసేవకుల క్షేమసమాచారాలు తెలుసుకునేవారు. వారు అనారోగ్యంతో మంచం పట్టడం నన్నెంతో కలచివేసింది. శ్రీ రామాచారిగారు ఎంతో ఓపికతో వారికి సుశ్రూష చేయడం నేను జీవితంలో మరువలేను. అనారోగ్యంతో ఉన్నప్పటికి నన్నెంతో ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరించేవారు.

1975-1977 కాలంలో అత్యవసర పరిస్థితిలో వారు ప్యాంటు, షర్టు ధరించి మారువేషంలో సంగారెడ్డికి వచ్చి సత్యాగ్రహులను సిద్ధంచేశారు. నేను 1976 జనవరిలో సత్యాగ్రహంచేసి 42రోజులు జైలుశిక్ష అనుభవించడంలో వారి ప్రోత్సాహం ఎంతగానో ఉంది.

గురుతుల్యులైన శ్రీ హల్దేకర్‌జీ మరణం నన్నెంతో కలవరపరిచింది. వారి అంత్యక్రియలలో పాల్గొన్న సందర్భంగా నేను కన్నీరు ఆపుకోలేకపోయాను. వారికివే నా అశ్రునయన శ్రద్ధాంజలి.

**- పి. పద్మారావు, సంగారెడ్డి**

# హల్దేకర్‌జీ అందించిన ప్రోత్సాహం

**మా**ననీయ హల్దేకర్‌జీ 1967 కొత్తగూడెం, ఖమ్మంజిల్లా రామచంద్ర పాఠశాలలో నిర్వహింపబడిన ప్రాథమిక శిక్షవర్గలో మొదటి పరిచయము. నేను ఖమ్మంలో ఉద్యోగం చేస్తూ ముఖ్యశిక్షక్ బాధ్యతతో ప్రాథమిక శిక్షవర్గలో పాల్గొనడమైనది. అంతకుపూర్వం నేను 1956 నుండి పరకాలలో మరియు హన్మకొండ ఏనుగులగడ్డ శాఖలకు వెళ్ళినప్పటికి ఒకసాధారణ స్వయంసేవక్‌గా మాత్రమే పాల్గొనేవాడిని. ప్రాథమిక శిక్షావర్గలో పాల్గొన్న రోజులలో ప్రచారక్ వ్యవస్థతోపాటు మాననీయ హల్దేకర్‌జీ చూపే ఆత్మీయ పలకరింపులు నన్ను ఒక కార్యకర్తగా నిలిపింది. వారి పలకరింపులోని ప్రత్యేకత ప్రతి ఒక స్వయంసేవక్‌కు స్ఫూర్తినిచ్చేది.

మా స్వంత ఊరు ఒడితెల కొత్తపల్లి శాఖకు వారు తరచూ వచ్చుచుండేవారు. మా ఊరికి రావాలంటే ఆనాటికి వరంగల్లునుండి మహాదేవ్‌పూర్ వెళ్ళే ఒకే ఒక్క సర్వీస్‌లో వచ్చి మోరంచ వద్దదిగి 3మైళ్ళ నడచి వచ్చేవారు. ఒకపర్యాయం జడలపేట గ్రామానికి

కోజాగిరికి వెళ్ళేందుకు పొనగంటి సమ్మారావు, ఏంచేని తిరుపతిరావుగారు ఏర్పాటుచేసిన "కచ్చడం బండి"లో శాఖకువెళ్లి తిరిగి అదేబండిలో వెనుకకు బయలుదేరారు. మార్గమధ్యంలో "లోతుగుంట బట్టె"లోని పెద్దపెద్ద బండలుండడంతో (రాళ్ళు) ఎడ్లబండి పడిపోయి హల్దేకర్‌జీ ఒకచేయి ఫ్రాక్చర్ అయింది, అదేరాత్రి అందరూ కలిసివారిని మహదేవ్‌పూర్ రోడ్డువద్దకు తీసికొనివచ్చినారు. మోరంచ బస్సు స్టాప్‌కు వచ్చేసరికి సుమారు తెల్లవారు ఝామైయ్యింది. బస్సుస్టాప్ వద్ద చిన్న హొటల్ పెట్టుకున్న జంగం రాజయ్య వెంటనే వేడిపూరి, పప్పు సిద్ధంచేసి ఇచ్చారు. ఆనాటినుండి ఆవైపు నాకెవరు కలిసినా సమ్మారావు, తిరుపతిరావుగురించి తెలుసుకొనేవారు. తమ పర్యటనలో "జంగం రాజయ్య" చేత పూరి, పప్పు చేయించుకొని తినేవారు. ఇప్పటికీ వారందరూ హల్దేకర్‌జీ గురించి చెప్పుకుంటూనే యుంటారు. అనేక సంవత్సరాలుగా నేను భాగ్యనగర్‌లో సంఘకార్యకర్తగా మరియు శ్రీ సరస్వతీ విద్యాపీఠం కార్యకర్తగా నిలిచాను. పొందుతున్న వారి ఆత్మీయ పలకరింపు, మార్గదర్శనము యొక్క అనుభూతి మరువరానిది.

**– కుందూరు విద్యాన్‌రెడ్డి, ప్రాంతకార్యకారిణి సభ్యులు**

# కొత్త స్వయంసేవకులను పుట్టిన బిడ్డతో పోల్చటం

**మా॥ శ్రీ హల్దేకర్‌జీ గోష్ఠి కార్యక్రమములో మాట్లాడుతూ....**

శాఖకు కొత్త స్వయంసేవక్ ఎవరైన వచ్చినట్లైతే అప్పుడే ఇంట్లో శిశువు పుడితే ఇంట్లో ఎంతో ఆనందంగా అందరు కుటుంబ సభ్యులు పుట్టిన శిశువును చూసి ఆనందించినట్లుగా మన నిత్యశాఖలో ఎవరైన క్రొత్తగా శాఖకు వస్తే అదే విధంగా మన సంఘస్వయంసేవకులు, కార్యకర్తలు ఆనందించుతారు. అతనితో పరిచయం పెంచుకుంటాము అని వారు అభివర్ణించేవారు.

ఇంట్లో క్రొత్తగా పుట్టిన శిశువు పట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటామో సంఘశాఖకు క్రొత్తగా చేరిన స్వయంసేవక్‌పట్ల అంత ప్రేమ, ఆప్యాయత శ్రద్ధ తప్పక తీసుకోవాలని వారు అభిలషించేవారు.

స్వయంసేవకుపట్ల వారు చూపించే ఆత్మీయత, ప్రేమానురాగాలు అనిర్వచనీయము.

## కుటుంబంపట్ల ఆత్మీయత :

నేను జిల్లా శారీరక ప్రముఖ్‌గా ఉన్నప్పుడు మాఅమ్మగారు దివంగతులు అయినపుడు (2007) మా ॥హల్దేకర్‌జీకి తెలిసి ఎంతో అవేదన చెంది ఉత్తరం ద్వారా ఓదార్చారు. వారు ఓదార్పుగా ఒక ఉత్తరం రాసి పంపినారు. మరణం అన్నది సహజమైన ప్రక్రియ. మనం దుఖఃలో కూడా సంతోషంగా ఉండాలని ఓదార్చారు. వెలుగు చీకటిలాంటివే సుఖదుఃఖాలు అని అభివర్ణించారు. అదేవిధంగా నా తమ్ముడు దామోదర్ 2015లో దివంగతులయ్యారు, అప్పుడు కూడా హల్దేకర్‌జీ సంతాపం తెలియజేసి, సానుభూతిని పంచారు. మా॥ హల్దేకర్‌జీ కుటుంబంపట్ల చూపించే ఆప్యాయత మరియు స్వయంసేవకులపట్ల అద్వితీయం.

## 1986 గోదావరి వరదలలో సేవలు :

1986 గోదావరి వరదలలో బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, మానవరం, తుక్కునూల, మొదలగు గ్రామాలు మునిగిపోయినపుడు మా॥ హల్దేకర్‌జీ ముందుండి సేవా కార్యక్రమాలు నడిపించి బూర్గంపాడునందు భారతీ భవన్ నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించారు. భారతీ భవన్ వరద బాధిత సేవలకై నిర్మాణం చేయబడింది. దాని నిర్మాణానికి పురప్రముఖులు కలిసి తగిన నిర్మాణనిధులు సమకూర్చటంలో ఎంతో శ్రమించారు.

## దక్ష, ఆరమ శాఖ గుండెచప్పుడు :

మా॥హల్దేకర్‌జీ గొప్ప త్యాగమూర్తి. గుండెకు లబ్, డబ్ ఎటువంటివో శాఖకు సంఘశాఖకు దక్ష, ఆరామ అటువంటివి అని వారు చెపుతుండేవారు.

**– పిల్లి రాజేశ్వరరావు, కొత్తగూడెం.**

# మా॥ రాంభావు హల్దేకర్‌జీతో నా అనుభవం

**మా॥** రాంభావు హల్దేకర్‌జీ, బోయిన్‌పల్లిలోని మా ఇంటికి కేదారేశ్వరవ్రతం పూజకు వచ్చేవారు. వారి వయసుగల మా నాన్నగారు (వారికి ఒకకాలులేదు) వారిని ప్రత్యేకంగా అభిమానిస్తూ ఆహ్వానించేవారు. మాటల సందర్భంలో "మీ ఊర్లో వారాల అంజయ్య ఇప్పుడు ఎలాఉన్నారు. పొడువుగా ఎర్రటినామం పెట్టుకునేవారు. చక్కటి భజనచేసెవారు, నాకు వారింట్లో భోజన వ్యవస్థ ఉండేది". మా నాన్నగారు నేనూ ఆశ్చర్యపోయాము. సరిగ్గా బస్సుసౌకర్యం కూడాలేని, మారుమూల గ్రామము. సిద్దిపేట దగ్గర పెద్ద చెప్యాల గ్రామము. మానాన్న తన గ్రామ విషయాలు వారినోటిద్వారా విని, చాల ఆనందపడుతూ, మీ జ్ఞాపకశక్తి చాలగొప్పది. మీరు మీ జీవితకాలం అంతా సమాజంలో తిరుగుతున్నారు. అంటూ వారికి చేతులు జోడించి అభిమానంగా గౌరవంగా నమస్కరించాడు. నేను మా నాన్నకు ఆర్.ఎస్. ఎస్. విషయాలు చెప్పేటపుడు అంతగా శ్రద్ధ చూపేవాడు కాదు. కాని జ్యేష్ఠకార్యకర్తలు ఇంటికి రావటం, వారి అనుభవాలు ఆసక్తిగా వినటంవల్ల ఆర్.ఎస్.ఎస్. పైన ముఖ్యంగా నేను చేస్తున్నపనిపైన చాలా గర్వంగా, గౌరవంగా చూసేవాడు. హల్దేకర్‌జీని వారి చివరిరోజుల్లో చాలాసార్లు వారి గదికివెళ్ళి దర్శించుకున్నాను. వారితో గడిపిన ఆత్మీయ అనుభవాలు మనలో మిగిలాయి.

**– దుంద్రపు దుర్గారెడ్డి, బోయిన్‌పల్లి.**

# వారిది అద్భుత స్మరణశక్తి

నేను బాల్యం నుండి స్వయంసేవక్. 1995నుండి1997వరకు వృత్తిరీత్యా వరంగల్‌లో ఉన్నాను. ఖాజీపేట మండల కార్యవాహగా బాద్యత. ఒకరోజు హనుమకొండ కార్యాలయంలో హల్దేకర్‌జీ బైఠక్ తీసుకున్నారు. నేను అదే మొదటిసారి చూడటం. పరిచయం చేసుకునేటప్పుడు కొందరు "నేను బాల్యంనుండి స్వయంసేవక్"అని చెప్పుకున్నారు. అప్పుడు హల్దేకర్‌జీ "మీరు బాల్యం నుండి స్వయంసేవక్ అని అంటే

మీరు ఎన్నేళ్ళనుండి స్వయంసేవక్ అని తెలుసుకోవాలని అంటే మళ్ళీ మిమ్మల్ని మీవయసెంతా అని అడగాల్సి వస్తుంది. అందుకే, ఎప్పుడూ, ఎన్నేళ్ళనుంచి స్వయంసేవక్ అని చెప్తే స్పష్టంగా ఉంటుంది" అన్నారు. నాకు ఆ సలహా మంచిదనిపించింది. "40సం॥లనుండి స్వయంసేవక్" అని చెప్తే మరొక ప్రశ్నకు తావులేకుండా ఉంటుంది. అప్పటినుండి నేను పరిచయం చేసుకునేటప్పుడు వారు సూచించినట్లే చెపుతుంటాను.

బైఠక్ తరువాత "నేను కర్ణాటకలో శివమొగ్గ స్వయంసేవక్" అని పరిచయం చేసుకున్నాను. సంవత్సరం తరువాత ఇంకొక బైఠక్‌లో నన్ను "శివమొగ్గ స్వయంసేవక్ కదా" అని అడిగినప్పుడు వారి స్మరణశక్తికి జోహార్ అనిపించింది.

**– తాయిలూరు ఎస్. సుందరరాజ**

# మాన్యశ్రీ హల్దేకర్‌జీ జ్ఞాపకాలు

**నే**ను 1964 జులైలో భాగ్యనగరం, ఉద్యోగబదిలీమీద వచ్చిన కొద్దినెలల తర్వాత హల్దేకర్‌జీతో పరిచయం లభించింది. అది క్రమేపి సన్నిహితంగా వృద్ధిఅయినది. ఈ అర్ధశతాబ్ధిపైగా కలసిఉండటంలో వారితో కొన్ని స్మృతులు:–

1. వారు మా నగరం పర్యటనకు వచ్చినప్పుడు, అప్పుడప్పుడు మా యింట్లో మధ్యాహ్న సమయంలో విశ్రమించుతుండేవారు కొద్ది సమయం. ఆ సమయంలో వారిని ఎక్కువ మాట్లాడించకూడదని దూరంగా ఉన్నా, వారే కల్పించుకొని, మాట్లాడుతుండేవారు. వెళ్ళేప్పుడు బట్టలు పెడుతుంటే, ఎందుకు ఇవన్నీ అనటం, నేను బలవంతంగా ఇవ్వటం జరుగుతుండేది.

2. వారు "పెనుతుఫానులో దీపస్తంభం" పుస్తకం వ్రాసినప్పుడు చాలామటుకు, ఒకరకంగా వారే దాన్ని స్వయంసేవకులందరి దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేసేవారు. ఈ క్రమంలో ఒకతడవ కేశవనగరు సంక్షేమ సంఘం భవనంలో వారు స్వయంసేవకులతో మాట్లాడారు 2010లో. ఆసందర్భంలోనే "జాగృతి" గురించికూడా చాలాసేపు చెప్పారు. సమావేశం తర్వాత మాయింటికి విశ్రాంతికై వచ్చారు. అప్పటికే వారి ఆరోగ్యం బాగాలేదు. సహాయకుడు కూడా వున్నాడు. వారితో 4–5 గురు స్వయంసేవకులను తీసుకువచ్చారు. కొంతసేపు మాట్లాడిన తర్వాత "శ్రీ దుబ్బాక నరసింహారావు" ఏడి అని అడిగారు.

శ్రీ దుబ్బాక సమావేశానంతరం వెంటనే వెళ్ళారో, నేను పిలుచురావటం మరిచానో గుర్తులేదు. ఏమైనా నా తప్పుకు కొంచెం యిబ్బంది అయినది. ఎందుకు వ్రాస్తున్నానంటే పాతస్వయంసేవకుల పేర్లు శ్రీ హల్దేకర్‌జీకి అంతగుర్తు.

3. 1996లో ఓ తడవ మా రెండవ అబ్బాయి చి॥ మురళి వివాహ పత్రిక ఇవ్వడానికి నేను, నాభార్య కార్యాలయం వెళ్లాము. వివాహం, పెళ్ళికూతురువాళ్ళ ఊరు 'వినుకొండ'లో. పత్రిక చూసి, వివాహవేదిక– "వినుకొండ సాయిబాబా మందిరం హాలులో"అన్న సంగతికి ఈ సాయిబాబా మందిరం వినుకొండలో ఎక్కడున్నది!? అని అడిగారు. నాకు తెలియని కారణంగా ఊరుకొన్నాం. లేదే అని వారిలో వారు చిన్నగా అన్నారు. తర్వాత మా వియ్యాలవారిద్వారా తెలిసిందేమంటే ఆ మందిరం వచ్చినది. అనగా, వారు 'విజయవాడ విభాగ్' చూస్తున్నప్పుడు ఆ మందిరం లేదు. అంటే వారి పర్యవేక్షణలోని ఊర్లు వాటిసంగతులు అన్నీవారికి అంత క్షుణ్ణంగా తెలుసు. వినుకొండ–గుంటూరుజిల్లాలో ఉంటుంది. అది అప్పటి విజయవాడ విభాగ్‌లో భాగం.

అలాగే, అక్కడ మన జేష్ట కార్యకర్త, శ్రీ టి.ఎస్.ఆర్. ఆంజనేయులుగారు ఉండవలెగదా అన్నారు. అప్పటికే మాకు ఆ విషయం తెలిసి ఉండటాన, అవునండి వారు మా కాబోయే వియ్యంకుడికి చుట్టమేనట, వివాహానికి వస్తారు అని చెప్పాము! ఇలాగా వారు ప్రతి విషయంలోనూ మినిట్ డీటైల్స్‌లోకి వెళ్తుండేవారు– అంతగుర్తుగా.

4. 8–9సం॥ క్రితం ఓసారి, శ్రీపట్నం శ్రీనివాసరావు కూతురు వివాహంలో శ్రీ దేవేందరు గారు మాతో మాట్లాడుతూ యథాలాపంగా అన్నారు కదా– శ్రీహల్దేకర్‌జీ – ప.పూ. శ్రీ గురూజీని చూసినవాళ్ళు ఉపన్యాసాలు విన్నవారి యిండ్లకు వచ్చి అక్కడ కొంతమంది పాత స్వయంసేవకులను కలిసే యోజన చేస్తున్నారు అని. నాకు వెంటనే అనిపించింది. 1950 నుంచి 1973 దాకా బాలస్వయంసేవకునుంచి మొదలుపెట్టి అనేకమార్లు గురూజీ బౌద్ధిక్‌లు వినటమేగాక, రెండుపర్యాయములు వారితో వన్ టూ వన్ సంభాషించే భాగ్యము కూడా లభించింది కదా అనుకుంటూ, నాలోనేనే ఆ సన్నివేశాలను నెమరువేసుకున్నాము– ఇలాగా–1950 వేసవిలో నెల్లూరులో ఆంధ్ర–తమిళ ప్రాంతాలకు కలిపి ఓ.టి.సి. జరిగింది. మేము అప్పుడప్పుడే సంఘంలో స్వయం సేవకులమయి ఆరునెలలైనది. నేను శ్రీ ఎస్.వి. శేషగిరిరావు, పద్మనాభం, చలం, యామినీ భాష 14–15 సం॥లు. మేము ప్రబంధకులం, మాకు గార్డింగు డ్యూటిలు ఇచ్చారు.

ఆ ఓ.టి.సి.కి ప.పూ. శ్రీ గురూజీ వచ్చారు. ఆరోజు ప్రమాదవశాత్తు ప్రహార్‌మార్‌తో ఓ శిక్షార్థికి తలకుగాయమైనది. వైద్యవిభాగ్‌లో కట్టుకట్టి, బసకు చేర్చారు. వి.ఆర్. హైస్కూలు గ్రౌండులో శాఖ – ప్రక్కనే వి.ఆర్. కాలేజీలో బస, మధ్య ఓచిన్న గేటు. శాఖ తర్వాత శ్రీ గురూజీ అతన్ని చూడడానికి వస్తున్నారు. ఇంతలో అక్కడ నిక్కర్లు, లాఠీలతో ఉన్న బాల స్వయంసేవకులను, మమ్మల్నిచూసి, ప.పూ. గురూజీకి మేము నమస్కరించాము. వారు అడిగారు "వాట్ ఆర్ యు స్టడియింగ్"? అని– మాది తెలుగుమీడియం. ఇంగ్లీషులో మిడిమిడి జ్ఞానం. అయిదవ తరగతి పరీక్షలు వ్రాశాము. ఇంకా ఫలితాలు వెలువరించలేదు. 5వ తరగతి అని కొందరు – పరీక్షలు అయినాయి కనుక 6వతరగతి అని కొందరము చెప్పాము ఒకే తడవ. మమ్మల్ని ఆట పట్టించడానికి శ్రీ గురూజీకి మంచి అవకాశం దొరికింది. విచ్ ఈజ్ కరెక్ట్ ? 5వ తరగతా లేక 6వ తరగతా ? మరల ప్రశ్న. మొత్తానికి వచ్చీరాని ఇంగ్లీషులో మేమంతా 5వ తరగతి నుంచి 6వ తరగతికి రాబోతున్నామని చెప్పగలిగాం. " వై ఆర్ యు కమింగ్ టు శాఖ?" మరో ప్రశ్న. "ఐకమత్యం" అని పొడిమాటతో మా సమాధానం. ఇలాఆ ఓ 10–12 నిమిషాలు శ్రీ గురూజీతో సంభాషణ ఆ చిన్న వయసులో మరువరానిది జీవితంలో.

పై విషయాలతో శ్రీ గురూజీతో సంభాషణా పరంగా కూడా అనుసంధానమై ఉన్నాను. కనుక ఈ నేపథ్యంతో మిత్రుడు శ్రీ దానం హనుమంతరావు గారిని తీసుకొని శ్రీ హల్దేకర్‌జీ గారిని కలవడం, వారు వెంటనే రావడానికి ఒప్పుకోవడం జరిగింది. తేదీ నిర్ణయించవలసి ఉంది. అయితే, మా ఇంట్లో మేడమీద హాల్‌లోనే, సమావేశంకు వీలువుంది కానీ, వారు పైకి ఎక్కడం కొంచెం కష్టమవుతుందని స్థలం శ్రీ బంగారులక్ష్మణ్‌గారి ఇంటికి మార్చాము. 25మందిదాకా పాత స్వయంసేవకులు వచ్చారు. శ్రీహల్దేకర్‌జీ వారి అనుభవాలు కూడా కొన్ని చెప్పారు.

5. వారు స్వర్గస్థులయే దానికి 5,6 నెలల ముందు ఓసారి కార్యాలయం వెళ్ళాను. వారి గది ముందుఉన్న సహాయక్ శ్రీ యుద్ధవీర్‌ని అడుగగా, వారు కూర్చొనే ఉన్నారు. కలవవచ్చు అని చెప్పాడు. వెళ్ళి నమస్కరించి కూర్చొన్నాను. కళ్ళతోనే మాట్లాడుకున్నాము. వారి ఆరోగ్యపరిస్థితి చూచి నాకు చాలా బాధ అయింది. 10–15 నిమిషాల తర్వాత – నేను తీసుకువెళ్ళిన బట్టలు – (సన్నని పంచ, కండువా) వారిముందు బల్లమీద పెట్టాను. ఇవన్నీ ఇప్పుడెందుకని వారు చేత్తోనే సంజ్ఞచేశారు. నేను నమస్కారంతోనే ఉంచండి

అన్నట్లు బదులు చెప్పాను. తిరిగి నమస్కరించి వచ్చేశాను బాధగా.

ఇలాగా ఇంకా ఎన్నో అనుభవాలు. ఈ అర్ధశతాబ్దిలో వారివి. నాతోనూ, కుటుంబ సభ్యులు ముఖ్యంగా మా అబ్బాయిలతోనూ మరుపురానివి.

**– ఆర్. పూర్ణచంద్రరావు, భాగ్యనగర్**

# మా॥ హల్దేకర్‌జీ ఆచరణీయ మార్గదర్శనం

**19**72 నుంచి స్వయంసేవకుడను. 1978లో మాననీయ హల్దేకర్‌జీ విజయవాడ విభాగ్ ప్రచారకుగా నియమించబడ్డారు. అప్పుడు వేమున్నది ఏలూరు, పశ్చిమగోదావరిజిల్లా. ఒక ప్రభాత్‌శాఖ నడిచేది. 20సంఖ్య. నేను ఆ శాఖకి ముఖ్యశిక్షకుని. వీరు ఏలూరు పర్యటనకి విజయవాడనుండి ఉదయం వచ్చారు. వారిని నేనే బస్టాండ్‌నుంచి శాఖకి తీసుకువచ్చా. అక్కడ పూర్తి గణవేశ్ వేసుకొని ప్రణామచేసి కూర్చొన్నారు. ఆరోజు సంఖ్య 50. అందరిని పరిచయం చేసుకున్నారు. వచ్చిరాని తెలుగులో బౌద్ధిక్ మొదలుపెట్టారు. ఆ బౌద్ధిక్ వింటానికి కొంచెం హాస్యంగా ఉన్నప్పటికి, ఎంతో విలువైనది. శాఖలో సంఖ్య ఎలా పెరగాలి, పెరుగుతున్న సంఖ్యకి సమాంతరంగా శాఖలు ఎట్లా పెరగాలి...అనేదానిపై మాట్లాడారు.

**ఆరోజు వారి బౌద్ధిక్ సారాంశం :**

నీకు తెలిసిన 10మంది పేర్లురాసుకో. రోజు ఉదయం 5గం॥లకు బయలుదేరి ఈ 10మందిని నిద్రలేపి శాఖకి రమ్మనిచెప్పి, నువ్వు సమయానికి శాఖకు వెళ్ళిపో, ప్రయోజనం సిద్ధించడానికి షుమారుగా 3 నెలలు పడుతుంది. అప్పుడు వీళ్ళల్లోంచి 5గురిని ఎంచుకుని వాళ్ళు ఒక్కొక్కరు 10 మందిని తెచ్చేట్టు ప్లాన్ చెయ్యి. వాళ్ళు ఒక్కొక్కరికి మళ్ళీ 3 నెలలు పడుతుంది. సుమారుగా 6 నెలలు తరువాత 60మంది రావాలి. నిత్యశాఖలో కనీసంగా 30 మంది ఉంటారు. దీనినే గటపని అంటారు. ఇది మాకు 40 ఏళ్ళక్రితం హల్దేకర్‌జీ చెప్పిన పద్ధతి. మేము అదే ఆచరించి సక్సెస్ అయ్యాము. ఖచ్చితంగా ఆచరించాం. 6 నెలల తర్వాత ఆశ్చర్యంగా 3 ప్రభాత్, 3 సాయం శాఖలు నడిచాయి. 6 శాఖలకి ప్రధాన

గటనాయక్‌ని నేను.

**వారు చెప్పిన ఒక సంఘటన :**

మన కార్యకర్త ఒకరు గటపనిచేస్తూ ఒక ఇంటికి వెళ్ళారుట. ఆ ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిని శాఖకు తీసుకుని రావడానికి వెళ్ళాడు. ఇంతలో వాళ్ళ అమ్మగారు బయటికివచ్చి 'ఎవరు కావాలి' అని అడిగారు. మన కార్యకర్త "నేను ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తనండి. ఈ పక్కన గ్రౌండ్‌లో శాఖ నడుపుతున్నాం. రోజు ఆటలు, సూర్యనమస్కారాలు, దేశభక్తి గీతాలు, శివాజీ, రాణాప్రతాప్ వంటి దేశభక్తులందరి కథలు, చివర్లో ప్రార్థన చెబుతాం" అన్నారు. వెంటనే ఆమె "అవునవును, నేను రోజు మా డాబా మీదనుంచి చూస్తున్నాను. నిజమే, చాలా బాగుంది. చెయ్యండి" అన్నారు. మన కార్యకర్త "మరి మీఇంట్లో కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారుకదా, వాళ్ళని కూడా పంపండి" అన్నాడు. ఆ తల్లి కంగారుగా "ఆ లేదులేదు వాళ్ళకి కుదరదు, ట్యూషన్లు, స్కూలు బిజీగా ఉంటారు వాళ్ళురారు. అయితే ఈ పక్కన ఇంట్లో ఒక అబ్బాయి ఉన్నాడు. ఆయన్ని తీసుకువెళ్ళి శివాజిగా తయారు చేయండి. ఈ వెనక ఇంట్లో ఒక అబ్బాయి ఉన్నాడు. ఆయన్ని తీసుకువెళ్ళి రాణాప్రతాప్‌గా చెయ్యండి" అన్నారు. మరి ఈనాడు సమాజంలో సంఘంపట్ల ఇటువంటి ఒక వింత పరిస్థితి ఉంది... అంటూ ఈ విధంగా అనేక విషయాలు చెప్పేవారు.

వారికి ఏర్పాటు చేసిన బస శాఖనుండి షుమారుగ ఒక కి॥మీ॥. నేను రిక్షా పిలవబోయా. వారు వద్దన్నారు నడుచుకుంటూ వెళదాంపద అని నాభుజంమీద చెయ్యివేసి నడుచుకుంటూ మాట్లాడుకుంటూ వెళ్ళాం. వారితో ఒకసారి బస్సులో ఏలూరు నుండి విజయవాడకు ప్రయాణం చేశాను. షుమారు గంటన్నర ప్రయాణం. ఆ సమయంలో వారు ఇటు శాఖలో, అటు సమాజంలో స్వయంసేవక్ పాత్ర ఎట్లా ఉండాలి, అనే విషయాలు చాలా చెప్పారు. వారి ప్రేరణతో కొంతకాలం ఆనాడు రెండు గ్రామాల్లో విస్తారక్‌గా పనిచేశా.

ఆ మహనీయునికి మరొక్కసారి శ్రద్ధాంజలి ఘటిస్తున్నా.

**– ఇసుకపల్లి సీతారామ శర్మ, ఏలూరు**

# మా॥ శ్రీ రామచంద్ర హల్దేకర్‌జీ

శ్రీ రామచంద్ర హల్దేకర్‌జీని నేను మొదటిసారిగా కలిసింది ఏలూరులో. వారు విజయవాడ విభాగ్ ప్రచారక్‌గా ఉండేవారు. నేను ఏలూరులో ప్రావిడెంట్‌ఫండ్ ఆఫీసులో ఉద్యోగం చేసేవాడిని. అగ్రహారంలోని కె.పి.డి.టి. స్కూలుప్రక్కనే ఉండేవాడిని. స్కూలులో శాఖజరిగేది. 1980లో అనుకుంటా. గురుదక్షిణ ఉత్సవం. ఆ స్కూలు భవనంలో నడవలో అరుగులపైన ఆ ఉత్సవం జరిగింది. ముందు గ్రౌండ్ ఉందికాని వర్షం వచ్చినట్లుంది. సంపదచేసి కూర్చున్నాము. ఉత్సవంలో వారి బౌద్ధిక్. వారు హైదరాబాద్ నుండి ప్రచారక్‌గా వచ్చారని చెప్పారు. నేను డిగ్రీ మూడు సంవత్సరాలు చదివింది భాగ్యనగర్‌లోనే. కాని వారిని కలిసినట్లుగా గుర్తులేదు. తెలుగులోనే బౌద్ధిక్ అయినా ఒక్కోసారి వాక్యం పూర్తిఅయ్యేదికాదు. వారి హావభావాలలో విషయం స్పష్టంఅయ్యేది. వినేవారిని కట్టిపడేసే స్వరం, హావభావాలు ఆ ఉపన్యాసంలో నేను చూసాను.

ఆరోజు బౌద్ధిక్ అంతా గురుదక్షిణ విషయంపైనే. గురుపూజ ఒకటి రెండు వాక్యాలలో... భగవధ్వజం, గురువు, సమర్పణ పూర్తిచేశారు. ఇక గంటసేపు గురుదక్షిణ విషయమే.

సామాజికంగా చాలా సంస్థలు ప్రారంభం అవుతుంటాయి. ఒకటి, రెండు కార్యక్రమాలు ఉత్సాహవంతంగా ప్రారంభిస్తారు. లక్ష్యం, ఆఫీసు ఇంకా అనేక హంగులు. తరువాత కార్యక్రమాలు చల్లబడతాయి. ఏమైంది? ఎందుకు ఆగిపోయింది? అంటే “ఏంచేద్దాం, ఫండ్స్‌లేవు” అంటారు. మన శాఖలు 1925 నుండి నడుస్తున్నాయి. మన శాఖలు కూడా అప్పుడప్పుడు ఆగిపోతాయి. ఎందుకు ఆగిపోయిందంటే, ముఖ్యశిక్షక్, ఊరువెళ్ళాడనో, మంచికార్యకర్తకు ట్రాన్స్‌ఫర్ అయ్యిందనో చెబుతుంటారు. కాని ఫండ్స్ లేవు ఆగిపోయింది అంటారా? అంటూ వారు ఓ క్షణం ఆగి ఎదురుగా ఉన్న స్వయంసేవకులను పరీక్షగా చూశారు. అందరూ ఔను అంతేగదా అనిపించింది. ఒక్కసారిగా అందరూ వారినే చూసి చిరునవ్వుతో స్వీకరించాము. శాఖపనికి డబ్బుతో పనేముంది? ధ్వజం ఉంటేపెడతాము, లేకపోతే ధ్వజస్థానం శుభ్రంచేసి ఓంకారంగీసి దానికే ప్రణామం చేస్తాము. ఆడుకుంటాం, పాడుకుంటాం. ఫండ్స్ అవసరమా?

మిగతా సంస్థలలో చేరడానికి సభ్యత్వరుసుం ఉటుంది. సంఘంలో మీరెవరైనా సభ్యత్వ రుసుం చెల్లించి చేరారా? సంఘం విశాల హిందూ కుటుంబం. ఇందులో

రావటానికి సభ్యత్వరుసుం ఉండదు. కుటుంబంలో సభ్యత్వరుసుం ఉండదు కదా? గురుదక్షిణకు సభ్యత్వంకు సంబంధం లేదు. కళ్ళుమూసుకుని ప్రారంభించిన విషయం మధ్యలో స్వరంపెరిగి అందరినీ పరిశీలిస్తూ వారు విషయం చెప్పేవారు.

సంస్థలు నడవటానికి విరాళల సేకరణ ఉంటుంది. రశీదు పుస్తకాలు, చెక్కుల సేకరణ, భూరి విరాళాలు ఇచ్చిన వారికి రాజపోషకులు, మహారాజపోషకులు అని ప్రస్తావించి, పొగిడి ఆనందింప జేస్తారు. అలా సంఘంలో విరాళాల సేకరణ కూడా చేయం. గురుదక్షిణ విరాళాలు ఒకటికాదు. ప్రతీవిషయం తడబడుతున్న వారి తెలుగు, చేతులు, చూపులు విన్యాసం అందరినీ కట్టిపడేసింది.

గురుదక్షిణ అంటే పవిత్రభావంతో గురువుముందు నతమస్తకులమై గుప్తంగా కవర్లో ఉంచి ప్రణామంచేసి పూలతో పూజచేసి భగవంతుడికి సమర్పిస్తున్నట్లుగా చేస్తాము. ఇంతే చేయగలిగాం వచ్చే సంవత్సరం మరింత చేయాలనే భావనతో సమర్పిస్తాం.

ఇలావారు అనేక విషయాలు కుర్చీలో కూర్చుని చెబుతుంటే వారి ముఖవర్చస్సు, హావభావాలు, సమర్పిత వారి జీవితం నా హృదయంపై గొప్పముద్ర వేసింది. మాట్లాడుతున్నంతసేపూ వారి చేతిలోని చైన్‌వాచిని చేతిలో తిప్పుతూనే ఉన్నారు. ఉత్సవం తరువాత అందరితో పరిచయం. నేను హైదరాబాద్ నుండి అనగానే ఎక్కడ ఉంటావు? యాఖుత్‌పురాలో శాఖ ఉందా? ఇలా ప్రశ్నించారు. తరువాత వారి మార్గదర్శనంలో ఎన్ని బౌద్ధిక్‌లు, బైఠకులలో ప్రేరణ పొందినా వారు, కెపిడిటి స్కూలు గురుపూజా ఉత్సవం నాటి అనుభూతి అలా మనసులో ఉండిపోయింది.

2. నేను విజయనగరం జిల్లా ప్రచారక్‌గా ఉన్నసమయంలో ఒక సంవత్సరం వారు ప్రాంత ప్రచారకులు. తరువాత క్షేత్ర ప్రచారకులు. చీపురుపల్లి ప్రక్కనే ఉండే గరివిడిలో కార్యక్రమం. ఆ ఊర్లో 'ఫేకర్' అనే (ఫెర్రోఅల్లాయిస్) ఫాక్టరీ ఉండేది. అందులో బి.ఎమ్.ఎస్. యూనియన్ ఉండేది (శ్రీ జగన్నాథ రాజు దాని సెక్రెటరీ. టి.వి. ఎస్. రామారావుగారు (భాగ్యనగర్) ఆ యూనియన్ ప్రెసిడెంట్. వారితో విజయనగరం నుండి మా జిల్లాకార్యవాహ రామంగారు వచ్చారు. ఓ మేడపైన ఆవరణలో సమావేశ స్థలము. ఎందుకో రామంగారికి యూనియన్ ప్రెసిడెంట్ గారినీ హల్దేకర్‌జీ ప్రక్కన కుర్చీలో కూచోబెడదామనుకున్నారు. నాతో అన్నారు. నేను వారికి చెప్పిచేద్దాం అన్నాను. రామంగారు వారి దగ్గరకు వెళ్ళి ఈ విషయం చెప్పారు. ఇది సంఘ సమావేశం గదా, వారెందుకు? అన్నారు. నీవు జిల్లాకార్యవాహ నీవు కూర్చోవాలి అన్నారు. రామంగారు తెలివిగా మేము

అనుకుని చెప్పానండి అన్నారు. వినగానే వారు అలా అయితే సరే అన్నారు. మొత్తం ఆవరణ నిండిపోయింది. ఎంతో ప్రేరణాదాయక ఉపన్యాసం. వచ్చిన వారంతా క్రిందే కూర్చున్నారు. అదే బి.యమ్.యస్.కు నన్నిస్తారని నాకు అప్పుడు తెలియదు.

విజయనగరంలో వారి పర్యటన సందర్భంగా కేవలం వ్యాపారస్తుల సమావేశం నిర్వహించాం. వైశ్యభవన్‌లో జరిగింది. వారు కార్యక్రమానికి వస్తూ నవ్వుతూ ఎంతమంది వస్తారు అన్నారు. తెలీదండి సంఖ్య ఇరవైవరకూ ఉంటుందేమో. మొదటిసారి ఇలాంటిది యోజనచేసాను. చిరునవ్వు నవ్వి స్కూటర్‌పై వచ్చారు.

అదృష్టమెమో ఆరోజు సంఖ్య యాభైదాటింది. గంటన్నర సమావేశం ప్రశ్నజవాబులు. చివర్లో వారి సమారోప్ మార్గదర్శనం అయిపోయాక విజయనగరంలో ఇంతమంది వ్యాపారస్థులు మన సంపర్కంలో ఉన్నారా? అన్నారు ఆశ్చర్యంగా ! భుజంతడుతూ ఈ పరిచయాలకు పనిలోకి ప్రయత్నం చేయండి అంటూ ఉత్సాహపరిచారు.

బైఠకులలో సంఖ్య తక్కువైనపుడు నవ్వుతూ ఎక్కువమంది ఉంటే తక్కువ పరిచయం. తక్కువమంది ఉంటే ఎక్కువ పరిచయం అంటూ నవ్వేసి పరిచయం లోతుగా చేసుకునేవారు.

ఎవరైనా పరిచయం అయితే వారి ఊరిపేరు వినగానే ఆఊర్లో వారు కలిసిన సంఘపెద్దలు, పరిచయం అయిన వారి బంధువుల పేర్లు అనేకం చెప్పేసేవారు.

క్షేత్రప్రచారకుల తరువాత కొంతకాలం అనారోగ్యంతో కార్యాలయంలోనే ఉండేవారు. కలుస్తూనే మాయింటి వారినీ, మా మామగారు నాగరాజు గారినీ, వారి ఇన్‌సేన్ అమ్మాయి "వల్లి కైసేహై"అంటూ అడుగుతూండేవారు. అంటే కుటుంబపెద్దగా అన్నివిషయాలు, యోగ క్షేమాలు అడిగి తెలుసుకునేవారు. **– భోజనపల్లి నరసింహమూర్తి**

# ప్రత్యక్ష మార్గదర్శనములో

**శ్రీ** హల్దేకర్‌జీ ప్రత్యక్ష మార్గదర్శనములో కొద్దిరోజులు పనిచేసినందులకు నేను వ్యక్తిగతముగా అదృష్టవంతుడనని భావిస్తున్నాను.

**ఒక అనుభవము:**

మాననీయ శ్రీ గొట్టిపాటి మురళిమోహన్‌జీ కృష్ణాజిల్ల సంఘచాలక్‌గా ఉన్నరోజులవి. వారి తమ్ముడు దేవీ చరణ్ అకస్మాత్తుగా పూనాలో స్వర్గస్తులైరి. ఆ సమయములో విజయవాడలో విభాగ్ ప్రచారక్‌గా ఉన్న శ్రీ హల్దేకర్‌జీ పూనాలో ఉన్న సంఘ అధికారులతో

సంప్రదించి ఎటువంటి ఇబ్బందులు లేకుండ పార్థివశరీరము విజయవాడ వచ్చేవ్యవస్థ చేయడము జరిగినది.

శ్రీ గొట్టిపాటి మురళిమోహన్‌జీ కుటుంబము విజయవాడ, కృష్ణాజిల్లాలో చాలా ప్రసిద్ధిగల కుటుంబము. వారి తమ్ముని పార్థివశరీరమునకుఅంజలి ఘటించుటకు చాలామంది విచ్చేసారు. అంత్యక్రియలరోజు వినాయకచవితి అయినది. ఎంత ప్రయత్నము చేసినను, ఒక్క వాహనము కూడా దొరకలేదు. మునిసిపాలిటీవారి వద్ద మహాప్రస్థాన వాహనం రిపేరులో ఉందన్నారు. ప్రయివేటు వాహనాలకై యత్నించినా, వినాయక చవితి సెంటిమెంటు వల్ల అందరూ క్షమించమని కోరారుతప్ప ముందుకురాలేదు.

స్నానంచేయించి, పార్థివశరీరాన్ని పాడెపైఉంచి, దగ్గరిబంధువులు భుజాలకెత్తుకోగానే, వచ్చిన వారందరూ చాలామంది తమ ఇండ్లకు తిరిగి వెళ్ళిపోయారు. శ్రీ హల్దేకర్‌జీ, శ్రీ దాసరి ఆంజనేయులు గారు, శ్రీ పొన్నపల్లి శ్రీరామచంద్రమూర్తిగారు, ఇంకొక ఇద్దరు ముగ్గురు స్వయంసేవకుల పేర్లు జ్ఞప్తికిలేవు, వారు స్వయముగా పార్థివ శరీరమును స్మశానముదాకా (స్మశానము వారి ఇంటినుండి 3 కిలోమీటర్లు దూరంలో నున్నది) భుజస్కంధములపై స్వంత కుటుంబసభ్యులవలె తీసుకువెళ్ళటం జరిగినది. అప్పటికి శ్రీ హల్దేకర్‌జీకి 50 సం॥లు పైబడి వయస్సు వుండవచ్చును. ఆ వయస్సులో కుటుంబసభ్యులవలె కష్టసమయములో ఒక కార్యకర్త ఏ విధముగా ప్రవర్తించవలెనో వారు చూపించారు. ఈ అనుభవం మురళీమోహన్‌గారి తండ్రిగారైన వెంటేశ్వరరావు చౌదరిగారిపై గొప్ప ప్రభావం కలుగజేసింది.

నాకు వ్యక్తిగతముగా ఎంతో ప్రేరణదాయకము ఈ సంఘటన.

## మరియొక సంఘటన :

పరమ పూజనీయ బాలాసాహెబ్‌జీ ఆంధ్ర పర్యటన విభాగ్ వారి శిబిరములు యోజన చేయబడినవి. విజయవాడ విభాగ్ అంటే గుంటూరు, కృష్ణా మరియు పశ్చిమగోదావరి జిల్లాలకు కలిపి. శిబిరము విజయవాడ మాంటిస్సోరి స్కూలులో నిర్వహింపబడినది. స్వయంసేవకులు అందరూ రాత్రికి చేరాలి. ఏ కారణముగా రాత్రికి చేరలేకపోయినా ఉదయము 5గం॥లోగా చేరవలయును. తరువాత శిబిరములోనికి అనుమతి ఉండదు.

సుమారు 5గం॥ తరువాత సత్తెనపల్లి, అవనిగడ్డ మొదలగు దూరప్రదేశములనుండి స్వయంసేవకులు ఆలస్యముగా వచ్చుట జరిగినది. గేటువద్ద వారికి అనుమతి ఇవ్వలేదు.

అక్కడున్న కొద్దిమంది రక్షకులతో తమతమ ఇబ్బందులు తెలియచేస్తున్నారు. ఆ సమయములో విజయవాడలో ప్రముఖ ఆయుర్వేదవైద్యులు, ప్రత్యేకించి నాకు వ్యక్తిగతముగా ట్రీట్‌మెంట్ చేస్తున్నవారు 5.15ని॥ రావటము జరిగినది. అప్పుడు శ్రీ హల్దేకర్‌జీ నన్ను వారి వద్దకువెళ్ళి సున్నితముగా విషయము కనుక్కొనుమని సూచించారు. అప్పుడు నేను డాక్టరుగారి వద్దకు వెళ్ళి సున్నితముగా నావల్ల ఏమైనా సమాచారలోపముఉందా అని అడిగాను. అప్పుడు డాక్టరుగారు శ్రీధర్ (అప్పట్లో అందరూ నన్ను శ్రీధర్ అనిపిలిచేవారు) నీ తప్పులేదు. నాకే ఇబ్బంది అయినది అని తెలిపారు.

ఈ మాట చెప్పగా శ్రీ హల్దేకర్‌జీ అయితే నెమ్మదిగా శిబిరములోనికి అనుమతిలేదు అని తెలుపమన్నారు. వారు వెంటనే అంగీకరించి వెనుకకు తిరిగి వెళ్ళిపోవుట జరిగినది.

శిబిరముపూర్తిఅయిన తరువాత నేను, శ్రీ హల్దేకర్‌జీ ఆ డాక్టరుగారి ఇంటికివెళ్ళి, నియమపాలన, ఇబ్బందులు వివరించటమేగాక, శిబిర విశేషములు విపులంగా డాక్టరుగార్కి తెలుపుట జరిగినది. ఆ డాక్టరుగారు ఎంతో సంతోషించారు.

ఆ విధముగా శ్రీ హల్దేకర్‌జీ వద్దనుండి ఒక సమస్యను ఎంత సున్నితముగా మానవ సంబంధములు దెబ్బతినకుండా కార్యకర్త ఎలా నిర్వహించాలో ప్రత్యక్షముగా అనుభవమైనది.

## మాననీయ శ్రీ హల్దేకర్‌జీతో మరియొక అనుభవము :

రక్షబంధన్ ఉత్సవములు జరుగుతున్న రోజులవి. శ్రీ హల్దేకర్‌జీ వారి ఎప్పుడు ఎంతరాత్రి అయినా పర్యటననించి రాగానే ఒకసారి కార్యాలయము అంతా పరిశీలించి ఆ తరువాతనే నిద్రకు ఉపక్రమించేవారు.

ఆరోజు వారు పర్యటన ముగించుకొని సుమారు రాత్రి 11గం॥లకు వచ్చారు. నేనుకూడా గన్నవరం ఉత్సవము పూర్తిచేసుకొని ఇంచుమించు కొద్ది సమయము ముందుగా కార్యాలయము చేరాను. అందరూ మంచినిద్రలో ఉన్నారు. విజయవాడ కార్యాలయము వచ్చేపోయేవారితో రద్దీగా ఉంటుంది. ఒక్కొక్కసారి కార్యాలయము తలుపులు కూడా దగ్గరగా వేసి వుంటాయి (గడియపెట్టకుండా, అవసరముదృష్ట్యా)

వారు ఆరోజు కూడా అలవాటుగా అంతే కలయతిరిగి నాతో శ్రీధర్ ఎవరో ఆడమనిషి పడుకుని ఉన్నారు ఎవరో, ఏమిటో కనుక్కో అని అన్నారు. నేను ముందు 'ఎవరూ లేరు' అని చెప్పాను. కాని మరలపోయిచూస్తే, గేటు లోపల ఒక ఆడమనిషి పడుకుని

నిద్రపోతోంది. అప్పుడు ఆమెను నిద్రలేపి బయటకు పంపే ప్రయత్నము చేసాను. ఆమే ఒక పిచ్చిది. తలుపులుతీసి ఉండటంవల్ల లోపలికి వచ్చి పడుకొన్నది ఎవరూ గమనించలేదు.

ఈ అనుభవము నాకు చాలా పాఠాలు నేర్పింది. ముఖ్యముగా ఏ విషయమును పరిశీలించకుండా మనము నిర్ణయమునకు రాకూడదు.

మా॥ శ్రీ హల్దేకర్‌జీ అవకాశమున్నపుడల్లా ప్రతి 2 నెలలకు 'కనకదుర్గాదేవి' దర్శనమును చేసుకొనేవారు. నేనుకూడా వారితోకలసి కనకదుర్గగుడికి వెళ్ళేవాడిని.

అయితే ఎపుడు దర్శనము మాకు 1గంటలో పూర్తిఅయ్యేది. కాని ఒకసారి బాగారద్దీ ఉన్నది. సమయము చాలా అయ్యేటట్టు అనిపించింది. కాని పర్యటన ఉన్న కారణముగా బయటినుండే అమ్మవారికి నమస్కారముచేసి వచ్చేసాము.

దానిదృష్ట్యా సమాజపు పని ఉన్నపుడు ఎంతముఖ్యమైన వ్యక్తిగత పనులను ప్రక్కనపెట్టాలని, అంటే దైవదర్శనమైనా ప్రథమ ప్రాధాన్యము సమాజపు పనికి ఇవ్వాలని.

**– పేరి అప్పల నరసింహమూర్తి, విశాఖ**

**9492534027**

# హల్దేకర్‌జీ మార్గదర్శనం

**మా** మేనమామ శ్రీ కొల్లిమర్ల వెంకటేశ్వర్లుగారి కారణంగా చిన్ననాటినుండి సంఘం తెలిసినా ఎస్.ఎస్.ఎల్.సి. అయిపోయి బాపట్ల కాలేజిలో చేరినప్పటినుండి తాలూకా కార్యవాహ్‌గా మా బాబాయి శ్రీ పోలంరాజు ప్రసాద్‌గారితో కలసి నేను 1965నుండి సంఘానికి రావటం జరిగింది. అప్పటినుండి శిబిరాలలో, శిక్షావర్గలలో శ్రీ హల్దేకర్‌జీ కలుస్తుండేవారు.

హల్దేకర్‌జి బౌద్ధిక్ "రాణాప్రతాప్, శివాజీ, గురుగోవింద్ సింగ్ వంశజులం మనం"అని కళ్ళుమూసుకొని తెలుగును, మరాఠీయాసలో చెపుతుంటే అదో ఆనందం. శ్రీ డి.కృష్ణమూర్తిగారు ఇంగ్లీషు పదాలు రాకుండా బౌద్ధిక్ చెప్పాలనుకొనేవారు. ఆ ఆలోచనలో చెప్పవలసిన విషయం మర్చిపోతుండేవారు. శ్రీ కరెడ్లగారు బౌద్ధిక్ అంటే అదో వ్యాయామం. ఈ బ్రిటీషువారు అనే సరికి చేయి ముందునుంచి వెనకదాకా తిరిగేది.

శ్రీ ద్వారకాచారిగారి బౌద్ధిక్‌లో పడికట్టు పదాలు ఎక్కువగా వుండేవి. ముందేరాళ్ళు పోగుచేసుకొని కూర్చొని ఆ పదం రాగానే ఒకరాయి పక్కనేసి, బౌద్ధిక్ అవగానే ఏ పదాలు ఎన్నిసార్లు అన్నారు చెప్పేవాళ్ళం. ఇక శ్రీ సోమయ్యగారి బౌద్ధిక్ అయిపోయిందనుకొని ఉత్తిష్ఠచెప్పి, మళ్ళీకూర్చోబెట్టిన సందర్భాలున్నాయి. ఇవన్నీ ఎందుకు అంటే ఆరోజుల్లో అంతపెద్ద కార్యకర్తలు మాతో అంత కలసిపోయి మమ్మల్ని సంఘకార్యకర్తలను చేశారు. శ్రీ దుర్గాప్రసాదుగారు మాలో ఒకరిగా గొడవ చేసేవారు.

నేను ఎమర్జెన్సీ తరువాత పశ్చిమగోదావరి జిల్లా ప్రచారక్‌గాపనిచేసి మానుకొని జాగృతి – సాహిత్యనికేతన్‌లో చేరాను. శ్రీ హల్దేకర్‌జీ విజయవాడ విభాగ్ ప్రచారక్‌గా ఉన్నారు. ఒకసారి వారు.....బౌద్ధిక్‌కి వెళ్ళవలసి వుంది. కాని జ్వరం కారణంగా తాను వెళ్ళలేనని, నన్నువెళ్ళమన్నారు. నేను అక్కడికి వెళ్ళేసరికి షణ్ముఖ కేటరర్స్ శాస్త్రిగారు ఎవరొస్తారని ఎదురుచూస్తున్నారు. కార్యక్రమం అయిన తరువాత శాస్త్రిగారు, నేను కలసివచ్చి శ్రీ హల్దేకర్‌జీని కలిశాము. 45మంది కార్యక్రమంలో పాల్గొన్నారని ఎమర్జెన్సీ, దివిసీమలో సంఘంచేసినపనిని రామకృష్ణ చెప్పారని శాస్త్రిగారు అన్నారు. శ్రీ హల్దేకర్‌జీ చాలామందికి తెలిసిన విషయాలే అయినా, జ్ఞాపకం చేయటం మంచిదని అన్నారు.

జాగృతి హైదరాబాద్ రావటంతో నేను హైదరాబాద్ వచ్చాను. ఒకసారి సాహిత్యనికేతన్ విషయం ఒకటి శ్రీ సోమయ్యగారిని అడిగాను. శ్రీ హల్దేకర్‌జీని అడగమన్నారు. అప్పుడు సోమయ్యగారు ప్రాంతప్రచారక్, హల్దేకర్‌జీ సహప్రాంత ప్రచారక్. మీరిద్దరు రామలక్ష్మణులలాంటివారు. లక్ష్మణుడు ఎప్పుడు నిర్ణయాలు చేయలేదు. రాముడు చేసిన నిర్ణయాలను ఆచరించేవాడు. అందుకే హల్దేకర్‌జీని అడిగితే మిమ్మల్ని అడగమన్నారన్నాను. నా మీదకే నెట్టావన్నమాట. సరే నీవు ఊరుకోవుగా అని, పరిష్కారమార్గం చెప్పారు. ఆ విషయం శ్రీ హల్దేకర్‌జీకి చెప్పి ఆపని పూర్తిచేశాను.

ఒకరోజు శ్రీరాంసాఠేజీకి వారి పుస్తకాల అమ్మకం తాలుకా 11వేల రూపాయలు తీసుకొనివెళ్ళి వారికిచ్చి ఓచరుమీద సంతకం చేయమన్నా, ఓచరులో 11007 రూపాయలు ఎకౌంటు రాసిఉన్నది. ఏడురూపాయలు రేపు ఇస్తాను సంతకం పెట్టమన్నాను. రేపటిదాకా నాకు గ్యారంటీ ఇస్తున్నావా. ఇప్పుడు తీసుకురా సంతకం పెడతానన్నారు. క్రింద సాహిత్యనికేతన్‌లోకి వచ్చేసరికి శ్రీ హల్దేకర్‌జి కూర్చొని ఉన్నారు. సంఘస్థాన్‌లో కాసేపునడిచి సాహిత్యనికేతన్‌లో కాసేపు కూర్చొని, టీ తెప్పిచ్చిఇస్తే తాగి తమరూముకు

వెళ్ళేవారు. నా హడావుడిచూసి ఏమిటి విషయం అన్నారు. శ్రీ సాఠేజీ విషయం చెప్పగానే – చిత్‌పావన్ వారు అలాగే వుంటారు అన్నారు నవ్వుతూ.

తరువాత రోజులలో హల్దేకర్‌జీతో కూడా ఇలాంటి సంఘటన జరిగింది. డాక్టర్జీమీద శ్రీ హల్దేకర్‌జీ వ్రాసిన 'పెనుతుఫానులో దీపస్తంభం' పుస్తకాన్ని నవయుగభారతి తరపున వేశాము. పుస్తకాన్ని ప్రింటుచేసి, అడ్వాన్సు ఇచ్చిన వారికి, ట్రాన్స్‌పోర్ట్, పోస్టల్‌ద్వారా పంపి, అంతా అయిన పిదప వారికి జమ, ఖర్చుల వివరాలు ఇచ్చాను. వారెందుకో అ ఎకౌంటుని ఒకసారి శ్రీ హరిహర శర్మగారికి, శ్రీ భావన్నారాయణగారికి చూపించమన్నారు. కార్యాలయంలోనే వారిద్దరిని కూర్చోబెట్టి మొత్తం అకౌంటు చూపించాను. వారు అంతాచూసి సరిపోయిందన్నారు. శ్రీ హరిహరశర్మగారు, నేను కలసి వెళ్లి ఈ విషయం శ్రీ హల్దేకర్‌జీతో అకౌంటు అంతా చెప్పాము. అప్పుడు వారన్న మాట నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. ఈ అమౌంటు అంతా నవయుగభారతి బ్యాంకు అకౌంటులో వేశాము కదా, దానిమీద వచ్చేవడ్డీ రామకృష్ణ ఇవ్వలేదన్నారు.

శ్రీ హరిహరశర్మగారు ముందుడబ్బులిచ్చి పేపరు కొన్నారు, తరువాత ప్రింటింగ్ అడ్వాన్సు, బైండింగ్ అడ్వాన్సు, ఇలా డబ్బులు వాడుతూ వచ్చారుగాని, మొత్తం ఏమి ఫిక్సెడ్ చేయలేదుకదా ! సేవింగ్స్ ఎకౌంటులో ఇన్‌ట్రస్టు పెద్దగారాదు. ఏ మూడో, నాలుగోవేలు వస్తాయి. అవి నవభారతికి ఇంతపని చేసినందుకు ఇచ్చామనుకోండి అని నచ్చచెప్పిన తర్వాతనే హల్దేకర్‌జీ శాంతించారు. పాత కార్యకర్తలంతా డబ్బుల విషయంలో అంతనిక్కచ్చిగా ఉండేవారు.

పాతతరం వారి ఆలోచనలు బాగా అర్థంకావటానికి శ్రీ సోమయ్యగారితో నా అనుభవం మీ ముందుంచుతాను. సంఘానికి 60సం॥ నిండిన సందర్భంగా పుస్తకాలు, కరపత్రాలు వేసి పెద్దఎత్తున ప్రచారం చేశాము. నా భార్య శారద పుట్టింట్లో ఉన్నందున పనిదృష్ట్యా కార్యాలయంలో భోజనం చేయమన్నారు శ్రీ సోమయ్యగారు. రెండు, మూడు నెలలు కార్యాలయంలోనే భోజనం చేశాను. ఉద్యమం అంతా అయిన పిదప ఒకసారి నేను, శ్రీ టి.ఎస్.ఆర్. మూర్తిగారితో ఇన్ని రోజులు కార్యాలయంలో భోజనం చేశానుగదా కార్యాలయానికి ఏదయినా కొని యివ్వాలి అనుకుంటున్నాను. ముఖ్యంగా శ్రీ సోమయ్యగారి రూమ్ పైఅంతస్తు కదా! ఎండాకాలంలో ఆరూములో చాలా వేడిగా ఉంటుంది! ఒక కూలర్ కొందామన్నాను. శ్రీ మూర్తిగారు శ్రీ సోమయ్యగారితో మాట్లాడి చేద్దామన్నారు.

శ్రీ సోమయ్యగారితో విషయం ప్రస్తావన చేయగానే "నన్ను సంఘానికి దూరం చేద్దామనుకుంటున్నావా?" అన్నారు.

నాకేమీ అర్థం కాలేదు. ఎందుకలా అన్నారని అడిగాను. ఇది 1986నాటి సంగతి. ఈరోజుల్లో చాలామంది ఇళ్ళల్లో కూలర్లు, ఎయిర్‌కండిషన్‌ల్లు ఉన్నాయిగాని ఆరోజుల్లో ఇన్నిలేవు. శ్రీ సోమయ్యగారు ఇలా అన్నారు. మన ముఖ్యశిక్షక్, కార్యవాహల ఇళ్ళల్లో, కూలర్‌లు ఉండవు. ఎక్కడైనా పట్టణాలలో ఉన్నా గ్రామాలలో ఇంకా వుండవు. కూలర్ ఉంటేగాని నిద్రపట్టదుగాన, మనవారు, బాగా డబ్బులున్న ఏ పెద్దవారింట్లోనో వుంచుతారు. వారింట్లో కూలర్‌తోపాటు, కుక్కలు కూడా ఉంటాయి. అది మన ముఖ్యశిక్షక్‌ని కార్యవాహ్‌ని, మన దగ్గరకు ఎప్పుడు పడితే అప్పుడు రానీయదు. అలాగే మన ముఖ్యశిక్షక్, కార్యవాహ్, ఇంట్లోని పెద్దలతో పరిచయాలుకావు, వారి కుటుంబ పరిస్థితులు తెలియవు. ఒక ఉపన్యాసం, ఒక బైఠక్‌తో మన పనికాదు. మన ఆచరణ చూసే కార్యకర్త నిర్మాణమవుతారు. నన్ను చెడగొట్టక సంఘకార్యకర్తగా ఉండనీయి అన్నారు. ఇదేనేమో సంఘంలో చెప్పే భ్రమరకీటక న్యాయం.

పుస్తకాల గురించి శ్రీ హల్దేకర్‌జి చాలమందిని కలిశారు. బైపాస్ ఆపరేషన్ చేయించుకొని ఇంతతిరుగుడు ఎందుకండి, మీరడిగితే బుక్‌కి ఎవరో ఒకరు మొత్తండబ్బు ఇస్తారుకదా? ఎందుకు ఇంతశ్రమ, రిస్కు? అన్నాను. వారు వెంటనే ఏకనాథ్ రానడే కన్యాకుమారిలో స్వామివివేకానంద శిలాస్మారకం నిర్మించారు. ప్రభుత్వాలు ముందుకువచ్చినా ఏకనాథ్‌జి స్వయంసేవకుల వద్దేకాదు, అందరివద్ద రూపాయి వంతున, చివరికి కమ్యూనిస్టులవద్ద కూడా వసూలుచేసి కట్టించారు. స్వామి వివేకానంద శిలాస్మారకం, ఏ కొద్దిమందిదో కాక భారతీయులందరికి ప్రాధాన్యం ఉండాలి. ప్రతివానికి ఆ నిర్మాణంలో ఉడతాభక్తిగా నాపాత్రకూడా ఉంది అని అనిపించాలని.

అలాగే మద్రాసులో సంఘకార్యాలయంలో బాంబుపేలుడు జరిగింది. కార్యాలయప్రముఖ్ కాశీనాథ్ కొద్దిరోజులు హాస్పటల్‌లో ఉండి, మృత్యువాతపడ్డాడు. ఈ రోజులలోలాగా అవయవదానం అంతగాలేవు. కాని ఆనాటి ముఖ్యమంత్రి జయలలిత అతన్ని చూట్టానికి వచ్చినప్పుడు కాశీనాథ్ చెల్లెలు తన అన్న కళ్ళు దానం చేస్తాడని, దానికి ఏర్పాటు చేయించమని అడిగింది. దానికి చలించిన జయలలిత, మనసంఘపెద్దలతో కార్యాలయం ప్రభుత్వ ఖర్చుతో కట్టిస్తామన్నారు. కాని అప్పటి

సర్‌సంఘచాలక్ మాననీయ బాలాసాహెబ్‌జీ “కార్యాలయం మా స్వయంసేవకులు నిర్మించుకుంటారు. పర్మిషన్లు వాటికి ఇబ్బంది లేకుండా చూడండి” అన్నారు. అందుకే నేనుకూడా ఒకరినో, ఇద్దరినో అడగకుండా, స్వయంసేవకులందరిని కలిశా. అందరి సహకారం లభించింది. కావుననే అంతపెద్ద పుస్తకం 15,000 కాపీలు ముద్రింపబడి, ఇంటింటికీ పోయినాయన్నారు. సాహిత్యనికేతన్‌లో ఉండగా వారితో ఎక్కువసార్లు కలిసేవాడిని. జాగృతికి మారిన తరువాత కలవటం తగ్గింది.

మీరుకాసేపు కూర్చొని మాట్లాడితే వారానందపడతారు కదండి అని రామాచారి అంటుండేవారు. చివరికి వారికుటుంబీకులు జరిపిన సహస్ర చంద్రదర్శనంలో కూడా తనతోపాటుగా సంఘంలో పనిచేస్తున్న తన వయసు పెద్దలను పిలిపించి, ఆ పెద్దలందరితో కలిసి జరిపించుకొవటంద్వారా సంఘకార్యకర్త ఎలాఉండాలో మన ముందుంచిన శ్రీ హల్దేకర్‌జికి శతకోటి వందనాలు. **– వల్లూరు రామకృష్ణ, జాగృతి**

# సంపర్కానికి మారుపేరు శ్రీ హల్దేకర్‌జీ

**శ్రీ** రాంభావు హల్దేకర్‌జీ గారితో నా అనుబంధం. అది షుమారు 1984వ సంవత్సరం అనుకుంటాను, హల్దేకర్‌జీ సహ ప్రాంత ప్రచారక్‌గా పర్యటనకు వచ్చారు. నేను అప్పటి మంచిర్యాల జిల్లాసహకార్యవాహగా ఉన్నాను. వారిరాక సందర్భముగా చిన్న ఆహ్వాన పత్రిక తయారుచేసి శాఖ వార్షికోత్సవము చేశారు. అది మాదారం అనే గ్రామం. అటవీ ప్రాంతం సింగరేణి కాలనీ అయిన కారణంగా కార్యక్రమం అనగా సంఖ్య బాగానే వచ్చేవారు. ఆరోజు సభలో వీరితోపాటు అప్పటి జిల్లా సంఘచాలక్‌గారు శ్రీ గోనె శ్యాంసుందర్‌రావుగారు కూడా వచ్చారు. ఆరోజు వారి బౌద్ధిక్‌లో శివధనుర్భంగం, చరిత్ర గురించి ఒక క్లాసుకు ఉపాధ్యాయుడు. విద్యార్థిని అడగడం, అందుకు అతను తెలియదు అని చెప్పడం, మళ్ళీ అదే విషయాన్ని ప్రధాన ఆచార్యునికి తెలపటం, శివధనస్సును, నేను ఎప్పుడు పాఠశాలలో చూడలేదని చెప్పడం, స్కూలు, ఇన్సిపెక్టర్‌ను అడగడం, అయితే విరిగిపోతే ఇంకొకటి కొనండి అని చెప్పడం. ఈ విషయం వారి తెలుగులో ఈ చమత్కార కథ చెప్పి విద్యా విధానాల దుస్థితి దయనీయస్థితిని తూర్పార బట్టి హాస్యరూపకంగా చెప్పటంతో ఆ గ్రామంలో అందు పాల్గొన్న ప్రతిఒక్కరు, స్వయంసేవకులు, ఇతర ఆహ్వానితులు చాలాకాలం మరచిపోలేని స్థితికలిగింది. తరువాత

వారి పర్యటన ఎక్కడ ఉన్నా చుట్టుప్రక్కల గ్రామాలలో అందరూ వారితో మాట్లాడాలని ఎంతో అవకాశంగా భావించేవారు. అదే సమయంలో శ్రీ రామచంద్రయ్యగారు విభాగ్ ప్రచారక్‌గా ఉండేవారు. ఈ పర్యటన సందర్భంగా తరువాత శాఖా కార్యక్రమాలకు చాలా అనుకూల వాతావరణం కలిగింది. వారివెంట మరుసటిరోజు రేచిని అనే గ్రామంలో ప్రభాతశాఖకు వెళ్ళాలి. నేను జిల్లా సహకార్యవాహ కంటే ముందు. అక్కడ ఖండ కార్యవాహను. అయితే నాపరిచయాలు వేరే విధంగా ఉండేవి. కానీ వారితో రేచినికి వెళ్ళాను. అక్కడ గ్రామంవారు మధ్యలో ఉన్న తాండూరు గ్రామంవారు, వీరు (శ్రీహల్దేకర్‌జీ) వస్తున్నారు అని చాలా సంతోషంగా తోరణాలు అలంకరణలు చేశారు. నాకు అర్థంకాలేదు. ఆ రోజుల్లో వారిని చూడటానికి, అక్కడ మరాఠీ మాట్లాడే వారందరూ వచ్చారు. అందరూ పెద్దలే, నాకు. వీరికి వారితో పూర్వపరిచయం ఉందని తెలియదు. శాఖ అయిపోయినది. వీరి బౌద్ధిక్ ఆ శాఖలో చాలామందిని ప్రభావితం చేసింది. విచిత్రం రేచిని లో శాఖ. ఒక ప్రాథమిక స్కూలు ప్రాంగణంలో జరిగింది. విశేషం కమ్యూనిస్టు నాయకుడు శ్రీ గుండామల్లేశం కూడా దూరంగా ఉండివిన్నారు. శాఖ అయిన తరువాత వీరిని కలువకుండ ఉండలేకపోయాడు. దేశభక్తిపూరితమైనవారి బౌద్ధిక్‌కు ఆయన శ్రీ హల్దేకర్‌జీకి మోకరిల్లాడు. తరువాత వారి సంపర్కం అనేకమందితో అంతకుముందు ఉన్న కారణాన కీ॥శే॥ మన్‌హర్‌రావు అనే గ్రామసర్పంచి. ఈయన ఒక ఉదాహరణ. ఇలా ఎంతోమందిని వారి ఆహ్లాదభరిత పరిచయం. వర్ణించలేనిది. వారి పరిచయాలు అప్పటి కఠిన పరిస్థితులలో కూడా. గ్రామ గ్రామాన శాఖలుపెట్టే అవకాశం దొరికింది. నేను విజయవాడనుంచి వచ్చిన కార్యకర్తను. వారు వచ్చి మొదటిసారి గోదావరిఖనిలో బైఠక్ తీసుకున్నారు. అప్పుడే నా పరిచయం. కానీ మాయింట్లో ఉన్న పదిమంది అన్నదమ్ములగురించి అడిగినతీరు. మాతల్లిగారిని వారు కొనియాడిన తీరు. ఒకసారి ప్రాంతకార్యకారిణి సమావేశాలు విజయవాడలో జరిగితే మాయింట భోజన వసతి ఏర్పాటు జరిగింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని వారు మాతల్లిగారిని గురించి ప్రస్తావించినతీరు. నేను నాజన్మ జన్మలకు మరువలేను. అందుకే వారికి ఆపరేషన్ సమయంలో మాయింట 108సార్లు హనుమాన్‌చాలీసా పారాయణ చేసినట్లు వారికి తెలిసి, తరువాత వారు నాకు కృతజ్ఞతలతో ఉత్తరం వ్రాశారు. కీ॥శే॥ హల్దేకర్‌జీని మరచిపోవటం అసంభవం. మదిలోనే నిలిచిపోయారు వారు.

**– బుర్రా దత్తాత్రేయశాస్త్రి,**

**కార్యాధ్యక్షుడు ఇతిహాస సంకలన సమితి, (భారతీయ), తెలంగాణ.**

# వారి మాటల్లో హాస్యం జాలువారుతుంటుంది

మా॥ హల్దేకర్‌జీని 1966 శిక్షావర్గలో కేశవమెమోరియల్ స్కూల్ మైదానంలో మొదటిసారి చూశాను. ప్రథమవర్ష శిక్షార్థుల ప్రథమ వాహినీకి వారు వాహినీ ప్రముఖ్. సంఘస్థాన్ కాగానే శిక్షార్థులు చాలామంది వారి చుట్టూ మూగేవారు. ఏవేవో చెప్తుండేవారు. వీరు వింటూ, మధ్యమధ్య చిన్నచిన్న మాటల్లో (చాలా వరకు హిందీలో) స్పందిస్తుండేవారు. అందరూ విరగబడి నవ్వుతుండేవారు. నేను దూరం నుండి వచ్చినవాడిని. ఆ వాహినీలో ఉన్నవాడిని కాను. కాబట్టి కొంచెం దూరంలో నిలబడి ఆ దృశ్యాన్ని ఆస్వాదిస్తూ ఉండేవాడిని. ఆ వర్గలో వారు బౌద్ధిక్‌వర్గ ఏదీ నిర్వహించలేదు. కాబట్టి వారి మాటల అందచందాలు ఆస్వాదించే అవకాశం లేకపోయింది.

1972 శిక్షావర్గలో ప్రబంధక్‌గా ఉన్నాను. అప్పుడు అటువంటి అనుభవాలే అయితే అప్పుడు వారు శారీరిక విభాగంలోగాక వర్గ నిర్వహణలో – బహుశః ప్రబంధ ప్రముఖ్‌గా ఉన్నారేమో. కాగా 1973 శిక్షావర్గలో వారి గొంతు మైక్ ద్వారా వినే అవకాశం లభించింది. పరమ పూజనీయ శ్రీగురూజీ స్వర్గస్థులు కాగా, ముఖ్యమైన బాధ్యతల్లో ఉన్న పెద్దలు అంతిమ ప్రణామం ఆచరించడానికి నాగపూర్ వెళ్లారు. అలా సర్వాధికారి, వర్గకార్యవాహల అనుపస్థితిలో వర్గప్రముఖ్ అయిన హల్దేకర్‌జీ ఆనాటి వక్త శ్రీపిల్లా రామారావుగారిని పరిచయం చేశారు. వారు తెలుగులో చెప్పటం కొంత వింతగా, ఆసక్తిదాయకంగా ఉండినది.

హల్దేకర్‌జీ బౌద్ధిక్ వినటం వారు సహప్రాంత ప్రచారక్ అయిన తర్వాతనే. వారు విజయవాడ పర్యటనకు వచ్చారు. నేను అంతకు వారం – పదిరోజుల ముందే – మహానగర్ ప్రచారక్‌గా బాధ్యత స్వీకరించారు. వారితో కలిసి సింగ్‌నగర్‌లో ప్రభాత్‌శాఖకు వెళ్లాను. దశాబ్దాల తర్వాత కలిసిన అన్నదమ్ముల కథను వారి నోటివెంట విని ముగ్ధుడనైనాను.

మామూలుగా మాట్లాడే మాటల్లో హాస్యరసం కురిపించి ఆహ్లాదపరిచే శైలి వారి విశిష్టత. ఒకసారి నెల్లూరులో శాఖ ముగిసిన తర్వాత ఒకరి తర్వాత ఒకరుగా పరిచయం చేసుకొంటున్నారు. ఒక బ్యాంక్ ఉద్యోగి తన పేరు చెప్పగానే – "ఇతనే సాల్ ఆఫ్ కహాఁ థే? ఆప్ కే లియే హమ్ ఢూండ్ రహే హై!" (ఇన్ని సంవత్సరాలుగా ఎక్కడున్నారు? మీకోసం మేము వెదుకుతూ ఉన్నాం!) అన్నారు. ఈయన మీకు ఇంతకు ముందే తెలుసునా? అని నేను హల్దేకర్‌జీని అడిగాను. "నేతాజీ కా నామ్ దేశ్‌భర్ మాలూమ్‌హై" అన్నారు

హల్దేకర్‌జీ. పరిచయం చేసికొన్న వ్యక్తి సుభాశ్చంద్రబోసు అయినందున నేతాజీ అంతర్ధానమైన చరిత్రకు ముడిపెట్టి, అలా ఒక ఉల్లాసకర వ్యాఖ్యతో వారు అందరినీ అలరించిన తీరు ఆశ్చర్యం కలిగించింది.

వారు సహప్రాంత ప్రచారక్‌గా ఉండగా 1986లో గోదావరినది వరద సంభవించి చాలా గ్రామాలు నష్టపోయిన తరుణంలో పోలవరంలో యానాదిగూడెంను గణేశ్‌నగర్ పేరున పునర్నిర్మించడానికి నిర్ణయమైంది. భూమిపూజ నిర్వహించడానికి వారిని ఆహ్వానించాం. నిడదవోలులో రైలుదిగి స్నానం అల్పాహారం పూర్తి చేసుకొని పోలవరం వెళ్లి ఆ పూజా కార్యక్రమంలో పాల్గొనాలి. దూరం సుమారుగా 50 కి.మీ.లు. ఆ రోజుల్లో కారు వంటి స్వతంత్ర ప్రయాణసాధనాలు సులభంగా లభించేవికావు. అందుచేత ఆర్‌టిసి బస్సులోనే వారిని ప్రయాణింప జేయాలనుకున్నాము. వెళ్లేటప్పుడు 3 గంటలు పట్టగా తిరిగి వచ్చేటప్పుడు నాలుగు గంటలకు పైనే పట్టింది. దానికి అక్కడి వాతావరణంలో చెమటపట్టే లక్షణం ఎక్కువ ఉంటుంది. ఈగల మనసు కూడా ఎక్కువగానే ఉంది. అయినా కిమ్మనకుండా వారు అన్నింటినీ భరించారు. మా యోజన ఎంత లోపభూయిష్టమో, అంతా అయిన తర్వాత అనుభవపూర్వకంగా గ్రహించాము.

నేను శ్రీ సరస్వతీ విద్యాపీఠం బాధ్యతలో ఉండగా, నాకు ఎదురవుతున్న సమస్యలను చెప్పినప్పుడు వెంటనే స్పందించి పరిష్కరించ యత్నించేవారు. 1999లో ఒరిస్సాలో పెద్ద తుఫాను సంభవించినప్పుడు నేను కొంతకాలం భువనేశ్వర్‌లో ఉన్నాను. హల్దేకర్‌జీ క్షేత్రప్రచారక్‌గా వచ్చిన ప్రతి సందర్భంలోనూ అప్పటివరకూ అపరిష్కృతంగా ఉన్న విషయాలు చక్కగా పరిష్కారమయ్యేవి. అందరిలో నూతనోత్సాహాన్ని నింపి తిరిగి వెళ్లేవారు.

హల్దేకర్‌జీకి దేశంలోని వివిధ భాషలపై తగినంత పట్టు ఉంది. వివిధ ప్రాంతాలవారు పలికే తీరు ఎంత గమ్మత్తుగా ఉంటుందో వారు అప్పుడప్పుడూ వినిపించేవారు. స్నానకర్‌కే స్వచ్ఛ హోకర్ అని చెప్పడానికి కొన్ని ప్రాంతాలవారు 'అస్నాన్‌కర్‌కే అస్వచ్ఛహోకర్' అని పలుకుతారని చెప్పేవారు. అలాగేవారు కొందరు పెద్దలతో కలిసి ఒక సిగరెట్ల ఫ్యాక్టరీ యజమానిని కలసికొనటానికి వెళ్లారట. అప్పుడు ఆ యజమాని తమ ఉత్పాదనలను పరిచయం చేస్తూ – 'అవర్స్ ఈజ్ ది ఓన్లీ సిగరెట్ మేడ్ ఇన్ హైద్రాబాద్ దటీజ్ రేప్డ్' అని చెప్పాడట! ఆయన చెప్పినదేమిటో అర్థం చేసుకోలేక వారు కష్టపడటం గమనించి ఒక సిగరెట్ పేకెట్ తెప్పించి చూపించాడట. పెట్టెలో ఒక తగరం కాగితం ఉంటుంది.

దానిని చించిన తర్వాతనే సిగరెట్ తీసుకోవటం వీలవుతుంది. రా...ప్డ్ (Wrapped) అని చెప్పడానికి బదులు రేప్డ్ (Raped) అని చెప్పి ఇబ్బంది పెట్టేశాడు గదా అని అందరూ నవ్వుకున్నారట!

ఇలా.. యథాలాపంగా మాట్లాడుతూ ఉన్న సందర్భాలలో ఎన్నెన్నో అనుభవాలు చెప్పేవారు. వారితో కలిసి పనిచేయటం ఆనందదాయకమైన అనుభవాల సమాహారం.

**– డా॥ వడ్డి విజయసారథి**

# నిష్కామ కర్మయోగి శ్రీ హల్దేకర్‌జీ

**అ**తను నిష్ఠావంతుడైన ఆదర్శ స్వయంసేవక్. తన సంపూర్ణ, జీవితాన్ని పూజ్య డాక్టర్జీ పూజ్య గురూజీల రాష్ట్ర కార్యాన్ని ముందుకు తీసుకువెళ్ళడాన్ని ఆహుతి చేసాడు. అతను సంఘదీక్షా పరుడిగా జీవించారు. ఏ కోణంనుంచి దర్శించినా అతని నిస్వార్థసేవ, అనేకానేకులకు ప్రేరణ నిస్తోంది. అతను మాననీయ శ్రీరామచంద్ర సదాశివ హల్దేకర్ గారు. వారు క్షేత్రప్రచారక్ బాధ్యతలనుంచి విముక్తులైనా చివరిశ్వాస వదిలేవరకు రకరకాల పనులను చేపట్టి అనేకమంది స్వయంసేవకులకు అహర్నిశలు మార్గదర్శనం చేస్తూనే వచ్చారు.

నేను బాల్యంనుంచి స్వయంసేవక్‌ను. ఉద్యోగ విరమణ తరువాత బొబ్బిలి జిల్లా (సంఘజిల్లా)లో నగర సహకార్యవాహ్‌గా పనిచేశాను. నేను బొబ్బిలి వచ్చిన కొంతకాలానికి ఆనాటి జిల్లా ప్రచారక్ శ్రీ కొత్త సీతారామాంజనేయులు (శ్రీరాముగారు) ‘‘ఈరోజు శ్రీ హల్దేకర్‌జీ అల్పాహారం మీ యింటిలోనే. ఆ తరువాత కార్యకర్తల బైఠక్ కూడా మీ యింటిలోనే అన్నారు. శ్రీ హల్దేకర్‌జీని చూడడం అదే మొదటిమారు. అతను పెద్దవక్తకాదు. తెలుగుభాషమీద పెద్దగా పట్టులేదు. అయినా అతని ప్రసంగానికి ఎవరైనా ఆకర్షితులు కావలసిందే.

‘‘ఉద్యోగానికి వయోపరిమితి, రిటైర్‌మెంటు ఉంటాయి. సంఘకార్యం ఈశ్వరీయకార్యం దానికి రిటైర్‌మెంటులేదు. అని ఆనాడు అతనినోట విన్నాను. మాశాఖలో ఒకస్వయంసేవక్ ఉండేవాడు. రోజూవెళ్ళి శాఖకు రమ్మని పిలుస్తే నాలుగైదురోజులకోమారు వచ్చేవాడు. ఆశ్చర్యంగా అతను శ్రీ హల్దేకర్‌గారి మాటలకు ప్రభావితుడై క్రమక్రమంగా ప్రాథమిక, ప్రథమ, ద్వితీయవర్ష శిక్షావర్గలు పూర్తిచేసాడు. ఆ సమయంలోనే శారీరక

విభాగ్ జిల్లా బాధ్యతలు చేపట్టాడు.

రాంభావ్ హల్దేకర్‌జీ అలుపెరుగని కార్యకర్త. సంఘంలో ఉన్నతమైన గౌరవస్థానం అతనిది. అతని ప్రేరణవల్లనే నేను నేటికీ స్వయంసేవక్‌గా శాఖకు వెళ్తున్నాను. దైనికశాఖకు వెళ్ళడం స్వయంసేవక్ లక్షణం కావాలంటూ స్వర్గీయ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిని ఉదాహరించేవారు. వారు అస్వస్థులుగాఉన్నా, శాఖకు వెళ్ళేవారని చెప్తూఉండేవారు.

నేను భాగ్యనగర్ వెళ్ళినపుడల్లా వారిని తప్పక కలిసేవాడిని. నీది బొబ్బిలి కదూ, ఒక రోజు మీయింట్లో అల్పాహారం చేసాను అది నాకు గుర్తుంది. ఆ సంఘటన జరిగి ఆరేడేళ్ళైనా వారు నాపేరు మరిచిపోలేదు. వారు భావాలను, ఆలోచనలను, మాటలను వట్టినే పోనీయక ఆచరణలోపెట్టేవారని ఎందరో అనగా విన్నాను.

ఆయన పెద్దవక్తకాకపోయినా వచ్చీరాని తెలుగులో శిక్షావర్గ్‌లో ఒక కాలాంశంలో ప్రసంగించేవారు. తరుచు వారి ప్రసంగం సంఘనీతి, రీతిమీద ఉండేది. పెనుతుఫానులో దీపస్తంభం వారి తెలుగు మొదటి రచన. మరాఠీలోని ఆ గ్రంథాన్ని శ్రీ భావన్నారాయణగార్కి వాక్యం వాక్యం చెప్పి తెలుగులో వ్రాయించారు. అలాగే శ్రీ బెల్లంకొండ మల్లారెడ్డిగారు వేరొక పుస్తకాన్ని అనువదించడంలో శ్రీ హల్దేకర్‌జీకి సహకరించారు.

శ్వః కార్యమద్యకుర్వీత పూర్వాహ్ణే చ అపరాహ్ణికమ్।
నహి ప్రతీక్షతే మృత్యుః కృతమస్యనవాకృతమ్ ॥

రేపటి పనిని నేడే చేయాలి. మధ్యాహ్నం చేయవలసిన పనిని పొద్దున్నే చేయాలి. మన పనులు పూర్తయ్యాయా యింకా మిగిలి ఉన్నాయా అని మృత్యువు ఎదురుచూడదు. అనగా ధర్మాచరణకీ మంచిపనులు చేయడానికి తొందర అవసరమని అర్థం.

శ్రీరాంభావ్ హల్దేకర్‌జీ మాటల్లో సంఘకార్యం పట్ల ఆలస్యం, అలసత్వం పనికిరాదు.

**– గుమ్మా ప్రసాదరావు,**

**భిలాయ్, ఛత్తీస్‌గఢ్, 9755110398.**

# పూజ్యశ్రీ హల్దేకర్‌జీతో నేను

**మా**ట మధురం, భాషా గుండెలోతులకు తాకేది. ఆకారం సాధుపుంగవులను తలపించేది ఆయన సంఘ ఎన్‌సైక్లోపీడియా. వారే స్ఫూర్తి ప్రదాతలలో అగ్రగణ్యులైన పూజ్యశ్రీ రాంభావ్ హల్దేకర్‌జీ. వారితో ఒక బైఠక్‌లో ఉన్నా, నిద్రపోయా. ఇంతలోవారి బౌద్ధిక్ అయిపోయింది. అప్పుడు కళ్ళుతెరిచా. "సత్యంగారు బాగా నిద్రపోయేటట్లుగా నా బౌద్ధిక్ వుందన్నమాట. ఏమైనా మీరు గురకపెట్టనందువల్ల నా బౌద్ధిక్‌కు అవరోధం కాలేదు" అన్నారు నా భుజంమీద చెయ్యివేసి. ఎంత హెచ్చరిక!

మరొక పర్యాయం మా ఇంటికివచ్చి మమ్మల్ని ఆశీర్వదించారు. భోజనంలో మా ఆవిడ ఆవకాయ పచ్చడి వేసింది. అది కారంగానే ఉంది. అది అడ్డు చెప్పక తిన్నారు. వెళ్ళిపోతూ యిది ఆవకాయగదూ అన్నారు. మా ఆవిడ అంది ఆవకాయ ముడిముక్కలు, నూనె, కారం కలిపి చేస్తారు. బాగుందాండీ అంది. వారన్నారు ఆ ఆవకాయ భేషుగ్గా ఉంది. నేను కలసినప్పుడల్లా అనేవారు ఆవకాయ బాగుంది. కాని కారం ఎక్కువగా ఉంది, అంతకారం మీరుగూడ తినవద్దు. మీ ఆవిడకు నమస్కారాలు చెప్పండి. నెల్లూరులో వారు వ్రాసిన పుస్తకాలను పరిచయం చేయడానికి వారి బృహత్‌యాత్రలో భాగంగా వచ్చారు. తిరుపతినుంచి బాగాపొద్దుపోయి వచ్చారు. ఉదయం 6.30 గం॥కు కార్యక్రమం వారు సమయానికి వచ్చారు. ఏకాత్మతాస్తోత్రం ఆలాపన ప్రారంభమయింది. ఉచ్చారణ తప్పుల తడకలా ఉంది.

"నాకు ఏకాత్మతాస్తోత్రం యిట్లా ఉంటుందని తెలీదు. కార్యక్రమంలో అభ్యాసం లేకుండా పాడడం సరికాదు. అదిలేకపోయినా నేనేమీ అనుకోను. ఆపేయ్‌బాబూ" అన్నారు, కొంచెం అసహనంగా. మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో చెప్పకనే చెప్పారు ఆయన. వారి బౌద్ధిక్ ప్రారంభం కావాలి. మైక్‌లేదు. "మైక్ వ్యవస్థ వద్దనుకున్నారా? నేను మళ్ళీ ఒంగోలు వెళ్ళాలి. నేను గట్టిగా మాట్లాడలేనుగదా" అన్నారు. మైక్ అతను సాయంత్రం ఉందనుకున్నాడని చావుకబురు చల్లగా చెప్పారు మన కార్యకర్త. "వ్యవస్థ, పూర్వయోజన సరిగాలేకపోతే పరమ పూజ్యశ్రీ డాక్టర్‌జీ జీవనయాత్ర స్వయంసేవకులకు చేరేదెట్టా" అని మైకులేకుండానే ప్రసంగించారు. నేను కలసినప్పుడల్లా, కుటుంబ విషయాలతోపాటే, యిటువంటివి ప్రస్తావించేవారు వారికి నా నమస్సుమాంజలి.

**– కోదూరు సత్యం, నెల్లూరు.**

# కార్యకర్తకి ఎంత విలువ ఇవ్వాలో నేర్పిన హల్దేకర్‌జీ

నేను 1978 నుండి 1990 వరకు నావృత్తిరీత్యా నల్లగొండజిల్లా మిర్యాలగూడాలో నివాసం ఉండేవాడిని. అప్పట్లో నా బాధ్యత మిర్యాలగూడా ఖండకార్యవాహ.

ఒకసారి మా హల్దేకర్‌జీ పర్యటన ఇచ్చారు. మిర్యాలగూడాకి 6 కి.మి. దూరంలో త్రిపురారం మండలకేంద్రంలో సాయంశాఖకు వారిపర్యటన నేను ముందుగా గటపనిచేసివచ్చి వారిని నా మోటరుసైకిల్‌పై తీసుకొని వెళ్ళాను. అది రైతులసాయంశాఖ. సమయంఅయినా ఎవరూరాలేదు. వారు నాచేత శాఖ ప్రారంభం చేయించారు. కొంతసమయానికి 5గురు వచ్చారు. వారు తీసుకోవలసిన బౌద్ధిక్ పూర్తిసమయం తీసుకున్నారు. శాఖానంతరం రాని స్వయంసేవకుల ఇళ్ళకు వెళ్దాం అనిఅన్నారు. వెళ్ళాము. అయినా ఎవరు ఇళ్ళలో దొరకలేదు. హల్దేకర్‌జీబస ఒక స్వయంసేవకు ఇంట్లో. మేము ఆలస్యంగా బసకు చేరుకున్నాము. కొంతసేపటికి మేము ఎవరెవరిళ్ళకు వెళ్ళామో ఆ స్వయంసేవకులు అందరు వచ్చి హల్దేకర్‌జీని కలుసుకొని వారు నిద్రపోయేవరకు ఆనందంగాగడిపి వారి ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆ గ్రామశాఖ మంచి ప్రభావీశాఖగా శక్తివంతంగా తయారయి ప్రతిసం॥ ఆ శాఖనుండి శిక్షావర్గకు శిక్షార్థులు వెళ్ళేవారు స్వయంసేవకులుమీద వారికి ఉన్న అచంచల విశ్వాసం నాకు సంఘపనిమీద విశ్వాసం పెంచింది.

**మా హల్దేకర్‌జీతో నా సంఘజీవితంలో ఎన్నో అనుబంధాలు అనుభూతులు:**

నేను 1990-1997 మధ్యలో అనకాపల్లి జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్‌గా ఉన్నరోజులలో హల్దేకర్‌జీ కశింకోట శాఖ పర్యటనకు వచ్చి అనకాపల్లిలో మా ఇంట్లో బస చేసారు. మర్నాడు ఉదయం గణవేష్ వేసుకొని బూట్లు వేసుకొని మెట్లు దిగుతున్నారు. అంతే ఒక్కసారి అమ్మా అని కుప్పకూలిపోయారు. ఎంతో భయపడ్డాను. మా ఆవిడ పిల్లలు వచ్చి వారిని నిలబెట్టే ప్రయత్నం చేసాం. కాని వారు నా పాదంలో ఎదో గుచ్చుకుంది నేను నడవలేను అన్నారు. బూట్లు విప్పితే అంతారక్తంమడుగు. వెంటనే శుభ్రంచేసి చూస్తే కాలులో గాజుపెంకు గుచ్చుకొని ఉంది. నా శ్రీమతి పిన్నీసుతో ఆముక్కను తీసివేసి

గుడ్డకట్టు కట్టింది. ఇంట్లో విశ్రాంతి తీసుకోమని చెప్పాం. ఆయన లేదు నేను కశింకోట శాఖకు వెళ్ళాలి అని బయలుదేరారు. ఇద్దరం వెళ్ళాము. యథాతథంగా వారి పర్యటన పూర్తిచేసారు.

ఈ ప్రభావం మా ఇంట్లో ఎంతగా పడింది అంటే నాకు 2008లో శ్రీకాకుళంలో మోటర్‌సైకిల్ ప్రమాదం సంభవించి ఒకకాలు, కుడిచేయి మల్టిపుల్ ఫ్రాక్చర్. లేవలేని పరిస్థితిలో మైసూరులో విభాగ్ కార్యవాహల వర్గఉంది. నేను అప్పుడు విజయనగరం విభాగ్ కార్యవాహ. ఆవర్గకు నేను ఎలాగయినా వెళ్ళాలని నా శ్రీమతి, పిల్లలు కూడా ప్రోత్సహిస్తూ అనకాపల్లిలో హల్దేకర్‌జీకి జరిగిన పై ఘటన గుర్తుచేసారు. అంత పెద్దాయన పరిస్థితులకు అతీతంగా జీవించారు. వారిముందు మీరెంత అని నన్ను వర్గకు అనుమతి తీసుకొని నా శ్రీమతి కూడా సహాయంగా రావడానికి అనుమతినిపొంది ఆవర్గ పూర్తిచేయించారు. పరిస్థితులను సవాలుగా తీసుకోవాలనేది వారినుంచి మా కుటుంబం మొత్తం నేర్చుకొంది.

మా హల్దేకర్‌జీ 2004లో శ్రీకాకుళం పర్యటనకు వచ్చారు. నగర సాంఘికలో పాల్గొన్నారు. శాఖానంతరం నగరంలో ఉన్న కార్యకర్తల ఇళ్ళకు వెళ్దాం అన్నారు. అలాగే బయలుదేరారు. ఒకనగర కార్యకర్త ఇల్లు (వారితో ఉన్న)మాకు ఎవరికి తెలియలేదు. అయినా ఎలాగయినా ఆ కార్యకర్త ఇంటికి వెళ్ళాలి అని పట్టుబట్టారు. సుమారు 2గం॥ తర్వాత ఆ ఇల్లు కనుగొన్నాం. అంతసేపు హల్దేకర్‌జీ కూడ మాతోనే తిరుగుతున్నారు. ఆయనకూడా ఆ కార్యకర్తపేరుచెప్పి ఇల్లు ఎక్కడ అని వీధులలో అడగడం మొదలుపెట్టారు. మేము ఎంతో ఆశ్చర్యపడటమేగాక సిగ్గుపడ్డాం కూడా. చివరకు ఆ కార్యకర్త ఇంటికి అతికష్టంమీదవెళ్ళి కొంతసేపు అక్కడ వుండి వెళ్ళేముందు ఆ కార్యకర్తతో నీవుకూడా ఈ కార్యకర్తల ఇళ్ళకు వెళ్తుఉండుఅని ఈరోజు నేను వచ్చాను కదా శాఖకు రాలేదేమి అన్నారు. నాకు రెండునెలలనుండి ఆరోగ్యం బాగులేనికారణంగా నేను శాఖకు రాలేకపోయాను అన్నప్పుడు మాకు ఆశ్చర్యంతోపాటు ఎంతో బాధకూడ కలిగింది. అది అయ్యాక అక్కడనుండి మా ఇంటికి వెళ్దాం అన్నారు. మా ఇల్లు ఊరికి చివర. ఇంటికి కారుకూడాపోదు. నీటిలోంచి నడవాలి మరియు మీరు హృద్రోగంతో బాధపడుతున్నారు వద్దని వారించాము. కాని వారు ఒప్పుకోలేదు. మాఇంటిముందు ఒక కి.మి. ముందు కారుఆపి అక్కడినుండి మోకాలులోతు నీటిలోంచి మాఇంటికి అతికష్టంగా వారిని

తీసుకొనివచ్చాము. అప్పటికి సాయంత్రం చిరుచీకట్లలో లైట్లుకూడాలేవు. మాఇంట్లో టీతాగి చీకట్లో 7గం॥లకు బయలుదేరాము. వారికాలికి చెప్పులుకూడాలేవు. అలాగే నీటిలో తిరుగు ప్రయాణం రాత్రి 8గం॥ల తరువాత వారి బసకు చేరాం.

కార్యకర్తకు ఎంత విలువ ఇవ్వాలి అన్నది వారిద్వారా మా జీవితంలో మరపురాని విధంగా నాటుకుపోయింది. అందుకే మా హల్దేకర్‌జీ ఎంతోమందికి స్వయంసేవకులకు, కార్యకర్తలకు ఆదర్శం.

**- పార్నంది వెంకట రమణమూర్తి, శ్రీకాకుళం**

# శ్రీమాన్ రాంభావు హల్దేకర్‌జీతో నా అనుభవాలు

**19**93లో నాకు ఇందూరు 'నగర కళాశాల విద్యార్థి ప్రముఖ్' బాధ్యత ఉండేది. ఆ సమయంలో మా హల్దేకర్‌జీ పర్యటన సందర్భంగా ఇందూర్‌లో 'నగర సాంఘిక్' ఏర్పాటు చేశారు. పాతవాళ్ళు చాలామంది ఉన్నప్పటికి క్రొత్తవాళ్ళను ప్రోత్సహించాలని కాబోలు నగరసాంఘిక్‌కి కొంతమంది బాల స్వయంసేవకులు వచ్చారు. నేను విడిగా బాల అగ్రేసర్‌ను పిలవలేదు. అప్పటికి అంత సమయస్ఫూర్తి, అవగాహన నాకులేదు. 'అరె బాల అగ్రేసర్ కో బులావో' అని వారు చెబుతూనే ఉన్నారు అయినా నేను ఒత్తిడిలో అలాగే కొనసాగించాను. తరువాత ఎవరో చెప్పినట్లున్నారు. 'నయా ముఖ్య శిక్షక్ హై' అని వారు నన్ను ఏమీ అనలేదు.

తరువాత జిల్లా బైఠక్ జరిగింది. నేను మొదటిసారి జిల్లా బైఠక్‌కు వెళ్లాను. ఎప్పుడైనా వారి బైఠక్‌లో మొదటనే పరిచయం ఉండేది. ఆ రోజు నేనుకూడా పరిచయం చేసుకున్నాను. అప్పటినుండి వారు నన్ను మర్చిపోలేదు. ఉదయం సాంఘిక్ విషయం గుర్తుచేశారు. అయితే ఆ విధంగా జిల్లా బైఠక్‌లో, క్షేత్ర ప్రచారక్‌గారితో బైఠక్‌లో పాల్గొనడం మొదటిసారి. వారు బైఠక్ మొత్తం సంఘ విషయాలను హాస్యోక్తులతో జోడించి మనస్సుకు హత్తుకునే విధంగా తెలియజేశారు. నిజం చెప్పాలి అంటే వారందరు కడుపుబ్బ నవ్వారు. నాకు చాలా ఆనందం, అనుభూతి కలిగింది. సంఘంలో ఉన్న ఆనందం, వారు చూపిన

ఆత్మీయత నన్ను సంఘానికి ఇంకా దగ్గరగా తీసుకువచ్చింది.

అప్పటినుండి ప్రతి సంవత్సరం సంఘశిక్షావర్గలో ఒకసారి మరియు సంవత్సరం మధ్యలో ఒకసారి వారి సాన్నిహిత్యం అభించింది. ఎప్పుడూ నవ్వుతూ, ఆత్మీయతతో పేరు పెట్టి పిలిచేవారు. నేను 1995లో ప్రచారక్‌గా వచ్చాను. నన్ను భాగ్యనగర్‌లోని పాతబస్తీకి నగర ప్రచారక్‌గా పంపించారు. అక్కడ ఉన్న రెండు సంవత్సరాలలో రెండుసార్లు పర్యటనకు వచ్చారు. వారి శాఖ పర్యటన, కార్యకర్తల బైఠక్‌తోపాటు 'శిశుమందిర్ విద్యార్థులకు' బౌద్ధిక్ కార్యక్రమం కూడా ఉండేది.

వారు ఎప్పుడూ పర్యటనకు వచ్చినా మొట్టమొదట అడిగేవి వారి కార్యక్రమాల 'సమయసారిణి'. ఆ సమయసారిణి చూసి, చాలా సూక్ష్మంగా పరిశీలించి మార్పులు చేర్పులు సూచించేవారు. వారికి 12గం॥లకు బయలుదేరాలి అని చెబితే 11-45ని॥లకు తయారయి సిద్ధంగా ఉండేవారు. నేను తరువాత, జిల్లా ప్రచారక్‌గా, విభాగ్ ప్రచారక్‌గా ఉన్న సమయంలో కూడా వారు ఆలస్యంగా బయలుదేరారు, ఆలస్యంగా వచ్చారు అనేది నేను ఎప్పుడూ చూడలేదు. అంత క్రమశిక్షణ, కఠోరసమయపాలన, నియమపాలన వారి జీవితంలో చూశాను.

1996లో పాత రాష్ట్రీయ విద్యాకేంద్రంలో నేను ద్వితీయవర్ష శిక్షావర్గ చేశాను. అక్కడ నేను చివరకు జరిగిన దండ ప్రతియోగితలో, బౌద్ధిక్ విభాగ్ పరీక్షలో ప్రథమస్థానం వచ్చాను. మా॥ కాశీపతిగారు వర్గ ముఖ్యశిక్షక్. శారీరక గణలను గటలుగా విభజించి 5 అంశాలలో శారీరిక స్పర్థలు నిర్వహించారు. మా గట ప్రముఖ్‌గా నేనున్నాను. మా గట 4 అంశాలలో ప్రథమ, ఒక అంశంలో ద్వితీయస్థానం వచ్చింది. ఈ విషయం తెలిసిన మా॥ రాంభావు హల్దేకర్‌జీ, మా॥ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ప్రత్యేకంగా నన్ను పిలిపించి శారీరిక, బౌద్ధిక్‌లో ప్రథమస్థానం వచ్చావని ప్రత్యేకంగా అభినందించారు.

నేను బర్కత్‌పుర భాగ్ ప్రచారక్‌గా ఉన్నప్పుడు నా వసతి ప్రాంత కార్యాలయం 'కేశవనిలయం'లో ఉండేది. అక్కడ కార్యకర్తల రాకపోకలు చాలా ఎక్కువగా ఉండేవి. అందులో వివిధ క్షేత్ర కార్యకర్తలు కూడా ఉండేవారు. నేను అక్కడే ఉండేవాడిని. కాబట్టి అందరితోటి పరిచయాలుకూడా ఉండేవి. చాలాసార్లు సెకండ్ ఫ్లోర్ నుండి బయలుదేరి క్రిందికి వచ్చి బండి తీయటానికి అర్ధగంటపైగా సమయం పట్టేది. కలిసిన వారందరితో మాట్లాడవలసి వచ్చేది. అలా ప్రత్యక్షంగా నేను చేసే పనికి సంబంధంలేదు, సమయం వృధా అవుతుంది అనే భావన కలిగి భాగ్ కార్యాలయం మార్చాలి అనే ఆలోచన కలిగింది. విభాగ్

ప్రచారక్; ప్రాంత ప్రచారక్‌గారికి చెప్పి నల్లకుంటలో విడిగా కార్యాలయం తీసుకున్నాను. అది తరువాత క్షేత్ర ప్రచారక్ అయిన రాంభావు హల్దేకర్‌జీకి తెలిసిందది. నన్నుపిలిచి అడిగారు కార్యాలయం ఎందుకు మార్చావు అని, నేను ఉన్నవిషయం చెప్పాను, వివిధ క్షేత్ర కార్యకర్తలు అందరు కలుస్తుంటారు, సమయం వృధా అవుతుంది అని చెప్పాను. వారు నాతో ఏమి అనలేదు. కాని అప్పటి ప్రాంత ప్రచారక్ రామచంద్రయ్య గారిని పిలిచి ఇంక ఈ కార్యాలయం ఎందుకు నేను ఖాళీ చేసి వెళతాను వేరే చూడండి అన్నారట. వెంటనే రామచంద్రయ్యగారు నన్ను పిలిచి ఇంక చాలు బయటి కార్యాలయం ఖాళీ చేసి ప్రాంత కార్యాలయం రమ్మని చెప్పారు. నేను తిరిగి కార్యాలయం వచ్చాను. ఆ విధంగా వారు ఏవిషయం ఎవరితో మాట్లాడాలి, ఎవరికి చెప్పాలి అనే విషయం చాలా జాగ్రత్తగా చెప్పేవారు.

వారి పర్యటనలో ఒకసారి ప్రచారకులుగా పనిచేస్తున్న వారందరి ఇళ్ళకు వెళ్ళారు. అప్పుడు మా ఇంటికి కూడా వెళ్ళి వచ్చారు. మా ఇంటికి వెళ్ళిన మొదటి ప్రచారక్ మరియు కార్యకర్తకూడా వారే. మా తమ్ముడి వివాహం సమయంలో కూడా వారు గుర్తుపెట్టుకొని ఉత్తరం ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ విధంగా వారు వెళ్ళలేనప్పుడు ప్రతి ఒక్కరికి ఉత్తరాలద్వారా శుభాకాంక్షలు తెలియజేసేవారు.

వారు వృద్ధాప్యంలో కూడా సర్‌సంఘచాలక్ జీ పిలుపు మేరకు “ప్రతి స్వయంసేవక్‌కు పని” అనే విషయాన్ని ఆచరణలోపెట్టి జీవించాలి అనుకున్నారు. అందుకే పుస్తకాలు వ్రాయటం, వ్రాసిన పుస్తకాలు అమ్మటం, పాత స్వయంసేవకులు ఉన్న సుదూర గ్రామాలకు వెళ్ళి, వాళ్ళ జాబితా తయారు చేయించి, వాళ్ళకు సమావేశాలుపెట్టి మార్గదర్శనం చేయుట నిజంగా అందరికి ప్రేరణ కలిగించే విషయం.

నేను చాలాసార్లు అనుకునేవాడిని “డాక్టర్జీ ప్రతిరూపం హల్దేకర్‌జీ” అని ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండటం, కోపం అనేది లేకపోవటం, గంభీరమైన ఉపన్యాసాలు ఇవ్వకుండా సరళమైన ఉదాహరణలద్వారా విషయాన్ని అర్థంచేయించటం ఇవన్నీ డాక్టర్జీ లక్షణాలే అనిపించేది. శ్రీ పోడూరి నర్సింహమూర్తిగారు బర్కత్‌పుర భాగ్ కార్యవాహగా ఉండేవారు. మొదట్లో వారి శ్రీమతి గారికి సంఘం గురించి పెద్దగా తెలియకపోయేది. కొంచెం వ్యతిరేకత కూడా వుండేదేమో! ఒకసారి కుటుంబ సమ్మేళనంలో హల్దేకర్‌జీ ఉపన్యాసం విని చాలా ప్రభావితురాలైంది. అప్పటినుండి హల్దేకర్‌జీ వస్తున్నారు అంటే తప్పకుండా ఆమె వచ్చేవారు. ఇటువంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి.

బహుశా 2004లో అనుకుంటాను శ్రీశైలం శివాజీ స్ఫూర్తికేంద్రంలో ప్రచారకులవర్గ

జరిగింది. దానికి మా ॥ మధుభాయి జీ కులకర్ణి గారు మార్గదర్శనం చేయటానికి వచ్చారు. సమారోప్ బౌద్ధిక్ వారిది. అనువాదం చేసే అవకాశం నాకు ఇచ్చారు. సమారోప్‌లో మా॥ జయదేవ్‌జీ, మా॥ భాగయ్యగారు, మా॥ హల్దేకర్‌జీ ఇటువంటి పెద్దలందరు ఉన్నారు. నేను అనువాదం చేశాను. వారి బౌద్ధిక్ చాలా అద్భుతంగా ఉండింది. బౌద్ధిక్ అయిపోగానే పెద్దలందరు వచ్చి అనువాదం చాలా బాగా చేశావని మెచ్చుకున్నారు. మా॥ హల్దేకర్‌జీ వచ్చి, 'అనువాద్ మే శబ్ద భీ ఆగయా, శబ్ద కే పీఛే భావ్ భీ ఆగయా' అన్నారు. ఆ విధంగా నాలాంటి ఎంతోమంది కార్యకర్తలను ప్రోత్సహించి వృద్ధిచేశారు.

**– పతకమూరి శ్రీనివాసరావు,**
**ప్రాంత సంఘటనా కార్యదర్శి, శ్రీ సరస్వతీ విద్యాపీఠం**

# 'ఓం రాష్ట్రాయ స్వాహా' యజ్ఞంలో ఒక సమిధ

**శ్రీ** రామచంద్ర సదాశివ హల్దేకర్‌జీ (శ్రీరాంభావు హల్దేకర్‌జీ) గారి గళంనుండి వెలువడ్డ అద్భుత గ్రంథం 'ఓం రాష్ట్రాయస్వాహా'. మరాఠీలో ప్రఖ్యాత రచయిత్రి శ్రీమతి మృణాళినీ జోషీ 'చారిత్రక నవల'గా రాసిన ప.పూ. గురూజీ జీవిత చరిత్రను హల్దేకర్‌జీ తెలుగులోకి అనువదిస్తూ చెప్తున్న విషయాలను శ్రీ బెల్లంకొండ మల్లారెడ్డిగారు కాగితంపై లిఖించారు. శ్రీ భావనారాయణగారు ఈ రాతప్రతిని చదివి, సరిచేసి నాకప్పగించారు. ఒక శుభముహూర్తాన 2010, జూన్3న (సావర్కార్ జయంతి) ఈ పని ప్రారంభమైంది. అయిదు నెలలపాటు రోజూ 4,5 గంటలపాటు జరిగిన ఈ అనువాద యజ్ఞం 2010, అక్టోబర్ 30న పూర్తయింది. 528 పుటలతో 2011 ఫిబ్రవరిలో ఈ పుస్తకం వెలువడింది.

ఈ అయిదు నెలలపాటు దాదాపుగా వారానికోమారు ఆ 'ఋషి'ని దర్శించుకుంటూ, కొంతసేపు గడిపే భాగ్యం నాకు కలిగింది. ఎప్పటికప్పుడు డి.టి.పి. చేసిన కాగితాల్ని వారికి చదివి వినిపిస్తూ, కొన్నిచోట్ల చేసిన మార్పు చేర్పుల్ని వారికి నివేదించేవాడిని. ఏమాత్రం సవరణలు లేకుండా నా మార్పుల్ని వారు అంగీకరించేవారు. ఒక్క విషయం వీలైనంత తొందరగా మీతో పంచుకోవాలని ఉంది. ఆ రోజులలో వారి సముఖంలో

నాకు లభించిన స్ఫూర్తి, వారి ముఖవర్చస్సు అందించిన శక్తి అనంతం. ఆ శక్తితోనే ప్రతిరోజూ తెల్లవారు ఝామునే 1,2 గంటలపాటు ఈ రాతప్రతికి ముద్రణకు కావలసిన అక్షరాకృతి చేసేవాడిని. ఈ మహదవకాశం లభించడం నాకు జీవితకాలానికి సరిపోయేంత తృప్తినిచ్చింది.

శ్రీ హల్దేకర్‌జీ అంతకుముందే శ్రీ గోపాల నీలకంఠ దాండేకర్ మరాఠీలో వ్రాసిన ప.పూ. డాక్టర్జీ జీవిత చరిత్రను 'పెనుతుఫానులో దీపస్తంభం' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ వ్రాతప్రతిని శ్రీ భావనారాయణగారు వ్రాసారు. టైపింగ్ పూర్తయిన తరువాత, ముద్రణకోసం నాకు అప్పగించారు. ఒకసారి చదవమన్నారు. తరువాత శ్రీ భావనారాయణగారితో కలిసి కొన్ని చిన్నచిన్న వాక్యనిర్మాణాలను మార్చాలనుకున్నాను. ఈ మార్పులతో శ్రీ హల్దేకర్‌జీని కలిసే భాగ్యాన్ని కలిగించారు భావనారాయణగారు. అంతకుముందు సంఘ కార్యక్రమాల్లో వేదికలపై హల్దేకర్‌జీని చూడడం, వినడం మాత్రమే నాకు అనుభవం. ఈ రూపేణా జనవరి 2010లో వారితో ప్రత్యక్షంగా కొద్దిసేపు గడిపే అవకాశం లభించింది. నా సూచనలు సంపూర్ణంగా అంగీకరించి అవసరమైన మార్పులకు అనుమతిచ్చారు. 2010 ఫిబ్రవరిలో ఆ పుస్తకం వెలువడింది. 10వేల ప్రతులు మొదటి ముద్రణ. నెలలోపే ఐదువేల ప్రతుల ద్వితీయ ముద్రణ. నిజంగా అది అద్భుతం. ఆ స్ఫూర్తి అమోఘం. ఈ విజయం అనల్పం.

తరువాత కొద్దిరోజుల్లోనే 'ఓం రాష్ట్రాయ స్వాహా' ముద్రణ సంబంధమైన పనులకు ప్రారంభం జరిగింది. నాకు వారితో మరింత సామీప్యతను పెంచింది. ఈ రచనసాగి, ముద్రణ జరిగిన 6,7 నెలలూ చాలా వేగంగా గడిచిపోయాయి. నా దైనందిన కార్యక్రమాలు యథావిధిగా కొనసాగిస్తున్నా, నేను ముద్రణాలయాన్ని వృత్తిగా నిర్వహిస్తున్నా, మనసులో ఒక చెప్పలేని అనుభూతి కలిగేది. ఈ పుస్తకం టైపుచేస్తున్నప్పుడు, మళ్ళీ మరోసారి చదువుతున్నప్పుడు కళ్ళు చెమర్చడం సాధారణం. ఒక్కోసారి కనులు ధారాపాతంగా వర్షించిన సందర్భాలు ఉన్నాయి. ఇది ఆ రచనలోని గొప్పదనం. ఇప్పటికే శ్రీ గురూజీ జీవితచరిత్ర అనేక గ్రంథాలలో వెలువడింది. అయితే ఈ పుస్తకానికున్నశైలి అద్భుతం. శ్రీమతి మృణాళినీ జోషిగారి రచనాపటిమ, ఒక చరిత్రపురుషుడి జీవితాన్ని అద్భుతశైలిలో ఆవిష్కరించిన తీరు అసామాన్యం. హల్దేకర్‌జీ ఆస్ఫూర్తి తగ్గకుండా తెలుగులోకి అనువదించి మనకు విలువైన గ్రంథాన్ని అందించారు.ఇది కేవలం ఒక సాధారణ రచన కాదు.

అనుభూతితో అనుభవాల్ని జోడించి అందించిన చరిత్ర.

ఈ పుస్తకాన్ని ఆరంభిస్తే పూర్తయేంతవరకూ చదవాలనిపిస్తుంది. సహజత్వంతో కూడిన సన్నివేశాలు, శక్తివంతమైన సంఘటనలు మన హృదయాలను తాకుతూ తాదాత్మ్యతకు, చెప్పలేని అనుభూతికి గురిచేస్తాయి. శ్రీ గురూజీని దైవాంశసంభూతుడుగా భావించడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. అందుకే ఈ పుస్తకం చదువుతుంటే ఒక రామాయణంలా, భారతంలా అనిపిస్తుంది.

వెలువడడానికి ముందే ధర నిర్థయమైన ఈ పుస్తకం గొప్ప ప్రజాదరణ పొందింది. తొలి ముద్రణ పదివేల ప్రతులు. అక్టోబరు 2010 నుండి జనవరి 2011 వరకు హల్దేకర్‌జీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రదేశాలకు స్వయంగా వెళ్లి ముద్రణకు ముందే పుస్తకాల పంపిణీ వ్యవస్థను పర్యవేక్షించారు. దేశంలోని కొన్ని ప్రాంతాలు కూడా పర్యటించారు.

తరువాత ప.పూ. శ్రీ బాలాసాహెబ్ జీవితచరిత్రను కూడా హల్దేకర్‌జీ అనువదించారు. ఈ క్రతువులో కూడా పాల్గొనే మహద్భాగ్యం నాకు దక్కింది.

హల్దేకర్‌జీతో అనుభవాలు రాయాలంటే... నాకు ఇంతకు మిక్కిలి ప్రముఖమైన అంశాలు తోచలేదు. వారి జీవిత చరమాంకంలో ముదిమి వయస్సులో సైతం సంఘమూలపురుషులైన డాక్టర్జీ, గురూజీ, బాలాసాహెబ్‌జీ జీవితచరిత్రల్ని తెలుగీకరించడం భగవన్నిర్ణయంగా భావిస్తాను. ముదిమివయస్సులో ఈ పనిని స్వీకరించి, విజయవంతంగా నెరవేర్చగలగడం కేవలం మహానుభావులకు మాత్రమే సాధ్యమవుతుంది.

ఏ యుగంలోనైనా మహనీయులు తక్కువమందే జన్మిస్తారు. వారి దర్శన, పరిచయభాగ్యాలు, వారితో కలిసి పనిచేసే అవకాశం కూడా కొందరికే లభిస్తుంది. ఈ తరంలో ఆ భాగ్యాన్ని పొందగలగడం నా పూర్వజన్మసుకృతంగా భావిస్తాను. వారు పరమపదించడానికి వారంముందు దర్శించుకున్నాను. వారిదృష్టి నాపై ప్రసరించింది. నా మనసులోని భావాలు వారు గమనించారనుకుంటాను. కళ్ళు కలిసిన కొద్ది క్షణాలు వారి ముఖంలో ప్రసన్నమైన మార్పు స్పష్టంగా గోచరమైంది. ఆ వాత్సల్యాన్ని జీవితాంతం పదిలపరచుకుంటాను.

**– మామిళ్ళపల్లి రామమూర్తి, మహతి ప్రింట్ క్రియేషన్స్**

# ఆత్మీయత, వ్రత నిష్ఠలకు ప్రతిరూపం హల్దేకర్‌జీ

**మా**న్యశ్రీ రామచంద్రరావు సదాశివరావు హల్దేకర్ కులకర్ణి (రాంభావు)జీ. నేను సంగారెడ్డిలో నగరప్రచారక్‌గా ఉన్నపుడు వారిని చూచినాను. అప్పుడు డాక్టర్జీ జీవితం (పెనుతుఫానులో దీపస్తంభం) పుస్తకాలు వంద అమ్మినాను. మెచ్చుకున్నారు. 2011 శిక్షావర్గ సమారోప్‌లో నేను ప్రాంత కార్యాలయం వ్యవస్థలో ఉంటానుఅని ప్రకటించినారు. కార్యాలయ ప్రముఖ్ యాదిరెడ్డిగారి గదిలో నాచేతి సంచి పెట్టినాను. ప్రాంత ప్రచారక్‌గారు తన గదికి పిలిచి "రేపటినుండి నీవు హల్దేకర్‌జీకి సహాయకుడిగా ఉండాలి" అన్నారు.

కార్యక్షేత్రంలో ఉన్నప్పటినుండి ఉ॥ 4.00లకు లేచి స్నానంచేయడం అలవాటు. 20 జూన్ 2011 ఉదయంలేచి స్నానంచేసి 5.00గం॥లకి హల్దేకర్‌జీ గదికి వెళ్ళినాను. హల్దేకర్‌జీ పడుకొని ఉన్నారు. వారు లేచినతరువాత నేను మీకు సహయంగా ఉంటున్నాను అని చెప్పి నేను పరిచయం చేసుకున్నాను. అప్పటినుండి 31మే 2016 వరకు వారితో కలిసి ఉండే అదృష్టం భగవంతుడు నాకు కల్పించాడు.

అప్పటివరకు వారిక సహాయక్‌గా ఉన్నవ్యక్తి మందులు, ఆహారనియమాలు నాకు వివరించి చెప్పి వెళ్లిపోయాడు. నేను వచ్చిన కొద్దిరోజులకు వారి ఆరోగ్యంలో ఇబ్బందిరాగా సాయివాణి ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటివరకు వాడుతున్నమందులు డాక్టర్‌గారికి చూపించాం. డాక్టర్‌గారి సలహాప్రకారం ఎప్పుడు ఏ మందులు ఇవ్వాలో సిస్టర్ వ్రాసుకుంది. రాత్రి భోజనం తరువాత సిస్టర్ మందులు ఇచ్చి వెళ్ళింది. హల్దేకర్‌జీకి నిద్రరావటంలేదు. వారు నావంకచూసి 'ఇంకోటాబ్లెట్ ఇవ్వ'అని అడిగారు. సిస్టర్ ఇస్తుంది అన్నాను. నేను అడుగుతున్నాను ఇస్తావా ఇవ్వవా అని కోపంగా అన్నారు. నేను ఇవ్వను, సిస్టర్ ఇస్తుంది అని నేను కోపంగా అన్నాను. నా జీవితంలో నాకు ఎదురుచెప్పిన వ్యక్తివి నీవే అన్నారు. నాకు బాధ అనిపించింది. ఇది అంతా సిస్టర్ బయటనుంచి గమనించింది. మిమ్మల్ని అంతగా కోప్పడుతున్నారు మీకు ఏమవుతారు? నాన్ననా? అవును. మీరంత జాగ్రత్తగా చూసుకుంటుంటే కోపపడుతున్నారు. మీ నాన్న కనుక మిమ్మల్ని కోప్పడుతున్నారు. మందిని అంటే ఊరుకుంటారా? అంటూ వెళ్ళిపోయింది. ఆరోజు రాత్రి నిద్రలో కలవరిస్తున్నారు.

హల్దేకర్‌జీ ఏమయింది అని చేయిపట్టుకున్నాను. వారు నాచేయి గట్టిగా పట్టుకున్నారు. కొద్దిసేపుచూసి "నాతో ఉంటావా? మా ఊరికి తీసుకుపోతా, మిఠాయిలు తినిపిస్తా" అని చేయి అలాగే పట్టుకున్నారు. ఉంటాను అని తలూపాను. మాటఅయితే ఇచ్చానుకాని ఉండటం కష్టమనిపించింది మనసులో.

హల్దేకర్‌జీతోపాటే శ్రీ ద్వారకాచారిగారు, శ్రీ భానుసింగ్‌గారు, శ్రీ అంగర త్రివిక్రమరావుగారు, శ్రీ పటోళ్ళ రామిరెడ్డిగారు, మరియు శ్రీ అప్పాజీ వంటి జ్యేష్ఠ ప్రచారకులు కార్యాలయంలో ఉన్నారు. ద్వారకాచారిగారి వద్ద ఒక సహాయకుడు ఉన్నారు. అతను "హనుమ". మాటలురావు, చదువులేదు, సంఘశిక్షావర్గ కాలేదు. అటువంటి పరిస్థితిలో సహాయక్‌గా ఉన్నారు. ఉదయమే లేస్తాడు, స్నానం పూర్తిచేసుకుంటాడు. ద్వారకాచారిగారికి స్నానము, కాలకృత్యాలు అతనే చేయిస్తాడు. సమయానికి అల్పాహారము, భోజనము పెడతాడు. ఎప్పుడు ఏమందులు ఇవ్వాలో ఆ సమయానికి ఇస్తాడు. బయటనుంచి కావలసినవి తీసుకువస్తాడు. చక్కగా దండపట్టుకుని శాఖకు వెళతాడు. అతడిని చూసిన తరువాత నాకు చాలా సిగ్గు, చిన్నతనము అనిపించింది. నేను చదువుకున్నాను, శిక్షావర్గ తృతీయవర్ష అయింది. నేను ఎందుకు ఈపనిచేయలేను? అని నాకునేను ప్రశ్నించుకున్నాను.

మధ్యమధ్యలో డాక్టర్లువచ్చి చూసి వెళుతుండేవారు. ఒకరోజు డా॥ రాఘవేంద్రరావుగారితో హల్దేకర్‌జీ ఏమీ తింటంలేదు, నోటికి రుచిగా ఉంటంలేదు అంటున్నారు అని చెప్పాను. డాక్టరుగారు వారిది చివరిదశ. ఏమిఅడిగితే అవి పెట్టమన్నారు. చాలా సంవత్సరాలనుండి రాత్రి రెండు చపాతీలు, పాలల్లో నానబెట్టుకుని తీసుకునేవారు. అట్లా కాకుండా రాత్రి భోజనం కూరతో తీసుకుంటే బాగుంటుంది అని హల్దేకర్‌జీకి చెప్పినాను. ఏమబ్బా నీవు డాక్టరులాగా చెపుతున్నావు అన్నారు. ఎందుకంటే మందులెక్కువగా తీసుకుంటున్నారు. దానికి తగ్గ ఆహారం ఉండాలి అన్నాను. సరే నీఇష్టం అన్నారు. అప్పటి నుండి (30 సెప్టెంబరు 2011) ఓట్సుతోపాటు అందరికోసం తయారుచేసే అల్పాహారం కూడా పెట్టటం మొదలైంది.

హల్దేకర్‌జీ ప్రతి సంవత్సరం దీపావళి కుటుంబసభ్యులతో కలిసి చేసుకునేవారు. 19-10-2011న బయలుదేరి 20-10-2011 ఉదయం 4.40కి శంభాజీనగర్ చేరుకున్నాం. వారి తమ్ముడు శ్రీ ప్రభాకర్‌జీ హల్దేకర్ ఇంటికి వెళ్ళినాము. సాయంత్రం

బంధువులు అందరు వచ్చినారు. నన్ను అందరికి పరిచయం చేసినారు. నాకు హిందీ వచ్చుగనుక అక్కడ ఇబ్బందికాలేదు. బంధువులకు ఒక బైఠక్ పెట్టినారు. ఎందుకంటే 22,23 రెండురోజులు హల్దేకర్జీ జన్మస్థలమైన 'హల్దా' గ్రామంలో పాత ఇల్లు తీసివేసి కొత్తఇల్లు కట్టినారు - దాని గృహప్రవేశం. నారాయణరావు హల్దేకర్ స్మృతి ప్రకల్పంలోకి (కొట్టంలోకి) గోవుల ప్రవేశం. ఈ రెండు కార్యక్రమాల నిమిత్తం మూడునెలల ముందే నాచేత సంఘపెద్దల జాబితా తయారుచేయించి, ముందే రిజర్వేషన్ చేయించినారు. హల్దాకు శంభాజీ నగర్నుండి రెండున్నర గంటల ప్రయాణం. వర్షాలుపడి తగ్గినాయి. పకృతి రమ్యంగా ఉంది. కొండలు, లోయలు కనిపిస్తున్నాయి. ముఖ్య రహదారి నుండి 12 కి.మీ. లోపలికి ఉంటుంది గ్రామం. అక్కడినుండి ఇరువైపులా చెట్లు కొద్దిదూరంగా పంటపొలాలు, అక్కడక్కడా విసరేసినట్లు చిన్న గ్రామాలు, పక్షుల కిలకిలారావాలు, మధ్యలో వాగూర్నది దాటాం. అది ప్రవహిస్తూపోయి చంద్రభాగానదిలో కలుస్తుంది. హల్దేకర్జీ వాగూర్నదికుండా పోయి స్నేహితులతో కలసి అజంతా గుహలు చాలాసార్లు చూసారని చాలాసార్లు చెప్పారు. ముందుకు వెళ్ళాం. దూరంగాచూస్తే ఒక గ్రామం చెట్లమధ్యలోనించి కనిపిస్తున్నది. హల్దేకర్జీ అదే మా గ్రామం. హల్దా అని చెప్పినారు. ఆ గ్రామంలో ప్రవేశించగానే రామమందిరం దర్శనం అవుతుంది. దానిప్రక్కనే హనుమాన్ మందిర్. నెమ్మదిగా హల్దేకర్జీ ఇంటికి చేరుకున్నాం. అప్పటికే బంధువులు చేరుకున్నారు. గ్రామంలో చాలామంది వచ్చినారు. వీరిని చూడగానే అందరికి ఒక ఆనందం. 'రాంభావుజీ ఆయేహై' 'రాంభావుజీ ఆయేహై' అంటూ వచ్చి పలకరించినారు. ఆరోజు సత్యనారాయణ వ్రతం పూర్తయింది. చాలా సంవత్సరాల తర్వాత హల్దేకర్జీ అక్కడ పడుకున్నారు. 22వ తేది శంభాజీనగర్కు వచ్చే కార్యకర్తలు ఉండటానికి వ్యవస్థ పూర్తయిందా అని అడిగి తెలుసుకున్నారు. వాళ్ళకు ఎలాంటి ఇబ్బందికూడా కలగకూడదని చెప్పినారు.

23న శంభాజీ నగర్నుండి కార్యకర్తలు బస్సులో బయలుదేరినారు. హల్దాగ్రామం రావటానికి బస్సులో ఆలస్యం అవుతుందని మధ్యలో 'లేహారేడి' దగ్గర గోకులప్రకల్పలో అల్పాహారం ఏర్పాటుచేసినారు. సాధారణంగా మహారాష్ట్రలో పోహా, చుడువా వాడతారు. కాని వచ్చేది తెలంగాణా ప్రాంత కార్యకర్తలు కనుక తెలంగాణా అల్పాహారం ఉండాలని ప్రత్యేకంగా ఇడ్లీ, వడ, మసాలాదోస, ఊతప్పం ఏర్పాటుచేసినారు.

హల్దాలో సభ జరిగింది. అందులో ఒక స్వామీజీ హల్దేకర్జీ గురించి మాట్లాడారు.

అక్కడ కొత్తగా నిర్మాణమయిన గోశాలలో గోవులను ప్రవేశం చేయించినారు. మళ్ళా కొత్త ఇంటిదగ్గర సమావేశం. చాలామంది కార్యకర్తలు కుటుంబాలతో వచ్చినారు. సాంస్కృతిక కార్యక్రమం తరువాత కొద్దిమంది పెద్దలు మాట్లాడినారు. ఆ తరువాత వచ్చినవారందరికి మగవాళ్ళందరికి పంచలు, మాతృమూర్తులకు చీరలు పెట్టినారు. మా॥ శ్రీ టి.వి. దేశ్‌ముఖ్ గారితో గోదానం చేయించినారు. భోజనంలో అందరికి పురణ్ పోలీలు, నెయ్యి అడిగి అడిగి మరిమరీ వడ్డించినారు. రాత్రి భోజనం తరువాత కార్యకర్తలు తిరుగుప్రయాణం అయినారు.

కార్యక్రమం మొత్తం యోజనచేసినవారు కుమారి సునితా హల్దేకర్‌జీ. వారు హల్దేకర్‌జీ అన్నగారు శ్రీ నారాయణరావుగారి కూతురు. సేవికాసమితి ప్రచారిక. ప్రస్తుతం సహ సర్ కార్యవాహగా బాధ్యత నిర్వహిస్తున్నారు. కేంద్రం గువాహటి. హల్దేకర్‌జీ నన్ను పిలిచి అక్కడ కార్యాలయంలోనే ఉంటావుకదా. ఇక్కడ అన్నీచూసిరా అన్నారు. దేవగిరికోట, యాదవరాజుల కోట, చాలా అద్భుతంగా ఉంటాయి. ద్వాదశ జ్యోతిర్లింగం ఘృష్ణేశ్వర ఆలయంచూశాను. పైఠణ్‌డామ్ ఆనకట్ట, సంత్ ఏకనాథ్ క్షేత్రం, అన్నీ దర్శించుకున్నాను. తోలుబొమ్మలాట చూసినాను. అంతకుముందు వినటమేగాని చూసిందిలేదు. 2012 జనవరిలో బెంగుళూరులోని ప్రశాంతి కుటీర్‌కి వెళ్లాము. ట్రెయిన్‌లో బెర్త్‌పై బెడ్‌షీట్ ఎలావేయాలో చెప్పి, వేసి చూపించారు. చిన్నపనులను కూడా ఎలా శ్రద్ధగా చేయాలో క్రమంగా నాకు నేర్పిస్తున్నారు. 20 సం॥ క్రితం విశాఖజిల్లా పాడేరులో జిల్లా బైఠక్‌కి వెళ్లినపుడు సిందూరం డబ్బా మరచిపోగా, పరశురామ్ గారికి తెలియజేసి తెప్పించిన విషయం చెప్పారు. అలాగే మరోసారి నారాయణపేట పర్యటన తర్వాత సిందూరం డబ్బా కనబడకపోతే, పాలమూరు జిల్లా కార్యకర్తకు చెప్పి తెప్పించుకున్నారు. తాను 30 సం॥లుగా దానిని వాడుతున్నానని, మనదగ్గర వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలనీ చెప్పారు. ప్రశాంత కుటీర్‌లో 15 రోజులు ఉన్నాం. అక్కడ ఉన్నపుడు ఒకరాత్రి కలలో ఒకదేవీమూర్తి కనిపించింది. తెల్లవారిన తర్వాత ఆ విషయం హల్దేకర్‌జీకి చెప్పాను. 'నువ్వు అదృష్టవంతుడివి' అన్నారు.

23-3-12 ఇందూర్ నాగశ్రీనివాస్‌గారి ఇంటికి వెళ్ళాము. 24ఉదయమే మాహూర్‌లోని రేణుకామాత దేవాలయానికి కారులో మాననీయ శ్రీ హల్దేకర్‌జీ, శ్రీ నాగ శ్రీనివాస్‌గారు, నేను బయలుదేరాం. 'కిన్వట్'లో హల్దేకర్‌జీ తమ్ముని కొడుకు శ్రీ బాపూ

హల్దేకర్ మా అందరికి అల్పాహారం ఏర్పాటుచేసినారు. అక్కడినుండి మధ్యాహ్నానికి మాహూర్ చేరుకున్నాం. ఆలయం గుట్టపై ఉన్నది. హల్దేకర్‌జీని పల్లకీలో కూర్చోపెట్టి పంపించాం. మేము నడుచుకుంటూ వెళ్ళేసరికి హల్దేకర్‌జీ దేవీదర్శనం చేసుకుని బయట కూర్చున్నారు. హల్దేకర్‌జీ నా దర్శనం అయింది వెళ్దామా అన్నారు. వెళ్దాం పదండి అన్నాను. నేను దర్శనం చేసుకోలేకపోయినాను. క్రిందకు వచ్చినాము. రెండువైపులా దుకాణాలు ఉన్నాయి. రకరకాల వస్తువులున్నాయి. హల్దేకర్‌జీ ఒక కొత్తఫుటో చూపిస్తానని అన్నారు. అది రేణుకామాతది. పైన దర్శనం చేసుకోలేదుకదా. క్రింద దుకాణంలో దర్శనం చేసుకున్నాను. నేను అదృష్టవంతుణ్ణి. ఎందుకంటే 21-1-12 నాకు కలలో కనిపించిన దేవీమూర్తిదే ఆ ఫొటో. నా భక్తుడు హల్దేకర్‌జీతోపాటు నీవు మాహూర్‌కు వస్తావుకాని అక్కడున్న పరిస్థితుల దృష్ట్యా నీకు దర్శనం కాదు. కనుక ముందే దర్శనం ఇవ్వాలని రేణుకామాత అనుకొని ఉంటుంది అని అర్థమైందినాకు. హల్దేకర్‌జీపై గౌరవం పెరిగింది. ఈ సంఘటన హల్దేకర్‌జీకి కూడా చెప్పలేదు. 2014లో పుణే వెళ్ళవలసి ఉంది. 29 ఏప్రియల్‌న సౌకర్యవంతమూన రిజర్వేషన్ దొరికింది. 30న లోక్‌సభ ఎన్నికలు. అందరూ తప్పక వోటువేయాలని చెప్తూ మనం వోటు వేయకపోతే ఎలా? అన్నారు. ఆరక్షణను 30వ తేదీకి మార్పించారు. వోటువేసి వెళ్లాము.

2013 అక్టోబర్ 12నుండి 15వరకు దేశంలో ఉన్న జ్యేష్ఠ ప్రచారకుల బైఠక్‌లు, నాగపూర్‌లోని రేషన్‌బాగ్‌లో జరుగుతున్నాయి. దానికి ఈ ప్రాంతంనుండి 1. మా॥ శ్రీ హల్దేకర్‌జీ, 2. పటోళ్ళ రామిరెడ్డిగారు, 3. శ్రీ అంగర త్రివిక్రమ్‌జీ, 4. కె.వి. సత్యన్నారాయణగారు, 5. శ్రీ భానుసింగ్‌గారు, 6. శ్రీ అప్పాజీ వారికి సహాయకులుగా నేను, తోటపల్లి ప్రసాద్, మరియు చెన్నా శ్రీనివాస్ వెళ్ళాం. దేశం మొత్తంమీద అపేక్షిత 126మంది. 29మంది అనారోగ్యం కారణంగా రాలేమని ముందేఅన్నారు. 97మందిలో 7గురు అస్వస్థులై రాలేకపోయినారు. ఆ తపోభూమిలో ఇంత ఋషి, ముని వారసులను (జ్యేష్ఠ ప్రచారకులను) చూసే అదృష్టం నాకు దొరికింది. 14 అక్టోబరున నాగపూర్ విజయదశమి ఉత్సవంలో పాల్గొన్నాం. మీరు ఎప్పుడయినా ఇంతకుముందు నాగపూర్ విజయదశమి ఉత్సవంలో పాల్గొన్నారా? అని నేను అడిగినపుడు లేదు, మనం ప్రచారకులం. సంఘం ఎక్కడ చెపితే అక్కడ ఉండాలి. జేష్ఠప్రచారకులు చాలా ఆనందంగా గడిపారు. ఒకరిని ఒకరు చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఇందులో పరమపూజనీయ

డాకర్ట్‌జీని చూసిన అయిదుమంది జ్యేష్ఠ ప్రచారకులు ఉన్నారు. 2014 జనవరి 30,31 ఫిబ్రవరి 1 తేదీల్లో విశాఖపట్నంలో రెండు ప్రాంతాల ప్రచారకుల బైఠక్ ఏర్పాటైంది. బైఠక్ మొదటి అంతస్తులో ఉంటుందని తెలిసింది. 2013 డిసెంబర్ 28 నుండి ఇక్కడ ప్రాంతకార్యాలయంలో మెట్లు ఎక్కడం, దిగడం అభ్యాసం మొదలుపెట్టారు. చూసినవారు లిఫ్ట్‌ఉందిగదా, అందులో రావచ్చుగదా అంటే నేను అభ్యాసం చేస్తున్నానని చెప్పేవారు.

2014 ఆగష్టు6న రాజయ్యగారు హల్దేకర్‌జీని కలవటానికి వచ్చారు. వారు తమ గ్రామం బూరద రాఘవపురం అని చెప్పినారు. హల్దేకర్‌జీ రాజయ్యగారు బాగున్నారా! మిగతా కార్యకర్తల గురించి కూడా పేరుపేరున అడిగారు. మాట్లాడుతూ “వీరిది చిన్నగ్రామం. ఎస్. ఎల్. ఎన్. ఆచార్యులుగారు అక్కడకు ఉద్యోగంకోసం వెళ్ళి శాఖ ప్రారంభించినారు. ఒకసారి నా పర్యటన అక్కడ ఉంది. ఖమ్మంనుంచి బస్సులో బయలుదేరి ఏన్కూరులో దిగినాము. అక్కడనుండి రాజయ్యగారు ఎడ్లబండిలో వారిఊరికి తీసుకువెళ్ళినారు. అట్లా నా పర్యటన జరిగింది. ఆరోజుల్లో ప్రయాణ సౌకర్య సాధనాలు చాలా తక్కువగా ఉండేవి” అన్నారు.

2014 మార్చిలో పట్లోళ్ళ రామిరెడ్డిగారు, 2014 అక్టోబరు 23న క్షేత్ర సంఘచాలక్ మాననీయ దేశ్‌ముఖ్‌గారు స్వర్గస్థులయినారు. అంతకుముందే శ్రీ ద్వారకాచారిగారు స్వర్గస్థులయినారు. నాతో కలిసి పనిచేసిన నాకంటే చిన్నవాళ్ళు నాకళ్ళముందే వెళు తుంటే బాధగాఉందిరా అన్నారు మాననీయ శ్రీ హల్దేకర్‌జీ. అక్టోబర్ 23న దీపావళినాడు మేము శంభాజీనగర్‌లో ఉన్నాం. దిగ్వాల్‌కి చెందిన రామకృష్ణ అనే కార్యకర్త ఫోన్‌చేసి – టి.వి. దేశ్‌ముఖ్‌గారు స్వర్గస్థులైనట్లుగా టి.వి.లో స్క్రోల్ వస్తున్నదని చెప్పాడు. వెంటనే భాస్కర్‌జీకి ఫోనుచేసి అడిగితే, నిజమేనన్నారు. భోజనం తర్వాత నేను హల్దేకర్‌జీకి చెప్పాను. వారు చాలా బాధపడ్డారు. దేశ్‌ముఖ్‌గారి కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి వారితో మాట్లాడినారు. దీపావళి పండుగకు క్రొత్తబట్టలు వేసుకోవటం ఆనవాయితీ. అయితే, ఆరోజువారు క్రొత్తబట్టలు వేసుకోలేదు.

చాలామంది కార్యకర్తలు కార్యాలయం ప్రక్కనేఉన్న ఉండ్‌లాండ్స్ ఆస్పత్రిలో చేరేవారు. హల్దేకర్‌జీ సమయం చూసుకొని కలిసి వచ్చేవారు. మీ ఆరోగ్యమే బాగాలేదు. మీరెందుకు వెళతారు అంటే మన కార్యాలయం ప్రక్కకి వచ్చారు. పలకరించటం మానవధర్మం. కష్టసుఖాలలో మనం మాట్లాడాలి. పాలుపంచుకోవాలి అనేవారు. వారి ఆరోగ్యం

బాగాలేకపోయినా వచ్చిన పెళ్ళిపత్రికలన్నింటికి వారు చెపితే నేను ఉత్తరం వ్రాసేవాడిని. వారు సంతకం పెట్టేవారు. సంతకం కూడా ఇబ్బంది అయిన తరువాత ఫోనులో మాట్లాడేవారు. కార్యకర్తలతో సంబంధం ఉండాలి అనేవారు.

నేను సహాయక్‌గా వెళ్లిన కొద్దిరోజుల తర్వాత భాస్కర్‌జీ మధ్యాహ్నం చాయ్ సమయంలో పెద్దవాళ్ళు కలుసుకునేలా వుంటే బావుంటుందని అన్నారు. దానికి రచ్చబండ అని పేరుపెట్టారు. హల్దేకర్‌జీ గదిముందు కుర్చీలువేసి అక్కడే చాయ్‌త్రాగే విధంగా ఏర్పాటు చేశారు. వచ్చిన వారి అందరికి ప్రసాదం ఇచ్చేవారు. బయటనుండి వచ్చే కార్యకర్తలకు మధ్యాహ్నం చాయ్‌సమయంలోనే రమ్మని చెప్పటంచేత అందరూ అక్కడే కలిసేవారు. ఎవరైనా ఆ సమయానికి రాకుంటే వెళ్ళి రచ్చబండకి రాలేదేమని అడిగేవారు. మొదటి అంతస్థుకు వెళితే శ్రీ ద్వారకాచారిగారిని కలిసి హౌఆర్‌యూ అని అనేవారు. శ్రీ ద్వారకాచారిగారు ఆయాం ఫైన్ అనేవారు. వారి బాధ వీరికి తెలుసు. వీరిబాధ వారికి తెలుసు. అయినా ఆమాటలతో ఇద్దరూ ఆనందం అనుభవించేవారు.

కార్యాలయంలో మార్పులు జరుగుతున్నాయి. చిన్న, చిన్న మార్పులు జరుగుతున్నాయి. రోజుఅంతా శబ్దాలు వచ్చేవి. 101 నెంబరు గదిలో శబ్దాలు తక్కువ వినపడేవి. అక్కడ ఉంటే బాగుంటుంది అనిపించి ఆ గదికి వెళ్దాం అన్నారు. సరే అన్నాను. కార్యాలయ ప్రముఖ్ శ్రీ యాదిరెడ్డిగారు ఉన్నారా? అనుమతి తీసుకో అన్నారు. మీకు అనుమతి ఎందుకండి? అన్నాను. నీవువెళ్ళి ఒక్కమాట చెప్పిరా అబ్బా అన్నారు వారు మనకు ప్రముఖ్ చెప్పిచేయాలి అన్నారు.

నేను సహాయకుగా వచ్చేనాటికే పరమ పూజనీయ డాక్టర్జీ పుస్తకం తెలుగులో అనువదించారు తరువాత రెండు పరమ పూజనీయ శ్రీ గురూజీ మరియు పరమపూజనీయ బాలాసాహెబ్‌జీ పుస్తకాలు అనువాదం చేస్తున్నారు. దానికి ముఖ్య భూమిక బెల్లంకొండ మల్లారెడ్డిగారు పోషించారు. వారికోసం హల్దేకర్‌జీ ఎదురుచూసేవారు. వారి సమయం వృథా చేయవద్దు అనేవారు.

జ్యేష్ఠ కార్యకర్తలు బౌద్ధిక్‌లలో చెపుతుంటారు. నిత్యంనిరంతరం వర్షం పడనీ, తుఫానురానీ, ఏది ఏమి అయినా సరే ప్రార్థన చేయలి అని చెపుతుంటారు. 2011లో దీపావళికి శంభాజీనగర్ (ఔరంగాబాద్) లోని దిశ సంస్కృత కాలనీ వెళ్లినాం. వారి తమ్ముడు ఉంటారు. ఇక్కడ హల్దేకర్‌జీ శాఖ ప్రారంభించినారు. అంతకుముందు ఇక్కడ

కార్యకర్తలున్నారు, శాఖలేదు. వారి జీవితంలో చివరి శాఖ ప్రారంభించారు. తరువాత వెళ్ళినపుడుకూడా శాఖ నడిపించాం. సాయంశాఖకు వెళ్ళమని చెప్పేవారు. ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో ఉన్నపుడు సమయానికి మంచంపైనే ప్రార్థన చేసేవారు. కార్యాలయంలో ఉన్నపుడు ఆరోగ్యం సహకరించినంతకాలం నడిచివెళ్ళి ప్రార్థన చేసేవారు. తరువాత వీల్‌ఛైయిర్‌లో వెళ్ళి ప్రార్థన చేసేవారు. మనం ప్రతిజ్ఞలో చెపుతాం సంఘఘటికుడిగా చేరామని సంఘకార్యాన్ని నేను ప్రామాణికంగా నిస్వార్థబుద్ధితో తను మన ధన పూర్వకంగా చేయదును. ఈ వ్రతాన్ని నేను ఆజన్మాంతం పాలింతును. "భారత్ మాతాకీ జై" అని చెపుతాం. నిజంగానే తను, మన, ధన పూర్వకంగానే చేస్తున్నారు. మొత్తం కుటుంబాన్నే సంఘ కుటుంబంగా మార్చినాడు. తన అన్నదమ్ములు సంఘ బాధ్యతలు నిర్వహించినారు.

అరవింద మహర్షి అఖండ భారత చిత్రపటాన్ని పూజిస్తారు అని విన్నాను. హల్దేకర్‌జీ కూడా ప్రతినిత్యం తన ఆరోగ్యం శరీరం సహకరించినన్నాళ్లు అఖండ భారత్‌ను పూజించారు. ఒకచిన్న బ్యాగు అందులో సింధూరం డబ్బా. రేణుకామాత చిన్న చిత్రపటం ఉంటాయి. స్నానం చేసిన తరువాత మంచంపై ఒకటవల్‌పరచి ఆ బ్యాగ్ ఉంచేవారు. దానిపై అఖండ భారత్ చిత్రపటం అంటించి ఉన్నది. ఒక గడియారం పెట్టేవారు. ఆ బ్యాగ్‌పైఉన్న చిత్రపటంది జిగురుపోవడంచేత అది పడిపోయింది. దానిని నేను తీసివేసినాను. 'చిత్రపటం ఏది'అడిగినారు. 'తీసివేసినాను' అన్నాను. "అది ఏమి అనుకుంటున్నావు? అది అఖండ భారత్ చిత్రం" తీసుకురా అన్నారు. దాన్ని వేరే జిగురుపెట్టి అంటించినాను. చివరివరకు ఉన్నది. వారు దేశభక్తులే, కాదు దైవభక్తులు.

వారు చివరిదశలో తక్కువగా మాట్లాడినారు. ఒకరోజు అడిగినారు. మీరువచ్చి కార్యకర్తలతో మాట్లాడం లేదు అన్నాను. ఏమి మాట్లాడాలి. మాట తరువాత మాట గుర్తుకు రావడంలేదు నాకు తెలియకుండానే తప్పుగా మాట్లాడవచ్చు. కార్యకర్త తప్పుగా అర్థం చేసుకుంటారు. అందుకే మాట్లాడం లేదు అన్నారు. ఒక వయస్సు వచ్చినతరువాత మనస్సు, బుద్ధి, శరీరంలపై నియంత్రణ ఎట్లా ఉండాలో చెప్పకనే చెప్పినారు.

వారు మాటనిలబెట్టుకున్నారు. ఇక నీవు కార్యక్షేత్రానికి వెళ్ళుఅన్నారు. అంతకు ముందే శ్రీ శ్యాంజీ ప్రాంత ప్రచారక్‌గా ఉన్నపుడు జిల్లా ప్రచారక్‌గా అవకాశం వచ్చింది. కాని హల్దేకర్‌జీకి ఇష్టంలేదు. అందుకే నేను కార్యక్షేత్రం వెళ్ళలేదు. ఇపుడు వారు స్వయంగా

వెళ్ళమన్నారు. నేను కార్యక్షేత్రం వెళ్తున్నాను.

దాసనవమి రోజున మహారాష్ట్రలోని శంభాజీ నగర్ జిల్లా "హల్దా"లో జన్మించి, భాగ్యనగర్‌లో శివరాత్రి ఉపవాసం రోజు శివైక్యం చెందినారు. వీరు ధన్యులు.

**– బూర్గుల రామాచారి**

# పూజనీయ హల్దేకర్‌జీ తో నా మధురస్మృతులు

**పూ**జనీయ హల్దేకర్‌జీని చూస్తేనే సంఘతత్వ దర్శనం చేసుకొన్న అలౌకిక అనుభూతి కల్గుతుంది. శుద్ధసాత్విక ప్రేమను పంచిన ఆదర్శ ప్రచారక్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలల్లో వేలాది కుటుంబాలతో ఆత్మీయ అనుబంధం కలిగి ఉండడముతోబాటు, అనేక కుటుంబాలలో సుమారు 4–5 తరాలను ప్రత్యక్షంగా చూసిన ప్రచారక్. వారి యొక్క ఆత్మీయ అనుబంధాన్ని ప్రతి స్వయంసేవక్ అనుభవించారు. వారు ఏదేని కార్యకర్త ఇంటికి వచ్చారంటే అట్టి కార్యకర్త కుటుంబసభ్యులు, వృద్ధులు, మహిళలు, పిల్లలు, అందరూ వాళ్లింట్లో కుటుంబపెద్ద ఎవరో వచ్చినట్టు ఆనందంగా అనుభూతిపొంది ఒక పండగవాతావరణంగా గడుపుకొనేవారు.

ఎంతోమంది ప్రాంతస్థాయి అధికారులు, ప్రచారకులు, గృహస్థ కార్యకర్తలు, సంఘపనిలో ఏదేని జటిలసమస్య వచ్చినపుడు వారి సలహా సంప్రదింపులు తీసుకోవడం మనకందరకూ విదితమే ! ముఖ్యంగా గృహస్థ కార్యకర్తలు వారివారి వ్యక్తిగత సమస్యలను వారికి చెప్పుకొని వారి సలహా తీసుకొని ఉపశమనం పొందేవారు.

పూజనీయ శ్రీ గురూజీతో హల్దేకర్‌జీకి బాగా సాన్నిహిత్యం ఉండేది. శ్రీ గురూజీ జీవిత ప్రభావం వీరిపై మెండుగా ఉండేది. శ్రీ గురూజీ మంచంపై కూర్చొని, నల్లని, పొడవాటి గడ్డంతో సుదీర్ఘంగా ఆలోచిస్తున్న ఒక చిత్తరువు కార్యాలయంలో వారి గదిలో ఎప్పుడూ ఉండేది. హల్దేకర్‌జీ స్వర్గస్థులు అయిన సందర్భంగా ప్రాంతకార్యాలయంలో జరిగిన సంతాప సభలో వారి అన్నయ్యగారి కుమార్తె సుదీర్ఘకాలంగా అస్సాంలో రాష్ట్రసేవికాసమితి ప్రచారికగా పనిచేస్తూ ప్రస్తుతము సమితి అ.భా. సంపర్క ప్రముఖ్

అయిన సునీతా హల్దేకర్ చెప్పిన ప్రకారము హల్దేకర్‌జీ తుదిశ్వాస విడిచే వారం, పదిరోజులముందు కలిసినప్పుడు ఆమె సమక్షంలో హల్దేకర్‌జీ శ్రీ గురూజీ చిత్తర్వుని తెప్పించుకుని ఆ ఫోటోని చూస్తూ అరచేతిలో పెట్టుకుని శ్రీ గురూజీని జ్ఞాపకంచేసుకుంటూ నిశ్శబ్దంగా కన్నీరు కార్చారని చెప్పారు. అలాగే ఆమె చెప్పిన ప్రకారము హిందూసమాజము ఎంతో సువిశాలమయిన సమాజము. దీనిని మరింత పటిష్టం చేయటానికి కార్యకర్తలందరూ ఇంకొంచెం శక్తిని, వేగాన్ని పెంచి సమాజాన్ని బలోపేతం చేయాలని హల్దేకర్‌జీ ఆకాంక్షించారని చెప్పారు.

అదే సభలో వారికి నిరంతరం చిరకాలంగా వైద్యం అందించిన డా॥ శ్రీనివాస్ కులకర్ణిగారు చెప్పిన ప్రకారము వారికి ఉన్న వ్యాధిలక్షణాల ప్రకారము జ్ఞాపకశక్తి పూర్తిగా నశించి ఉండాలి. కాని అట్టిదశలో కూడా వారి జ్ఞాపకశక్తి చెక్కుచెదరకుండా ఉండటాన్ని చూసి వైద్యులందరూ ఆశ్యర్యచకితులై వారి విల్‌పవర్ - అద్భుతశక్తిని వైద్యులు కొనియాడారని చెప్పటం జరిగింది.

## గురూజీతో ఆత్మీయ స్పర్శ:

ఒకసారి ఆంధ్రప్రాంత పర్యటన ముగిసిన తరువాత శ్రీ గురూజీతో హల్దేకర్‌జీ రాత్రి భాగ్యనగర్‌నుండి రైలులో వెళ్ళి నాగపూర్‌కి వారిని క్షేమంగా చేర్చి వెంటనే తిరిగి భాగ్యనగర్ వచ్చారు. వెంటనే తిరుగుప్రయాణం కారణంగా హల్దేకర్‌జీ ఆచలికాలంలో రాత్రి కప్పుకోవడానికి శాలువా లాంటిది తీసుకువెళ్ళలేదు. శ్రీ గురూజీ ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో కిందబెర్తులోను, శ్రీ హల్దేకర్‌జీ పైబెర్తులోను ప్రయాణించారు. రాత్రి పొద్దుపోయినాక శ్రీ గురూజీ, హల్దేకర్‌జీ ఎటువంటి ఉన్నిదుస్తులు కప్పుకోకుండా పడుకోవటం చూసి తనవద్ద ఉన్న శాలువాను స్వయంగా కప్పారు. తెల్లవారగానే నిద్రలేచిచూస్తే హల్దేకర్‌జీ వారిపైఉన్న శాలువాను శ్రీగురూజీ స్వయంగా కప్పడం గమనించుకొని శ్రీగురూజీకి ఇతర కార్యకర్తలపై ఉన్న శ్రద్ధ, ప్రేమకు పులకించిపోయారు.

శ్రీ హల్దేకర్‌జీ ప్రతిరోజు ప్రొద్దున్నే స్నానంచేయంగానే పదినిమిషాలు మాహెూర్ రేణుకామాత, భారతమాత ఫోటో ఎదురుగా పెట్టుకుని ధ్యానంచేసి పూలతో పూజించేవారు. వారు ప్రార్థనా, ఏకాత్మతా స్తోత్రమ్ చేయనిరోజులేదంటే అతిశయోక్తికాదు. వారు పర్యటనకు రాగానే మరుసటిరోజు ఏ సమయంలో, ఏ స్థలంలో, ఏ శాఖలో ప్రార్థన చేస్తున్నాము? అని ముందే స్థానిక కార్యకర్తలతో విచారించేవారు. ఆవిధంగా శాఖకి, ప్రార్థనకి జీవితంలో

ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ఇతర కార్యకర్తలు కూడా ప్రతినిత్యం ప్రార్థన చేయకుండా ఉండరాదనే సందేశం ఇచ్చేవారు.

ఎప్పుడూ నియమపాలన విషయంలో సమయపాలనవిషయంలో ఎంతో ఖచ్చితత్వం పాటించేవారు. ఒకసారి నిర్ణయమైన కార్యక్రమము, పర్యటన ఎట్టిపరిస్థితిలోను మార్పుచేయటానికి అంగీకరించేవారు కాదు. కార్యకర్తలందరూ నియమపాలన విషయంలో "స్వ" విషయంలో కఠినంగా ఉంటూ ఎదుటి కార్యకర్త నియమపాలన విషయంలో ఉదారంగా ఆదరణతో ప్రేమపూర్వకంగా "సమజ్‌దారీ"గా ఉండాలని సూచించారు.

అలాగే మనం మన ఇతర కార్యకర్తలతో మాట్లాడే మాటవిషయంలో చాలా జాగ్రత్తగా ఆత్మీయంగా మాట్లాడాలని గుర్తుచేస్తూ నోటిమాటద్వారా దూరంగా ఉన్న అపరిచితులను కూడా మన బంధువులుగా, ఆత్మీయులుగా మార్చుకోవచ్చును. అలాగే నోటిమాటద్వారా దగ్గరవాళ్ళను కూడా దూరంచేసుకునే ప్రమాదం కలదు అనే భావన కలిగిన సుభాషితాన్ని ఉటంకించేవారు. శ్రీ హల్దేకర్‌జీ తెలంగాణా ప్రాంతంలో సంఘశాఖలు ప్రారంభం చేయడానికి అనేక ప్రదేశాలకు, ముఖ్యమైన కేంద్రాలన్నింటికీ వెళ్ళి పరిచయపత్రం తీసుకొని ఆయా ప్రదేశాల్లోని ప్రముఖులను కలిసి వారి సహకారంతో ప్రాంతం మొత్తం సంఘశాఖలు ప్రారంభించారు. వారు భాగ్యనగరం మినహా మొత్తం తెలంగాణా ప్రాంతంలో అన్ని జిల్లాల్లో వారు అనేక విభాగ్‌లకు విభాగ్ ప్రచారక్‌గా పనిచేసినప్పుడు చాలా సందర్భాలల్లో కాలినడకన అనేక గ్రామాలు పర్యటన చేశారు. 65-70 సం॥లో విశాఖ ఉక్కు ఉద్యమం సందర్భంగా బంద్ పాటించినప్పుడు వరంగల్ విభాగ్‌లో అప్పటి జిల్లా ప్రచారక్ శ్రీ సత్యనారాయణ గారితో కలిసి ఒక సైకిల్‌పై సంచి పెట్టుకొని, రైలు పట్టాలు వెంబడి సైకిల్ నడిపించుకొంటూ నడిచి పర్యటించిన సందర్భము పెద్దలు చెప్పుకొంటూ ఉంటే విన్నాను. అలాగే బర్కత్‌పురా ప్రాంతకార్యాలయం నుండి మా॥శ్రీ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి గారితో కలిసి చార్మినార్ శాఖకు చాలాసార్లు నడలిచివెళ్ళివచ్చిన సందర్భాలు అనేకం.

ఎమర్జెన్సీలో వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు బాధ్యునిగా ఎంతో తెలివిగా, సునిశిత పరిశీలనతో, సమయానుకూలంగా విచక్షణతో, చతురతతో పనిచేసి పోలీసులకు, సి.ఐ.డి. లకు చిక్కకుండా పోలీసుల దృష్టిలో పడినా నైపుణ్యంగా తప్పించుకుని వారు అరెస్ట్ కాకుండా తనకు అప్పచెప్పిన అండర్‌గ్రౌండ్ పనిని సమర్థవంతంగా నడిపించారు.

ఎమర్జెన్సీలో భాగ్యనగర్‌లో అనేకమంది అఖిల భారతీయ అధికారుల పర్యటన సందర్భంగా రహస్య బైఠకులను చాకచక్యంగా, విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యంగా బైఠకులకు వచ్చేసమయంలో బైఠక్ తదనంతరం గుంపులు గుంపులుగా వెళ్ళకుండా జాగ్రత్త తీసుకున్నారు. అలాగే చెప్పులన్నీ ఒక వరసలో పెట్టకుండా జాగ్రత్త తీసుకొన్నారు. అలాగే బైఠక్‌లో పాల్గొన్న వాళ్లందరికీ బైటికి వెళ్ళిన తర్వాత ఎవరైనా అడిగితే శ్రీ సత్యనారాయణ స్వామివ్రతంకి వెళ్ళి వచ్చామని చెప్పమనేవారు.

ఒకసారి ఎమర్జెన్సీలో వారి అనుభవాన్ని ఇలా వివరించారు. సంగారెడ్డిలో బైఠక్ ముగించుకొని భాగ్యనగర్ తిరిగి రావడానికి సంగారెడ్డి ప్రయాణ ప్రాంగణంలో బస్సు ఎక్కడానికి వెళ్ళే సందర్భంలో ప్లాట్‌ఫ్లారంమీద పోలీసుల ఆచూకీని హల్దేకర్‌జీ గమనించి, నెమ్మదిగా వాళ్ళదృష్టిలో పడకుండా భాగ్యనగర్ బస్సు ఎక్కికూర్చొన్నారు. కానీ దురదృష్టవశాత్తూ ఆ పోలీసులు అదేబస్సు ఎక్కి చివరి సీట్లలో కూర్చొన్నారు. శ్రీ హల్దేకర్‌జీ వాళ్ళరాకను గమనించి చాకచక్యంగా బస్సుదిగి ఆ రాత్రి సంగారెడ్డి నుండి భాగ్యనగర్‌కి కాలినడకన చాలాదూరంవెళ్ళి, చేరుకున్నట్లుగా వారు స్వయంగా చెప్పారు.

వారు కార్యకర్తల విషయంలో, పర్యటనల విషయంలో, నియమపాలన విషయంలో చిన్నచిన్న అంశాలపై ఎంతో శ్రద్ధచూపేవారు. ఇంకా చెప్పాలంటే చిన్న విషయాలపై ఎంతో పర్టిక్యులర్‌గా ఉండేవారు. ఉదా: 1. ఏదైనా ఒక ప్రదేశానికి పర్యటనకు వచ్చినప్పుడు అక్కడ స్థానిక కార్యకర్తలతో ముఖ్యంగా తిరుగుప్రయాణానికి సంబంధించిన ప్రయాణపు రిజర్వేషన్ టికెట్ గురించి విచారణ చేసేవారు. సాధారణంగా ముందస్తు రిజర్వేషన్ లేనిది ప్రయాణం చేయడానికి ఇష్టపడేవారు కాదు. 2. అలాగే పర్యటనకు రాగానే అక్కడి స్థానిక కార్యకర్తలతో ఆ పర్యటనకు సంబంధించిన టైమ్‌టేబుల్ నిమిషాలతోసహా కార్యక్రమ సరళి తెలుసుకొనేవారు. ఆ స్థానిక పర్యటన సందర్భంగా ఎక్కడినుంచి ఎక్కడి ఎలా, ఎవరి కారులో వెళ్తున్నామో కూడా అడిగి తెలుసుకొనేవారు.

ఒకసారి మా ఇందూర్ నగర సాంఘిక పర్యటనకు వచ్చినప్పుడు వారికిముందే శాఖా కార్యక్రమాలు సమయానుసారంగా వ్రాసి ఇవ్వడం జరిగింది. కానీ పొరపాటున ముఖ్యశిక్షక్ వారికి వ్రాసి ఇచ్చిన కార్యక్రమపట్టిక ప్రకారంగా కాకుండా కొంత మార్పుచేసి నిర్వహించాడు. అదే సాంఘిక్‌లో వారు బైఠక్ తీసుకొనేటప్పుడు ఈ విషయమై కార్యకర్తలను మందలించి కోపగించారు. అంటే ముందే యోజన చేసిన రచనచేసిన ప్రకారమే

కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు ఉద్బోధ చేశారు.

3. నేను చాలా సందర్భాలల్లో వారిని ఇందూర్ నుండి కారులో భాగ్యనగర్ దింపి తిరిగివచ్చిన తర్వాత మరుసటిరోజు ఉదయమే వారే స్వయంగా ఫోన్‌చేసి నేను క్షేమంగా ఇంటికి చేరానా? లేదా? అనే విషయం తెల్సుకొనేవారు. ఇది కేవలం నా అనుభవం మాత్రమే కాదు అనేకమంది కార్యకర్తల అనుభవం కూడా అదే విధంగా ఉంది.

4. అలాగే వారు ఒక ప్రదేశంనుండి ఇంకో ప్రదేశానికి రైల్లో వెళ్ళేటప్పుడు అనేకచోట్ల అనేకమంది కార్యకర్తలు వారికి స్టేషన్‌లో ఇంటినుండి తెచ్చిన అల్పాహారం, భోజనం –టీ వంటివి అందజేసేవారు. హల్దేకర్‌జీ ముఖ్యంగా ఏ కార్యకర్త ఇంట్లోనుంచి పాత్రలతో ఇట్టి భోజనాదులు అందజేశారో, మళ్ళీ ఆ కార్యకర్తలకు వాళ్ళు తెచ్చిన పాత్రలను వాళ్ళ ఇంటికి అందజేసే విషయంలో తగుశ్రద్ధ తీసుకొనేవారు. ఆ పాత్రలు ఆ కార్యకర్త ఇంటికి ముట్టినాయా, లేదా? అని తదుపరి విచారించేవారు. ఎవరైనా దూరప్రదేశమునుండి గృహస్థు కార్యకర్తలు భాగ్యనగర్ ప్రాంత కార్యాలయంలో వారిని దర్శించుకోవడానికి వెళ్ళినప్పుడు భోజన సమయానికి భోజనం తప్పనిసరిగా చేసి వెళ్ళమని చెప్పేవారు. అలాగే కార్యాలయ ప్రముఖ్‌ని పిలిపించి వచ్చిన వాళ్ళకు భోజన వ్యవస్థ చేయమని స్వయంగా సూచించేవారు.

## నేను వ్యక్తిగతంగా గమనించింది ఏమంటే :

ఎంత ఎక్కువ కాలం జీవిస్తే అంత ఎక్కువకాలం సమాజ పరమేశ్వరుణ్ణి సేవించవచ్చును అని వారు భావించారు. తత్కారణంగా వారు వారి ఆరోగ్యం విషయంలో, పథ్యం విషయంలో, వైద్యులు సూచించిన నియమాల విషయంలో, ఏ సమయంలో ఎన్ని మందులు తీసుకోవాలో ఆ సమయానికి అన్ని మందులు సమయానికి గుర్తుచేసుకొని ఎంత తీవ్రమైన పర్యటన ఒత్తిడిలో ఉన్నా తీసుకొనేవారు.

ముఖ్యంగా వారు సమాజంలోని అనేకమంది ప్రతిష్ఠిత వ్యక్తులను సంఘానికి పరిచయంచేసి, అట్టి వ్యక్తులను కార్యకర్తలుగా తీర్చిదిద్ది వాళ్ళందరూ ప్రాంత, క్షేత్ర స్థాయి అధికారులుగా ఎదగడంలో వారి గుణవికాసం కోసం ఎంతో శ్రమించారు. శంభాజీనగర్ (ఔరంగాబాద్)లో జరిగిన వారి సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవం సందర్భంగా మా॥ శ్రీ జస్టిస్ పర్వతరావ్‌గారు మాట్లాడుతూ, హల్దేకర్‌జీ విజయవాడ విభాగ్ ప్రచారక్‌గా ఉన్న సమయంలో తనకు సంఘాన్ని పరిచయంచేసి తాను క్షేత్ర సంఘచాలక్‌గా ఎదగడానికి

వారి మార్గదర్శనం ఎంతోఉందని వారు స్వయంగా చెప్పుకున్నారు. ఇట్టి కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుండి ప్రముఖ ప్రచారకులు, అధికారులు, కార్యకర్తలు హాజరైనారు. అలాగే ఈ సమావేశానికి పూజనీయ సుదర్శన్‌జీ, మా. గో. వైద్యజీ, హంపీపీఠం శంకరాచార్యులు పాల్గొని ఆశీః ప్రసంగం చేశారు.

వారే స్వయంగా తీర్చిదిద్దిన ముఖ్యమైన వందలాది గృహస్థ కార్యకర్తలు, అధికారులు, ప్రచారకులు, అనారోగ్య కారణంగా, ప్రమాదాల కారణంగా అకస్మాత్తుగా చనిపోయినప్పుడు, వారికి వ్యక్తిగతంగా ఎంతో అనుబంధం ఉన్నప్పటికీ నిర్వేదానికి, నిరుత్సాహానికి గురికాకుండా వాళ్ళ వాళ్ళ కుటుంబాలకు ఒక ఋషిలాగే ధైర్యవచనాలు చెప్పిన సందర్భాలు అనిర్వచనీయమైనవి.

అలాగే ముఖ్యమైన స్థాయీ ప్రచారకులు ప్రచారక్ జీవితం ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్ళాలని నిర్ణయించుకొన్న సందర్భంలో మరియూ వ్యక్తిగత కారణాలతో అనేకమంది గృహస్థ కార్యకర్తలు క్రియాశీలకంగా లేని సందర్భములో వెంటనే వారు అట్టివాళ్ళకి తగిన ప్రేరణ కలిగించి వారందరినీ తిరిగి కార్యరంగంలోకి దింపారు. ఆ విధంగా అనేకమంది తిరిగి కార్యంలో అడుగుపెట్టి ఆకాశమే హద్దుగా పనిచేసినవారు ఉన్నారు.

వారు స్వయంగా అనారోగ్యంతో ఉండికూడా, ఎదుటి కార్యకర్తల ఆరోగ్యంగురించి సవివరంగా తెలుసుకునేవారు. కార్యకర్తలు ఎవరు ఎక్కడ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నా, వెంటనే వెళ్ళి వారిని తప్పక పరామర్శించేవారు. అలాగే కార్యకర్తల ఇండ్లలో వారివారి దగ్గరి బంధువులు చనిపోతే తప్పక ఆయా కుటుంబాలను దర్శించి పరామర్శించేవారు.

అలాగే ప్రచారకులు, విస్తారకులు ఎక్కడెక్కడో పనిచేస్తున్నప్పటికీ, హల్దేకర్‌జీ వివిధ జిల్లాల పర్యటన సందర్భంగా వారి స్వగ్రామాలకు వెళ్ళి వారి కుటుంబసభ్యులను కలిసి, వాళ్ళ యోగక్షేమాలు విచారించేవారు. మళ్ళీ ఆ కుటుంబసభ్యుల క్షేమసమాచారాలు అట్టి ప్రచారకులకు వారి క్షేత్రానికి వెళ్ళినప్పుడు తెలియజేసేవారు. మా కుటుంబంలో 5 తరాలతో వారికి ఆత్మీయ అనుబంధం ఉంది. మా తాతగారు – పితామహులు కీ॥శే॥ చల్లా సుబ్రహ్మణ్యంగారు (గుంటూరుజిల్లా పొన్నూరు స్వయంసేవక్ –కీ॥శే॥ సోమయ్యగారి సమకాలీనులు) నుండి మాయింట్లో మా బాబాయిలు, అత్తయ్యలతో సహా నా మనవరాలి వరకు మా కుటుంబంలో అందరితో అనుబంధం వారికి ఉంది. వారు తుదిశ్వాస విడిచే

నెలరోజుల ముందు నా శ్రీమతి నా అమ్మాయిని, మనవరాలిని వెంటపెట్టుకొని ప్రాంతకార్యాలయం వెళ్ళి అప్పటికే మంచానికే పరిమితమైన హల్దేకర్‌జీకి మా ఇంట్లో 5వ తరానికి సంబంధించిన నా మనువరాలిని చూపించి, చరవాణిలో ఫోటో తీసుకోవడం జరిగింది. నా మనువరాలితో వారు కొద్దిగా మాట్లాడి, పేరుతెల్సుకొని, ఛాతీపై ఎత్తుకొని ముద్దుచేశారని నా శ్రీమతి నాకు చెప్పింది.

శ్రీ హల్దేకర్‌జీ వారి ఇంటి కులదేవత అయిన ప్రసిద్ధ మాహెూర్ క్షేత్రంలో (మహారాష్ట్ర) పవిత్రమైన రేణుకమాత దర్శనానికి మాఘమాసంలో ప్రతి సంవత్సరమూ ఒకసారి క్రమం తప్పకుండా సుమారు 50-60సంవత్సరములు నుండి వెళ్ళివచ్చేవారు. గతంలో చాలాసార్లు వారు నాందేడ్ వెళ్ళి, నాందేడ్ నుండి మాహెూర్‌కి బస్సులో ప్రొద్దున్నే వెళ్ళి రేణుకమాతను దర్శించుకొని తిరిగి నాందేడ్‌కి చేరుకొని, రాత్రి రైలులో నాందేడ్ నుండి బయల్దేరి భాగ్యనగర్ చేరుకునే వారు. 2000సం॥లో శ్రీ దుర్గారెడ్డిజీ (అప్పటి మా విభాగ్ ప్రచారక్, ప్రస్తుతము “జాగృతి”) సూచనమేరకు ఇందూర్‌నుండి నా తల్లితండ్రులతో కలిసి శ్రీ దుర్గారెడ్డిగారితో కారులో వారిని మహాశివరాత్రి రోజున మహెూర్ దర్శనానికి తీసుకొని వెళ్ళివచ్చాను. అప్పటినుండి క్రమంతప్పకుండా సుమారు 10సం॥లు 2010వరకు వారిని ఇందూర్‌నుండి మాహెూర్‌కి తీసుకొని వెళ్ళి దర్శనం చేయించుకొని వచ్చేవాడిని. ఇట్టి తీర్థయాత్రలో అప్పటి మా విభాగ్ ప్రచారకులు, శ్రీ దేవేందర్‌జీ, శ్రీ రామ్మూర్తిగారు, వాసుజీ, అప్పటి జిల్లాప్రచారకులు యాదిరెడ్డిజీ, రాజగోపాల్ మరియు ఇతరత్రా మా ఇందూర్ విభాగ్ కార్యకర్తలు ఒక్కొక్కసారి ఒక్కొక్కళ్ళు పాల్గొన్నారు. సుమారుగా 2010 తర్వాత వారి ఆరోగ్యం సహకరించనందున వారు మహెూర్ పర్యటన రద్దుచేసుకొన్నారు.

ఒకటి రెండు సందర్భాలలో వారి అన్నదమ్ముల పిల్లలు , అన్నదమ్ములు, వారి అక్కగారు మొదలగు కుటుంబ సభ్యులు ఔరంగాబాద్,భాగ్యనగర్ నుండి మహెూర్‌కి చేరుకొని వారితో గడిపేవారు. ముఖ్యంగా నన్ను, నా శ్రీమతిని వాళ్ళ కుటుంబసభ్యులందరికీ వ్యక్తిగతంగా పరిచయం చేసేవారు. ముఖ్యంగా వారి తమ్ముడు కీ॥శే॥ దత్తాత్రేయ హల్దేకర్‌జీగారి కుమారుడు శ్రీ శంకర్ హల్దేకర్‌జీ (ముంబాయి ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్ ఎక్సికూటీవ్ ఇంజనీర్ ప్రతి సంవత్సరమూ మేము వెళ్ళే సమయానికి ముంబాయినుండి వారు కూడా మహెూర్ చేరుకొని అక్కడి స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ బంగ్లా ముందే బుక్ చేసి వసతి ఏర్పాటు చేసేవారు. హల్దేకర్‌జీ ఇందూర్ నుండి

మహెూర్ వెళ్ళే సందర్భంలో, వారు భాగ్యనగర్ నుండి ఇందూర్‌కు వచ్చేటప్పుడు నా ఆహ్వానం మేరకు ఒకసారి వారి సోదరుడు కీ॥శే॥ దత్తోపంత్ హల్దేకర్, కీ॥శే॥ ప్రభాకర్ హల్దేకర్‌జీ వారి శ్రీమతి ప్రమీలాతాయి వారితో కలిసి మా యింటికి విడివిడిగా విచ్చేశారు. వాళ్ళ అన్నదమ్ముల రాక చిరస్మరణీయమైన మధురానుభూతులను మిగిలించింది. ఎప్పటికీ మరువలేను నా శ్రీమతి కూడా అంతే ఆత్మీయతను అనుభవించింది.

ముఖ్యంగా హల్దేకర్‌జీ ఎదుటి కార్యకర్త సమయానికి ఎంతో విలువ ఇచ్చేవారు. ఆ విధంగా మహెూర్ పర్యటన తేదీని సుమారు 3నెలలముందే తేదీని నిర్ణయించి నాకు చెప్పేవారు. అలాగే అట్టి పర్యటన తేదిలో ఏదేని ఆకస్మికమార్పు జరిగితే కూడా వెంటనే తెలియజేసేవారు. కేవలం మహెూర్ పర్యటన మాత్రమే కాకుండా సుమారు 2000సం॥నుండి మా విభాగ్‌లో పర్యటనకి ఎక్కడికి ఎప్పుడు వచ్చినా వారితోపాటు కలిసి ప్రయాణించి, వారితో సమయంగడిపే భాగ్యం, అదృష్టం నాకు కల్గింది.

అదేవిధంగా వారి పథ్యం విషయలో నా శ్రీమతి చాలా జాగ్రత్త వహించి, సమయానికి ఎటువంటిలోపం జరగకుండా వంటచేసి అందించేది. ఆ విధంగా వారికి పథ్యం విషయంలో మా ఇంట్లో లోపం జరగదని విశ్వాసంతో అధికారులు అందరూ మా ఇంట్లోనే హల్దేకర్‌జీ వసతి, బస ఏర్పాటుచేసేవారు. విభాగ్‌లో వేరే ప్రదేశములో ఎక్కడైనా వారు బస చేయాల్సివస్తే అక్కడి కార్యకర్తలు నా శ్రీమతికి ఫోన్‌చేసి పథ్యం నియమాలు తెల్సుకొనేవారు.

చివరిగా, రానున్నతరాలవారికి ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో సంఘకార్యం ప్రారంభం, వికాసము, శ్రీ గురూజీ పర్యటన ప్రాంత పర్యటన విశేషాలు, వారి అనుభూతులు మనకు ముందే పుస్తకరూపంలో అందజేశారు. హల్దేకర్‌జీ స్వర్గస్థులుకాగానే వారి ఉత్తర క్రియలన్నింటినీ వారి అన్నయ్యగారి అబ్బాయి శ్రీ నందు హల్దేకర్ వారింటిలో (ఔరంగబాద్) శంభాజీనగర్‌లో జరిగినాయి. చివరరోజైన వైకుంఠ సమారాధనకు ఇక్కడ నుంచి మా॥ శ్రీ భాస్కర్‌జీ, టి.ఎస్.ఆర్. మూర్తిగారు, వెంకట్‌రెడ్డి, రాంపల్లి మల్లికార్జున్‌జీ, భోజనపల్లి నర్సింహ్మమూర్తిగారు, యుద్ధవీర్ (హల్దేకర్‌జీ చివరిదశలో 2సం॥లు వారి సహాయక్‌గా వారి సేవచేసిన తరించిన ప్రచారక్), రామాచారి (చాలాకాలం హల్దేకర్‌జీ వ్యక్తిగత ప్రబంధక్‌గా పనిచేసిన ప్రచారక్, ప్రస్తుతము జగిత్యాల జిల్లాప్రచారక్) ఇత్యాది కార్యకర్తలము శంభాజినగర్ (ఔరంగాబాద్)కి వెళ్ళి హాజరు అయినాము. అట్టి వైకుంఠ సమారాధన రోజున శంభాజీనగర్‌లో సభా సమావేశము ఏర్పాటుచేసినారు. అట్టి

కార్యక్రమమునకు మా॥ శ్రీ మధుబాయి కులకర్ణి, మంగేష్‌జీ, పశ్చిమక్షేత్ర క్షేత్రప్రచారక్, స్థానిక ప్రాంతప్రచారక్, ప్రాంత కార్యవాహ ఇత్యాది కేంద్ర, క్షేత్ర అధికారులు హాజరయ్యారు. ఇట్టి కార్యక్రమానికి సమస్త హల్దేకర్ పరివారము ముఖ్యంగా అన్నదమ్ముల కుమారులు, కూతుళ్ళు, కోడళ్ళు, అల్లుళ్ళు, మొదలగు వారందరూ హాజరైనారు. నాకు ఆశ్చర్యకరమైన విషయమేమంటే సహజంగా వారి తమ్ముళ్ళ కుమారులకు, కూతుళ్ళకి హల్దేకర్‌జీ ఎడల శ్రద్ధ ఉంటుంది. కానీ కోడళ్ళు, అల్లుళ్ళు కూడా కన్నీళ్ళ పర్యంతమైనారు. ముఖ్యంగా కోడళ్ళు, ఇతరత్రా కుటుంబ సభ్యులందరూ హల్దేకర్‌జీ జీవితవిశేషాలను వాళ్ళందరూ ముందే వ్రాసుకొనివచ్చి చదివి వినిపించారు మరియు వారి జీవితంపై కొందరు కవితలు వ్రాసికొనివచ్చి చదివి వినిపించారు. వారి కుటుంబ సభ్యులందరూ హల్దేకర్‌జీని “రాంభావు కాకా” అని ప్రేమతో పిలుచుకొంటారు. వారి తమ్ముడిగారి అబ్బాయి సందీప్ హల్దేకర్ మాట్లాడుతూ ‘దీపావళి’ సందర్భంగా అప్పుడప్పుడు హల్దేకర్‌జీ ఔరంగాబాద్ వెళ్ళి వచ్చేవారు. వారిరాక సందర్భముగా ఎక్కడ ఎక్కడో ఉన్న వారి పరివార సభ్యులందరూ ఔరంగాబాద్‌కి వచ్చి ఒకచోటచేరి, ఎంతో ఆనందంగా వారిరాకనే పండుగగా భావించి ‘దీపావళిని’ జరుపుకొనేవారట. అలాగే సందీప్ జీ చెప్పిన ప్రకారము హల్దేకర్‌జీ పరివార కుటుంబ సభ్యులను స్థానిక శంభాజీనగర్‌లోని ముఖ్య కార్యకర్తలకు పరిచయం చేసి, కుటుంబ సభ్యులందరినీ సంఘోన్ముఖం చేసేవారట. శంభాజి నగర సంఘకార్యకర్తలకు హల్దేకర్‌జీ అంటే ఎంతో శ్రద్ధ మరియు భక్తి, కలదు.

అనేక సందర్భాలల్లో హల్దేకర్‌జీ ముఖ్యంగా వారి తమ్ముడు దత్తాజి మరణించి నప్పుడు, అలాగే తమ్ముడి కుమారుడు గృహప్రవేశం చేసినప్పుడు, గోవత్స ఏకాదశిని నిర్వహించి మరియూ వారి సహస్ర పూర్ణచంద్రదర్శనోత్సవము సందర్భముగా మన క్షేత్ర అధికారులను, ఇరుప్రాంతాల అధికారులను, ముఖ్యమైన కార్యకర్తలందరినీ వారి స్వగ్రామమైన “హల్దా”కి (ఔరంగాబాద్‌నుండి సుమారు 100కి॥మీ॥లో గల చిన్న గ్రామము) ఆహ్వానించారు. ముఖ్యమైన అధికారులు, కార్యకర్తలు ఇట్టి కార్యక్రమాలకు హాజరైనారు. సునీత హల్దేకర్ చెప్పిన ప్రకారము హల్దేకర్‌జీ అనేకసార్లు వారి స్వగ్రామమైన “హల్దా” వెళ్ళేటప్పుడు, గ్రామ ప్రవేశ ద్వారంవద్ద ఆగి, వంగి ఆ పవిత్రభూమి యొక్క మట్టిని నుదుటిన తిలకంగా ధరించేవారట.

**– చల్లా నాగశ్రీనివాస్,**

**ఇందూరు జిల్లా సంపర్క ప్రముఖ్**

# ఆత్మీయతకు మారుపేరు హల్దేకర్‌జీ

**20**15 జూన్ 1 ఉదయం 5.00గం॥లకు భాగ్యనగరాన్ని విడిచి నా స్వగ్రామం చెన్నూరుకు బయలుదేరాము నేను, నాభార్య. ఉపాధ్యాయునిగా పదవీ విరమణ తర్వాత పెద్దల సూచన మేరకు భాగ్యనగరానికి వచ్చి సుమారు ఆరేళ్ళు'జాగృతి' పత్రికలో పనిచేశాను. ఎందుకు భాగ్యనగరానికి వచ్చానో కాచిగూడా వీధుల్లో నడుస్తూ కేశవనిలయం – జాగృతి భవనాలమధ్య తిరుగాడుతూ ఎందుకు విడిపోలేని అనుబంధాన్ని పెంచుకున్నానో, ఇప్పుడెందుకు భారమైన హృదయంతో విడిపోక తప్పలేదో అర్థంకాదు. విధివిచిత్రం! మే 31రాత్రి కేశవనిలయంలో వారితోపాటే భోంచేసి వీడ్కోలు తీసుకున్నాం. నా భార్య ఇందిరపట్ల ప్రత్యేకవాత్సల్యం. ఆరోగ్యరీత్యా డాక్టరు సలహామేరకు జొన్నరొట్టె ఆహారమవసరమయింది. భాస్కర్‌జీ సూచనమేరకు మాఇంటినుండి రొట్టెలు పంపాము. రొట్టెల కారణంగా మా ఆవిడపట్ల ప్రత్యేక వాత్సల్యం చూపారు. ఇద్దరము అనేకసార్లు వెళ్ళికల్సివచ్చేవాళ్ళం. ఓ చిన్నవ్యానులో సామాను వేసుకొని అందులోనే నేనూ, నాభార్య సామాన్లమధ్య కూర్చుండి వచ్చాము. ఎండ ఎక్కువకాకముందే ఇంటికిచేరుకోవాలని చీకట్లో బయలుదేరి వచ్చాము. భాగ్యనగరానికి వీడ్కోలు ప్రణామా లర్పించాం!

ఉదయం 11.00గం॥లకు మా స్వగ్రామం చెన్నూరులోని మా స్వగృహం వాకిట్లో రోడ్డుపైనున్న వేపచెట్లు నీడలో వ్యాను ఆగింది. దిగి చల్లగా సేదతీరినాము. ఓ అరగంట తర్వాత భాగ్యనగరం కేశవనిలయంనుండి ఫోను. మండుటెండలో ప్రయాణించి వచ్చిన మాకు మరింతసేదతీర్చిన చల్లని పలకరింపు అది. పూజ్యులు హల్దేకర్‌జీ ఆత్మీయపలకరింపు....." మల్లారెడ్డిగారూ! క్షేమంగా చెన్నూరు చేరుకున్నారు కదా? ఎండతీవ్రంకాక ముందే చేరుకున్నారు కదా? మీ శ్రీమతి అలసిపోయి ఉంటుంది. ఆరోగ్యం జాగ్రత్త అనిచెప్పండి. అన్నట్లు నిన్నరాత్రి నాతోచెప్పినట్లు అశోక్ బోధన్‌కర్‌ను కల్సి వచ్చారా? ఆయన ఆరోగ్యం ఎలావుంది?".... ఈ పలకరింపుతో నేనూ, నా భార్య పులకించి పోయాం. హల్దేకర్‌జీ అంతపెద్దవారు, విశ్రాంతి తీసుకోవలసిన సమయం, మా ప్రయాణాన్ని గుర్తుపెట్టుకొని మరీ, 'క్షేమంగా చేరినారు కదా, ఆరోగ్యం జాగ్రత్త!' అన్న ఆ ఆత్మీయపలకరింపుతో అమృతాన్ని పంచారు. హల్దేకర్‌జీ వంటి మహనీయుని ఆత్మీయతకు నోచుకున్న మేమెంతటి ధన్యజీవులం! ఆ మహనీయునిలో మన పూజ్య సర్ సంఘచాలకులు

–డాక్టర్జీ, గురూజీ, బాళాసాహెబ్‌జీ పరంపర కళ్లముందు కదలాడింది. స్వయంసేవకుల కష్టసుఖాలలో పాలుపంచుకున్న సంఘటనలు చదివా. చెన్నై సంఘకార్యాలయాన్ని తీవ్రవాదులు బాంబులతో ధ్వంసంచేసినపుడు చనిపోయినవారి కుటుంబాల్ని, గాయపడినవారిని ఓదార్చుటకు, కదలలేనిస్థితిలో, మాటాడలేనిస్థితిలో, చక్రాల కుర్చీకే పరిమితమైన స్థితిలో నాగపూరు నుండి చెన్నైకి వచ్చిన బాళాసాహెబ్‌జీ కనిపించారు నాకు హల్దేకర్‌జీలో. వారి ఆరోగ్యం బాగా క్షీణించింది. వారు కూడా చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. కేశవనిలయంలో చక్రాలకుర్చీలోనే అటు–ఇటు తిరుగుతూ వచ్చిపోయే వారందరినీ పేరుపేరునా పలకరిస్తూ వారియొక్కయు, వారికుటుంబ సభ్యుల యొక్కయు యోగక్షేమాలు తెలుసుకొనే ఆత్మీయత హల్దేకర్‌జీ సొంతం..... ప్రతినిత్యం ఉదయంపూట సంఘప్రార్థన సమయానికి కేశవనిలయం భవన వరండాలో భగవాధ్వజానికి ఎదురుగావచ్చి చక్రాలకుర్చీలోనే కూర్చుండి సంఘప్రార్థన చేస్తున్న హల్దేకర్‌జీలో నాకు గురూజీ కనిపించారు.... అశోక్ బోధన్‌కర్ నల్లకుంటలో ఉంటారు. ఎనభయ్యేళ్ళ వయోవృద్ధ స్వయంసేవక్, నిష్ఠావంతుడైన కార్యకర్త, పూర్వప్రచారక్, హల్దేకర్‌జీకి సహచరుడు, సన్నిహితుడు. రోజూ కేశవనిలయం శాఖకు వస్తారు. మా ఇరువురిదీ ఒకేశాఖ. అలా కాకూ ఆత్మీయుడు. ఆరోగ్యం బాగాలేక ఆమధ్య శాఖకు రావటంలేదు. భాగ్యనగర్ వదిలి వెళ్తున్నందున ఆయనను కల్సి వీడ్కోలుతీసుకుంటానని హల్దేకర్‌జీకి ముందురోజు చెప్పాను. అది గుర్తుపెట్టుకొని అశోక్ బోధన్‌కర్ ఆరోగ్యం గురించి వాకబుచేసిన హల్దేకర్‌జీలో నాకు డాక్టర్జీ కనిపించారు.

జాగృతి పత్రికలో ఒక్కయేడు పనిచేద్దామని వచ్చాను. సుమారు ఆరేళ్ళు ఉండిపోయాము. నాతోపాటు నా భార్యకూడా ఎలా ఉందా అని ఆశ్చర్యం వేసింది. ఇటు జాగృతి భవనంతో అటు కేశవనిలయంతో మేము ఏర్పరచుకున్న అంతరంగ సంబంధమైన మౌన అనుబంధమే దానిక్కారణమనిపించింది. హల్దేకర్‌జీతో ఏర్పడ్డ ఆత్మీయాను బంధం అలా బంధించి ఉంచింది. హల్దేకర్‌జీ మరాఠీ నుండి తెలుగులోకి అనువదించిన పుస్తకరచనలలో తెలుగులేఖన సహాయకుడిగా వారి సన్నిధిలో చాలాకాలం గడిపే అదృష్టం లభించింది. మొదటి పుస్తకం 'పెనుతుఫానులో దీపస్తంభం' నేను జాగృతిలో చేరేనాటికే లేఖన ప్రక్రియ పూర్తయింది. ఫైనల్ ప్రూఫు కొద్దిగా చూసేఅవకాశం లభించింది. రెండవ పుస్తకం 'ఓం రాష్ట్రాయస్వాహా' రచన సుదీర్ఘకాలం సాగింది. ప్రతినిత్యం ఉదయం

సాయంత్రం హల్దేకర్‌జీవద్దకు వచ్చేవాన్ని. కొద్దికాలం మొదట్లో నాకు అద్దె ఇల్లు దగ్గర్లో దొరకనందున పాతబస్తీనుండి లోకల్‌రైల్లో వచ్చేవాన్ని. అప్పుడప్పుడు నారాక ఆలస్యమై హల్దేకర్‌జీని ఇబ్బంది పెట్టాను. మరాఠీ పుస్తకం ప్రతివాక్యం చదివి నాకు తెలుగులో చెప్పేవారు. వారిది మరాఠీ యాసతో కూడిన తెలుగు. స్వయంగా స్వయంసేవకుల మధ్య మాట్లాడుతూ నేర్చుకున్న తెలుగు. వ్రాతకు (రచనకు) అనుకూలమైన తెలుగులోవ్రాసి వెంటవెంట వినిపించేవాన్ని. ఎక్కడైనా సరియైన అర్థం వచ్చేతెలుగుపదం రాకుంటే దాన్ని మార్పించేవారు. అలా ఒక్కొక్క పదమూ క్షుణ్ణంగా విని సరిచేసేవారు. ఓం రాష్ట్రాయస్వాహ చాలా కవితాత్మకభాషతో, చక్కని వర్ణనలతో సాగిన నవల. దాన్ని "కావ్యమయభాష' అనే వారు హల్దేకర్‌జీ. రచన పూర్తయింది. కొందరు పెద్దలకిచ్చి వారి సూచనలు।సలహాలమేరకు సరిగా వ్రాయించారు. ఫైనలు ప్రూఫుదిద్ది చదివి వినిపించుమన్నారు. చివరకు నన్ను మెచ్చుకోలుగా ఆశీర్వదించారు. నీభాష చాలా బాగుందని అభినందించారు. పుస్తకావిష్కరణ పూజ్యసర్‌సంఘచాలక్ సుదర్శన్‌జీ ద్వారా జరిగింది. భాగ్యనగర్‌లోని సంఘ ప్రముఖులతో నిండిన ఆసభలో నన్ను సన్మానించారు. పూజ్య సుదర్శన్‌జీ శాలువాతో సత్కరించినపుడు నేను పొందిన అనుభూతి మాటల కందదు. డాక్టర్జీ గురూజీ జీవిత చరిత్రలు నవలారూపంలో అలా తెలుగులో వచ్చినవి. తెలుగునాట ఆ పుస్తకాలు బాగా ప్రాచుర్యాన్ని పొందినవి. మూడవ సర్ సంఘచాలక్ బాళాసాహెబ్‌జీ జీవితచరిత్ర మరాఠీలో చాలా చక్కగా వ్రాయబడింది. దాన్నికూడా అనువదించాలని సంఘపెద్దల సూచనమేరకు సంకల్పించారు హల్దేకర్‌జీ. మళ్ళీకొద్దికాలం విరామం తర్వాత 'సంఘహీచ జీవనగాథా బాళాసాహెబ్ దేవరస్' తెలుగు అనువాదం ప్రారంభమయింది. అప్పటికే హల్దేకర్‌జీ ఆరోగ్యం బాగా బలహీనమయింది. పర్యటనలు మానుకొని విశ్రాంతి తీసుకుంటూ ఉండాలి, హార్ట్‌పేషంటువు కదా అని డాక్టర్లు సూచిస్తే రచనా వ్యాసంగంతో విశ్రాంతికి దూరమయ్యారు. ఎలాగోలా పుస్తకం పూర్తికావచ్చింది. చివరి 10-20 పుటలు మిగిలినవి. హల్దేకర్‌జీ పూర్తిగా అస్వస్థులయ్యారు. నిస్సహాయతను వ్యక్తం చేశారు. మరాఠీ మిత్రుడు ఆశోక్ బోధన్ సాయంతో పుస్తకం పూర్తయింది. మళ్ళీ చక్కని ఆవిష్కరణసభ. హల్దేకర్‌జీ అస్వస్థతతోనే సభలో పాల్గొన్నారు. బాళాసాహెబ్‌జీకి పి.ఏ.గా పనిచేసిన పెద్దలు శ్రీకాంత్‌జోషీజీ ద్వారా ఆవిష్కరణ జరిగింది. వారు బాళాసాహెబ్‌జీ పూర్వీకులు కూడా తెలంగాణ-చెన్నూరుకు సంబంధించిన వారని చెప్పారు. నాకు మళ్ళీ సన్మానం, తర్వాత

మైకువద్దకు వెళ్ళి శ్రీకాంత్‌జీ పేర్కొన్నా చెన్నూరు, ఉత్తరవాహిని గోదావరి తీరం మా స్వగ్రామమని చెప్పగా అంతా ఆశ్చర్యపోయారు. అప్పటి ఆ అనుభూతి కూడా నాకు అవిస్మరణీయం.... తర్వాత కొంత కుదుటపడి హల్దేకర్‌జీ మరోరెండు చిన్న పుస్తకాలు వ్రాశారు. వాటి లేఖనభాగ్యం కూడా నాకేదక్కింది. తెలుగునాట సంఘప్రగతిలో 'ఆత్మీయజ్ఞాపకాలు' ఆరుదశాబ్దాల సంఘ ప్రస్థానంలో హల్దేకర్‌జీ అనుభవాలు ప్రేరణాదాయకాలు చిన్నపుస్తకంగా వచ్చినవి. మరోచిన్న పుస్తకం, సమర్థరామదాసస్వామి జీవితం ప్రచారకులకు బాగా ఉపకరించే దాసబోధలోని మరాఠీ శ్లోకాలు కూడా అచ్చయింది. ఆత్మీయ జ్ఞాపకాలు పుస్తకంలో ఇలాఉంది,.. 1945 లో రా.స్వ. సంఘంలో ప్రవేశించి, నేటికీ సంఘమే జీవితంగా వ్యవహరిస్తూ మనముందు నిలిచిఉన్న వ్యక్తి మాన్యులు శ్రీ రామచంద్ర సదాశివ హల్దేకర్. వారికి సంఘపరిచయం శంభాజీనగర్ (ఔరంగాబాదు)లో జరిగినా, విద్యాభ్యాసంకోసం వారు భాగ్యనగర్‌కు వచ్చినందున వారిని ఇక్కడివారిగానే అందరూ భావిస్తారు. డిగ్రీ చదువును మధ్యలో (ఫైనల్ పరీక్షలు వ్రాయకుండా ప్రచారక్‌ల బైఠకులకు వెళ్ళారు) వదిలిపెట్టి ప్రచారక్ జీవితాన్ని ఆరంభించిన హల్దేకర్‌జీ భాగ్యనగర్, వరంగల్లు, విజయవాడ విభాగ్ ప్రచారక్‌గా, ఆంధ్రప్రాంతం (తెలంగాణ, ఆం.ప్ర) అంతటికీ సహప్రాంత ప్రచారక్‌గా, ప్రాంత ప్రచారక్‌గా, ఆగ్నేయ క్షేత్రప్రచారక్‌గా – సుదీర్ఘకాలంగా తెలుగువారిమధ్య మసలినవారు. తెలుగునాట వారెన్నో గ్రామాలు సందర్శించారు. ఎన్నెన్నో కుటుంబాలకు సన్నిహితమయ్యారు. ఎందరోకార్యకర్తల్ని తీర్చిదిద్దారు. జటిలమైన ఎన్నో సమస్యల్ని పరిష్కరించారు.... కంటకాకీర్ణమార్గంలో – ఏమాత్రం తత్తరపాటు లేకుండా వీరోచితంగా నడిచిన రాంభావు హల్దేకర్‌జీలాంటివారి అనుభవాలు ఎందరెందరికో పాథేయాలవుతాయి...” ఈమాటలు వ్రాసినరోజు వారు ఉన్నారు. ఇప్పుడులేరు. కళ్ళముందు మాత్రమే కదలాడుతున్నారు. వారి అనుభవాలు, ఆత్మీయ స్మృతులు నాకు చిరస్మరణీయాలు. వివిధ సంఘబాధ్యతలలో వారి పర్యటనలలో తోడుగా పాల్గొన్న అనుభూతులున్నవి. సుదీర్ఘకాలం (29సం॥లు) సంఘ శిక్షావర్గలలో ప్రబంధక్‌గా పాల్గొన్నందున వారితో సన్నిహితంగా ఉన్న అనుభూతులు కూడా ఉన్నాయి. నా కుటుంబ సభ్యులందరియోగక్షేమాలు అడుగుతూ ఆశీర్వదించిన అనుభూతులు కూడా ఉన్నాయి. మా చెన్నూరు శాఖకు వారొకసారి పర్యటనకు వచ్చారు. చిన్న గ్రామశాఖ సాంఘిక్‌లో ఈలవేసే సమయానికి 200మంది పెద్దలు – యువకులున్నారు. కార్యక్రమం

పూర్తయ్యేవరకు ఎవ్వరూలేచిపోలేదు. ఈ సంఘటనను వారు ఆ సంవత్సరమంతా తమపర్యటనలో మెచ్చుకోలుగా చెప్పారు. వారి వాక్కులు ఎంతో ప్రేరణదాయకాలు. వారి సహస్ర పూర్ణచంద్రదర్శన కార్యక్రమానికి జాగృతి ప్రతినిధిగా శంభాజీనగర్ వెళ్లాను. మరోమారు వారి ఆహ్వానం మేరకు అనేకమంది కార్యకర్తలతో కల్సి నేను –నాభార్య వారి స్వగ్రామం 'హల్దా'కు వెళ్ళాం. ఇలా ఎన్నెన్నో ఆత్మీయ అనుభూతులు. 'దాసనవమి' (సమర్ధ రామదాస స్వామిజన్మతిథి) వారి జన్మతిథి. మాఘబహుళ త్రయోదశి (మహాశివరాత్రి పూర్వ సంధ్య) వారి పుణ్యతిథి కావటం యాదృచ్ఛికమే కావచ్చు. మహాత్ముల అంశతో జన్మించారు, జీవించారు హల్దేకర్‌జీ. వారి చివరిదినాలలో దగ్గర ఉండాలనే ఆకాంక్ష నెరవేరలేదు. ఓ నెలరోజుల ముందు ఆసుపత్రిలో తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పుడు దర్శించాను. కళ్ళల్లో కళ్ళు పెట్టిచూశారు. కన్నీళ్ళు గిర్రునతిరిగి స్పష్టంగా చూడలేకపోయాను. కాళ్ళుముడుచుకొని పడుకున్నారు. పాదాలకు ప్రణమిల్లాలని కాళ్ళు చాచమన్నాను. కాళ్ళు చాచారు. తెల్లని పాదాలు స్పృశించాను. చల్లగా ఉన్నాయి. 'చల్లగా బ్రతుకునాయనా!' అన్న ఆశీర్వచనానుభూతి, అదే ఆఖరిచూపు. ఆత్మీయతకు మారుపేరు హల్దేకర్‌జీ. ఆనారోగ్యంగా ఉన్నాకూడా తనకోసం వచ్చేవాళ్లందరినీ ఆత్మీయంగా పేరుపేరునా పలుకరించేవారు. వారివారి కుటుంబసభ్యుల, బంధు, మిత్రులందరి బాగోగులు అడిగేవారు. ప్రతియేటా దీపావళికి కార్యాలయంలోని కార్యకర్తలందరికి తనవద్దనున్న నూతన వస్త్రాలనుఇచ్చి, మిఠాయిలుఇచ్చి ఆశీర్వదించేవారు. మా దంపతులిద్దర్కి కూడా ఆ అదృష్టం లభించింది.

మంచిర్యాల జిల్లా కార్యవాహగా, కరినగర్ విభాగ్ కార్యవాహగా అనేకసార్లు హల్దేకర్‌జీతో కలిసి విభాగ్‌లో పలుచోట్లకు పర్యటించాను. అలాగేవారు అనువదిస్తున్న పుస్తకాల ముందస్తు అమ్మకాలకు రెండు తెలుగు ప్రాంతాల్లోని అనేక నగరాలకు పర్యటించారు. కరినగర్ విభాగ్‌లో పర్యటించినపుడు భాగ్యనగర్ నుండి వారికి తోడుగా వచ్చాను. ఆయా సందర్భాల్లో కార్యకర్తలకు చేసిన మార్గదర్శనం నుండి నేనెంతగానో ప్రేరణ పొందినాను.

హల్దేకర్‌జీ ప్రాంత ప్రచారకులుగా ఉన్నపుడు ఒకసారి మా చెన్నూరు శాఖకు వచ్చారు. సాయంత్రం శాఖలో సాంఘిక్ కార్యక్రమం శిశుమందిర్ సంఘస్థాన్‌లో. అంతకు ఓ గంటముందు కొద్దిమంది నగరప్రముఖులతో తేనీరు పరిచయకార్యక్రమం, శిశు

మందిర్‌లోని ఓ గదిలో. ఆహ్లాదంగా పరిచయ కార్యక్రమం 40ని॥లు జరిగినది. 10-12మంది ప్రముఖులు వచ్చారు. తర్వాత సంఘస్థాన్‌లోకి నిక్కరుతో వచ్చారు. సంఘస్థాన్ సమయానికి 10-15ని॥ల ముందే జనంతో మైదానం నిండిపోయింది. చిన్న నగరం, పాతశాఖ. ఈల సమయానికి 250మందికిపైగా ఉన్నారు. వారిలో 40-50 మంది నిక్కరుతో ఉన్నారు. సంపతతో మైదానమంతా నిండింది. చక్కని కొద్దిపాటి శారీరిక ప్రదర్శనలు. ఇద్దరు క్రొత్త వ్యక్తులకునిక్కరు వేయించి సాంఘిక్ వైయుక్తిక్ గీత్‌లు పాడించాం. 40ని॥లు ఆనర్గళము, అద్భుతమైన హల్దేకర్‌జీ బౌద్ధిక్. ప్రార్థన పిదప అనేకమంది హల్దేకర్‌జీని చుట్టుముట్టి పరిచయం చేసుకున్నారు. కొందరు పాత స్వయంసేవకుల పేర్లను హల్దేకర్‌జీ గుర్తుచేశారు. తర్వాత హల్దేకర్‌జీ కార్యక్రమం గురించి బాగా ప్రశంసిస్తూ ప్రసన్నతను వ్యక్తం చేశారు. తర్వాత కాలంలో  పాంతంలో ఎక్కడికెళ్ళినా చెన్నూరు కార్యక్రమంగురించి ఉదహరించానని వారు స్వయంగా తెలిపారు. కొందరు ఇతరజిల్లా కార్యకర్తలు కూడా దీన్ని గుర్తుచేశారు. క్షేత్రప్రచారక్‌గా గుజరాత్ ప్రాంతంలో జిల్లావారి పర్యటన కెళ్ళారు. అక్కడకూడా నగర సాంఘిక్ కార్యక్రమాలు జరిగిన చోట చెన్నూరు సాంఘిక్‌ను ఉదహరించానన్నారు.

2016చివరలో హల్దేకర్‌జీ ఆరోగ్యం బాగా క్షీణించింది. పూర్తిగా మంచమునకే పరిమితమై అసుపత్రులకు, కార్యాలయానికి తిరగాల్సి వచ్చింది. పాలమూరులో వనవాసీ కళ్యాణ ఆశ్రమ కార్యకర్తల ప్రాంత సమ్మేళనం జరిగింది. దానికి నేను నా బాధ్యత కారణంగా వెళ్ళాను. తిరుగు ప్రయాణంలో భాగ్యనగర్ కేశవనిలయంలో ఆగి హల్దేకర్‌జీని చూడాలనుకున్నాను. నావెంట జ్యేష్ఠకార్యకర్త పరశురామ్‌జీ ఉన్నారు. ఇద్దరమూ వారి దర్శనానికి వెళ్ళాము. కేశవనిలయానికి దగ్గరలోని ఆసుపత్రిలో ఉన్నారు, వెళ్ళిచూశాం. బాగా చిక్కిపోయి నీరసంగా కళ్ళుమూసుకొని ఉన్నారు. అక్కడున్న కార్యకర్త వార్నిపిలిచారు. కళ్ళుతెరిచి చూశారు. తేరిపార చూశారు. మాట్లాడలేకపోతున్నారు. గుర్తించలేదేమోనని మా పరిచయం చేసుకున్నాం. లేదు గుర్తించానన్నట్లు తలాడించారు. కలుసుకున్న కనుచూపులు ఎన్నెన్నో ఊసులు చెప్పుకున్నాయి. నాకళ్ళు వర్షించినవి. వారూ కళ్ళు మూసుకున్నారు. మమ్మల్ని చల్లగా దీవిస్తూ రెప్పలు క్రిందుగా ఆశీరశ్రువులు కార్చారు. ఒకకాలు ముడుచుకొని పడుకున్నారు. కాళ్ళకు దండంపెడతామనగానే కాలుచాచారు. ప్రణమిల్లాం. అదే ఆఖరుచూపు, ఆఖరు స్పర్శ.

2017 ఫిబ్రవరి 23 రాత్రి మహాశివరాత్రి పూర్వసంధ్య పర్వకాలంలో హల్దేకర్‌జీ స్వర్గస్థులయిన వార్త వచ్చింది. తెల్లవారి మహాశివరాత్రి రోజున. "డా బద్రీనారాయణగారు మరియు సాగర్‌జీతో కారులో వెళ్ళి శ్రద్ధాంజలి ఘటించి వచ్చాం.....

ఓం శాంతిః శాంతిః శాంతిః

**- బెల్లంకొండ మల్లారెడ్డి,**

**9959387778**




**సేవాభారతి నిర్వహించిన ఆరోగ్య కార్యకర్తల శిక్షణవర్గలో**
**వేదికపై ఎడమనుండి శ్రీ ఆర్.నాగరాజ్ (సేవాభారతి అధ్యక్షులు),**
**శ్రీ పర్వతరావు (క్షేత్ర సంఘచాలక్), శ్రీ రాంభావ్ హల్దేకర్ (క్షేత్ర ప్రచారక్),**
**శ్రీ సిబిఆర్ ప్రసాద్ (సేవాభారతి భాగ్యనగర్ అధ్యక్షులు)**

## మాన్యవరులు శ్రీ రామచంద్ర సదాశివ హల్దేకర్‌జీ సహస్ర పూర్ణచంద్రదర్శన మహోత్సవ సందర్భంగా సాదర సుమాంజలి

ఓ మహానుభావ ! ఒహో రామభావా!! హళదేకరాఖ్య శ్రీ వంశోద్భవా !!

ఆర్ద్రతాపూర్ణమౌ మీదు భాషణము – అనవరతము మాకు మార్గదర్శనము
దిశలకు విరజిమ్మేటి వెలుగులే మీరు – భువి కొసలకు తాకేటి భవ్యతే మీరు
బొమ్మలను చెక్కేటి శిల్పులే మీరు – హృదయాలు మీటేటి ఋషివరులే మీరు ॥

రామచంద్ర ప్రదీప్తి, వరసదాశివ ప్రాప్తి – ఎల్లెడల జీవన సుగంధవ్యాప్తి
సరళ సుస్మితమూర్తి, చిరవిమల ఘనకీర్తి – మా ఎల్లరకు స్ఫూర్తి, మధ్యవర్తి ॥

మాతృసేవకు సర్వమర్పించినారు – బంధుకోటికి గర్వకారణమైనారు
పూర్ణచంద్రుల వేయి చూడంగలిగిన మీరు – లక్ష సూర్యోదయాల్ దర్శించగలరు
కోటి కోటి జనాల అభినందనలనంది – భారతీ పదపీఠి శోభిల్లగలరు ॥

మీ మధుర ప్రేమ వాత్సల్యాల కివియె మా – ధన్యవాదాలు
శతశత ప్రణామాలు అభివందనాలు శ్రీకర చందనాలు
సుదీర్ఘ జీవనము ఆరోగ్య భాగ్యముతో – భాసించి భవ్యమై ధన్యమగు గాకయని
శుభమస్తు మీకంటు దైవప్రార్థనలు
జయమస్తు మీ వెంట తల్లి దీవెనలు ॥

**॥ భారత్‌మాతాకీ జయ్॥**

**– 'మంజీరా'**

**ఔరంగాబాదు,**

**(7-2-2010)**

# సహస్ర పూర్ణచంద్రదర్శన కార్యక్రమము

## శ్రీ రాంభావు హల్దేకర్ మనోగతము:

('రాష్ట్రవిభూవి రాంభావు హల్దేకర్' వెలువడి హిందీ-మరాఠీ స్మరణికలో ప్రచురితం)

పూజ్య శంకరాచార్య స్వామీజీ హంపీ విరూపాక్ష పీఠాధిపతి సన్నిధికి శత శత ప్రణామాలు. వేదిక నలంకరించిన పెద్దలు మా॥ శ్రీ సుదర్శన్‌జీ, మా. మా. గో. వైద్యజీ, వందనీయ ప్రమీలాతాయీ మేఢే, ఉపస్థితులైన మహానుభావులు, సజ్జనబృందం మరియు మాతలారా! అందరికీ వందనాలు. నాకు చాలా సంకోచంగా ఉంది, భయంగానూ ఉంది. కర్తృత్వంతోను-ఆయుష్యంలోనూ మా. గో. వైద్యజీ చాలా పెద్దవారు. నేను ఎవరి మార్గదర్శనంలోనైతే పనిచేస్తూ వస్తున్నానో పూజ్య సుదర్శన్‌జీ - వీరిముందు ప్రసంగించడానికి తప్పకుండా ఎంతోకొంత సంకోచంగా, భయంగా ఉంటుంది. వారు నాగురించి ఎంతో ప్రశంసా పూర్వకంగా ప్రసంగించారు. ఇప్పుడు నేను నా మనోగతాన్ని వ్యక్తంచేస్తూ ఉన్నాను. ఈ కార్యక్రమంకోసం నేను అంగీకరించడం వెనుక కొన్ని భావనాత్మక విషయాలున్నాయి. నా పెద్దఅన్నగారు నారాయణరావు హల్దేకర్, నందు - సునీతా తండ్రి. ఆయనవద్ద నా జన్మపత్రిక భద్రపరచబడి ఉంది. నాకది ఏమాత్రం తెలియదు, ఎప్పుడూ అది నాకంటపడలేదు. ఆయన నాకుఉత్తరం వ్రాశారు. నా షష్టిపూర్తి సందర్భంగా చిన్న ధార్మిక కార్యక్రమం నిర్వహిస్తామని, అందుకు మీ అంగీకారాన్ని తెలపమని కోరినారు. వారు నాకంటే పెద్దవారు. 'మీ-మీ' (ఆప్‌కీ) అంటూ సంబోధించారు. నాకేమో చాలా సంకోచంగా ఉండేది. నేను వెంటనే వారికి ప్రత్యుత్తరం వ్రాశాను. 'దయచేసి అలాంటి కార్యక్రమమేదీ నిర్వహించవద్ద'ని ప్రాధేయపడినాను. అయినా వారు నన్ను మళ్ళీ మళ్ళీ ఒప్పించే ప్రయత్నం చేశారు. కార్యక్రమం చాలా చిన్నగా జరుగుతుంది. మన కుటుంబ సభ్యులకు, మీతో శాఖకు వచ్చిన అతికొద్దిమంది సన్నిహితులకు మాత్రమే పరిమితంగా ఉంటుంది. ఆహ్వాన పత్రికలాంటిదేమీ ఉండదు. అయినా నేను ససేమిరా

వద్దన్నాను. తర్వాత వారు స్వయంగా భాగ్యనగర్‌కు వచ్చారు. మా. ఈ చిన్న కార్యక్రమానికి అనుమతి తెలుపమన్నారు. నేనేమో నాపర్యటన కార్యక్రమాలలో బిజీగా ఉన్నాను. ఇప్పటికైతే నాకు ఇది సమ్మతంకాదు, వద్దన్నాను. తర్వాత మా అన్నగారు శంభాజీనగర్ (ఔరంగాబాదు)కు వెళ్ళిపోయారు. నేను నా పర్యటనకు వెళ్లిపోయాను. వాళ్ళు నిర్ణయించిన నా షష్టిపూర్తి తిథి దగ్గరకు వచ్చిందని మళ్లీ ఉత్తరము రాశారు. కార్యక్రమానికి అనుమతి ఇంకా తెలుపలేదని మళ్లీ ఈ ఉత్తరం రాస్తున్నానన్నారు. ఇప్పుడైనా మీరు అనుమతిస్తే మీమందరం ఆనందిస్తామన్నారు. అయినా నేను నాకు ఇలాంటి కార్యక్రమాలు ఇష్టముండవు, దయచేసి నన్నుక్షమించడన్నాను. నా ఈ జవాబుతో మా అన్నగారి మనసుబాధపడింది. అది నేను స్వయంగా అనుభూతి చెందాను. దీనికి కొంచెం ముందుగా మా అన్నగారి షష్టిపూర్తి కార్యక్రమం శంభాజీనగర్‌లో జరిగింది. సరిగ్గాఅది సంఘ శిక్షావర్గ జరుగుచున్న సమయం. శిక్షావర్గ విడిచి ప్రచారకులెవ్వరూ సాధారణంగా బయటకు వెళ్ళరు. నియమం ప్రకారం నేనూ శిక్షావర్గ విడిచిపోలేకపోయాను. అలా మా అన్నగారి షష్టిపూర్తి కార్యక్రమంలోపాల్గొనలేదు. మా తండ్రిగారికి 82 ఏళ్ళవయసు వచ్చి సందర్భంగా ఆ కార్యక్రమానికి తప్పక రావాలని ఆహ్వానించారు. నాకు అప్పటికే నిర్ణయమైన పర్యటన కార్యక్రమాలున్నందున ఆ కార్యక్రమానికి అప్పుడు వెళ్లలేకపోయాను. ఇలా మరి కొన్ని కార్యక్రమాలకు నేను వెళ్ళలేదు. నాకు ఆలోచిస్తే చాలా బాధవేసింది. నేను మాఅన్నగారి షష్టిపూర్తి కార్యక్రమానికి వెళ్ళలేదు. మా తండ్రి సహస్రచంద్రదర్శన కార్యక్రమానికి అప్పుడు వెళ్లలేదు. మా అన్నగారు మళ్లీ మళ్లీ అడుగుతూనే ఉన్నారు. "ఇంకా చాలా సమయముంది కదా? తొందరెందుకు? అప్పటివరకు చూద్దాంలే?" అని కొంచెం సడలించా సమాధానం చెప్పాను. మా కుటుంబంలోని సభ్యులందరు, మా సోదరుల కొడుకులు-కోడళ్లు, బిడ్డలు-అల్లుళ్ళు అంతాబాగా ఒత్తిడి తెచ్చారు. వారందరి ఆత్మీయ అబిమతాన్ని కాదనలేకపోయాను." సరే మంచిది, మీ అందరి కోరిక ప్రకారం కార్యక్రమానికి అంగీకరిస్తున్నాను. అయితే నేను ఒక్కరోజు కొరకు మాత్రమే భాగ్యనగర్‌నుండి శంభాజీనగర్‌కు వస్తాను. ఎలాచేయాలన్నది మీరు నిర్ణయించుకోండి." అంటూ ఒకానొక విచిత్రమైన మానసికతతో అంగీకారాన్ని తెలిపాను. అలా ఆ షష్టిపూర్తి కార్యక్రమం వరకు నిరంతర పర్యటనలో ఉండిపోయాను. కార్యక్రమానికి ముందురోజు విజయవాడ, నల్గొండ వంటిచోట్ల పర్యటనచేసి రాత్రిరైలెక్కి కార్యక్రమంరోజు ఉదయం శంభాజీనగర్

చేరుకున్నాను. అలా ఆనాడు ఆ కార్యక్రమం పూర్తయింది. ఇప్పుడు ఈ సహస్రపూర్ణచంద్ర దర్శన కార్యక్రమానికి కూడా అప్పటివలె రాలేనని చెప్పడానికి మనసు అంగీకరించలేదు. ఇప్పుడు నాకు పెద్దగా పర్యటనలు కూడా ఏవీలేవు. నా ఆరోగ్యం దృష్ట్యా డాక్టర్ల సలహా అది. మా పిల్లలు అడగగానే సరేనన్నాను. నేను నా జన్మస్థలం 'హల్దా' గ్రామంలో చిన్నగా చేయండని సూచించాను. మా వాళ్లందరి కోరక శంభాజీనగర్‌లోనే చేయాలని, వచ్చేవాళ్లకు సౌకర్యంగా ఉంటుందని ఇక్కడ ఇలా ఈ కార్యక్రమం నిర్ణయమయింది. అలా మీ అందరికి కష్టం కలిగించాల్సి వచ్చింది. మీరందరు నాపైప్రేమతో వచ్చారు, సంఘకృప కూడా దీనికి మరో కారణం. మీరంతా చాలా పెద్దసంఖ్యలో వచ్చారు. నాకు మా కుటుంబసభ్యులకు చాలా సంతోషం కల్గించారు.

ఇక్కడ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మాకుటుంబ సభ్యులందరు కలిసి ఏకత్రతమై నిర్వహిస్తున్నారు. వారెంతగానో పరస్పర ఆత్మీయతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్నున్నారు. నాపట్ల ప్రేమాదరాలతో నిర్వహిస్తున్నాను. వారిని ఎంతగా అభినందించినా అది తక్కువే. ఇక్కడ నేనొక అంశాన్ని ప్రస్తావించక తప్పదు. ఇక్కడ మా 'వదిన'గారిని గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాను. ఆమె ఒక అసాధారణ మహిళ. అద్వితీయ మహిళ. పారివారిక సాగరాన్ని ఈదుతున్న మహాసాధ్వి. ఆమె సహకారంతోను మరియు భగవంతుని అనుగ్రహముతోనే 'సంఘప్రచారక్'గా రాగలిగాను, ఇంతకాలం పనిచేయగలిగాను. ఆమెనాకు ఎంతోప్రేరణను కలిగించింది. మా వదిన అంటే సేవికాసమితి ప్రచారిక సునితా తల్లి. ఆమె సహకారం కారణంగానే హైదరాబాదులో సంఘకార్యం చేయగలిగాను. అక్కడ మేము నల్గురం సోదరులం ఒకే ఇంట్లో కలిసే ఉన్నాం.

మా అన్నగారు (సునీతా తండ్రి) మొదట్లో సంఘానికి బద్ధవ్యతిరేకి. అయినా మేము మా వదినకు చెప్పి శాఖకు వెళ్లేవాళ్లం, బైఠకులకు వెళ్లేవాళ్లం. తిరిగివచ్చేసరికి బాగారాత్రయ్యేది. అందుకని తలుపుకు గడియపెట్టవద్దని చెప్పేవాళ్లం. మేము, మా అన్నగారికి తెలియకుండా, నిద్రాభంగం కాకుండా నిశ్శబ్దంగా ఇంటిలోకి వచ్చేవాళ్లం. అన్నంపెట్టుకొని తినేవాళ్లం. మా అన్నగారికి ఎంతమాత్రం తెలియకుండా ఇలాచేసేవాళ్లం. తర్వాత కాలంలో మా అన్నగారు చాలా 'కట్టర్' స్వయంసేవక్ అయ్యారు. మాకంటే ఎక్కువ నిష్ఠచూపారు. అలామొత్తంమీద మా అన్నగారి సహకారంకూడా లభించింది. మా అన్నయ్య కూతురు సునీతా సేవికాసమితి ప్రచారికగా పనిచేస్తున్నది. ఆమెను అస్సాం

ప్రాంతానికి పంపించాలని సేవికాసమితి పెద్దలు నిర్ణయించారు. ఆ విషయం వందనీయ ప్రమీలాతాయిమేఢే (సేవికాసమితి ప్రముఖ సంచాలిక) నాతో చెప్పారు. సునీతా తల్లి అందుకు ఒప్పుకుంటుందో లేదో అనివారు అనుమాన పడుతున్నారు. ఈ విషయం సునీతా తల్లితో మాట్లాడమని నాకు చెప్పారు. నేను ఆ విషయమై సునీతా తల్లితో అనగా మా వదినగారితో కల్సి విషయం చెప్పాను, "సేవికాసమితి అధికారులు సునీతాను అస్సాం ప్రాంతానికి పంపాలని నిర్ణయించారని" (సునీతా అప్పటివరకు సేవికాసమితి ప్రచారికగా మహారాష్ట్రలోనే పనిచేయుచున్నారు. అలా ఎంతో కొంత ఇంటికి దగ్గరలోనే ఉన్నది) నా మాటవిని మా వదిన (సునీతా తల్లి) అన్నారు, "సునీతా ఇంటినుండివెళ్లి ప్రచారిక పనిచేయుచున్నది. ఇంటినుండి బయటికి వెళ్లిన తర్వాత ఔరంగబాదు అయితేనేమి? పూనే అయితేనేమి? అస్సాం అయితేనేమి? ఎక్కడయినా మాకు ఎలాంటి తేడా ఉండదు. ఎక్కడయినా మంచిదే." దీన్నిబట్టి ఆమెకు సంఘంపట్ల, సమితిపట్ల ఎలాంటి ఆదరభావముందో నేను స్వయంగా అనుభూతి చెందాను. మా వదినగారు చనిపోకముందునాటి మరో సంఘటన: మా వదినగారు వార్కరీ సంప్రదాయపు కుటుంబానికి చెందినవారు. ప్రతియేటా పండరీపూర్‌కు వార్కరీ సంప్రదాయానికి చెందిన భక్తులు వెళ్తుంటారు. మా వదినగారూ వెళ్లేవారు. ఏకాదశినాడు ఉపవాసముండి కాలినడకన వెళ్లేవారు మా వదినగారు. వారు భజనలు చేస్తూవెళ్లేవారు. అలాగే మరాఠీ భగవద్గీత 'జ్ఞానేశ్వరీ' (సంత్ జ్ఞానేశ్వర్ ద్వారా వ్రాయబడిన భగవద్గీత మరాఠీ వ్యాఖ్యానం) పారాయణం 108సార్లు పూర్తిచేసి మరీ వెళ్లేవారు. చివరి సంవత్సరం 108సార్లు పారాయణం పూర్తిచేయకుండానే మా వదినగారు స్వర్గస్థురాలైనారు. అయితే ఆ తర్వాత ఆమె మరో కూతురు సురేఖా భాలేరావు (ఇప్పుడీ మన సభా నిర్వహణ చేస్తున్న అమ్మాయి) ఆగిపోయిన జ్ఞానేశ్వరి పారాయణాన్ని పూర్తిచేసింది. 108 సార్లకు బదులు 121 సార్లు పూర్తిచేసింది. అలా మా వదినగారు వెళ్లిపోయారు. అటు తర్వాత ఆమె ప్రథమ వర్ధంతి, సంవత్సరీకం వచ్చేసింది. దాని సమాచారంతోబాటు మరో విశేషాన్ని తెల్పుతూ మావాళ్ళు (కొడుకులు-కోడళ్ళు, కూతుర్లు-అల్లుళ్ళు) నాకు ఫోనుచేశారు. "కాకా మేమంతా హైదరాబాదు వస్తున్నాం". అన్నారు. ఎందుకని నేను అడిగాను. "మా అమ్మగారి (మీ వదినగారి ) ఆఖరి కోరికను నెరవేర్చడానికి" అన్నారు. ఏమిటది అని నేనడిగాను. ఆమె జ్ఞానేశ్వరి పారాయణం పూర్తిచేసిన పిదప హైదరాబాదుకు వచ్చి 21మంది బ్రాహ్మణులకు

బదులు 21మంది సంఘప్రచారకులకు భోజనం పెట్టి నూతన వస్త్రాలు ఇవ్వాలని సంకల్పించారు. అది పూర్తిచేయకుండానే ఆమె గతించారు. ఆమె సంకల్పాన్ని పూర్తిచేయడానికి హైదరాబాదుకు వస్తామన్నారు. నేను దానికి సమ్మతించలేదు. ఇందుకోసం డబ్బుఖర్చుచేయడం వద్దన్నాను. అప్పుడు వాళ్ళన్నారు, "డబ్బులు సమస్య కానేకాదు, అమ్మగారు దీనికోసం స్వయంగా డబ్బులు జమచేసి ఉంచింది. మా అన్నగారి పెక్షన్‌నుండి మరియు ఇతరత్రా కార్యక్రమాల సందర్భంగా పొదుపుచేసి తగినన్ని డబ్బులను జమచేసింది. ఆ పైకం ఈపనికోసమే వినియోగించాలన్నది ఆమెకోరిక. ఆమెకోరిక ప్రకారం 21మంది బ్రాహ్మణులకు బదులు 21మంది ప్రచారకులకు భోజనం పెట్టి నూతన వస్త్రాలు సమర్పించాలి.

అప్పుడు నాకు అనిపించింది, ఈ కార్యక్రమం హైదరాబాదుకు బదులు, ఔరంగబాదులోనే చేస్తే బాగుంటుంది. ఆమె సంవత్సరీకంనాడే చేయాలి. కుటుంబ సభ్యులందరికి రావడానికి సౌకర్యంగా ఉంటుంది. ఈ విషయమైనేను మన క్షేత్ర సంఘచాలకులు ఆచార్య చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి సలహా అడిగాను. వారు చాలా పెద్దవారు, అనుభవజ్ఞులు. వారన్నారు, ఈ కార్యక్రమం బాగుంది, ఈ ఆలోచన బాగుంది. అది ఔరంగబాదులో కుటుంబసభ్యుల మధ్య జరగడమే మంచిది అన్నారు. అయితే అక్కడ అంతమంది ప్రచారకులు అందుబాటులో ఉండరు. హైదరాబాదులో సులభంగా అందుబాటులో ఉంటారు. నేను మావాళ్లకు సూచించాను, అక్కడ ఔరంగాబాదు, సల్లోడ్, పూనే వంటి చోట్ల ఉన్న ప్రచారకుల్ని ఆహ్వానించమన్నాను. హైదరాబాదునుండలి ప్రతినిధులుగా ముగ్గురు ప్రచారకులు వస్తారు. ఆలా ఆ కార్యక్రమానికి నేను, నాతోబాటు ఆనాటి క్షేత్రప్రచారకులు, భాగయ్యగారిని, క్షేత్రసేవాప్రముఖ్ పట్లోళ్ళ రాంరెడ్డిగారిని తీసుకొని ఔరంగబాదుకు వచ్చాను మాననీయ భయ్యాజీ కూడా ఆకార్యక్రమంలో పాల్గొన్నారు. మా వదినగారి మానసికతను గురించి తెల్పడానికి ఇదంతా చెప్పాను. ఆమెకు సంఘకార్యంపట్ల, సంఘప్రచారకులపట్ల ఎంతో గౌరవముంది. సామాజిక సమరసతపట్ల ఆమెకెంతో నిష్ఠ ఉంది. ప్రచారకులకు కులం-మతం-సంప్రదాయం ఏదీ ఉండదనేది ఆమో ప్రగాఢవిశ్వాసం. ప్రచారకులది ఒకటే కులం 'గోకులం-గోకులం' సంఘంపట్ల, సమాజంపట్ల ఆమెకు ఉన్న బాధ్యతాయుత భావం మనసులో మెదలాడుతుంది. అనేకరకాల సామాజిక కార్యక్రమాలలో, సేవాకార్యక్రమాలలో నిరంతరం

పాల్గొనేది. ఆమె సామాజిక జీవన ప్రభావం కూడా నాపైబాగా పనిచేసినది. అలాగే మా సోదరులందరిపై కూడా పనిచేసింది. అలా వారుకూడా సంఘకార్యంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేను సంఘం గురించే వేరే ఏమీ చెప్పాలనుకోవట్లేదు. అయితే నా సంఘ పరిచయంగురించి కొద్దిగా చెబుతాను. మేము పల్లెటూరు పిల్లలం. మా గ్రామంలో ఉన్న చిన్నబడి చదువుపూర్తిచేసుకున్నాం. పై చదువులకోసం ఔరంగబాదుకు వచ్చాం. ఇక్కడ ఔరంగాబాదు(శంభాజీనగర్)లో మాబంధువు, మాకంటే సీనియర్ ఒకాయన దత్తాజీభాలే అనే వ్యక్తిద్వారా సంఘపరిచయమయింది. ఆయన ప్రతిరోజు శాఖకు వెళ్లేవాడు. నన్ను శాఖకు రమ్మన్నాడు. శాఖలో ఆటలుంటాయి . కబడ్డీ, ఖో ఖో వంటి ఎన్నెన్నో ఆటలాడుతాం అన్నాడు, అలాగే పాటలు నేర్పిస్తారు, మంచి కథలు చెబుతారు అన్నాడు. నువ్వుకూడా శాఖకురా! అన్నాడు. మంచిది, నేను కూడా వస్తాను, కాని ఈరోజు నాకు పనిఉంది, రేపు వస్తానని అన్నాను. ఆయన తెలవారి మళ్లీవచ్చాడు, నిన్న పనిఉండినది, అయితే ఈరోజు శాఖకు పద, అన్నాడు. సరే. తప్పకుండా వస్తాను, మీరు ముందువెళ్లండి. నేను తప్పకుండా మీ వెనుక వచ్చేస్తానన్నాను. అలా శాఖకు వెళ్లకుండా మళ్లీ తప్పించుకున్నాను. ఇలా నాల్గురోజులు నావెంటపడ్డారు. ఇంకా కూడా శాఖకు పోకుండా ఉంటే బాగుండదనుకున్నాను. మర్యాదగా కూడా ఉండదు. ఎందుకంటే ఈ దత్తాజీభాలే మా అన్న నారాయణరావుగారికి సొంత బావమరిది. మా వదినగారికి సొంత తమ్ముడు. అలా నాక్కూడా బావమరిదే అవుతాడు. సునీతాకు మేనమామ. అలా శాఖకు వెళ్లాను, కొంచెం ఆలస్యంగానే వెళ్లాను. నా మామూలు డ్రెస్‌తో పైజామా-లాల్చీతో వెళ్లాను. శాఖలో ఓ ప్రక్కకు నిలబడ్డాను. నాచే ధ్వజప్రణామ్ కార్యవాహ ప్రణామ్ చేయించారు. అంతా చూస్తున్నాను. కొందరు తరుణ దండతో ప్రహర్లు చేస్తున్నారు. బాల లేజిమ్ (యోగఛాప్) చేస్తున్నారు. నన్నుకూడా ఆడుకుందాం రమ్మన్నారు. ఈరోజు అంతా చూస్తాను, రేపు మీతోకల్సి ఆడుతానన్నాను. అలా నిలబడి చూస్తున్నాను. క్రొత్తవాణ్ణి కాబట్టి అంతానావైపే చూస్తూ నవ్వుతున్నారు. ఆనందంగా ఉన్నారు. ఎందుకు ? కుటుంబంలో క్రొత్తగా శిశువు జన్మిస్తే అంతా సంతోషిస్తారు కదా? మనశాఖకు ఓ క్రొత్త స్వయంసేవక్ వచ్చాడని ఆనందిస్తున్నారనిపించింది. మరోరకంగా కూడా కావచ్చు, ఓ క్రొత్తవ్యక్తి మనవలలో చిక్కిపోయాడని కూడా కావచ్చు.... తర్వాత ప్రార్థన అయిపోయింది. అంతా వచ్చి నాచుట్టుమూగారు, నీపేరేమిటి అడిగారు, ఎక్కడినుంచి వచ్చారన్నారు. మీ

పరిచయమేంటని అడిగారు. నేను నా పరిచయం చేశాను. ఇంతలో ఒకాయన నా దగ్గరగా వచ్చాడు. ఇక్కడే మా కార్యవాహ ఉన్నారు. ఆయన దగ్గరికొచ్చి మీ పరిచయం చేసుకమని తీసికెళ్ళారు. ఆయనవద్దకెళ్లి పరచయం చేసుకున్నాను. ఇంతలో మరో స్వయంసేవక్ నా దగ్గరగా వచ్చాడు. 'రండి, ఇక్కడే విభాగ్ ప్రచారక్‌గారు ఉన్నారు', అంటూ మరో వ్యక్తి దగ్గరకు తీసికెళ్లారు. అక్కడ ఆయనకూడా అదేపాఠం చదివారు. 'నీ పేరేంటి? నీ పరిచయం చేయమన్నారు. నా పరిచయం మళ్లీ చేస్తుంటే నా మనసులో ఒక భావం తట్టింది. వీళ్ళు ఎందుకిలా పరిచయమంటు ఎన్నిసార్లు అడుగుతారు? అని ఆనాడనిపించింది. సంఘంలో పరిచయం చేసుకోవడానికి చాలా ప్రాధాన్యముందని మనందరికి ఇప్పుడు తెలిసిందే! పరస్పర స్నేహం, పరస్పర ఆత్మీయత, పరస్పర ప్రేమ, పరస్పర విశ్వాసం, పరస్పర సహకారం – వంటివన్నీ పరచయం ద్వారా అలవడతాయి. మొదటిరోజు జరిగేది ఔపచారిక పరిచయం. మీపేరేమిటి? నా పేరేమిటి? మీరెక్కడినుండి వచ్చారు? మీరేం చేస్తుంటారు? నేనేంచేస్తుంటాను? ఇవన్నీ పరస్పరం తెలుసుకుంటాం. తర్వాత మనం కల్సిపనిచేస్తాం, కల్సి ఆడుతాం, కల్సి పాడుతాం, కల్సి తిరుగుతాం – అలా ఈ పరిచయం మరింత ముందుకెళ్తుంది. ఆత్మీయత పెరుగుతుంది. మన పరిచయ ప్రక్రియ నిరంతరం కొనసాగే ప్రక్రియ.

మొదటిరోజు అలా శాఖకు వెళ్లాను. ఎవరో ఒకరి పిలుపువల్ల వెళ్ళాను, వెంటపడిన కారణంగా వెళ్లాను, మర్యాద కోసం వెళ్లాను. అలా వెళ్లి అందులోనే చిక్కుకుపోయాను. ఇప్పుడిలా మాట్లాడితే – ఆలోచిస్తే ఏం లాభం? ఆ మొదట్లోనే పొరపాటు జరిగిపోయింది. మీరు వెంటపడకపోతే శాఖకు పోయేవాడ్నేకాదు. ఆలా పొరపాటు జరిగింది. ఇప్పుడిక ఆ వ్రతాన్ని పాటించక తప్పదు. అప్పటినుండి ఇప్పటివరకు ఆ వ్రతాన్ని కొనసాగిస్తూనే ఉన్నాను. నాశక్తిమేరకు సంఘపనిచేస్తున్నాను. దీన్నే తెలుగులో 'ఉడతాభక్తి' అంటారు. శ్రీరాముడు సేతువు నిర్మించినపుడు ఉడతకూడా తనశక్తి మేరకు ఇసుకతెచ్చిపోస్తూ రామకార్యనికి సాయపడ్డది. (ఉడత తన శరీరాన్ని పూర్తిగా నీళ్లలో తడిపి తర్వాత ఇసుకలో దొర్లేది. తడికారణంగా ఇసుక శరీరానికి అంటుకునేది. అది తీసుకొచ్చి వారథి నిర్మాణంలో ఉపకరించేలా దులిపేది. దీన్నే ఉడతా భక్తి అంటారు.) నా కంటే ముందు మాట్లాడిన మా.గో. వైద్యగారన్నారు, మనమంతా సంఘకార్యంలో బిందువులం. సంఘ సౌధపు పునాదిరాళ్లం. ప్రజలెవ్వరికీ మనపేర్లు కూడా తెలియకుండా పనిచేస్తుంటాం. భవ్యమైన

సంఘ సౌధానికి పునాదిరాయిగా ఆధారశిలగా ఉండడంలోనే జీవన సార్ధకత ఉంది. ఇలాగే పనిచేయడానికి శక్తిని ప్రసాదించమని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. తగినంత శక్తిని, సామర్థ్యాన్నిస్తూ ఆశీర్వదించమని కోరుకుంటున్నాను. తగినంత పనిచేయడానికి పెద్దల ఆశీర్వాదాన్ని అర్థిస్తున్నాను. మీరంతా నాపట్ల ప్రేమతో వచ్చారు. శుభాకాంక్షలందించారు. అందరికీ మళ్ళీ మళ్ళీ ప్రణామాలర్పిస్తున్నాను. మీరంతా పెద్ద సంఖ్యలో వచ్చారు. దినమంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

# 'కర్మమయ జీవనం శ్రీ హల్దేకర్‌జీది'

## సహస్ర పూర్ణచంద్ర దర్శన మహోత్సవంలో శ్రీ సుదర్శన్‌జీ ప్రసంగం

"శ్రీ రాంభావు హల్దేకర్‌జీ కర్మవీరులు. ఈ మట్టినుండి కర్మవీరులు నిర్మాణమవుతూనే ఉంటారు. శ్రీహల్దేకర్‌జీ జీవనం కర్మమయజీవనం – వారి ఆదర్శజీవనం, ఆత్మీయత మన హృదయాలను స్పర్శించింది. వారు దాస నవమినాడు జన్మించారు. సమర్థ రామదాస స్వామి జీవనాదర్శమే వారి జీవనాదర్శ మైంది" అని రా.స్వ.సంఘ పూర్వ సర్‌సంఘచాలకులు సుదర్శన్‌జీ అన్నారు. వారు శంభాజీనగర్ (ఔరంగాబాదు)లో జరిగిన శ్రీ రాంభావు హల్దేకర్‌జీ సహస్రపూర్ణచంద్రదర్శన మహోత్సవంలో ముఖ్యాతిథిగా పాల్గొన్నారు. ప్రసంగంలో వారింకా ఇలా అన్నారు. సహస్రపూర్ణచంద్ర దర్శనమహోత్సవాలు మన హిందూకుటుంబ వ్యవస్థలోనే ఉన్నవి. పాశ్చాత్యులకు ఇలాంటివేవీ లేవు. మహా అయితే వారు ఫాదర్స్‌డే, మదర్స్‌డే వంటివి జరుపుకుంటారు. మనవద్దనున్న కుటుంబవ్యవస్థ వారికిలేదు. థర్డ్‌వైఫ్, ఫోర్త్ హస్బండ్ వంటి వ్యవస్థవారిది. జీవితాంతం ఒకరితోనే కాపురం చేసే వ్యవస్థ మనది. మన కుటుంబవ్యవస్థలో పొదుపుచేసే పద్ధతి, పొదుపు నేర్పే ఒరవడి ఉన్నవి. ఇది మన దేశ ఆర్థికవ్యవస్థను బలంగా నిలిపి ఉంచుతున్నది. వారిది దుబారా ఖర్చు చేసే వ్యవస్థ. అప్పుచేసి అయినా సుఖాలను అనుభవించాలంటారు వారు. అప్పు తీర్చే బాధ్యత వారికి లేదు. విశ్వాని కంతటికి సభ్యతను నేర్పిన "కృణ్వంతో విశ్వమార్యమ్" సంస్కృతిమనది. ప్రపంచమంతటా మన సంస్కృతి

విస్తరించింది. ఇప్పటికీ అనేకదేశాలలో హిందూ శిథిల మందిరాలు మనకు దర్శనమిస్తున్నాయి. స్వామి వివేకానందుని ఒక విదేశీయుడిలా ప్రశ్నించారు. 'మీ హిందూసంస్కృతి చాలా గొప్పదంటున్నారు. ఈ గొప్ప సంస్కృతిని ప్రచారంచేస్తూ ఇంతకు ముందెవ్వరూ రాలేదు. మీరే మొదటగా వచ్చారెందుకు?'

దానికి స్వామీజీ సమాధానం 'మీరంతా ఇంతకాలం బట్టలు కూడా సరిగా లేక దిగంబరంగా ఉన్నారు. ఇప్పుడిప్పుడే మీరు నిండా బట్టలు కట్టుకుంటున్నారు. అందుకే ఇప్పుడు నేను వచ్చాను అన్నారు. ప్రపంచంలో 'డ్రూజ్' అనే ఆదిమజాతులవారున్నారు. వారంతా తమది హిందూ సంస్కృతేనని, తామంతా రహస్యంగా ఇళ్లలో హిందూదేవీదేవతల్ని పూజిస్తున్నామన్నారు. బహిరంగంగా పూజిస్తే తెల్లజాతివారు తమ పూర్వీకుల్ని చంపినట్లే మమ్మల్ని చంపుతారని తెలిపారు. ఈ 'డ్రూజ్' పదం 'ద్విజ' పదానికి అపభ్రంశరూపమే. బుద్ధుడు, ఆదిశంకరులు, స్వామిదయానంద, రామకృష్ణ పరమహంస, స్వామివివేకానంద వంటి మహాత్ముల పరంపరను కొనసాగిస్తూ డా॥ హెడ్గేవారు సంఘకార్యాన్ని స్థాపించారు. వారు విప్లవకార్యక్రమాల్లోను, కాంగ్రెసు ఉద్యమంలోను క్రియాశీలంగా పనిచేశారు. మనకు అద్భుతమైన సర్‌సంఘచాలక్ పరంపర ఉంది. డాక్టర్జీతో ప్రారంభమైన సంఘకార్యం నిరంతరం ముందుకేగుచున్నది. శ్రీగురూజీ పిలుపుకు ప్రేరితులై అనేకమంది ప్రచారకులుగా విచ్చేశారు. శ్రీ హల్దేకర్‌జీ నిజామ్ నిరంకుశ పాలనాకాలంలో సంఘకార్యకర్తగా ఎదిగినారు. క్లిష్టపరిస్థితుల్లో సంఘప్రచారక్‌గా వచ్చారు. వారు కఠోర పరిశ్రమతో సంఘకార్యాన్ని విస్తరింపచేశారు. కాలినడకన గ్రామాల్లో పర్యటించారు. ఆంధ్రప్రదేశమంతటా కార్యప్రగతికి కావలసిన కార్యకర్తల నిర్మాణానికి వారి జీవితం సమర్పితమైంది. వేలాది స్వయంసేవకుల్ని వారు తీర్చిదిద్దినారు. వారు 81 సంవత్సరాలు నిండిన ఈ వయసులోను నిరంతరం పర్యటిస్తున్నారు. వారికి భగవంతుడు దీర్ఘాయువును, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ప్రార్థన – వారికే కాదు మనందరికీ భగవంతుడు దీర్ఘాయువు నిస్తాడు. కర్మమయ జీవనంతో 'బఢరహే హై హమ్ నిరంతర్.....' అంటూ ముందుకేగుదాం" అంటూ శ్రీ సుదర్శన్‌జీ తనప్రసంగం ముగించారు.

శ్రీ హల్దేకర్‌జీ కుటుంబసభ్యులు అనగా వారి సోదరుల సంతానం అంతా కలిసి 07.2.2010 శ్రీ దాసనవమినాడు వారికి సహస్రపూర్ణచంద్రదర్శనమహోత్సవాన్ని ఔరంగాబాద్‌లో నిర్వహించారు. ఉదయం పూజ – హవనం – యజ్ఞం నిర్వహించారు. ఈ

సందర్భంగా రా.స్వ.సంఘ పెద్దలు శ్రీ సుదర్శన్‌జీ, శ్రీ భయ్యాజీ జోషీ, శ్రీశ్రీకాంత్‌జోషి, శ్రీ మధుభాయికులకర్ణి, శ్రీ భాగయ్యగారు, శ్రీ బాబూరావు వైద్యగారు మొదలగు పెద్దలు అనేకమంది హల్దేకర్‌జీకి శుభాకాంక్షలు తెలిపినారు. స్థానిక పార్లమెంటు సభ్యులు, ఇతరప్రజాప్రతినిధులు, ప్రముఖులు అనేకులు వారిని అభినందిస్తూ శుభాకాంక్ష లందించారు. ఆంధ్రప్రదేశ్‌నుండి కూడా చాలామంది రా.స్వ.సంఘకార్యకర్తలు శ్రీ జస్టిస్ పర్వతరావు, శ్రీ టి.వి.దేశ్‌ముఖ్, శ్రీ ప్యాటా వేంకటేశ్వరరావు, ప్రొ.సుందరమూర్తి, ప్రొ.విశ్వేశ్వరం, శ్రీ దూసి రామకృష్ణ ఉభయప్రాంతాల ప్రాంత ప్రచారకులు శ్రీ శ్యాంకుమార్, డా॥ సుకుమార్ మొదలగువారు వారిని అభినందించి ఆశీస్సులు పొందినారు. రాష్ట్రసేవికా సమితి పెద్దలు వందనీయ ప్రమీలాతాయి మేఢే, మాననీయులు రుక్మిణి అక్క, శాంతక్క, సువర్ణక్క, సుశీలాతాయి అభ్యంకర్, సోమరాజు సుశీల మొదలగువారు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్ష లందించారు. మధ్యా: 3.00 నుండి 6.30 వరకు సభాకార్యక్రమం జరిగింది. సభా కార్యక్రమాన్ని హల్దేకర్‌జీ సోదరుని కూతురు శ్రీమతి సురేఖా భాలేకర్ అద్భుతంగా నిర్వహించారు. హల్దేకర్‌జీ పరివారసభ్యులు మహోత్సవంలో పాల్గొన్న పెద్దలందరికి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలిచ్చి సత్కరించారు. జ్యోతి ప్రజ్వలనతో సభా కార్యక్రమము ప్రారంభమైనది. వక్తలు వరుసగా శ్రీ భయ్యాజీ జోషి, శ్రీ బాపూరావు వైద్య, శ్రీ పర్వతరావు, శ్రీ వి.రామారావు (మాజీ గవర్నర్ – సిక్కిం), వందనీయ ప్రమీలాతాయి మేఢే, శ్రీ రాంభావు హల్దేకర్‌జీ, పూజ్య సుదర్శన్‌జీ ప్రసంగించారు. హంపీ విరూపాక్ష పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విద్యారణ్యభారతీస్వామి ఆశీర్వచన ప్రసంగం చేశారు.

శ్రీ హల్దేకర్‌జీ కుటుంబసభ్యులు ఈ సందర్భంగా సంఘానికి, సమితికి సేవానిధిని సమర్పించారు.

## శ్రీ భయ్యాజీ జోషి సందేశం :

శ్రీ రాంభావు హల్దేకర్‌జీ 81 సంవత్సరాలు పూర్తి చేసికొన్నారు. ఎలా పూర్తి చేశారన్నదే జీవితానికి ముఖ్యం. 1948-49 సంఘం కష్టకాలంలో ఉన్న సమయాన వారు స్వయంసేవకులైనారు. సంఘంలో మొదటితరం గడిచిపోయింది. రెండవతరానికి చెందిన వరిష్ఠ ప్రచారకులు శ్రీ హల్దేకర్‌జీ – ఎన్నో కష్టాలనోర్చి నిజాం నిరంకుశ గడ్డపై సంఘకార్యాన్ని విస్తరింపచేశారు. 81 ఏళ్లు కాగానే విశ్రాంతి కావాలి. కాని వారికి విశ్రాంతి లేదు. అలసట లేదు. వారు సంఘకార్యం కోసం జీవితాన్ని అరగదీశారు. జీవనజ్యోతిని తానే వత్తిగా

వెలిగించారు. సమాజంలో ఆదర్శవాదులేరి? రాజనేతలా? సామాజికనేతలా? విద్యావేత్తలా? నాకెవరూ ఆదర్శవాదులు కనిపించుటలేదన్న ఎ.పి.జె.అబ్దుల్‌కలాంగారి హృదయవేదనకు జవాబు శ్రీ హల్దేకర్‌జీ జీవితం. ఎక్కడి డా॥ హెడ్గేవార్, ఎక్కడి నాగపూర్, ఎక్కడి సంఘ సిద్ధాంతం – ఎవరికీ అర్థంకాని, అంతుబట్టని సంఘాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని పల్లెలకు ప్రసరింపచేశారు. సహజత్వంతో ప్రజలకు సంఘాన్ని అర్థం గావించారు. ఇది పురుషార్థానికి సన్మానం, యజ్ఞమయజీవితానికి సన్మానం.

## శ్రీ మా.గో.వైద్యగారి సందేశం :

శ్రీ రాంభావు ఇలాంటి సన్మానాలకు వ్యతిరేకి. అతికష్టంపైన దీనికి అనుమతించారు. వారు సంఘ సౌధానికి పునాదిరాయిగానే ఉండాలని కోరుకున్నారు. పునాదిశిలకు సన్మానాలుండవు – శిఖరానికే సన్మానాలు, రంగులు – శిఖరంపైననే ఎవరైనా కూర్చుంటారు – చివరకు కాకులు, గ్రద్దలు కూడా కూర్చోవచ్చు – శిఖరాలపై కూర్చుండేవారికి పునాదిశిల అర్థం కాదు. సౌధానికి ఆధారం పునాది. పునాదిగా మారి ఇలా జీవితాలు ఎందుకు 'బర్బాద్' చేసుకుంటారో పైన కూర్చున్నవారికి అర్థంకాదు. వేలాది కార్యకర్తల బలిదానాలతో సంఘకార్యం విస్తరించింది. 1954లో అ.భా.స్థాయి జిల్లా ప్రచారకుల వారందినాల వర్గలో శ్రీ గురూజీ చక్కని మార్గదర్శనం చేశారు. ఆనాడు రెండే వివిధ క్షేత్రాలున్నవి. అ.భా.విద్యార్థి పరిషత్, భారతీయ జనసంఘ్– వివిధ క్షేత్రాలకు స్వయంసేవకు లెందుకు వెళతారు? సంఘ రాయబారులుగా వెళతారు? పవిత్రమైన, స్వచ్ఛమైన సంఘ సిద్ధాంతాన్ని అక్కడ నిలబెట్టాలి. అక్కడ బురద ఉంటుంది. అది మనకు అంటుతుంది. ఆ బురదను కడిగి ఆ క్షేత్రాన్ని, మనల్ని శుభ్రంచేయడానికి స్వచ్ఛమైన నీటిని తగినంతగా తీసికెళ్లాలి. అనేక క్షేత్రాలతో కలిసి రాష్ట్రజీవనం ఏర్పడుతుంది. అలాంటి రాష్ట్రజీవన నిర్మాణానికి ఒక బిందువు శ్రీ హల్దేకర్. బిందువు బిందువు కలిస్తేనే రాష్ట్ర జీవనసింధువు ఏర్పడుతుంది. శ్రీ హల్దేకర్ జీకి ఇప్పుడు 82 ఏళ్లు. నా శతజయంతి జరుపడానికైనా శ్రీ రాంభావు హల్దేకర్ దీర్ఘాయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థన.

శ్రీపర్వతరావుగారు, శ్రీ వి.రామారావుగారు, వందనీయ ప్రమీలాతాయి మేఢే (సేవికాసమితి ప్రముఖ సంచాలిక)గారు కూడా సభలో ప్రసంగించారు. శ్రీ హల్దేకర్‌జీతో తమకు ఏర్పడిన అనుబంధాల్ని అనుభవాల్ని వివరించారు.

### శ్రీ హల్దేకర్‌జీ సందేశం :

నాకు 60 ఏళ్ళప్పుడే మా అన్నగారు, కుటుంబసభ్యులు షష్టిపూర్తి చేస్తామన్నారు. వీలుకాదన్నాను. మా అన్నగారి షష్టిపూర్తికి నేను వెళ్లలేదు. మా నాన్నగారి సహస్రపూర్ణచంద్ర దర్శనానికీ నేను వెళ్ళలేదు. చివరికి వారి అంత్యేష్టిలో కూడా సరిగా పాల్గొనలేదు. మా కుటుంబ సభ్యులందరి బాధను కాదనలేక, సంఘ పెద్దల ప్రోద్బలంతో దీనికి సమ్మతించాను. కాని కేవలం కార్యక్రమంనాడే వస్తానన్నాను. అలాగే మొన్నటివరకు పర్యటనలో ఉండి నిన్న ఔరంగబాదుకు వచ్చాను. మా వదినగారు సంఘకార్యానికి బాగా సహకరించారు. నేను పాఠశాల విద్యార్థిగా ఇక్కడే మొదట బలవంతంగా శాఖకుపోయాను. అలాగే అతుక్కుపోయాను. కూరుకుపోయాను. (గయా, అటక్‌గయా, ఫస్‌గయా) ఏదో ఉడతాభక్తి సంఘకార్యం చేస్తున్నాను. పునాదిరాయిగానే మన జీవనానికి సార్థకత. ఇప్పుడు నాకు పదవీబాధ్యతలనుండి విముక్తి లభించినా స్వయంసేవకత్వంనుండి విముక్తి లేదు కదా! సంఘసాగరంలో నేనొక బిందువు మాత్రమే.

పూజ్య శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విద్యారణ్యభారతి స్వామి సందేశం: సంఘప్రచారకులు సన్మానాల నంగీకరించరు. హల్దేకర్‌జీ దీనికి ఎందుకు సమ్మతించారో ఈ కార్యక్రమం తర్వాత ఇప్పు డర్థమైనది. మన సమాజానికి మన కుటుంబజీవనవ్యవస్థ ఆధారం – చెట్టుకు వేళ్లు ఆధారంలాగా – మన హిందూ సమాజానికిప్పుడు సంఘకార్యం ఆధారంగా ఉంది. మనం ప్రభావంతో కాకుండా స్వభావంతో సమాజాన్ని గెలుస్తాం.

**విజయోస్తు ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

# మీ జీవనం దీప సమానం

**2**3-02-2017 నాడు ఉదయం నుండే మనసులో అనేక ఆందోళన పూర్వక ఆలోచనలు పొడసూపుతున్నాయి. గౌహతి విద్యాభారతి కార్యాలయంలో బైఠకు జరుగుచున్నది. మనసేమో భాగ్యనగర కేశవనిలయం, సంఘకార్యాలయం వైపు పరుగెడుతున్నది. ఎవ్వరికైనా ఏదో ఓ దినం మృత్యువు తప్పదు. మనసుకది తెలుసు. మా కాకా (చిన్నాన్న) రాంభావు హల్దేకర్‌జీ మృత్యుముఖంలో ఉన్నారు. వారిని గురించిన ఆలోచనలే నన్ను ముసురుతున్నాయి. వారు మా ఉమ్మడి కుటుంబానికి మార్గదర్శకులు.

అంతకంటే మరింత ఎక్కువ నా ప్రచారిక జీవితానికి మార్గదర్శకులు. ప్రత్యక్షంగా కలుసుకున్నపుడు మరియు తరచు ఫోనుద్వారా కలుసుకున్నపుడు వారి ఆత్మీయ సాన్నిధ్యం లభించేది. ప్రచారిక జీవితంలో ముందుకెళ్ళడానికి తగిన సతతప్రేరణ వారినుండి లభించేది.

నా జ్ఞాపకాలు చాలా వెనక్కి వెళ్ళాయి. 1985లో నాందేడ్ –పర్భనీ జిల్లాల ప్రచారికగా నా ప్రచారిక జీవితం ప్రారంభమయింది. ప్రచారిక జీవనానికి కావలసిన అనుభవజ్ఞాన భాండాగారం వారివద్ద ఉంది. వారు జ్యేష్ఠ సంఘప్రచారకులు వారి ప్రేరణతో నేను సేవికా సమితికి క్రొత్తగా ప్రచారికగా వచ్చాను. నా ప్రచారిక జీవితానికి అవసరమయ్యే అనేక అంశాలు తెలిపేవారు. పర్యటన యోజన, కార్యపద్ధతి, కార్యక్షేత్రంలో వ్యవహారం, అవగాహన, ఎదురయ్యే సమస్యలు, ఇలా అనేక విషయాలు క్షుణ్ణంగా చెప్పకనే చెప్పేవారు. నవ్వుతూ, నవ్విస్తూ చెప్పేవారు, ముచ్చటిస్తూ చెప్పేవారు, కథలుగా చెప్పేవారు, సామెతలుగా చెప్పేవారు. ఉదాహరణలద్వారా చెప్పేవారు. మహారాష్ట్ర నుండి నన్ను అస్సాంకు పంపాలని నిర్ణయం జరిగింది. నేను అక్కడ తట్టుకొని నిలబడేలా నన్ను అనేకరకాలుగా పరీక్షించినారు. హల్దేకర్‌జీ మార్గదర్శనం ఆ సందర్భంగా నాకు ఎంతో శక్తినిచ్చింది. అది నన్ను మానసికంగా మరింత దృఢంగా నిలబెట్టింది. నేను అస్సాంకు వెళ్లిన తర్వాత మా కాకా నాకొక ఉత్తరం రాశారు. అందులో అత్యంత అమూల్యమైన విషయం ప్రస్తావించారు. “అస్సాం వంటి క్షేత్రంలో చాలా జాగ్రత్తగా పనిచేయాలి. మహారాష్ట్రలోని పనితో అస్సాం పనిని పోల్చిచూడరాదు. అస్సాంను మహారాష్ట్ర కళ్లద్దాలతో చూడరాదు, అస్సాం కళ్ళద్దాలతోనే చూడాలి. అక్కడి సామాజిక, భౌగోళిక స్థితిని అధ్యయనం చెయ్యాలి. అక్కడి వాతావరణంలో కలగల్సిపోవాలి. అక్కడి భాష, వేషం అన్నపానాదుల్ని అన్నింటినీ సొంతం చేసుకోవాలి” అంటూ ఒక అత్యంత మార్మికమైన మాట వ్రాశారు. “ఒక సంవత్సరంపాటు మరాఠీ పుస్తకాలు చదువొద్దు. కార్యక్షేత్రం పట్లఆసక్తి, శ్రద్ధ ఉండడంకాదు, కార్యక్షేత్రంతో ఏకరూపతను, ఏకాత్మతను సాధించిపనిచేయాలి.” అని గొప్పసత్యాన్ని అవగతం గావించారు. ఎప్పుడైనా ఎక్కడైనా కలిసినపుడు కార్యక్షేత్రంలో ఎదురయ్యే కష్టాలను గూర్చి పెద్దగా చర్చించేవారుకాదు.... ఇలా అనేక విషయాలు నామదిలో ఆనాడు (23–2–2019) మెదలాడినవి. మా బైఠక్ పూర్తికావచ్చింది. మాననీయ శ్రీ భాగయ్యగారినుండి ఫోను, రాంభావు సదాశివ హల్దేకర్‌జీ అనే పుణ్యశ్లోకుడు–కర్మయోగి–సాధకుడు పరమపదించాడని

తెలిపారు. మా కాకా మమ్మల్నివిడిచిపోయారని మనస్సు అత్యంత వేదనకు గురి అయింది. అదే మనస్సు వెంటనే సంబాళిస్తూ చెప్పింది, పరమపవిత్రమైన సంఘకార్యరూపంలో హల్దేకర్‌జీ అమరుడని తెలిపింది.

**జనమ దుర్లభ భరతభూపర్ నిత్యగుంజే సంత్‌వాణీ,**

**క్యోం న కర్‌లే ఇస్ జనమ్‌మే ఆత్మ సుమసే మాతృపూజన్।**

ఇలాంటి అనేకపాటలు సంఘంలో పాడుకుంటూ ప్రేరణపొందుతాం. దేశభక్తి, ధ్యేయనిష్ఠ, మాతృభూమిపట్ల సమర్పణలాంటి భావాలు ఆపాటల్లో ఉంటాయి. వీటితో స్వయంసేవకుల జీవనవికాసం కూడా తెలియకుండానే జరిగిపోతుంది. ఇలా వికసించిన జీవన పుష్పాలనుండి కొన్ని పూర్ణవికసిత పుష్పాలు ప్రచారకులుగా భారతమాత పూజకు సమర్పించుకుంటాయి. ఇలాంటి దేవదుర్లభ ప్రచారక పరంపర సంఘంలో సాగిపోతున్నది. ప్రచారకులు 'ఒకే ధ్యేయం– ఒకే జీవనం' వ్రతంగా సంపూర్ణ భారతవర్షంలో 'సంఘకార్యం' అనే విశాల వటవృక్షాన్ని వికసింపజేశారు, విస్తరింపజేశారు.

అలాంటి భరతమాత సుపుత్రుడైన రామచంద్ర సదాశివ హల్దేకర్ మహారాష్ట్రలోని దేవగిరి ప్రాంతం శంభాజీనగర్ (ఔరంగబాదు) జిల్లా, అజంతా గుహల సమీపంలోని 'హల్దా' గ్రామంలో జన్మించారు. శంభాజీనగర్‌లో పదవతరగతి పిదప సంఘశాఖకు పోవడం ఆరంభమయింది. వైయక్తిక జీవనంనుండి సామాజికి జీవనంవైపు అడుగులు ఆరంభయినవి. పై చదువులకోసం భాగ్యనగర్ (హైదరాబాదు) వెళ్లారు. అక్కడినుండే హల్దేకర్‌జీ ప్రచారక్ జీవనయాత్ర ఆరంభమయింది. అక్కడి జనజీవనంతో సమరసుడయ్యారు. అక్కడి కార్యక్షేత్రాన్ని కార్యకర్తలతో జోడించారు. మరియు కార్యకర్తల్ని తన కుటుంబంతో జోడించారు. మాకుటుంబంలో జరిగే కార్యక్రమాలలో కార్యకర్తలు ఆత్మీయంగా పాల్గొనేలా చేశారు.

పర్యటనలో భాగంగా మా కాకా హల్దేకర్‌జీ సంవత్సరంలో ఒకసారి శంభాజీనగర్‌కు వచ్చేవారు. రెండు రోజులుండేవారు. ఒకరోజు తన జన్మస్థలం 'హల్దా' గ్రామానికి వెళ్లేవారు. గ్రామానికి చేరుకోగానే అక్కడి మట్టిని నుదుట ధరించేవారు. తనకు కర్మయోగాన్ని నేర్పిన మట్టిఅది, భారతమాత సేవా సౌభాగ్యాన్ని ప్రసాదించిన మట్టి అది, ఆమట్టి తనకు చందన సమానము. మాతృభూమిపట్ల కృతజ్ఞత, సమర్పణ, కటిబద్ధత వంటి భావానుభూతి మనకు దీంతో కల్గుతుంది. గ్రామప్రజలతో కల్సి కూర్చుండేవారు. వారందరి యోగక్షేమాలు

తెలుసుకునేవారు. పేరుపేరునా పలకరించేవారు. భజన గీతాలాపన జరిపేవారు. అలా అక్కడ సంఘభావాన్ని జాగృతం చేసేవారు. రెండవరోజు మా ఉమ్మడికుటుంబ సభ్యులందరం కలిసేవాళ్లం. అనౌపచారిక ముచ్చట్లు జరిగేవి. సంఘగీతాలపోటీ (అంత్యాక్షరిలాంటిది) జరిగేది. మా ఉమ్మడి కుటుంబంలోని చిన్నా-పెద్దలందరితో హల్దేకర్‌జీ కలగల్సిపోయేవారు. అందరి సమస్యలు తెలుసుకునేవారు. బాధలో ఉన్నవారి వీపుతట్టి లేదా భుజంపైచేయివేసి ఆత్మీయత నందించేవారు. వారి ఆత్మీయ స్పర్శతో సమస్యలు-బాధలు దూరమైపోయేవి. వారు వస్తున్నారంటేచాలు చిన్నా-పెద్దలందరు బాగా ఆనందించేవారు.

వారు ప్రతియేట తప్పనిసరి కుటుంబ సభ్యులతో కలిసే మరో పర్యటన జరిపేవారు. వారి జన్మతేది ఫిబ్రవరి5, ఆ వారంలో మంగళవారంనాడు మా కులదేవత రేణుకామాత దర్శనానికి మాహూర్ పుణ్యక్షేత్రానికి ఉమ్మడి కుటుంబమంతా కలిసే యోజన వారు చేశారు. నాందేడ్-ఆదిలాబాదుజిల్లా సరిహద్దులో మహారాష్ట్ర కిన్వట్ తాలూకా కేంద్ర సమీపంలో మాహూర్ రేణుకామాత పుణ్యక్షేత్రముంది. వారిరాక తెలిసి దగ్గరలోని కిన్వట్, ఆదిలాబాద్, బోథ్, నిజామాబాదు కార్యకర్తలు కూడా అక్కడకు వచ్చి హల్దేకర్‌జీ ఉమ్మడి కుటుంబ సభ్యులతో కలిసేవారు. ప్రతియేటా నియమంగా వెళ్లి రేణుకామాత దర్శనము చేసుకొని ఆశీర్వాదం పొందేవారు. 1952 నుండి 2015వరకు ఈ యాత్ర నిరంతరాయంగా జరిగింది. అక్కడ కల్సిన అందరం మాతదర్శనం చేసుకొనేవారము. తర్వాత అంతాకలిసి కాసేపు భజన చేసేవారం. తర్వాత 'సంఘప్రార్థన' చేసేవారం. తన ఈ పర్యటన సూచన అటు ఉమ్మడి కుటుంబ సభ్యులకు, దగ్గరలోని నాందేడ్-నిజామాబాద్- ఆదిలాబాదు జిల్లా కార్యకర్తలకు చాలా ముందుగానే తెలిపేవారు. ఇది అందరికీ ఎంతో ప్రేరణదాయకంగా ఉండేది.

## సకారాత్మకదృష్టి-స్థితప్రజ్ఞత :

నేను ప్రతి సంవత్సరం కాకాను కలవడానికి మార్చినెలలో భాగ్యనగర్‌కు వెళ్లేదాన్ని. రెండురోజులు వారి సన్నిధిలో గడిపేదాన్ని. వారెప్పుడూ నకారాత్మక విషయాలు-సమస్యలు చర్చించేవారు కాదు. తెలంగాణ-ఆంధ్రప్రాంతాలలో వారికి కొంత ప్రతికూల - ఉపేక్ష పరిస్థితి ఉండేదనిపిస్తుంది. పనిలో మునిగి ఉన్నపుడు కొన్ని కటువైన అనుభవాలు ఎదురై ఉంటాయనిపిస్తుంది. వారెప్పుడూ ఇలాంటి విషయాలు లేశమాత్రం కూడా వ్యక్తంచేసేవారు

కాదు. కార్యప్రగతికి పనికివచ్చే అనేక ప్రేరక ప్రసంగాలు తెలిపేవారు. సకారాత్మక-ఔపచారిక ముచ్చట్లే ఎప్పుడూ చెప్పేవారు. వారి సన్నిధికి - సంపర్కానికి వచ్చిన వ్యక్తులెందరో మంచి కార్యకర్తలుగా ఎదిగారు. దీపం ఎంతపెద్దదయితే అంత ఎక్కువ వెలుతురును వెదజల్లుతుందని తరచు చెప్పేవారు. సమస్యలు అసంఖ్యాకంగా ఉండవచ్చు. వాటికి పరిష్కారాలు కూడా అనంతంగా ఉంటాయి. విశాల మనస్తత్వముండాలి, అంతే! ఆత్మీయంగా అందర్నీ పలకరించేవారు. బైఠకులలో అందరి భాగస్వామ్యముండేలా చూసేవారు. సరళ-సుందర ఉదాహరణలద్వారా విషయాన్ని వివరించేవారు. కార్యయోజనకు కార్యకర్తల వికాసానికి చాలా ప్రాధాన్యమునిచ్చేవారు. వారి బౌద్ధికులలో, బైఠకులలో, చర్చలలో హాస్యమయ, ఆహ్లాదవాతావరణ ముండేది. ఇలా సంఘ కార్యపద్ధతితో వారు పూర్తిగా ఏకరూపులై ఏకాత్మతను ప్రదర్శించేవారు.

## అద్భుతమైన జ్ఞాపకశక్తి :

హల్దేకర్‌జీ అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉంది. అనేకమంది పాత,క్రొత్త కార్యకర్తలపేర్లు, వారి కుటుంబసభ్యుల పేర్లతోసహా వారికి గుర్తుండేవి. వారు మంచి గాయకులు. అనేక సంఘగీతాలు వారికి కంఠోపాఠంగా ఉండేవి. ఒకసారి వారితో కల్సి మాకుటుంబ సభ్యులందరం వాహనంలో మాహూర్ నుండి శంభాజీనగర్ వెళ్తున్నాం. 10 గంటల సుదీర్ఘ ప్రయాణం. గీత్ స్పర్ధ (అంత్యాక్షరి వంటిది) తో సమయం తెలిసేదేకాదు. ఎవరైనా ఏదైనా గీత్‌పాడుతూ పాదం మధ్యలో మర్చిపోతే వారు వెంటనే ఆపాట పాదాన్ని అందించేవారు. చివరివరకు వారి స్మరణశక్తి అలాగేఉంది. శారీరిక అస్వస్థత కారణంగా చివరి అయిదారేళ్ళు వారు పర్యటనలు చేయలేక కార్యాలయానికే పరిమితమై ఉండిపోయారు. తనను కలువవచ్చిన వారందరిని వారు చాలా పాతకాలం కార్యకర్తలయినా వారిని పేరుపెట్టి పలకరించేవారు. వారి కుటుంబసభ్యులు మరియు కార్యకర్తలందరిని గుర్తుచేసేవారు. కార్యాలయానికి వచ్చే కొత్త కార్యాకర్తల్ని కూడా విస్తృతంగా పరిచయం చేసుకునేవారు.

## సాధనా పథమందునా సాధ్యమా విశ్రామమూ :

2005 వరకు వారు నియమబద్ధంగా పర్యటనలు జరిపారు. అనారోగ్యం విశ్రాంతి కారణంగా వారు కొన్ని నగర కేంద్రాలకు మాత్రమే పర్యటించారు. నగరశాఖా కార్యక్రమం, కార్యకారిణి బైఠక్. ఇంతే. శ్రీ గురూజీ జన్మశతాబ్ది సందర్భంగా శ్రీ గురూజీని చూసిన,

విన్న జ్యేష్ఠకార్యకర్తల సమావేశాలు తానే సూచించి జరిపేవారు. శ్రీ గురూజీ 23ఏళ్ళపాటు తెలుగునాట, ప్రతియేటా పర్యటించారు. ఆ పర్యటనల విశేషాలు చెప్పి జాగృతి పత్రికలో ప్రత్యేకంగా ప్రచురించారు. తాను జిల్లా, విభాగ్ ప్రచారక్‌గా ఉన్న కార్యక్షేత్రంలోని ఆనాటి కార్యకర్తల జాబితాను తయారుచేసి వారి సమావేశాలు తీసుకున్నారు. 100 కేంద్రాలలో సమావేశాలు జరిగినవి. 450పైగా గ్రామాలనుండి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో కూడా శ్రీ గురూజీ పర్యటనల్ని వివరించారు.

## కాళ్ళు, చేతులు కాదన్నా లేఖన కార్యం సాగింది :

కుర్చీలో కూర్చుండి సహాయకున్ని పెట్టుకొని లేఖన కార్యం సాగించారు. పూజనీయ డాక్టర్జీ, గురూజీ, బాళాసాహెబ్‌జీ ముగ్గురు సర్ సంఘచాలకుల జీవిత చరిత్ర గ్రంథాలను మరాఠీనుండి తెలుగులోకి అనువదించారు. వాటి అమ్మకం కోసం కూడా చాలా శ్రమించారు. సంఘ సైద్ధాంతిక ప్రవాహంతో తెలుగు సాహిత్యం పరిపుష్టమయింది.

## జీవితపు అంతిమకాలం :

మాకాకా హల్దేకర్‌జీ పుణ్యతిథికి 25 రోజులముందు వెళ్లి కలిశాను. నేను చేరేసరికే నారాకకోసం బాగా ఎదురుచూస్తుండినారని తెలిసింది. కూర్చుండి మాట్లాడాలని ప్రయత్నించారు. సాధ్యంకాలేరు. పడుకొనే అనేక విషయాలు చెప్పారు. అందరి యోగక్షేమానలడిగారు. మాటల్లో ఏ మాత్రం స్పష్టతలేదు. అంతిమకాలం సమీపించినదని నాకర్థమయింది. పర్యటన కెళ్లాలి, బ్యాగ్ సర్దమంటారు. శ్రీ గురూజీ చిత్రాన్ని చేతపట్టుకొని చూస్తూ విలపించారు. 23ఏళ్ళ సాన్నిహిత్యం శ్రీ గురూజీతో లభించిందని తెలిపారు. తర్వాత కన్నతల్లి ద్వారకాబాయి ఫోటో తీసుకొని ఆమె నన్నెప్పుడు రమ్మంటున్నావని విలపించారు. ఇంకెంతోకాలం వారి సాన్నిధ్యం లభించదని భావించాను. రెండు రోజులు గడిపి నా పర్యటనకు వెళ్ళిపోయాను. మా కుటుంబ సభ్యులు ముఖ్యంగా నా సోదరులు ఎవరో ఒకరిద్దరు ప్రతినెలా వారిని చూడవచ్చేవారు. ఏళ్ళతరబడి ఇది జరుగుతున్నది. నాలుగైదు రోజులు పిదప నాకు ఫోనుచేశారు. మాటలో ఏమాత్రం స్పష్టతలేదు. భాగ్యనగర్‌లో ఇప్పుడే పూజ్య సర్ సంఘచాలక్ మోహన్‌జీ పర్యటన ఉందన్నారు. అంతిమదినాల్లోనూ అదే సంఘధ్యాస. మోహన్‌జీ క్షేత్రకారిణి బైఠక్ కార్యాలయంలో తీసుకుంటున్నపుడు అతికష్టంమీద వీల్‌చైర్‌లో అక్కడికెళ్ళి అందరికీ ప్రణమిల్లి వచ్చారు. ఫిబ్రవరి 19నాడు తనవద్ద సహాయకునిగా ఉన్న సంఘప్రచారక్ యుద్ధవీర్‌ను కాగితం,

కలం తీసుకొని రాయమన్నారు. కేరళలో స్వయంసేవకులపై జరుగుచున్న అమానుష హత్యాకాండను గురించి 3-4 వాక్యాలు చెప్పారు. అక్కడ మన శక్తి ఇంకాబాగా పెరగాలన్నారు. మిగిలిన విషయాలు రేపు చెబుతానన్నారు. అంతే ఆ తర్వాత వారి అమృతవాణి శాశ్వతంగా మూగవోయింది. ఆ పుణ్యశ్లోకుడు-మహావిభూతి 2017 ఫిబ్రవరి 23రాత్రి శ్రీ మహాశివరాత్రి పూర్వ సంధ్యలో మహాప్రయాణానికి వెళ్ళిపోయారు.

**- సునితా హల్దేకర్, గువాహటి**

**సహసర్ కార్యవాహిక - రాష్ట్ర సేవికాసమితి**



రాజమండ్రి వాస్తవ్యుడైన సంఘకార్యకర్త తులసీ సూర్యప్రకాశ్ రెండవకుమార్తె వైభవికి మా॥ హల్దేకర్‌జీ అక్షరాభ్యాసం చేయించిన దృశ్యం. ఆ అమ్మాయి ఇప్పుడు ఎం.బి.బి.ఎస్ చదువుతున్నది.

# శ్రీ రామచంద్ర సదాశివ హల్దేకర్‌జీ

మహారాష్ట్ర నందుపుట్టి
తెలుగువారి కాప్తుడైన
హల్దేకర్ ఇకలేరు
మా. హల్దేకర్‌జీ లేరు

ఇంటింటా ప్రతి ఇంటా
ఆయనడుగు పెట్టినింట
ఆనందం సౌహార్ద్రం
వెల్లివిరిసి వుండినవట

రామువెంట భావుకతతో
కోతులన్ని వెడలినట్లు
సంఘానికి పిల్లలట్లు
పరువులిడుతు వచ్చిరంట

భరతమాత నడువనున్న
దారిలోని ముళ్ళనేర
చదువు వదిలి పెట్టిమరీ
సంఘస్థాన్ కొచ్చిరంట

బ్రహ్మాచర్య దీక్షబూని
పూర్తిసమయప్రచారక్‌గ
తనరక్తపు ప్రతిబొట్టును
భరతభూమి కర్పించిరి

భాగ్యనగర్, మెతుకుసీమ
నల్లగొండ, ఓరుగల్లు
ఇందూరూ, పాలమూరు
విజయవాడ, ఒకటేమిటి
తెలుగునేల నలుచెరగుల
రామచంద్ర సదాశివుని
పేరువినని వారుగలరె

కన్నడ ఒరియా తమిళము
మలయాళము తెలుగునాడు
హల్దేకర్ పనిచేయని
దక్షిణాది క్షేత్రమేది?

మహారాష్ట్రుడు తెలుగునేర్చి
గ్రంథాలను వెలువరించి
తెలుగుతల్లి మెచ్చుకొనెడు
పాదపూజచేసినాడు

భరతమాత చెదరిపోవు
పెనుతుఫాను వీచుచుండ
దీపస్తంభమొకటినిలచె
దానిపేరు 'డాక్టర్జీ'

ఆ వెలుగులో నడవడమే
మనపని యనె రాంభావుడు
యజ్ఞమందు రాష్ట్రానికి
స్వాహాకారముచేయుచు
తనను తాను అర్పించుకు
అమరుడైన 'గురూజీ'ని
అనునిత్యము జపియించెడు
దారిచూపె హల్దేకర్

సంఘమొకటి తానొక్కటి
కాదనియెడు దేవరస్‌జి
జీవిత చిత్రణచేసిన
అమరుడండి హల్దేకర్

గోదావరినదివోలెను
ఆప్యాయత పారించెడు
హల్దేకర్ లేడనెటిగి
నాకలమే గోదావరి
నదివోలెను దుఃఖించెను

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**– వరిగొండ కాంతారావు**

**(హనుమకొండ)**

## అది కాకతాళీయమేనా?

**ప**నిలేని పాత్రికేయులు కొందరు ఏవేవో లెక్కలు వేస్తుంటారు. అలా పాత్రికేయుడైన ఒక స్వయంసేవక్ మా॥ అటల్ బిహారీ వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్న 1999–2004 లోక్‌సభలో వారిని సమర్థిస్తున్న లోక్‌సభ సభ్యులు సంఘంలోని క్షేత్రాలవారీగా ఏ క్షేత్రంనుండి ఎందరున్నారు? – అని లెక్క వేశాడు.

అప్పుడు ఆశ్చర్యకరంగా తెలిసివచ్చిందేమంటే మా॥ రామచంద్ర సదాశివ హల్దేకర్ క్షేత్ర ప్రచారక్‌గా ఉన్న ఆగ్నేయ క్షేత్రం (దీనిలో అప్పటి ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలు ఉన్నాయి) ప్రథమ స్థానంలో ఉంది. ప్రభుత్వాన్ని సమర్థించేవారిలో భాజపా, తెదేపా, బిజూ జనతాదళ్– బిజెడి– పార్టీల వారున్నారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్ – మహారాష్ట్రలు కలిసి ఉన్న పశ్చిమ క్షేత్రం, బిహారు, మధ్యక్షేత్రం వగైరాలన్నీ ఆగ్నేయ క్షేత్రం తర్వాతనే ఉన్నవి. మరి ఇది కేవలం కాకతాళీయమేనా?

హల్దేకర్‌జీ అందించిన ఆలోచనలు

# శాఖ - ఇది మన కల్పవృక్షము :

పరమపూజనీయ శ్రీ గురూజీ శాఖను కల్పవృక్షమని, కల్పతరువు అని వర్ణించేవారు. దీని క్రిందకూర్చుంటే మన అందరి కోరికలు తీరిపోతాయి. తెలుగులో కూడా ఒక గీతంలో ఒక పంక్తి 'ఏది కోరినా అది లభించును' అని వర్ణించబడింది. దీన్ని అర్థం చేసుకోవటానికి ఒక కథ చెబుతున్నాను.

అనగనగా ఒక రాజు ఉండేవాడు, కథ అనగానే 'అనగనగా ఒక రాజు' అని మొదలుపెట్టాల్సిందే గదా! 'ఆ రాజు యుద్ధంలో ఓడిపోయాడు. సర్వస్వం కోల్పోయాడు రాజ్యం, ఆస్తి, సంపద - సర్వం పోగొట్టుకొని అడవిలో నిరాశా నిస్పృహలతో తిరుగుచున్నాడు. అలా సంచరిస్తున్నపుడు ఒక ఆశ్రమం కనపడింది. అక్కడికి వెంటనే వెళ్ళాడు, అక్కడున్న స్వామికి ప్రణామం చేశాడు. తన బాధామయ గాధనంతా స్వామికి విన్నవించాడు, చివరికిలా అన్నాడు "నిరాశా నిస్పృహలతో ఈ అడవిలో సంచరిస్తుండగా మీ ఆశ్రమం కనిపించింది. పరుగున వచ్చి మిమ్మల్ని దర్శించుకున్నాను. మీ ఆశీర్వాదం కోరుచున్నాను." అప్పుడు స్వామీజీ అన్నారు, "రాజా! నీవు ఒక పనిచేయి ఈ ఆశ్రమం ముందు ఒక చెట్టు కనబడుతున్నది గదా! ఆ చెట్టుపేరు కల్పవృక్షం. దాని క్రింద కూర్చొని నీవు ఏదికోరితే అది లభిస్తుంది." అనగానే రాజు పరుగునవెళ్లి చెట్టుక్రింద కూర్చున్నాడు. కోరికలు కోరినాడు, అతిగా ఏమీ కోరుకోలేదు. తాను కోల్పోయిన వాటిని మాత్రమే కోరినాడు. కోరిన వెంటనే అన్నీ సమకూరినవి. రాజ్యం, సైన్యం, ఆస్తి, సంపద అన్నీ లభించాయి. అతనికి ఆశ్చర్యం కలిగింది. పరుగెత్తుకొని స్వామీజి దగ్గరికి వెళ్లాడు. సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆనందంతో ఇలా అన్నాడు: "స్వామీజీ! నాకు అన్నీ లభించాయి. నాకొక సందేహం కలుగుతున్నది" అనగానే స్వామీజీ అడగమన్నారు. ''ఇంత గొప్పమహిమగల కల్పవృక్షం మీ ఆశ్రమంచెంత ఉన్నది. మీరు ఎందుకింత కష్టపడుతున్నారు? కఠినమైన తపస్సు చేస్తున్నారు? కటిక నేలపైనే పడుకుంటున్నారు? అహోరాత్రాలు ఇలా తపస్సు చేయటమెందుకు? మీరుకూడా చెట్టుక్రింద కూర్చుండి కోరుకుంటే అన్నీ లభిస్తాయి గదా?" స్వామీజీ అన్నారు - "మేము ఇలా తపస్సు చేయటంవల్లనే అది కల్పతరువుఅయింది. మేము తపస్సును వదిలిపెట్టి చెట్టుక్రింద

కూర్చుండి కోరికలు కోరితే ఆ కల్పతరువు – కల్పతరువుగా ఉండదు. అది వొఠ్ఠి చెట్టుగా మారిపోతుంది. తపస్సువల్లనే ఆ చెట్టు కల్పవృక్షమయింది.

ఇలాగే మన శాఖ కూడా కల్పవృక్షం ఎప్పుడవుతుంది? దాని కోసం ప్రతిశాఖలో 5–10 మంది నిరంతరం తపస్సు చేస్తే ఆశాఖ తప్పకుండా కల్పతరువు అయితీరుతుంది. అప్పుడే 'ఏది కోరినా అది లభించును' అన్న పాట సార్థకమవుతుంది. రోజూ శాఖకు వెళ్లటం, క్రొత్తవాళ్లను పాతవాళ్లను శాఖకు వెంట తీసికెళ్లటం, వాళ్ల ఇళ్లకు వెళ్లటం, కుటుంబంతో పరిచయం చేసుకోవటం, దానికోసం రోజూ వాళ్ల కష్టసుఖాల్లో పాలుపంచుకోవటం, తద్వారా స్నేహం, ఆత్మీయత లభిస్తుంది కదా? దీనికోసం రోజూ కొంతసమయం ఇవ్వాలి. ఇదే తపస్సు. ఇలాంటి తపస్సును ఆ శాఖా స్వయంసేవకులు నిరంతరం చేయాల్సిందే! అన్యథా ఆశాఖ కల్పవృక్షం కానేరదు. శాఖను కల్పవృక్షంగా మార్చుకొందాం.

## మనమంతా ఒకేతల్లి సంతానం

మనం ఒకే తల్లి బిడ్డలం, అందరం అన్నదమ్ములం, అక్కాచెల్లెళ్లం. దీన్ని మరిచిపోవటం వల్ల జాతికి బానసత్వం వచ్చింది. మనందరిది ఒకే జాతి. హిందూ జాతి. ఒకే సంస్కృతి, హిందూ సంస్కృతి. ఒకే ప్రజ, హిందూప్రజ. దీన్ని తెలుసుకొని అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. దీన్ని అర్థచేసుకోవడానికి ఒక చిన్న కథ:

ఒక గ్రామంలోని కుటుంబంలో ఇరువురు పుత్రులు జన్మించారు. పసితనంలో పెద్దపిల్లవానిని మేనమామలు తీసికొనివెళ్లి పెంచారు. చిన్నవాడు స్వస్థలంలో పెరిగాడు. చిన్నవానికి 20 యేండ్లు వచ్చాయి. గ్రామంలో వ్యవసాయం చేస్తున్నాడు. అతనికి అన్నగారిని చూడాలనే అభిలాష కల్గింది. మేనమామలది పెద్దనగరం. అక్కడికి వెళ్లి అన్నను చూద్దామని బయలుదేరాడు. అడ్రసు తీసుకుని, తన వెంట ఒక వృద్ధ సేవకుణ్ణి తోడు చేసుకొని వెళ్లాడు. సరిగ్గా అదే సమయానికి అతని అన్నకు కూడా స్వగ్రామానికి వెళ్లి, తల్లి దండ్రులను, తమ్ముణ్ణి చూడాలని కోరిక కలిగింది. అతను కూడా స్వగ్రామానికి ప్రయాణమై వచ్చాడు. ఇరువురూ రైల్లో ప్రయాణం చేస్తూ నడుమ ఒక జంక్షన్‌లో అతి సమీపంలో ఉన్న పుణ్యక్షేత్రాన్ని దర్శించుకు పోదామని ఆ ఊరికి పోయే మరో రైలు పెట్టెలో ఎక్కారు. ముందు ఎక్కిన తమ్ముడు, వృద్ధసేవకుడూ పెట్టెలో సీటువద్ద సంచీలు పెట్టి టీత్రాగి వద్దామని క్రిందికి వెళ్ళారు. వారు క్రిందికి దిగిపోయిన తరువాత అన్న

వచ్చి ఖాళీగా ఉన్న సీటుకదా అని కూర్చున్నాడు. సీటుక్రింద సంచీలు ఉన్నట్లు అతను గమనించలేదు. అతను కూర్చున్న కొంచెంసేపటికి తమ్ముడు వచ్చాడు. వృద్ధసేవకుడు యింకా టీ త్రాగుతూ వెనకాల ఉన్నాడు. తమ్మునికి అన్న తెలియదు. అతను అన్నను గుర్తుపట్టలేకపోయినాడు. ఎవరో అనుకున్నాడు. వచ్చి రాగానే "ఈ సీటునాది, లే" అన్నాడు కొంచెం తీవ్రంగా. అన్నకు కోపం వచ్చింది. "ఏమిటి, ఈ సీటుమీద నీ పేరేమన్నా వ్రాసి ఉందా? ఖాళీగా ఉంది. కూర్చున్నాను. నన్ను లేవమంటావేం?" అన్నాడు. "సీటు క్రింద సంచీలున్నాయి. కనుపించటం లేదా?" అని రెట్టించాడు తమ్ముడు. "సీటుక్రింద ఎవరైనా పెట్టుకుంటారారా సామాన్లు? సీటుమీద ఏమీలేదు కదా!" అన్నాడు, అన్న. "ఏమిటయ్యా రూల్సు మాట్లాడుతున్నావు? లే ముందు నా సీట్లోనుండి" అని తమ్ముడు గద్దించాడు. అన్నకు కోపం వచ్చింది. "ఇదేమన్నా రిజర్వేషన్ చేసుకున్న సీటా? ఏమిటయ్యా దబాయిస్తున్నావ్, నేను లేవను. ఏంచేస్తావ్?" అన్నాడు. తమ్ముడు అతణ్ణి గ్రామ్యభాషలో తిట్టాడు. అన్నకూడా తక్కువ తినలేదు. ఇంగ్లీషు తెలుగు కలిపి తిట్టాడు. తమ్ముడికి తిక్కరేగింది. అన్నను చేయిపట్టుకొని లాగాడు. అన్నకు మండిపోయింది. ఒక దెబ్బవేశాడు. ఇరువురూ కలియబడి ముష్టిఘాతాలకు దిగారు ఇంతలో సేవకుడు టీ త్రాగి లోపలికి వచ్చి ఈ దృశ్యాన్ని చూశాడు. అతనికి అన్నలో అతని తండ్రిపోలికలు స్పష్టంగా కన్పించాయి. తక్షణమే దగ్గరికి పోయి, వాళ్లను విడదీసి, తమ్మునితో, "అయ్యా, అయ్యా, ఈయనే మీ అన్న" అని చెప్పాడు. అంతే ఆ అన్నదమ్ములిరువురికీ నరాల్లోంచి విద్యుత్తు ప్రవహించినట్లయింది. స్తబ్ధులయి పోయి, నోళ్ళు తెరచుకొని ఒకరినొకరు చూసుకున్నారు. తాము ఎవరికోసమైతే బయలుదేరి వస్తున్నారో ఆ వ్యక్తి ఎదురుగా ఉన్నాడు. మరుక్షణంలో తేరుకుని "అన్నయ్యా!" అని తమ్ముడు, "తమ్మూడూ!" అని అన్నయ్య గాఢంగా కౌగిలించుకున్నారు. అటుపిమ్మట కుశలప్రశ్నలు వేసుకున్నారు. తమ్ముడు అప్పుడన్నాడు, "అన్నయ్య, కూర్చో! ఈ సీటు మనదే!" "లేదులే. తమ్ముడూ, నీవు కూర్చో!" "అహ...నీవె కూర్చో" "కాదు. నీవే కూర్చో, నే చెబుతున్నాగా!" "లేదు లేవయ్యా, నీవు కూర్చో, నేను ఇంకో సీటు చూస్తాగా!" "ఎందుకులే ఇద్దరం ఇక్కడే సర్దుకొని కూర్చుందాం." ఇలా వాదించుకుంటూ ఇరువురూ ఒకరి భుజాన్ని ఒకరు పట్టుకొని కూర్చోమని ఒత్తిడి చేయసాగారు. ఇప్పుడు కూడా తగాదాయే. అయితే కొన్ని క్షణాలక్రితం జరిగిన ఘర్షణకు, యిప్పుడు సాగుతున్న ఘర్షణకు నడుమ పాతాళానికి ఆకాశానికీ ఉన్నంత అంతరం

ఉంది. అంతకుముందు వారి నడుమ ద్వేషం ఉంది. ఇప్పుడు ప్రేమ ఉంది. ఇంతటి మార్పు హఠాత్తుగా ఎలా వచ్చింది. "ఇరువురం ఒకే తల్లి గర్భవాసాన జన్మించిన వాళ్లం" అనే సత్యం ఇప్పుడు వారి సాక్షాత్కారమయింది. ఆ సత్యసాక్షాత్కార ఫలితంగా ద్వేషం ప్రేమగా మారింది. శత్రుభావన భ్రాతృభావనగా పరిణామం చెందింది. భావనలో వచ్చిన మార్పువల్ల 'మనము ఇరువురం సమానం" అనే దృష్టి యేర్పడింది. సమదృష్టివల్ల వాతావరణంలో సామంజస్యం ఏర్పడింది. శాంతి ఏర్పడింది.

# పరిచయం - దాని మహత్త్వం

ప.పూ. శ్రీ గురూజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా అనేక రకాల కార్యక్రమాలు జరుపబడినవి. వాటిలో శాఖ 'ఉపస్థితిదిన్' కార్యక్రమం ఒకటి. దానికోసం నేను కొన్ని గ్రామీణ శాఖలకు వెళ్లటం జరిగింది. వరంగల్ జిల్లాలోని ఇల్లెంద గ్రామానికి వెళ్లాను. ఇది హన్మకొండకు 25కి.మీ. దూరంలో ఉన్న గ్రామం. ఈ జిల్లాలో ఇల్లెంద శాఖ చాలా పాతశాఖ. 1952 నుండి అనగా ఇప్పటికి 60 సంవత్సరాలు జరుగుచున్న శాఖ. ఉ. 6.30.గం.కు శాఖ. గణవేషధరించి హన్మకొండనుండి సరాసరి సంఘస్థాన్‌కు వెళ్లాము. పాత స్వయంసేవకులనేకమంది గణవేష ధరించి 'ఉపస్థితిదిన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో చాలా మంది నాకు బాగా పరిచయస్థులే. సంపత జరుగుచున్నందున ఎవరినీ పలకరించే అవకాశం లేకపోయింది. పాతవాళ్ళు, కొత్తవాళ్ళతోకార్యక్రమం మంచి ఉపస్థితితో ఉత్సాహవంతంగా జరిగింది. నా బౌద్ధిక్ అయింది. ప్రార్థన కూడా అయిపోయింది. వీకిర కాగానే అనేకమంది పాతమిత్రులు నన్ను చుట్టుముట్టారు. సహజం. చాలా కాలం తర్వాత ఈ కలయిక. 40 ఏళ్ళ తర్వాత నేను ఆశాఖకు వెళ్లాను. వరంగల్ విభాగ్ ప్రచారక్‌గా ఉన్నపుడు ఆశాఖతో బాగా అనుబంధం ఉండింది. అప్పుడు తరచూ వెళ్లినవాణ్ణి. అప్పటి వారంతా ఇప్పుడు చాలా పెద్ద వాళ్లయిపోయారు. నన్ను అనేకమంది చుట్టుముట్టినప్పుడు నాదృష్టి కొంచెం దూరంగాఉన్న ఒక కార్యకర్తపై పడింది. విశ్వహిందూపరిషత్‌జిల్లా బాధ్యతున్న కార్యకర్త. నేను ఆయనను గుర్తుపట్టాను. పేరుపెట్టి పిలిచాను. దగ్గరికెళ్లి వీపుతట్టి 'బాగున్నారా' అని అడిగాను. ఆయన చేతులు జోడించి నావైపు తదేకంగా చూస్తున్నాడు. కళ్ళనుండి అశ్రుధారలు కారుతున్నాయి. నేను గాభరాపడిపోయాను. 'ఇంట్లో అందరు బాగున్నారా?' అని ఆదుర్దాగా అడిగాను.

ఆయనన్నాడు, 'హల్దేకర్‌జీ! ఇవి కన్నీళ్ళు కావు, ఆనందాశ్రువులు. 40 ఏళ్ళతర్వాత మిమ్మల్ని చూశాను. నన్ను గుర్తుంచుకుని మీరు పేరుతో పిలిచారు. నా ఆనందం వర్ణించలేను' అని మరీ చెప్పాడు. అనేక పాతవిషయాలు మాట్లాడుకున్నాం. నా అల్పాహార వ్యవస్థ కూడా ఆ కార్యకర్త ఇంటిలోనే ఏర్పాటు చేశారు. ముందే జరిగిన నిర్ణయమిది. వారింటికి వెళ్ళాము. కుటుంబసభ్యులందరినీ పలకరించాను. అల్పాహారం చేసి హన్మకొండకు బయల్దేరాను. అనేకమంది పాతవాళ్ళతో సరదాగా ముచ్చటించాను. అనేకమందిని నేను పేరుపేరునా పలకరించడం జరిగింది. అందరిలో ఒకటే ఆనందం. ఇది పరిచయ మహత్వం. దీనికి విపరీతంగా ఒక స్వయంసేవక్‌ని అడిగాను, 'మీ పేరేమండీ?' అని. ఆయన కొంచెం బాధపడుతూ నాతో అన్నాడు, 'ఎన్నిసార్లు చెప్పాలండి? అనేకసార్లు పరిచయమయిన పిదప కూడా నాపేరు మరిచిపోయారు' అంటూ బాధపడ్డాడు. ఇలా పరిచయమైన పిదపకూడా పేరుమరచిన సంఘటనలూ ఉన్నాయి. అలాంటి అనుభవాలు మనందరికీ ఉంటాయి. పేరుతో పలుకరిస్తే ఆనందం, పేరుమరిచిపోతే బాధ సహజం. ఇలా అందరికీ అనుభవైకవేద్యమే. ఇదంతా మనం మన కార్యపద్ధతిలో ఒక భాగంగా చెప్పుకొనే పరిచయ కార్యక్రమమహత్వం.



**సంజీవని సంచార వైద్యశాల ప్రారంభ సందర్భంలో ఆత్మీయులమధ్య కుశలప్రశ్నలు శ్రీ హల్దేకర్‌జీ, శ్రీ బండారు దత్తాత్రేయ, శ్రీ టి.వి. దేశ్‌ముఖ్, శ్రీ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు**

హల్దేకర్‌జీ స్వయంగా చెప్పిన అనుభవాలు

# ఖండవారీ పర్యటన - కాలినడక అనుభూతి!

1969 నాటి విషయం, నేను – నాతోపాటు వరంగల్ జిల్లా ప్రచారక్ కె.వి. సత్యనారాయణతో కలిసి జిల్లా పర్యటనకోసం మానుకోటకు వెళ్లాము. విభాగ్‌లో 7 రోజుల పర్యటన. ప్రతిరోజు ఒక తాలూకా పర్యటన. శాఖలో సాంఘిక్, కార్యకర్తల బౌఠక్ – ఇలా కార్యక్రమం. అప్పుడు ఆంధ్రప్రదేశ్ అంతటా విశాఖలో ఉక్కు కర్మాగారం కావాలనే ఉద్యమం నడుస్తుండినది. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అనే నినాదం ప్రసిద్ధికెక్కింది. నా పర్యటనకు రెండురోజులముందు ఉద్యమం ఉధృతమయింది. ఎలాగోలా మానుకోట కార్యక్రమం పూర్తయింది. మరుసటిరోజు ఉదయం వరంగల్లుకు రావాలి. ఉద్యమం కారణంగా రవాణా వ్యవస్థ స్తంభించింది. రైళ్ళులేవు, బస్సులు లేవు. ఏదైనా వాహనంలో పోదామన్నా ఉద్యమకారులు దాన్ని తగులబెడుతారనే భయం. ప్రయాణం విరమించుకున్నాం. మానుకోటలోనే ఉండిపోయాము. మరుసటిరోజు ఉద్యమం మరింత ఉధృతమైంది. బంద్‌లు –రాస్తారోకోలు –తగులపెట్టడాలు జరుగుతున్నవి. బస్సుస్టాండులో, రైల్వేస్టేషన్‌లో ఎంక్వైరీ చేశాము. కొన్నిరోజులపాటు ప్రయాణ సౌకర్యాలు ఏవీ ఉండవని తెలిసింది. మరి పర్యటన కార్యక్రమాలన్నీ ఎలా? ఎన్నిరోజులని చూస్తాం. కాలినడకన వెళ్లటానికి సిద్ధపడ్డాము. మానుకోట నుండి వరంగల్లు 65కి.మీ. మావెంట ఒక స్వయంసేవక్ వచ్చాడు. అతనికి సైకిలుంది. దానిపై మా బ్యాగులు పెట్టి అతడు కూడా మావెంటే త్రోసుకుంటూ వచ్చే ఏర్పాటు – ఆ కాలంలో బ్యాగు అంటే చాలా బరువుగా ఉండేది. కార్యాలయమంతా వెంట ఉండేదన్నమాట. రైలు పట్టాల ప్రక్కనుండి దారి దగ్గరవుతుందని అలా బయల్దేరాము. రోడ్డు మార్గం ఇంకా దూరమవుతుంది. ఉదయం 11.00 – 11.30 మధ్య కేసముద్రం స్టేషన్‌కు చేరుకున్నాం. మాకు అక్కడ విద్యార్థులు – యువకుల ఊరేగింపు ఎదురయింది. వారంతా ఆవేశంతో "విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు" అంటూ నినాదానిస్తూ సాగిపోయారు. ఆకలి అవుతున్నది. ఏదైనా హోటలుందా అని అనుకున్నాం. ఇక్కడ పూర్తిగా బంద్ కాబట్టి ఏ హొటలూ తెరవరు అన్నారు. ప్రక్కనే ఉన్న ఊరు వెంకటగిరికి బయల్దేరాం. అక్కడ లింగాల రామచంద్రారెడ్డి అనే స్వయసేవక్ వ్యవసాయం చేయిస్తూ ఉంటారు. ఆయన జనసంఘ్ పార్టీకోసం పూర్తి

సమయ కార్యకర్తగా పనిచేసిన వ్యక్తి. మంచి సిద్ధాంతవేత్త, నిష్ఠావంతుడైన కార్యకర్త. అక్కడికి చేరేసరికి ఒంటిగంట అయింది. ఆయన ఇల్లు కనుక్కొని వెళ్తే ఆయన పొలానికి వెళ్లినట్లు చెప్పారు. మేం వచ్చిన విషయం ఆయనకు కబురు పంపారు. ఆయన వచ్చారు. మమ్మల్ని కూర్చోమన్నారు. మంచినీళ్లిచ్చారు. విశ్రాంతి తీసుకోమన్నారు. అతడక్కడ ఒంటరిగానే ఉంటాడు. అతడన్నాడు, మీరు ఎండలో వచ్చారు, స్నానం చేయండి, ఇంతలో వంట అవుతుందన్నాడు. మేం మానుకోటలోనే స్నానంచేసి బయల్దేరాము అని చెప్పాము. ఆమాట ఈమాట మాట్లాడుకున్నాం. ఇంతలో వంట అయింది. భోజనం చేశాం. అప్పటికి మధ్యాహ్నం 2.30గం॥లు అవుతుంది. బాగా ఆకలితో ఉన్నందున, అన్నం-పప్పు భోజనమే అయినా చాలా రుచిగా ఉంది. ఓ ముద్ద ఎక్కువగానే తిన్నాం. చాలా తృప్తిగా భోంచేశాం. 3.00గంటలకు బయల్దేరి మళ్ళీ రెలుకట్ట ఎక్కాం. పట్టాల ప్రక్కన నడుస్తూ నెక్కొండకు చేరుకున్నాం. అప్పటికి సాయంత్రం 7.00 కావస్తున్నది. ఆఊర్లో బుచ్చి శంకరలింగం అనే స్వయంసేవక్ ఉన్నాడు. ఉపాధ్యాయుడుగా అక్కడ పనిచేస్తున్నాడు ఆయన పర్కాల స్వయంసేవక్ - ఇల్లు కనుక్కుని వెళ్ళాం. ఆయనొక వ్యాపారస్థుల ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఇంటియజమానురాలు ఒకతే ఉంటుంది. అక్కడికి వెళ్ళి శంకరలింగంతో మా ప్రయాణ పరంపరను గూర్చి చెప్పాం. ఆమె మా మాటలువిని "కొడుకా! మీరు నడిచివస్తున్నారు. వంటచేస్తా. ఇంతలో మీరు స్నానం చేయండి" అని చెప్పింది. కాళ్ళు బాగా నొప్పిగా ఉన్నాయి. మధ్యాహ్నమే ఆలస్యంగా భోంచేశాం. భోజనమిప్పుడే వద్దన్నాం. ఆ తల్లిలోనికెళ్ళి మంచిది నాయనా పాలు త్రాగండి, అంటూ పాలు తెచ్చిఇచ్చింది. మా కాళ్ళు నొప్పిగా ఉన్నాయని చెప్పాముకదా? ఆ తల్లి కొంచెం నూనె వేడిచేసి తెచ్చిఇచ్చి కాళ్ళకు రాసుకోమంది. వేన్నీళ్ళు పెట్టింది. నీళ్ళు వేడిఅయింతర్వాత స్నానంచేశాము. అలసి ఉన్నాం. ఆ తల్లి వంట చేస్తానన్నా వద్దని పడుకున్నాం. బాగా నిద్రపట్టింది. ప్రొద్దున్నే లేచి అల్పాహారంచేసి, చాయత్రాగి మళ్ళీ బయల్దేరాం. రైలుకట్ట ఎక్కాం, పట్టాలప్రక్కనుండి నడకసాగించాం. ఒక చిన్న స్టేషన్ చేరాం. మళ్ళీఆకలి. అది చిన్నఊరు, అక్కడ తినడానికేమీ లేదు. స్టేషన్ముందు ఒక గుడిసెలో చిన్న టీ కొట్టుఉంది. ఒక ముసలమ్మ ఆకొట్టును నడుపుతున్నది. కావాలన్న వాళ్ళకు డబ్బులు తీసుకొని వంటచేసిపెడుతుంది. మేంచెప్పగానే ఆమె వంటకు ఉపక్రమించింది. మేం అక్కడ ప్రక్కనే ఉన్న బావివద్ద స్నానంచేశాం. బట్టలుతికి ఆరేసుకున్నాం. ఇంతలో వంట అయింది.

అన్నం - టమాటపప్పు చాలా రుచికరంగా ఉండింది. భోజనం చేసి మళ్ళీ బయల్దేరాం. చింతపల్లి స్టేషన్‌చేరాం. అక్కడ ఒక జట్కాబండి, ఒక రిక్షా కనిపించింది. బండి అతడు ముందు వరంగల్ వస్తాననిమళ్ళీ ఎందుకో రానన్నాడు. రిక్షా మాట్లాడుకొని వరంగల్లులోని రామన్నపేట కార్యాలయం చేరాం. కార్యాలయంలో ఆకుతోట రామారావు, గుండా యాదగిరి, రాంసింగ్ మరొకరిద్దరు స్వయంసేవకులు ఉండేవారు. వాళ్ళు చదువుకోసం వచ్చి అక్కడున్నారు. అలిసిపోయి వచ్చిన మాకు ఆకుతోట రామారావు కిచిడీ వండిపెట్టాడు. వాళ్ళ ఊరినుండి తెచ్చిన మంచినెయ్యి, పచ్చడి పెట్టాడు. చాలా రుచిగా ఉండింది. ఇలా అంతటా రుచికరమైన భోజనాలే - ఆకలి - అలసటలో అంతా రుచిగానే ఉండింది.

మరుసటి రోజు ఉదయం మరో తాలూకా (ఖండ) కార్యక్రమానికి వెళ్లాం. నడక కారణంగా ఒక తాలూకా పర్యటన మాత్రం జరగలేదు. బస్సుల రాకపోకలు ప్రారంభమయినాయి. 7 రోజుల పర్యటన పూర్తయింది. జీవితంలో ఇదో గొప్ప మధురమైన అనుభూతిగా ఉండిపోయింది. ఆ పర్యటన గురించి గుర్తుచేస్తే శ్రీ కె.వి. సత్యనారాయణ ఇంకా చాలా వివరంగా మా ప్రయాణాన్ని వర్ణించి చెప్పాడు, మధురమైన ఆ స్మృతి మనసులో మెదలగానే ఎంతో ఆనందం వేసింది.

# అత్యవసర పరిస్థితిలో అజ్ఞాత జీవితం

అత్యవసర పరిస్థితి కాలం (1975-77) నాటి సంఘటన: అనేకమంది కార్యకర్తలు జైళ్ళలో నిర్బంధింపబడ్డారు. అనేకమంది కార్యకర్తలు వేషాలు, నివాసాలు మార్చుకుని అజ్ఞాతంగా ఉండి సంఘకార్యం కొనసాగిస్తున్నారు. ఇందిరాగాధీ తన పదవికోసం దేశంలో అత్యవసర పరిస్థితిని విధించింది. సంఘంపై నిషేధం విధించబడింది. ప్రతికక్షాల నాయకులంతా జైళ్లలో నిర్బంధింపబడినారు. అందుకే ఈ అజ్ఞాతజీవితం. వేషాలు బహువిధాలుగా మార్చుకున్నారు. మీసాలుఉన్నవాళ్ళు తీసేశారు, లేనివాళ్లు పెంచారు. ధోవతి - లాల్చీ ధరించే ప్రచారకులు ప్యాంటు-షర్టు ధరించారు. కొందరు గడ్డంపెంచారు.

అజ్ఞాతంగానే బైఠకులు జరగసాగినవి. మెదక్‌జిల్లా బైఠక్ జహీరాబాదులో రహస్యంగా జరిపే ఏర్పాటు జరిగింది. నేను ఆ బైఠక్‌కు వెళ్లాను. నావేషం కూడా మార్చుకున్నాను. ప్యాంటు,షర్టు ధరించాను. జహీరాబాదు చేరకముందే ఒక తోటుంది. అది ఒక మార్వాడీ

సేర్‌గారిది. ఇంకొంచెం ముందుకెళ్తే పోలీసుస్టేషన్ ఉంది. మరికొంచెం ముందుకెళ్తే బస్టాండు ఉంది. తోటలో చాటుగా మెదక్‌జిల్లా కార్యకర్తల సమావేశం. భోజన సామాగ్రి అంతా ఒక రిక్షాలో పోలీసుస్టేషన్ ముందునుండే తీసుకొచ్చారు. సాయంత్రం 5.00గం॥లకు అజ్ఞాత సమావేశం పూర్తిచేసుకుని అందరూ తిరుగుప్రయాణమయ్యారు. అజ్ఞాత కార్యక్రమం కాబట్టి అందరూ ఒకేసారి బయల్దేరకుండా ఒక్కరొక్కరుగా తలా ఓవైపు నుండి వెళ్లిపోయారు. రోడ్డుకు కుడివైపున ఉన్నపోలీసుస్టేషన్ వెనుకనుండి దారి ఉంది. నేను మరోకార్యకర్త, దయానంద్ (సంగారెడ్డి ప్రచారక్) కలిసి ఆ దారిగుండా వెళ్లాము. బస్టాండుకు చేరాలి. పోలీసు స్టేషన్ వెనుకదారిగుండా అనేకమంది రాకపోకలు సాగిస్తున్నారు. అలా ఆ దారిగుండా వస్తున్నవాళ్ళలో సంగారెడ్డికి సంబంధించిన గూఢచారి పోలీసులు (సి.ఐ.డి.) కూడా ఉన్నట్లు తర్వాత తెలిసింది. అలాంటి సి.ఐ.డి. పోలీసులకు వారంవారం జరిగే మీటింగ్ జహిరాబాద్‌లో జరిగింది, దానికోసం వచ్చినారని తెలిసింది. వాళ్లమీటింగ్‌పూర్తయి వాళ్లంతా తిరుగు ప్రయాణానికి రోడ్డుపైకి వచ్చారు. అలా వచ్చిన సంగారెడ్డి సి.ఐ.డి.లు దయానంద్‌ను గుర్తించారు. ప్రక్కన నేనున్నాను. ఆ సి.ఐ.డి. వెంటనే పోలీసుస్టేషన్ లోపలికి వెళ్ళి, వాళ్ళ అధికారికి తెలిపాడు. సంగారెడ్డి ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ వెళ్తున్నాడు, అతనివెంట మరో పెద్దమనిషికూడా ఉన్నాడు. ఆయన ఎవరో పెద్ద ఆర్.ఎస్.ఎస్. స్టేట్ లెవెల్ ప్రచారక్ అయి ఉంటాడని తెలిపాడు. అంతే ఒకరిద్దరు సి.ఐ.డి.లుమమ్మల్ని ఫాలో అయ్యారు. బస్టాండుకు చేరాం. దయానంద్ నన్ను వదిలివెళ్లిపోయాడు. తర్వాత నావెంట జిల్లా ప్రచారక్ తీపిరెడ్డి సోమిరెడ్డి ఉన్నాడు. హైదరాబాదు బస్సు రెడీగా ఉంది. మేం దానిలో ఎక్కాం. మాకు వెనుక సీటు దొరికింది. నేను హైదరాబాదు వెళ్తాను. మమ్మల్ని అనుసరించిన సి.ఐ.డి.లు కూడా అదే బస్సు ఎక్కారు. ఈ బస్సులో వెళ్తే ప్రమాదమని భావించాం. మన కార్యకర్తలంతా కూడా తలోదారి గుండా వేర్వేరుగా వచ్చి చేరారు. జిల్లా ప్రచారక్ తీపిరెడ్డి సోమిరెడ్డి కూడా అదే బస్సెక్కి మరోచోట ఉన్నాడు. నేను “వెనుకసీటు నాకు ఇబ్బంది. మళ్ళీ బస్సు ఎప్పుడుంది? నేను దిగిపోతా”నని సోమిరెడ్డికి వినపడేటట్లు చెప్పి బస్సుదిగాను. సోమిరెడ్డి కూడా బస్సు దిగాడు, మళ్ళీ బస్సు ఆరుగంటలకు ఉంది అన్నాడు. ఆ మాట విన్న పోలీసు సి.ఐ.డి.లు కూడా “హమ్‌భీ ఛః బజే బస్‌మేజాయింగే సీట్‌నహీంహైనా” అంటూ వాళ్ళు ఇద్దరు ముగ్గురు కూడా బస్సు దిగారు. మాకు బాగా అర్థమయింది. పోలీసులు మమ్మల్ని ఫాలో

అవుతున్నారని, మేం వాళ్లకు దూరంగా వెళ్తూ చాయత్రాగి వచ్చి బస్సెక్కుదాం అనుకుంటూ బస్టాండులోని హెూటల్‌వైపు వెళ్లాం. సి.ఐ.డి.లు మాత్రం అక్కడే ఉన్నారు. సంగారెడ్డి హైదరాబాదు బస్సెక్కడానికి ఇటే వస్తారని మమ్మల్ని ఫాలో అవుతున్న వాళ్ళు కాస్తా హైదరాబాదు బస్సులు ఆగే ఫ్లాటుఫారంవద్దనే బెంచిమీద కూర్చుండిపోయారు. నావెంట వచ్చిన దయానంద్ మొదలే నన్ను విడిచివెళ్లటం మంచిదని ఏదో లారీపట్టుకొని సంగారెడ్డి వెళ్ళిపోయాడు. ఇప్పుడు నావెంట జిల్లా ప్రచారక్ సోమిరెడ్డి ఉన్నాడు. మేమిద్దరం చాయత్రాగి బస్టాండుకు మరోవైపున్న దారిగుండా బయటికి వచ్చాం. పొలాలగుండా కోహిర్‌వైపు బయల్దేరాం. కోహిర్ రైల్వేస్టేషన్ ద్వారా హైదరాబాదు వెళ్దామని అనుకున్నాం. సుమారు 20కి.మీ. దూరంలో ఉన్న కోహిర్‌కు నాలుగైదు గంటలు చీకట్లో నడిచి చేరుకున్నాం. రాత్రి 11.00గం॥లు కావస్తున్నది. రైలు అప్పుడు ఏదీలేదు. రాత్రి 1.45గం॥లకు ప్యాసింజరు ఉంది. పోలీసు సి.ఐ.డి.ల కళ్ళుకప్పి మేమలా తప్పించుకున్నాం. ఎక్కడికెళ్ళాలి? అక్కడ శ్రీ రాంరావు దేశ్‌పాండేగారింటికి వెళ్లాం. వారు ఆఊళ్లో పెద్దమనిసి, ఈ దేశ్‌పాండే కుటుంబం సాయంతోనే అక్కడ మనశాఖ ప్రారంభించబడింది. ఆరాత్రి వారింటికి చేరాం. భోజనం చేయాలని చెప్పాం. వెంటనే వంట, వేడివేడి భోజనం, ఆతర్వాత మళ్ళీ స్టేషన్‌కు చేరాం. అర్ధరాత్రి తర్వాత ఎప్పుడో వచ్చిన ప్యాసింజర్ రైలులో ఎక్కి తెల్లవారేసరికి హైదరాబాదు చేరుకున్నాం. అక్కడ జహీరాబాదు బస్టాండులో పోలీసు సి.ఐ.డి.లు మాకోసం చూస్తున్నారు. 6.00గం॥ల బస్సు వచ్చింది మేం రాకపోవటంతో వాళ్ళకు అనుమానం వేసింది. మేం తప్పించుకున్నాం అని భావించారు. జహీరాబాదు నగర సంఘచాలక్ శ్రీ కోటావిశ్వనాథ్ ఇంటికి వెళ్ళామని భావించి ఆయన ఇంటికివెళ్లి పోలీసులు ఆయన్ని మాగురించి అడిగారు. ఆయన్ని బాగా ఇబ్బంది పెట్టారు. మేం అక్కడికి రాలేదని ఎంత మొత్తుకున్నా వీళ్ళువినరు. వాళ్ళు వచ్చారు కాని ఎక్కడికి వెళ్ళారో తెలీదన్నాడు, విసిగి వెళ్ళిపోయారు. ఇలా అత్యవసర పరిస్థితిలో ఇదో సాహసయాత్ర. ఇప్పుడు తలుచుకుంటే ఒక మధుర స్మృతి.

# సర్దుబాటు తప్పనిసరి

ఒకసారి నేను భాగ్యనగర్ విభాగ్ ప్రచారక్‌గా ఉన్నప్పటి ఘటన. అప్పుడు భాగ్యనగర్ విభాగ్‌లో నిర్మల్, ఇందూర్, మెదక్, రంగారెడ్డి, పాలమూరు, నల్గొండ జిల్లాలు ఉన్నవి. పెద్ద విభాగ్ అది.

ఇప్పటి ఇందూరు విభాగ్‌లోని – నిర్మల్ నుండి భైంసా వెళ్లాల్సిఉంది. బస్సులో బాగారద్దీగా ఉంది. కిటికీ దగ్గర ఉన్న సీటుకావాలి నాకు. మన కార్యకర్త ఒకరు నాకోసం కిటికీ నుండి సీటులో టవల్ వేశాడు. నేను మెల్లగా బస్సుఎక్కి సీటువద్దకు చేరుకున్నాను. ఆ సీటుకాస్తా వెనుకగా ఉంది. అక్కడికెళ్ళి చూస్తే మరొక పెద్దమనిషి టవల్‌వేసిన నాసీట్లో కూర్చున్నాడు. "ఈ సీట్లో టవల్‌వేసుకున్నాం, ఇది నా సీటు కదా!" అని అడిగినాను. "సీట్లో టవల్ ఏదీలేదు, అది క్రిందపడివుంది. అందుకే నేను సీట్లోకూర్చున్నాను" అన్నాడు. మన కార్యకర్తలు అతనితో వాదనకు దిగారు. "టవలు తీసి క్రిందపడవేసి కూర్చున్నావు, లే!" అంటూ వాదన చేశారు. చివరకు నేనే అన్నాను, "పోనీలెండి నేనే ప్రక్కసీట్లో సర్దుకుంటాను అన్నాను. కిటికీవైపు సీటుదొరకలేదు, అంతేగదా అని సర్దుకున్నాను. సీట్లో ఇద్దరం ప్రక్కప్రక్కన కూర్చున్నా కూడా మేం మాట్లాడుకోలేదు. భైంసా వచ్చింది. ముందు నేను దిగాను, తర్వాత అతడూ దిగాడు. నాకోసం బస్సుదగ్గరికి ఒకబాల స్వయంసేవక్ వచ్చిఉన్నాడు. అతడు నాబ్యాగ్ పట్టుకున్నాడు. విచిత్రం! నాప్రక్కన సీటులో కూర్చున్న అతడు ఆ బాలస్వయంసేవక్ తండ్రి. కోపంలో ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు. తర్వాత బాలస్వయంసేవక్‌ను అడిగాను, ఎక్కడికెళ్ళాలి, నా వ్యవస్థ ఎక్కడని అడిగాను, మాయింటికే వెళ్ళాలి. అక్కడే మీ వ్యవస్థ అని ఆ బాల స్వయంసేవక్ చెప్పాడు. అప్పటివరకు మేం మాట్లాడుకోలేదు. ఇంటికి నడిచేవెళ్ళాం. అప్పుడు ఆటోలు రిక్షాలు లేని కాలం. ఇంటికి చేరిన పిదప నేనే ఆయనతో "క్షమించండి! సీటుకోసం మనం అనవసరంగా గొడవపడ్డాం" అని అన్నాను. లోకసంగ్రహకార్యం చేస్తున్న మనకు ఇదొక మంచి గుణపాఠం. ఇలాంటివి ఎన్నో భరించాల్సి ఉంది. ఇంట్లో ఆయన ఆప్యాయంగానే పలకరించాడు. చాయ్, భోజనం – అన్నీ చాలా ఆప్యాయంగా ఏర్పాటు చేశారు. ఆయన కూడా "మీలాంటి పెద్దవారితో నేనే అనవసరంగా గొడవపడ్డాను తెలియక" అంటూ వీడ్కోలు సమయంలో అన్నాడు.

# శ్రీ భోగాది దుర్గాప్రసాద్ స్మారక సమితి (రి)

**ఆంధ్రప్రదేశ్, రి. నెం. 995/87**

**అధ్యక్షులు** : గొట్టిపాటి మురళీమోహన్, న్యాయవాది, విజయవాడ

**ఉపాధ్యక్షులు** : డా. సూరపనేని లక్ష్మీప్రసాద్ – విశాఖపట్నం

**ఉపాధ్యక్షులు** : తమ్మిరెడ్డి వేణుగోపాలరెడ్డి కోట, వ్యవసాయం, నెల్లూరు

**కార్యదర్శి** : వాసిరెడ్డి వినోద్‌కుమార్, న్యాయవాది,హైదరాబాద్

**సహ కార్యదర్శి** : పి.ఎస్.వి. ప్రసాదరావు, విశ్రాంత ఉద్యోగి, గుంటూరు

**కోశాధికారి** : పెద్ది మల్లిఖార్జునరావు, ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

**కార్యవర్గసభ్యులు** : వల్లూరు రామకృష్ణ, ఉద్యోగం, హైదరాబాద్

: జి. కోదండరామ్, విశ్రాంతి ఉద్యోగి, మద్రాసు

: అన్నె చంద్రశేఖరరావు, సర్వేయరు, విశాఖపట్నం.

: కె. కోటేశ్వరశర్మ, సామాజిక కార్యకర్త, ఢిల్లి.

: పి. కాశీవిశ్వేశ్వరరావు,వ్యాపారం, హైదరాబాద్.

: టి. రామమూర్తి, కాంట్రాక్టరు, హైదరాబాద్.

: పి. మాలకొండయ్య,విశ్రాంత ఉద్యోగి, విజయవాడ.

: వి. సత్యమూర్తి,సామాజిక కార్యకర్త, విజయవాడ.